'ప్రతిపల్లెలోనూ అందరికీ గ్యాస్ సరఫరా, ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా నా ధ్యేయం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 231

బుధవారం 12-11-2025

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఇషా-సామ్రాట్ జోడీకి రజతం

ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల జోరు -12లో

డీప్‌ఫేక్.. ఇప్పటి విలన్

డీప్‌ఫేక్ ద్వారా స్త్రీలను భయపెట్టడం పెరిగిందన్న తాజా అధ్యయనం -11లో

అమెరికా షట్‌డౌన్ నేడు బంద్!

అమెరికా షట్‌డౌన్‌ను ముగించి ప్రభుత్వ సేవలను మళ్లీ ప్రారంభించడానికి వీలుగా సంబంధిత బిల్లును సెనేట్‌లో ఆమోదించారు.

వివరాలు 6లో ▸



పాకిస్తాన్ మళ్లీ రక్తసిక్తం

పాకిస్తాన్‌లోని ఇస్లామాబాద్‌లో జరిగిన ఆత్మాహుతి దాడిలో 12 మంది మరణించగా.. 27 మంది గాయపడ్డారు.

వివరాలు 6లో ▸

సురేంద్ర కోలీ నిర్దోషి

సంచలనం సృష్టించిన నిఠారీ వరుస హత్యల కేసులో గతంలో దోషిగా తేలిన సురేంద్ర కోలీని సుప్రీంకోర్టు నిర్దోషిగా ప్రకటించింది.

వివరాలు 6లో ▸

డేవిడ్ సలాయ్‌కు బుకర్ ప్రైజ్

వలస వ్యక్తి జీవనాన్ని హృద్యంగా వర్ణిస్తూ డేవిడ్ సలాయ్ రచించిన 'ఫ్లెష్'ను బుకర్ ప్రైజ్-2025 వరించింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

మంత్రివర్యులు.. ప్రత్యేక విమానాల్లోనే..

ఇప్పటికే సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రత్యేక విమానాల్లో విహరిస్తుండగా.. ఇప్పుడు మంత్రులూ ప్రత్యేక విమానాల బాట పట్టారు. మంత్రులు అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్, ఆనం రామనారాయణ రెడ్డి గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో పుట్టపర్తికి రాకపోకలు సాగించారు.

వివరాలు 5లో ▸

వరి పండిస్తే క్యాన్సర్ తప్పదు



వరి పండిస్తే క్యాన్సర్ తప్పదని.. వరి పండించటం వల్లే పంజాబ్ రైతులకు క్యాన్సర్ సోకిందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రతి రోజు పంజాబ్ నుంచి రెండు బస్సుల్లో ఢిల్లీలోని క్యాన్సర్ ఆస్పత్రులకు వెళుతున్నారని చెప్పారు. పురుగు మందులు, రసాయన ఎరువులు వాడటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు.

వివరాలు 10లో ▸

మదనపల్లెలో కిడ్నీ రాకెట్

అన్నమయ్య జిల్లా మదనపల్లెలో మంగళవారం కిడ్నీ రాకెట్ గుట్టురట్టయ్యింది. జిల్లా ప్రభుత్వాస్పత్రుల సమన్వయాధికారిగా పని చేస్తున్న ప్రభుత్వ వైద్యుడు ఆంజనేయులుకు చెందిన గ్లోబల్ ఆస్పత్రిలో రహస్యంగా నిర్వహించిన కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స వికటించి ఓ మహిళ మరణించింది. ఆమె మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా తరలించే సమయంలో ఈ విషయం బయటపడింది.

వివరాలు 13లో ▸

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై.. కోటి గళాల గర్జన

నేడు 175 నియోజకవర్గాల్లో కదం తొక్కనున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, మేధావులు

చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్ జగన్ ఉద్యమ కార్యాచరణ ప్రకటన

- అక్టోబర్ 10 నుంచి ఊరూరా రచ్చబండ నిర్వహిస్తూ చంద్రబాబు సర్కార్ నిర్వాకాన్ని ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ పోటాపోటీగా అన్ని వర్గాల ప్రజల సంతకాలు
- కోటి సంతకాల సేకరణకు వస్తున్న ప్రజా స్పందన చూసి బాబు సర్కారులో వణుకు
- నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ ర్యాలీలను అడ్డుకునేందుకు పోలీసులను ఉసిగొల్పిన ప్రభుత్వ పెద్దలు

2లో

- ర్యాలీల్లో పాల్గొంటే కేసులు పెడతామంటూ వైఎస్సార్‌సీపీ నేతలకు నోటీసులిస్తూ బెదిరింపులు
- పోలీసుల నోటీసులు, బెదిరింపులను లెక్క చేయకుండా ఉద్యమించేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, విద్యార్థులు సిద్ధం

- అధికారంలోకి రాగానే ఆరోగ్యశ్రీని నీరుగార్చి.. ఆసరా ఎగ్గొట్టిన బాబు ప్రభుత్వం
- పెండింగ్‌లో దాదాపు రూ.4 వేల కోట్ల బకాయిలు.. నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సేవలందక రోగుల అవస్థలు
- కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుతో పేదలకు చేరువలో సూపర్ స్పెషాలిటీ వైద్యం..
- మన విద్యార్థులకు మెడికల్ సీట్లు ఉచితంగా, తక్కువ ఫీజుకే అందుబాటులోకి..
- కుట్రపూరితంగా అడ్డుకుని ప్రైవేట్‌కు అప్పగిస్తున్న బాబు సర్కారు

టీడీపీ నేత గోదాం నుంచే గో మాంసం ప్యాకింగ్!

దీన్ని డైవర్ట్ చేసేందుకే తిరుమల లడ్డూ వ్యవహారం మళ్లీ తెరపైకి!

అసలు 189 టన్నుల గో మాంసం ఎక్కడికి తరలిస్తున్నట్లు?

విశాఖలో టీడీపీ నేత సుబ్రహ్మణ్య గుప్తా గోదాంలో ఉన్న గో మాంసం

- ప్రతి నెలా విశాఖ పోర్టు నుంచి ప్యాకేజీలు ఎగుమతి!
- 6 శాంపిల్స్‌ను అక్టోబర్ 3న ఫోరెన్సిక్‌కు పంపిన పశుసంవర్ధక శాఖ
- మూడింటిలో నిషేధిత గో మాంసం ఉన్నట్లు గుర్తింపు
- మిగిలినవాటిలో రెండు ఎద్దువి, ఒకటి గేదె మాంసం!
- శొంఠ్యాంలోని కోల్డ్‌స్టోరేజీలో దొరికిన 9,921 బాక్సులు
- బాపట్ల ఎమ్మెల్యే అనుచరుడు గుప్తా గోడౌన్‌గా గుర్తింపు
- డీఆర్ఐకి అప్పగించకుండా అడ్డుకుంటున్న సర్కారు
- సనాతని పవన్... నోరెత్తరేం అంటున్న హిందూ సంఘాలు

3లో

బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మతో టీడీపీ నేత సుబ్రహ్మణ్య గుప్తా

ఉద్యోగాల కల్పనలో అట్టడుగున ఏపీ

2025 జూలై - సెప్టెంబర్ 'లేబర్ సర్వే' నివేదికలో వెల్లడి

- ఏపీలో నిరుద్యోగిత 8.2 శాతం.. జాతీయ సగటు 5.2 శాతమే
- 29 ఏళ్ల లోపు యువత నిరుద్యోగం ఏపీలో 21%.. దేశంలో 14.8 శాతమే
- యువతకు 20 లక్షల ఉద్యోగాలు లేదంటే నెలకు రూ.3 వేల భృతి అంటూ సూపర్‌సిక్స్‌లో హామీలు

సాక్షి, అమరావతి: దేశంలో ఉద్యోగాల కల్పనలో ఆంధ్రప్రదేశ్ అట్టడుగున నిలిచినట్లు లేబర్ ఫోర్స్ సర్వే తాజా నివేదిక వెల్లడించింది. దేశవ్యాప్తంగా నిరుద్యోగంలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉన్నట్లు పేర్కొంది. ఈమేరకు ఈ ఏడాది జూలై నుంచి సెప్టెంబర్ వరకు వివిధ రాష్ట్రాల్లో నిరుద్యోగిత గణాంకాలతో నివేదిక విడుదల చేసింది. యువతకు 20 లక్షల ఉద్యోగాలు.. లేదంటే నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల ముందు సూపర్ సిక్స్‌లో చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 17 నెలలైనా హామీని అమలు చేయకపోగా నిరుద్యోగ భృతిని నైపుణ్య శిక్షణతో అనుసంధానం చేశానంటూ మాట మార్చేశారు! దీంతో రాష్ట్రంలో ఉపాధి లభించక నిరుద్యోగిత పెరిగిపోతోంది. ఇదే విషయం

మిగతా 14వ పేజీలో ▶

ఢిల్లీలో సోమవారం రాత్రి పేలుడుకు కారణమైన కారు, అనుమానితుడు ఉమర్ నబీ సీసీటీవీ దృశ్యం

డాక్టర్ షాహీన్

ఇది ఆత్మాహుతి దాడేనా?

ఎర్రకోట ఘటనలో కారు పేలుడుపై భిన్నాభిప్రాయాలు

- విస్ఫోటక అమ్మోనియం నైట్రేట్‌ను ఉగ్రవాది తరలిస్తుండగా ఒత్తిడితో పేలి ఉండొచ్చంటున్న అధికారులు
- కారులో డాక్టర్ ఉమర్ నబీ ఉన్నట్లు ప్రాథమిక నిర్ధారణ
- 12కు పెరిగిన మరణాల సంఖ్య
- పేలుడుకు మూడు గంటల ముందే అక్కడే తిష్టవేసిన కారు
- వేల కిలోల పేలుడు పదార్థాల స్వాధీనంతో ఈ ఘటనకు లింకు
- కేసు దర్యాప్తును ఎన్ఐఏకు అప్పగించిన కేంద్ర హోంశాఖ
- అరెస్టయిన వైద్యురాలు షాహీన్ సారథ్యంలో జైషే మహిళా ఉగ్ర విభాగం.. దర్యాప్తును ముమ్మరం చేసిన అధికారులు

2లో

కుట్రదారులను వదిలిపెట్టం

చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షిస్తాం

ఢిల్లీ బాంబు పేలుడుపై ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరిక

6లో

బిహార్ పీఠంపై మళ్లీ ఎన్డీయే!

మహాగఠ్‌బంధన్‌కు మరోసారి నిరాశే

- ప్రశాంత్ కిశోర్ పార్టీకి పరాభవం
- ఎగ్జిట్ పోల్స్ ఫలితాల్లో వెల్లడి

మంగళవారం జెహానాబాద్‌లో ఓటేసేందుకు బారులు తీరిన ప్రజలు

బిహార్‌లో 69% ఓటింగ్

ముగిసిన రెండో విడత పోలింగ్

తొలిదశను మించి ఓటేసిన జనం

కిషన్‌గంజ్‌లో అత్యధికంగా 76.26%

- వివరాలు 6లో

'గోదావరి' టు హైదరాబాద్

తూర్పుగోదావరి జిల్లా అరికిరేవుల వద్ద గోదావరి ఇసుకను లారీల్లోకి లోడ్ చేస్తున్న దృశ్యం

కొవ్వూరు, తాళ్లపూడి కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా

- నిత్యం వందల లారీల్లో సరిహద్దులు దాటించి మరీ తరలింపు
- రోజుకు కోటిన్నర... నెలకు రూ.45 కోట్ల అక్రమ సంపాదన
- కూటమి నేతల నేతృత్వంలో బరితెగించిన ఇసుక మాఫియా
- నియోజకవర్గ ప్రజాప్రతినిధి పూర్తి స్థాయి అండదండలు
- టీడీపీ కీలక నేత కనుసన్నల్లో భారీ దందా
- కన్నెత్తి చూడని మైనింగ్ అధికారులు

14లో

కల్తీ నెయ్యికి తావే లేదు

వేంకటేశ్వరస్వామి వైభవాన్ని పెంచేలా కృషి చేశాం..

ఏ తప్పూ చేయలేదు..

నిబంధనల మేరకే నెయ్యి టెండర్లు.. అన్నింటికీ చట్టబద్ధ రికార్డులు.. వాటిని చూస్తే మీకే అర్థమవుతుంది

సీబీఐ నేతృత్వంలోని సిట్ విచారణలో టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డి

10లో

'కాశీబుగ్గ' బాధితులకు వైఎస్సార్‌సీపీ ఆర్థిక సాయం

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ ఆర్థిక సాయం అందజేస్తోంది. సోమ, మంగళవారాల్లో పలు కుటుంబాలకు రూ.రెండు లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించింది.

2లో

బోర బృందావతి కుటుంబానికి రూ.2 లక్షల చెక్కు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు తమ్మినేని సీతారాం, సీదిరి అప్పలరాజు, ధర్మాన కృష్ణదాస్

మౌలానా అబుల్ కలామ్ ఆజాద్‌కు నివాళి

స్వాతంత్ర్య సమరయోధుడిగా, దేశానికి తొలి విద్యాశాఖ మంత్రిగా 'భారతరత్న' మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ అందించిన సేవలు అజరామరం అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనియాడారు. మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి సందర్భంగా మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి వైఎస్ జగన్ పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రజలకు మైనార్టీ సంక్షేమ, జాతీయ విద్యా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ ఖాదర్ బాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఏ హఫీజ్‌ఖాన్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, రుహుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు నూరీ ఫాతిమా, షేక్ ఆసిఫ్, డాక్టర్ మెహబూబ్ షేక్, సిరాజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, అమరావతి

ప్రతి మహిళా ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలి

పదో తరగతిలో 600కు 599 మార్కులు సాధించిన షేక్ ఇష్రత్ (నంద్యాల) మంగళవారం తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఆమెను అభినందించిన వైఎస్ జగన్... రూ.లక్ష ప్రోత్సాహకం ప్రకటించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. ప్రతి మహిళా చదువుకున్నప్పుడే సమాజంలో జరుగుతున్న ఘటనలపై అవగాహన వస్తుందని, ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలని సూచించారు. చదువు వల్ల సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. మహిళలు ఉన్నత విద్యను అభ్యసించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇష్రత్ తల్లిదండ్రులు భాను, ఎస్‌ఎం రఫీ, వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ ఖాదర్ బాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఏ హఫీజ్ ఖాన్, ఎమ్మెల్సీ రుహుల్లా, నాయకులు నూరీ ఫాతిమా, షేక్ ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, అమరావతి

స్థానికులకు ఉద్యోగాలు ఎక్కడిస్తున్నారు?

పరిశ్రమలు వస్తున్నాయని చెబుతున్నారే తప్ప.. స్థానికులకు ఉద్యోగాలు ఎక్కడిస్తున్నారు... అంటూ ఓ సామాన్యుడు సీఎం చంద్రబాబును నిలదీశాడు. దీన్ని సహించలేని టీడీపీ నేతలు అతన్ని చొక్కా పట్టుకుని బయటకు లాక్కెళ్లారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లిలో ఏర్పాటు చేసే ఎంఎస్‌ఎంఈ పార్కుకు సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. పరిశ్రమల ఏర్పాటుతో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెబుతుండగా, ఓ వ్యక్తి ఉద్యోగాలు స్థానికులకు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ వెంటనే సదరు వ్యక్తిని బయటకు లాక్కెళ్లారు. టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ సభావేదిక బయట ఆ వ్యక్తికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో అక్కడున్న టీడీపీ కార్యకర్తలు ఆయన చొక్కా పట్టుకుని జిల్లా అధ్యక్షుడి కారులోనే అక్కడి నుంచి బయటకు తీసుకెళ్లారు.

– ఓర్వకల్లు

క్లుప్తంగా...

'కాశీబుగ్గ' బాధితులకు వైఎస్సార్‌సీపీ ఆర్థిక సాయం

మురిపింటి నీలమ్మ కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న అప్పలరాజు, కృష్ణదాస్

శ్రీకాకుళం: కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ ఆర్థిక సాయం అందజేస్తోంది. సోమవారం పలు కుటుంబాలకు రూ.రెండు లక్షల చొప్పున చెక్‌లను అందించగా, మంగళవారం కూడా పలువురు మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. సోంపేట మండలం బెంకిలి గ్రామానికి చెందిన నిఖిల్ కుటుంబ సభ్యులకు, వజ్రపుకొత్తూరు మండలం దుక్కవానిపేటలో మురిపింటి నీలమ్మ కుటుంబ సభ్యులకు, కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన డొక్కరి అమ్ముడమ్మ కుటుంబ సభ్యులకు, అలాగే మందస మండలం మందస గ్రామానికి చెందిన బోర బృందావతి, బెల్లుపట్టియా గ్రామానికి చెందిన దువ్వ రాజేశ్వరి కుటుంబ సభ్యులకు చెక్కులను అందించారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టులో స్టాండింగ్ కౌన్సిళ్ల నియామకం

సాక్షి, అమరావతి: రాష్ట్ర హైకోర్టులో పలు సంస్థల తరఫున వాదనలు వినిపించేందుకు పలువురు స్టాండింగ్ కౌన్సిళ్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) స్టాండింగ్ కౌన్సిల్‌గా బొల్లా వెంకట రామారావు, ఏపీ ఫైబర్ నెట్ లిమిటెడ్‌కు వలివెల వీరరాఘవయ్య, ఏపీఎస్ ఆర్టీసీకి కె.శ్రీనివాసప్రసాద్, ఏపీ బెవరేజస్ కార్పొరేషన్‌కు రామినేని సతీష్‌బాబు నియమితులయ్యారు. వీరు బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేళ్ల పాటు ఈ పోస్టుల్లో కొనసాగుతారు.

పోలవరాన్ని సందర్శించిన మహారాష్ట్ర అధికారులు

ప్రాజెక్టు నమూనాను పరిశీలిస్తున్న మహారాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టును మహారాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు మంగళవారం సందర్శించారు. ప్రాజెక్టులోని కీలక నిర్మాణ ప్రాంతాలను వారు పరిశీలించారు. పోలవరం ప్రాజెక్ట్ ఈఈ బాలకృష్ణ, ఎంఈఐఎల్ జనరల్ మేనేజర్ ఎ.గంగాధర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ మురళి పమ్మి ప్రాజెక్ట్ నిర్మాణం తీరును వారికి వివరించారు. మహారాష్ట్ర అధికారులు తొలుత జలవనరుల శాఖ, ఎంఈఐఎల్ అధికారులతో సమావేశమయ్యారు. ఆ తర్వాత నమూనా ప్రాజెక్ట్‌ని పరిశీలించారు. అక్కడ ప్రాజెక్ట్‌లోని కీలక నిర్మాణాల గురించి తెలుసుకున్నారు. నమూనా ప్రాజెక్ట్‌ను వీడియో తీసుకున్నారు. ప్రధానంగా స్పిల్ వే గేట్ల తయారీ, వాటి బిగింపు, నిర్వహణకు ఉపయోగించిన సాంకేతికతను గురించి అధ్యయనం చేశారు. ఎక్కువ వరద నీటిని డిశ్చార్జ్ చేసే పోలవరం స్పిల్ వే, దాని గేట్లు, గేట్లను ఆపరేట్ చేసేందుకు ఏర్పాటు చేసిన సిలిండర్లను పరిశీలించారు. వాటి నిర్మాణానికి పట్టిన సమయం, ఎంతమంది పని చేశారు.. అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలవరం ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు, డయాఫ్రమ్ వాల్ నిర్మాణం, ఫిష్ లేడర్‌ను పరిశీలించారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై..

కోటి గళాల గర్జన

ప్రభుత్వ నూతన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ
నేడు 175 నియోజకవర్గాల్లో కదం తొక్కనున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, మేధావులు

సాక్షి, అమరావతి: చంద్రబాబు సర్కారు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, కక్షపూరిత వైఖరి, ప్రభుత్వ కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ నిర్వహిస్తున్న ర్యాలీల్లో కదం తొక్కేందుకు అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా సిద్ధమయ్యారు. ప్రభుత్వ కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులు, మేధావులు, ప్రజాసంఘాలు, సామాజికవేత్తలు కోటి గొంతుకలతో సింహగర్జన చేయనున్నారు. ప్రభుత్వ రంగంలోనే కొత్త మెడికల్ కాలేజీలు నిర్వహించాలనే డిమాండ్‌తో చంద్రబాబు సర్కార్‌పై సమరభేరి మోగించనున్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు గత నెల రోజులుగా ఊరూరా రచ్చబండ నిర్వహిస్తూ.. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల పేద, మధ్య తరగతి రోగులు, విద్యార్థులకు కలిగే నష్టాలు, ప్రైవేటీకరణ ముసుగులో చంద్రబాబు సర్కారు అవినీతిని ప్రజలకు లోతుగా వివరించారు. చంద్రబాబు సర్కారు అధికారంలోకి రాగానే ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేస్తూ ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేయడం.. నెట్‌వర్క్ ఆస్పత్రులకు బకాయిలు చెల్లించకపోవడంతో రోగులకు సేవలు నిలిచిపోవడం.. ఆరోగ్యశ్రీ, ఆసరా కింద ఏకంగా రూ.4 వేల కోట్లకు పైగా బకాయిలు పెట్టడం.. చరిత్రలో తొలిసారి ప్రైవేట్ డాక్టర్లు రోడ్డెక్కి ఆందోళనకు దిగడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ప్రభుత్వ రంగంలో కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుతో పేదలకు చేరువలో నాణ్యమైన వైద్యంతోపాటు మన విద్యార్థులకు కన్వీనర్ కోటాలో సగం మెడికల్ సీట్లు ఉచితంగా, మిగిలినవి కూడా ప్రైవేట్ కాలేజీలతో పోలిస్తే అతి తక్కువ ఫీజులతో అందుబాటులోకి వచ్చే అవకాశాన్ని చంద్రబాబు సర్కారు కాలదన్నుకోవడంపై మండిపడుతున్నారు. కొత్త మెడికల్ కాలేజీలపై చంద్రబాబు సర్కారు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో సంతకాలు చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు పోటీపడుతున్నారు.

బుధవారం ర్యాలీ నిర్వహించకూడదంటూ నర్సీపట్నంలో మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్‌కు నోటీసు ఇస్తున్న పోలీసు

కోటి సంతకాల సేకరణ మహోద్యమంగా రూపాంతరం చెందుతుండటం చంద్రబాబు సర్కార్‌కు వణుకు పుట్టిస్తోంది. నేడు వైఎస్సార్‌సీపీ నిర్వహించే ర్యాలీలలో అన్ని వర్గాల ప్రజలు భారీ ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమరభేరి మోగించనున్నారని ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా సమాచారం అందుకున్న ప్రభుత్వ పెద్దలు యథావిధిగా అధికార దుర్వినియోగానికి తెరతీశారు. నిరసన ర్యాలీల్లో పాల్గొనకూడదని.. కేసులు పెడతామంటూ వైఎస్సార్‌సీపీ నేతలకు పోలీసులు నోటీసులు జారీ చేస్తున్నారు. పోలీసుల నోటీసులు.. బెదిరింపులకు లొంగే ప్రసక్తే లేదని.. నిరసన ర్యాలీల్లో విద్యార్థులు, తల్లితండ్రులు, మేధావులు, ప్రజాసంఘాలతో కలిసి కదంతొక్కి, గళం విప్పుతామని వైఎస్సార్‌సీపీ నేతలు తేల్చి చెబుతున్నారు.

14 ఏళ్లలో ఒక్క మెడికల్ కాలేజీ కట్టని చంద్రబాబు..

రాష్ట్రంలో 1923 నుంచి 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి కేవలం 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే ఉన్నాయి. పద్మావతి అటానమస్ మెడికల్ కాలేజీతో కలిపితే 12 ఉన్నాయి. 2019 నాటికి చంద్రబాబు మూడు సార్లు అంటే 1995–99, 1999–2004, 2014–19 మధ్య 14 ఏళ్ల సీఎంగా పాలించారు. ఆయన హయాంలో ఒక్కటంటే ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీ కూడా కట్టలేదు. కనీసం కొత్తగా ఏర్పాటు చేయాలనే ఆలోచన కూడా చేయలేదు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని ఏర్పాటు చేస్తామని వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలను పునర్విభజించి 26 జిల్లాలుగా ఏర్పాటు చేశారు. ప్రజలకు చేరువలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించడంతోపాటు మన విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా 17 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఒక్కో కాలేజీకి కనీసం 50 ఎకరాల స్థలం ఉండేలా భూమిని కేటాయించారు. ఒక్కో మెడికల్ కాలేజీ నిర్మాణానికి రూ.500 కోట్లకు పైగా కేటాయించి అన్ని రకాల సదుపాయాలు ఉండేలా క్యాంపస్‌ల అభివృద్ధి పనులు ప్రారంభించారు. కోవిడ్ రెండేళ్లపాటు రాష్ట్రాన్ని పీడించినా, ఎన్ని ఇబ్బందులున్నా ఎక్కడా వెనక్కి తగ్గకుండా మెడికల్ కాలేజీలను పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో అడుగులు ముందుకు వేశారు. విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల మెడికల్ కాలేజీలను 2023–24లోనే ప్రారంభించి తరగతులు కూడా మొదలుపెట్టారు. ఎన్నికల నాటికి పాడేరు, పులివెందుల కాలేజీలు కూడా సిద్ధమయ్యాయి. ఎన్నికల తర్వాత పాడేరులో అడ్మిషన్లు ముగిసి తరగతులు కూడా ప్రారంభమయ్యాయి.

కక్షసాధింపు చర్యలకు పరాకాష్ట..

గత ఏడాది అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కొత్త మెడికల్ కాలేజీలను తన అనుయాయులకు కట్టబెట్టాలని నిర్ణయించారు. పులివెందుల మెడికల్ కాలేజీలో 50 ఎంబీబీఎస్ సీట్లతో తరగతులు ప్రారంభించడానికి నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) గతేడాది అనుమతులు ఇచ్చింది. కానీ.. ఆ సీట్లు మాకు వద్దంటూ ఎన్‌ఎంసీకి సీఎం చంద్రబాబు లేఖ రాశారు. సీఎం చంద్రబాబు కక్ష సాధింపు చర్యలకు ఇది పరాకాష్ట. కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణానికి అవసరమైన నిధులను అప్పట్లోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమీకరించింది. ఆ నిధులను సద్వినియోగం చేసుకుని.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూపొందించిన ప్రణాళిక ప్రకారం చంద్రబాబు సర్కారు చర్యలు చేపట్టి ఉంటే.. 2024–25 విద్యా సంవత్సరంలో ఆదోని, మదనపల్లి, మార్కాపురం మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వచ్చేవి. ఈ విద్యా సంవత్సరం అంటే 2025–26లో అమలాపురం, బాపట్ల, నర్సీపట్నం, పార్వతీపురం, పాలకొల్లు, పెనుకొండ కూడా ప్రారంభం అయ్యేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లు 2,360 మాత్రమే ఉండేవి. కొత్త మెడికల్ కాలేజీల ద్వారా అదనంగా మరో 2,550 సీట్లు పెరిగి.. మొత్తమ్మీద 4,910 సీట్లు అందుబాటులోకి వచ్చేవి. ఎక్కడ వైఎస్ జగన్‌కు క్రెడిట్ వస్తుందోనని ఏకంగా ప్రభుత్వ కొత్త మెడికల్ కాలేజీలను సీఎం చంద్రబాబు దెబ్బతీస్తున్నారని మేధావులు, ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి.

17 నెలల్లో రూ.2.36 లక్షల కోట్ల అప్పు.. మెడికల్ కాలేజీలకు మాత్రం డబ్బుల్లేవట..

చంద్రబాబు ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి 17 నెలల్లోనే రూ.2.36 లక్షల కోట్లు అప్పులు చేసింది. మిగిలిన కొత్త మెడికల్ కాలేజీలు పూర్తి చేయడానికి ఐదేళ్లలో రూ.5 వేల కోట్లు వ్యయం చేస్తే చాలు! ఆ రూ.5 వేల కోట్లను సైతం నాబార్డు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, వివిధ రూపాల్లో సమీకరించేందుకు అప్పట్లోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఆ నిధులతో మిగిలిన ప్రభుత్వ కొత్త మెడికల్ కాలేజీలను పూర్తి చేయవచ్చు. అయితే కొత్త మెడికల్ కాలేజీలను పప్పు బెల్లాలకు బినామీలు, అస్మదీయులకు కట్టబెట్టేందుకు చంద్రబాబు సర్కారు పీపీపీ కుట్ర పన్నింది.

ఉద్యమ కార్యాచరణ ప్రకటించిన వైఎస్ జగన్

రూ.లక్ష కోట్ల విలువైన సంపద లాంటి కొత్త మెడికల్ కాలేజీలను బినామీలకు కట్టబెట్టేందుకు సీఎం చంద్రబాబు సిద్ధమవడంపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ సమరభేరి మోగించారు. ఉద్యమ కార్యచరణ ప్రకటించారు. ప్రభుత్వ కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ ఊరూరా రచ్చబండ నిర్వహించి.. కోటి మంది ప్రజలతో సంతకాలు సేకరించాలని, వాటిని గవర్నర్‌కు అందజేద్దామని పిలుపునిచ్చారు. గత నెల 10న రచ్చబండ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ ప్రారంభించింది. ఊరూవాడా రచ్చబండ నిర్వహిస్తూ చంద్రబాబు సర్కార్ నిర్వాకాలను వైఎస్సార్‌సీపీ నేతలు ప్రజలకు వివరిస్తున్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ.. వాటిని ప్రభుత్వ రంగంలోనే నిర్మించాలని డిమాండ్ చేస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో సంతకాలు చేసేందుకు అన్ని వర్గాల ప్రజలూ పెద్ద ఎత్తున వస్తున్నారు. కోటి సంతకాల సేకరణ మహోద్యమంగా మారింది. వైఎస్ జగన్ ప్రకటించిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా 175 నియోజకవర్గాల్లో బుధవారం వైఎస్సార్‌సీపీ నిరసన ర్యాలీలు నిర్వహిస్తోంది.

కుప్పంలో ర్యాలీకి అనుమతి లేదు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం వైఎస్సార్‌సీపీ చేపట్టనున్న నిరసన ర్యాలీకి చిత్తూరు జిల్లా కుప్పంలో పోలీసులు అనుమతి ఇవ్వలేదు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మాజీ సీఎం వైఎస్ జగన్ పిలుపు మేరకు తిరుపతి, చిత్తూరు జిల్లాల వ్యాప్తంగా నిరసన ర్యాలీలు చేపట్టనున్నారు. ఇందుకు అనుమతులు కోరుతూ ఆయా నియోజకవర్గ సమన్వయకర్తలు పోలీసులకు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో నిరసన ర్యాలీకి పోలీసులు అనుమతి ఇవ్వలేదు. అదేవిధంగా మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న గంగాధర నెల్లూరులో కేవలం 20 మందితో ర్యాలీ నిర్వహించుకోవాలని పోలీసులు హుకుం జారీ చేశారు.

ఇది ఆత్మాహుతి దాడేనా?

- ఎర్రకోట ఘటనలో కారు పేలుడుపై భిన్నాభిప్రాయాలు
- 12కు పెరిగిన మరణాల సంఖ్య

న్యూఢిల్లీ/శ్రీనగర్: దేశ రాజధాని నడిబొడ్డున రుధిర ధారల్ని ఎగజిమ్మి యావత్ భారతావని ఉలిక్కిపడేలా చేసిన కారు పేలుడు ఘటనను ఉగ్రవాద దుశ్చర్యగా కేంద్ర దర్యాప్తు సంస్థలు అనధికారికంగా ప్రకటించాయి. ఉగ్ర వైద్యుడు డాక్టర్ ఉమర్ మొహమ్మద్ నబీ అత్యంత విస్ఫోటక స్వభావమున్న అమ్మోనియం నైట్రేట్ ఫ్యూయల్ ఆయిల్(ఏఎన్‌ఎఫ్‌ఓ)తో నిండిన కారును ఎర్రకోట సమీపంలో నడిరోడ్డుపై పేల్చేశాడని తొలుత వార్తలొచ్చాయి. అయితే ఆరు బయట అధిక వేడిమి, ఒత్తిడి కారణంగా అమ్మోనియం నైట్రేట్ పేలిపోయి ఉంటుందని జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఐ20 కారును జమ్మూ–కశ్మీర్‌లోని పుల్వామా జిల్లా లీథ్‌పురాకు చెందిన ఉమర్ నబీ నడిపినట్లు సమీప సీసీటీవీ కెమెరాల్లో రికార్డయింది. దీంతో కారులో ఉన్నది అతనేనా... కాదా.. అనేది శాస్త్రీయంగా నిర్ధారించేందుకు ఉమర్ తల్లి షమీమా బానో నుంచి డీఎన్‌ఏ శాంపిళ్లను సేకరించారు. ఇప్పటికే ఆమెతోపాటు ఉమర్ సోదరులు ఆషిక్ అహ్మద్, జహూర్ అహ్మద్‌లను పోలీసులు అరెస్ట్ చేసి ప్రశ్నిస్తున్నారు. పుల్వామాలోని ఉమర్ ఇంట్లో సోదాలు చేసి కీలక డాక్యుమెంట్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. కారు పేలినప్పుడు అందులో ఉమర్ ఒక్కడే ఉన్నట్లు తెలుస్తోంది. చికిత్స పొందుతున్న క్షతగాత్రులు ముగ్గురు మంగళవారం ప్రాణాలు కోల్పోవడంతో సోమవారం నాటి పేలుడు ఘటనలో మరణాల సంఖ్య 12కు పెరిగింది. 2,900 కేజీల పేలుడు పదార్థాల స్వాధీనం, ఢిల్లీలో పేలుడు ఘటనలతో అంతటా అలర్ట్ ప్రకటించగా రెండు కేసుల్లో మూలాలను వెతికిపట్టుకునేందుకు ఢిల్లీ

ఉన్నతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా

పోలీస్, ఎన్‌ఐఏ, నిఘా ఏజెన్సీల బృందాలు దేశవ్యాప్తంగా దర్యాప్తు కోసం బయల్దేరాయి. మంగళవారం కశ్మీర్‌లో నలుగురు అనుమానితులను అరెస్ట్‌చేశారు. ఢిల్లీలోని ఎయిర్‌పోర్ట్, రైల్వేస్టేషన్లు, బస్ టర్మినళ్ల వద్ద కట్టుదిట్ట భద్రత కొనసాగుతోంది.

గంటల తరబడి అక్కడే...

సీసీటీవీ దృశ్యాల ప్రకారం ఆ కారు ఎర్రకోట సమీప చారిత్రక సునేహ్రీ మసీదు పార్కింగ్ ఏరియాకు సోమవారం మధ్యాహ్నం 3.19 గంటలకు వచ్చింది. మూడు గంటలపాటు అది అక్కడే ఉంది. అంటే సాయంత్రం 6.22 గంటలదాకా పార్కింగ్‌లో ఉంది. అందులోని వారెవరూ కనీసం కిందకు కూడా దిగలేదు. పేలుడుకు సంబంధించిన ఉగ్ర నెట్‌వర్క్ సూత్రధారుల నుంచి ఆదేశాల కోసం అప్పటిదాకా వేచి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. సాయంత్రం రద్దీ పెరిగాకే కొద్ది నిమిషాల ముందే కిక్కిరిసిన ట్రాఫిక్‌లో చొరబడి విధ్వంసం సృష్టించి ఉంటాడని భావిస్తున్నారు. అంతకుముందు కారు సోమవారం ఉదయం ఫరీదాబాద్ నుంచి బయల్దేరింది. ఏడున్నరకు ఫరీదాబాద్ ఏసియన్ హాస్పిటల్ వద్ద కనిపించింది. బదార్‌పూర్ టోల్ ప్లాజా దాటి ఉదయం 8.13 గంటలకు ఢిల్లీలోకి అడుగుపెట్టింది. అక్కడి సీసీటీవీ ఫుటేజీలో డ్రైవర్ కనిపిస్తున్నా ముఖానికి మాస్క్ ఉంది. సెంట్రల్ ఢిల్లీ, పాత ఢిల్లీలోని దర్యాగంజ్, కశ్మీరీ గేట్ ప్రాంతంలో చక్కర్లు కొట్టి చివరకు ఎర్రకోటకు చేరుకుంది. పేలుడు సాయంత్రం 6.52 గంటలకు జరగ్గా ఈ కారు కొన్ని నిమిషాల ముందు ఛాందిని చౌక్ వైపు వెళ్తూ హఠాత్తుగా యూటర్న్ తీసుకుని వచ్చి సుభాష్ మార్గ్ రోడ్డులో ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆగి పేలిపోయింది. ''తోటి ఉగ్రవాదులు ఫరీదాబాద్‌లో అరెస్టయిన వార్తలను ఇంటర్నెట్, మీడియా ద్వారా తెలుసుకుని డాక్టర్ ఉమర్ పారిపోయి ఉంటాడు. కారులోని పేలుడు పదార్థాలను ఢిల్లీలో ఎక్కడైనా దాచేందుకు వెళ్తూ మార్గమధ్యంలో సిగ్నల్ వద్ద అమ్మోనియం నైట్రేట్ ఒత్తిడి కారణంగా పేలిపోయి ఉండొచ్చు'' అని దర్యాప్తు అధికారు ఒకరు అభిప్రాయపడ్డారు.

కారు ఆర్సీ సల్మాన్ మీదనే ఉన్నా పలువురి చేతులు మారి..

కారును తొలుత ఎండీ సల్మాన్ కొన్నాడు. ఆర్సీ ఇప్పటికీ అతని పేరు మీదే ఉంది. తర్వాత నదీమ్ కొనుగోలు చేయగా తర్వాత ఫరీదాబాద్‌లోని రాయల్ కార్ జోన్ దీనిని కొనుగోలుచేసింది. తర్వాత అమీర్, ఆ తర్వాత కశ్మీర్‌కు చెందిన తారిఖ్ దార్ కొన్నారు. అతను డాక్టర్ ఉమర్‌కు అప్పగించాడు. సల్మాన్ పేరిట ఆర్సీ ఉన్నా అధికారికంగా ఇంతమంది చేతులెలా మారింది? అనేది తెలియాల్సి ఉంది. తారిఖ్ అహ్మద్ దార్‌కు ఉగ్రమాడ్యూల్‌తో సంబంధం ఉందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత యజమానులందరికీ ఉగ్రవాదంతో సంబంధం ఉందా... అనే కోణంలోనూ దర్యాప్తు జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)కు అప్పగించింది. పేలుడు కోణంలో మాత్రమే చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద కేసు నమోదుచేశారు. ఉగ్రచట్టాల కింద కేసు నమోదు చేయలేదు. ఉగ్రవాదం సంబంధిత కేసులను మాత్రమే ఎన్‌ఐఏ దర్యాప్తు చేస్తుంది. ఈ లెక్కన ఈ పేలుడు ఉగ్ర చర్యేనని పరోక్షంగా ప్రభుత్వం ఒప్పుకున్నట్లయింది.

కఠినంగా శిక్షిస్తాం: అమిత్ షా

ఈ ఘటనపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా సారథ్యంలో రెండు సార్లు అత్యున్నత స్థాయి సమావేశాలు జరిగాయి. '' ఈ పేలుడు ఘటన వెనక ఉన్న ప్రతి ఒక్కడినీ వేటాడండి. కారకులను చట్టప్రకారం కఠినంగా శిక్షిస్తాం.'' అని అమిత్ షా అన్నారు.

భారీ స్థాయిలో అమ్మోనియం నైట్రేట్ ఉగ్రవాదులకు ఎలా లభించింది?

పొలాల్లో ఎరువుగా నైట్రోజన్‌గా పనికొచ్చే అమ్మోనియం నైట్రేట్‌ను విధ్వంసం కోసం ఉగ్రవాదులు వేల కిలోల కొద్దీ సేకరించిన తీరుపై దర్యాప్తు కొనసాగుతోంది. క్వారీలో రాతిని బద్దలుకొట్టేందుకు అమ్మోనియం నైట్రేట్‌ను ఉపయోగిస్తారు. నిషేధిత రసాయనం అమ్మోనియ నైట్రేట్‌కు పొటాషియం క్లోరేట్, సల్ఫర్‌ను మిశ్రమంగా కలిపితే అత్యంత పేలుడు పదార్థం(ఐఈడీ) తయారవుతుంది. అమ్మోనియం నైట్రేట్ ఫ్యూయల్ ఆయిల్(ఏఎన్‌ఎఫ్‌ఓ)కు అత్యంత వేగంగా మండే స్వభావం ఉంది. ఈ రసాయనాన్నే ఆర్‌డీఎక్స్‌తో కలిపి 2019లో పుల్వామాలో సైనిక వాహనశ్రేణిపై దాడికి ఉగ్రవాదులు ఉపయోగించారు. ఈ నేపథ్యంలో ఉగ్రమాడ్యూల్‌ల వద్ద ఈ రసాయనం భారీ స్థాయిలో ఉండొచ్చనే అనుమానాలు బలపడుతున్నాయి.

ఎవరీ ఆత్మాహుతి బాంబర్?

36 ఏళ్ల డాక్టర్ ఉమర్ ప్రస్తుతం ఫరీదాబాద్‌లోని అల్–ఫలాహ్ వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. ఉమర్ తండ్రి గతంలో జమ్మూ కశ్మీర్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేశారు. ఉమర్ సొంతూరు పుల్వామా సమీప కోయిల్ గ్రామం. కారును పేల్చింది ఉమర్ అని మీడియాలో వచ్చిన వార్తలు విని ఉమర్ వదిన ముఝామిల్ హుతాశురాలైంది. '' ఉమర్ పుస్తకాల పురుగు. ఎప్పుడూ వైద్యవృత్తి సంబంధ పుస్తకాలే చదువుతాడు. శుక్రవారం కూడా ఫోన్‌లో మాట్లాడాం. గ్రంథాలయంలో ఉన్నానని చెప్పాడు. పేదరికం నుంచి మమ్మల్ని బయటపడేస్తాడనుకున్నాం. ఉగ్రవాదభావంలో మునిగిపోతాడని అస్సలు అనుకోలేదు. ఉమర్ తల్లి చిన్నాచితకా పనులు చేస్తూ ఇంకా కష్టపడుతున్నారు. ఉమర్ అన్న ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా తమ్ముడు స్టెనోగ్రఫీ నేర్చుకుంటున్నాడు'' అని వదిన చెప్పింది.

షాహీన్ కనుసన్నల్లో జైషే మహిళా ఉగ్ర విభాగం..

దర్యాప్తు సంస్థ అదుపులో ఉన్న వైద్యురాలు షాహీన్ సయీద్ గురించి విస్మయకర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈమె కారులో అసాల్ట్ రైఫిల్, పిస్టల్, మందుగుండు లభించడంతో ఉగ్రవాదులకు సాయపడుతోందని భావించి తొలుత ఆమెను అరెస్ట్‌చేశారు. కానీ ఈమెనే స్వయంగా అమాయకులను ఉగ్రవాదంలోకి దింపుతున్నారని తెలిసి దర్యాప్తు అధికారులు సైతం ఆశ్చర్యపోయారు. షాహీన్ ఏకంగా భారత్‌లో జైషే మొహమ్మద్ ఉగ్రసంస్థ మహిళా విభాగం 'జమాత్ ఉల్ మోమినాత్'కు సారథ్యం వహిస్తోంది. ఈ విభాగం జైషే మొహమ్మద్ చీఫ్ మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ పాకిస్తాన్‌లో ఉండి నడిపిస్తోంది. ఫరీదాబాద్‌లోని అల్–ఫలాహ్ వైద్య కళాశాలలోని తోటి వైద్యుడు ముజామిల్ ఘనీతో షాహీన్‌కు సత్సంబంధాలు ఉన్నాయి. ఘనీకి ఈమె ప్రియురాలు అని తెలుస్తోంది. కశ్మీర్‌కు చెందిన ఘనీ ఇప్పటికే ఉగ్రమాడ్యూల్ ఉదంతంలో అరెస్ట్ అయ్యాడు. ''షాహీన్ ధోరణి విచిత్రంగా ఉండేది. మెడికల్ కాలేజీలో ఆమె ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించేది. చెప్పకుండా బయటకు వెళ్లిపోయేది. ఆమెకు కలిసేందుకు ఎంతోమంది వచ్చేవారు. సరిగా విధులు నిర్వర్తించట్లేదని ఆమెపై ఎన్నో ఫిర్యాదులు అందాయి. ఆమె ఏకంగా ఉగ్ర రిక్రూటర్ అని తెల్సి నమ్మలేకపోతున్నాం'' అని కాలేజీ యాజమాన్యం పేర్కొంది.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా..
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 425 9899

అది ప్రీ-బిడ్ మీటింగ్

- టెండర్ల విధివిధానాల రూపకల్పన కోసం జరిగింది
- సాక్షి కథనంపై ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ పి.అయూబ్ ఖాన్

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఎస్పీడీసీఎల్) కార్పొరేట్ కార్యాలయం (తిరుపతి)లో ప్రీ-బిడ్ సమావేశం నిర్వహించామని, సమీక్షా సమావేశం కాదని సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్- ఐటీ) పి. అయూబ్ ఖాన్ తెలిపారు. 'పవర్' పై ప్రైవేట్ 'పెత్తనం' శీర్షికతో 'సాక్షి'లో మంగళవారం ప్రచురించిన కథనంపై ఆయన స్పందించారు. ఆర్డీఎస్ఎస్ పథకంలో భాగంగా విజయవాడలో డేటా రికవరీ (డీఆర్) సెంటర్ ఏర్పాటు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), ఆపరేషనల్ టెక్నాలజీ (ఓటీ) అప్లికేషన్ల రూపకల్పన తదితర అంశాలకు సంబంధించి గతనెల 13న వివిధ కంపెనీలకు చెందిన కాంట్రాక్టర్లు, ఐటీ నిపుణులు, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) ప్రతినిధులతో ఏపీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో ప్రీ-బిడ్ మీటింగ్‌ను నిర్వహించినట్లు ఆయన వివరించారు. ఆ టెండర్లకు విధివిధానాలను రూపొందించేందుకే ముందుగా ప్రీ-బిడ్ సమావేశాన్ని నిర్వహించామన్నారు.

ఇప్పుడే నిద్ర లేచావా సనాతన యోధా?

- బాబు స్క్రిప్ట్‌ను వల్లె వేస్తూ చిలుక పలుకులా?
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై మాజీ మంత్రి అంబటి వ్యంగ్యాస్త్రాలు

సాక్షి, అమరావతి: మెడికల్ కాలేజీలను చంద్రబాబు సర్కారు ప్రైవేటీకరించడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం వైఎస్సార్‌సీపీ ర్యాలీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రజల దృష్టి మళ్లించడానికి చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్ట్‌ను 'ఎక్స్' వేదికగా చిలుక పలుకుల్లా పలుకుతున్నారంటూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. సీఎం చంద్రబాబు ప్రచార డప్పులకు నృత్యం చేయడానికి నిద్రాణస్థితి నుంచి ఇప్పుడు బయటకు వచ్చావా అంటూ చలోక్తులు విసిరారు. ఇది ధర్మం కాదు.. ఇది రాజకీయ రాక్షస క్రీడే అని మంగళవారం అంబటి 'ఎక్స్'లో మండిపడ్డారు. ''ఓరి దేవుడా.. గొప్ప సనాతన యోధుడు పవన్ కళ్యాణ్ గారు చివరకు నిద్రాణ స్థితి నుంచి తేరుకుని.. న్యాయం కోసం కాదు, సత్యం కోసం కాదు, ధర్మం కోసం కాదు, చంద్రబాబు ప్రచార డప్పులకు నృత్యం చేయడానికి వచ్చాడు. తిరుపతి తొక్కిసలాటలో ఆరుగురు మరణించినప్పుడు బిగ్గరగా మాట్లాడిన ఈ 'విశ్వాస రక్షకుడు' ఎక్కడ ఉన్నాడు? సింహాచలంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయినప్పుడు అతని దైవిక ఆగ్రహం ఎక్కడ ఉంది? కాశీబుగ్గలో 9 మంది మరణించినప్పుడు గొప్ప ధర్మ యోధ ఎక్కడ ఉన్నాడు? ఒక్క పరామర్శ కూడా లేదు, ఒక్క మాట కూడా లేదు, ఒక్క నామమాత్రపు అంగీకారం కూడా లేదు. శోకసంద్రంలో ఉన్న కుటుంబాలను కలవలేదు, సంతాపం ప్రకటించలేదు, ప్రజా నాయకుడి నుంచి ఆశించిన కనీస మానవత్వాన్ని చూపించలేదు. ఇక విశాఖపట్నంలోని టీడీపీ నేత సుబ్రహ్మణ్య గుప్తా కోల్డ్ స్టోరేజ్ నుంచి 1,89,000 కేజీల ఆవు మాంసం స్వాధీనం చేసుకున్నప్పుడు, స్వయం ప్రకటిత సనాతన యోధుడు మళ్లీ అదృశ్యమయ్యాడు. దారుణం కాదా? ఈరోజు వైద్య కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ బుధవారం ర్యాలీలు నిర్వహించే ముందు, పవన్ అకస్మాత్తుగా మేల్కొని, బాబు ఇచ్చిన స్క్రిప్ట్‌ను చిలుక పలుకుల్లా వల్లె వేస్తున్నాడు' అంటూ ఎద్దేవా చేశారు.

టీడీపీ నేత గోదాం నుంచే గో మాంసం ప్యాకింగ్!

దీన్ని డైవర్ట్ చేసేందుకే తిరుమల లడ్డూ వ్యవహారం మళ్లీ తెరపైకి!

అసలు 189 టన్నుల గో మాంసం ఎక్కడికి తరలిస్తున్నట్లు?

సాక్షి, విశాఖపట్నం: టీడీపీ నేతకు చెందిన గోదాంలో దాదాపు 200 టన్నుల గో మాంసం పట్టుబడిన సంచలన కేసు నుంచి ప్రజలను డైవర్ట్ చేసేందుకు తిరుమల లడ్డూ వ్యవహారాన్ని చంద్రబాబు సర్కారు మళ్లీ తెరపైకి తెస్తోంది. లడ్డూ నెయ్యి కల్తీ అంటూ అనవసర రాద్ధాంతానికి దిగుతూ... గో మాంసం కేసును నీరుగార్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. బాపట్ల టీడీపీ ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ప్రధాన అనుచరుడు, టీడీపీ కీలక నేత సుబ్రహ్మణ్య గుప్తాకు చెందిన విశాఖ శివారు శొంఠ్యాంలోని శ్రీ మిత్ర మెరైన్ ఏజెన్సీ కోల్డ్ స్టోరేజీలోనే గోమాంసం దొరకడంతో చంద్రబాబు సర్కారు ఉలిక్కిపడింది. అంతే, ఆ వెంటనే అసలు ఏమీ లేని కల్తీ నెయ్యి కేసును మళ్లీ తెరపైకి తెచ్చింది. ఓవైపు విశాఖ గోదాం నుంచి అరబ్ దేశాలకు ఎగుమతికి సిద్ధం చేసిన 189 టన్నుల గో మాంసం దొరికిన కేసులో విచారణను జాప్యం చేస్తూ... మరోవైపు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్‌కు కూడా దర్యాప్తు ఇవ్వకుండా అడ్డుకుంటోంది. వాస్తవానికి నెల నుంచి సాగుతున్న ఈ గో మాంసం సీజ్ కేసులో విస్తుపోయే వాస్తవాలున్నాయి.

గో మాంసం పట్టుబడిన టీడీపీ నేత గోదాం. ఇన్‌సెట్లో టీడీపీ నేత సుబ్రహ్మణ్య గుప్తా

అసలు ఏం జరిగిందంటే?

అక్టోబరు 3న శ్రీ మిత్ర కోల్డ్ స్టోరేజీలో నిషేధిత పశుమాంసం ఉన్నట్లు విజిలెన్స్‌కు సమాచారం అందగా పశు సంవర్థక శాఖకు సమాచారం ఇచ్చి శాంపిల్స్ తీసుకోవాలని సూచించారు. సంబంధిత అధికారులు ఆరు శాంపిల్స్ తీసి అక్టోబరు 5న ఫోరెన్సిక్‌కు పంపారు. గత నెలాఖరునే మెయిల్ ద్వారా రిపోర్టులు ఇచ్చారు. ఆరు శాంపిళ్లలో మూడింట్లో నిషేధిత గో మాంసం ఉన్నట్లుగా వెల్లడైంది. మిగిలిన రెండింట్లో ఎద్దు మాంసం, ఒకదాంట్లో గేదె మాంసం ఉన్నట్లు వెల్లడైంది. దీంతో నిషేధిత గో మాంసం ఉందని విజిలెన్స్‌కు సమాచారం ఇచ్చారు. ఈ నెల 3న పశు సంవర్థక శాఖ, విజిలెన్స్, ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులతో కలిసి విశాఖ ఆనందపురం పోలీసులు సోదాలు చేశారు. అనుమతుల్లేని 189 టన్నుల గో మాంసం ఇక్కడ ఉన్నట్లుగా గుర్తించారు. దీన్ని 9,921 కంటైనింగ్ బాక్సుల్లో ప్యాక్ చేసి నిల్వ ఉంచారు. ఏ పత్రాలు లేకపోవడంతో కోల్డ్ స్టోరేజ్ మేనేజర్ అబ్దుల్ గఫూర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గోమాంసాన్ని సీజ్ చేశారు. ఇక ఇక్కడినుంచి చంద్రబాబు ప్రభుత్వం డ్రామాలు మొదలు పెట్టింది.

ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని..

అక్టోబరు 3వ తేదీన దాడులు జరిగి సీజ్ చేస్తే... 4వ తేదీ సాయంత్రం వరకు సమాచారం బయటకు రాలేదు. ఓవైపు సనాతన ధర్మం అంటూ హడావుడి చేస్తుండగా, రాష్ట్ర చరిత్రలోనే భారీఎత్తున నిషేధిత గోమాంసం పట్టుబడడంతో చెడ్డ పేరు వస్తుందని టీడీపీ నేతలు పోలీసులపై ఒత్తిడి తెచ్చారు. బయటికి రాకుండా చేయాలని ప్రయత్నించారు. కానీ, స్థానికులు కొందరు శొంఠ్యాంలో గోమాంసం పట్టుబడిందని ప్రచారం చేయడంతో ఒక్కసారిగా గుప్పుమంది. చేసేదిలేక...4వ తేదీన పోలీసులు విషయాలను బహిర్గతం చేసి కేసు నమోదు చేశారు. ఉత్తరప్రదేశ్ రిజిస్టర్డ్ కంపెనీ మెష్ ఓవర్సీస్ సంస్థ ఈ పశు మాంసాన్ని తీసుకొచ్చినట్లు గుర్తించి అక్కడి డైరెక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. 8వ తేదీన పోస్టు ద్వారా ఫోరెన్సిక్ నివేదికలు పశుసంవర్థక శాఖకు చేరగా 10న ఆనందపురం పోలీస్‌స్టేషన్‌కు అందజేసినట్లు తెలుస్తోంది.

గేదె మాంసానికి అనుమతి.. ఎగుమతి గో మాంసం

సుబ్రహ్మణ్య గుప్తా గేదె మాంసం అని చెప్పి అనుమతులు పొంది కొంతకాలంగా అనధికారికంగా నిషేధిత గో మాంసం నిల్వ చేసి విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు తెలుస్తోంది. పట్టుబడిన గో మాంసం సెప్టెంబర్ 24న ప్యాక్ అయి విశాఖ చేరుకుంది. ఇక్కడి నుంచి యూఏఈకి చెందిన సాదియా ఫుడ్స్ సంస్థతో కలిసి యూఏఈ, ఖతర్, కువైట్, బహ్రెయిన్, సౌదీ అరేబియా, ఒమన్, వియత్నాంకు ఎగుమతి చేస్తుంటారు. కొంతకాలంగా ఈ అక్రమ వ్యాపారం జరుగుతోందని విజిలెన్స్ దర్యాప్తులో తేలింది.

గో మాంసం కేసును తప్పుదారి పట్టించేందుకు కల్తీ నెయ్యి వ్యవహారం

హిందుత్వాన్ని తామే ఉద్ధరిస్తున్నామంటూ... గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుతున్న చంద్రబాబు ప్రభుత్వానికి గోమాంసం పట్టుబడడం తీవ్ర సంకటంగా మారింది. దీంతో అడ్డగోలుగా వ్యవహరిస్తోంది. భారీగా గోమాంసం పట్టుకున్నారన్న విషయం తెలిస్తే పరువు పోతుందని.. టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారం పేరుతో మరోమారు తప్పుడు ఆరోపణలు మొదలు పెట్టారు. మరోవైపు.. గోమాంసం కేసును తప్పుదారి పట్టించేందుకు అడ్డదారులు తొక్కుతోంది. ఈ వ్యవహారంలో విజిలెన్స్ విచారణకు బ్రేక్ వేసింది. మరోవైపు.. భారీగా నిషేధిత గోమాంసం.. కంటైనర్ల ద్వారా పోర్టు నుంచి విదేశాలకు వెళ్లేందుకేనని తెలుసుకున్న డీఆర్ఐ తమకు కేసును అప్పగించాలని చంద్రబాబు ప్రభుత్వాన్ని కోరగా తమ పోలీసులే విచారణ చేస్తారని వారిని అడ్డుకునేందుకు యత్నిస్తోంది. మరోవైపు.. గోడౌన్ యజమాని అయిన టీడీపీ నేతను తప్పించి.. కేవలం మెష్ ఓవర్సీస్ సంస్థదే తప్పు అన్నట్లుగా చిత్రీకరించి.. కేసుని క్లోజ్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

నన్నెందుకు అడుగుతారంటున్న సీపీ.!

రాష్ట్రంలో ఇంత భారీగా గోమాంసం పట్టుబడి సంచలనం సృష్టించిన కేసు విచారణ ఎంతవరకు వచ్చిందనే విషయంపై విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీని 'సాక్షి' ప్రశ్నించగా.. సీఐని అడగమని బదులిచ్చారు. సీఐ స్పందించడం లేదని చెప్పగా.. ఏసీపీని.. ఆయనా కాదంటే డీసీపీని అడగండి.. నన్నెందుకు అడుగుతారంటూ మాట దాటవేశారు. ఇదంతా చూస్తుంటే కేసు విచారణకు బ్రేక్ వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా ఒత్తిడి తెస్తున్నదో అర్థమవుతోంది. ఆనందపురం సీఐ వాసునాయుడిని అడిగితే.. ఇంతకంటే ప్రాధాన్యమున్న కేసులు, ముఖ్యమైన కార్యక్రమాలు చాలా ఉన్నాయి.. వాటిపైనే దృష్టిసారించామని, ఆ తర్వాతే దీనిగురించి అని చెప్పడం గమనార్హం.

మైనార్టీలను అడ్డం పెట్టుకుని...

విశాఖలోని కోల్డ్ స్టోరేజీని సుబ్రహ్మణ్యగుప్తా ఉరఫ్ చిన్నా ఎనిమిదేళ్లుగా నడుపుతున్నట్లు తెలుస్తోంది. గతంలో రొయ్యల ఎగుమతులు చేసే సమయంలో ప్రస్తుత బాపట్ల టీడీపీ ఎమ్మెల్యే నరేంద్రవర్మ భాగస్వామిగా ఉన్నట్లు తెలుస్తోంది. క్రమంగా నష్టాలు రావడంతో వర్మ తప్పుకొన్నారు. ఇతర వ్యాపారాలను సుబ్రహ్మణ్యగుప్తా కొనసాగిస్తున్నారు. బాపట్ల ఇస్లాంపేటకు చెందిన మైనార్టీల పేరుతో పశుమాంసం ఎగుమతులకు అనుమతులు పొందారు. తొలుత గల్ఫ్ దేశాలకు ఎద్దు, గేదె మాంసం ఎగుమతి చేసేవారు. నిషేధిత గో మాంసం ఎగుమతితో లాభాలు బాగా వస్తాయని అక్రమంగా ఎగుమతులు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. గుప్తాకు టీడీపీ నేతల మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు, పెట్రోల్ బంకుల్లో భాగస్వామ్యం ఉందని చెబుతున్నారు.

సీజ్ ద కోల్డ్ స్టోరేజ్ అని పవన్ ఎందుకు చెప్పలేదు?

గోమాంసం అక్రమరవాణా.. ప్రత్యక్షంగా, పరోక్షంగా రాజకీయ నాయకుల అండదండలతోనే నడుస్తోంది. ఎవరి వాటా వాళ్లకు అందుతోంది. పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఎక్కడా లేని విధంగా.. విశాఖలో స్వయంభూ దేవాలయాలకు దగ్గర్లో దొరికినా స్పందించలేదు. స్థానిక ఎమ్మెల్యే కూడా మాట్లాడలేదు. ఇదంతా ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. హిందువుల మనోభావాల్ని రాష్ట్ర ప్రభుత్వం గౌరవించడం లేదు. గోమాంసం పట్టుబడడంపై ఇంకా స్పందించడం లేదంటే ఏమనుకోవాలి. పశుసంవర్థక శాఖ మంత్రి, హోం మంత్రులు ఎందుకు మాట్లాడడం లేదు? సనాతన ధర్మం అని చెప్పే పవన్ కళ్యాణ్ ఎందుకు నోరు విప్పడం లేదు.? బియ్యం అక్రమ రవాణా జరుగుతుంటే సీజ్ ద షిప్ అని చెప్పిన ఆయన... సీజ్ ద కోల్డ్ స్టోరేజ్ అని ఎందుకు అనలేదు.? ప్రభుత్వం ఏమీ మాట్లాడనివ్వడం లేదా?

– విజయశంకర్ ఫణీంద్ర,
బీజేపీ రాష్ట్ర ధార్మిక సెల్ కో కన్వీనర్

ర్యాలీలను సూపర్ సక్సెస్ చేద్దాం

వైద్య వ్యవస్థను నిర్వీర్యం చేసిన చంద్రబాబు ప్రభుత్వానికి గుణపాఠం చెబుదాం

- ప్రజా స్పందనను బలంగా వినిపిద్దాం
- టెలీ కాన్ఫరెన్స్‌లో వైఎస్సార్‌సీపీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగే ర్యాలీలను సూపర్ సక్సెస్ చేసి చంద్రబాబు ప్రభుత్వం దిగివచ్చేలా చేద్దామని వైఎస్సార్‌సీపీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, పార్లమెంటరీ నియోజకవర్గాల పరిశీలకులతో మంగళవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం కుట్రపూరితంగా వైద్య విద్యార్థుల కలలకు గండికొట్టిందని సజ్జల మండిపడ్డారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టాక ఒకేసారి 17 కొత్త వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టి 5 మెడికల్ కాలేజీలను ప్రారంభించారని గుర్తు చేశారు. తెలంగాణలో భవనాలు లేకపోయినా అనుమతులు తెచ్చుకుని మెడికల్ కాలేజీలు నిర్వహిస్తుంటే.. ఏపీలో దాదాపుగా అన్ని వసతులతో కాలేజీలు సిద్ధం చేశారని చెప్పారు. చంద్రబాబు కొత్త మెడికల్ కాలేజీలు తీసుకురాకపోగా ఉన్న వాటిని ప్రైవేట్‌పరం చేయడానికి కుట్రపన్నారన్నారు.

ఇదంతా ప్రజా ఉద్యమం

'కోటి సంతకాల సేకరణ కోసం క్షేత్రస్థాయిలో మీరంతా ఉన్నారు. ఇదంతా ఒక ప్రజా ఉద్యమంగా కొనసాగుతోంది. మీ అందరి భాగస్వామ్యం వల్ల కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలు విజయవంతం అవుతున్నాయి. చంద్రబాబు ప్రభుత్వం అన్ని పథకాలు నిర్వీర్యం చేసింది. ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందడం లేదు. అన్ని రంగాలు కుదేలయ్యాయి. జగన్ పాలనలో అన్నీ చెప్పిన ప్రకారం ఇచ్చిన ప్రభుత్వాన్ని చూస్తే ఇప్పుడు అంతా కుదేలైన పరిస్థితి దాపురించింది. రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. విచ్చలవిడితనం, అవినీతి పెరిగిపోయాయి. చంద్రబాబు ప్రభుత్వంపై దేశంలో ఏ ప్రభుత్వంపై లేనంతగా వ్యతిరేకత వచ్చింది. నియోజకవర్గాల్లో ర్యాలీలకు పార్టీలకు అతీతంగా కలిసిరావాలి. విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు, మేధావులు, సామాజిక కార్యకర్తలతో ర్యాలీలు విజయవంతం చేయాలి. మనం చేసే ఆందోళనలు, ర్యాలీలు జాతీయ స్థాయిలో చర్చ జరిగేలా ఉండాలి. అప్పుడే చంద్రబాబు ప్రభుత్వం దిగివస్తుంది. సోషల్ మీడియా, డిజిటల్ మీడియాను విస్తృతంగా వినియోగించుకుందాం. మన హయాంలో ప్రజలకు జరిగిన మంచిని, చంద్రబాబు చేస్తున్న దుర్మార్గాలను ప్రజల్లోకి తీసుకెళదాం' అని సజ్జల దిశానిర్దేశం చేశారు.

పలు పరిశ్రమలకు అనుమతులు

- ఇండిచిప్‌కు 150 ఎకరాలు
- ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్‌కు భూమి లీజు గడువు 99 ఏళ్లకు పొడిగింపు
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయాలకు అనుగుణంగా వివిధ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులతో పాటు భూములు కేటాయించింది. ఇండిచిప్ సెమీకండక్టర్స్ లిమిటెడ్‌కు భూ కేటాయింపులతో పాటు ప్రోత్సాహకాలు ప్రకటించింది. ఈ పరిశ్రమకు కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌లోని గుట్టపాడు వద్ద 150 ఎకరాల భూమిని ఎకరం రూ.10 లక్షల చొప్పున కేటాయించింది. ఏపీఐఐసీ రేటు ఎకరం రూ.37.10 లక్షలు ఉందని పేర్కొంది. ఈ కంపెనీ 22,976 కోట్ల పెట్టుబడితో 1,241 ఉద్యోగాలు కల్పించనున్నట్టు తెలిపింది. తిరుపతి జిల్లా శ్రీసిటీలో పీసీబీఏ, బీఎల్‌డీసీ మోటార్స్, కాపర్ ట్యూబ్స్ తయారీ పరిశ్రమను రూ.550 కోట్లతో ఎస్‌సీవీసీ వెంచర్స్ ఎల్ఎల్‌పీ నిర్వహించేందుకు, విశాఖపట్నం మధురవాడలో రూ.2,200 కోట్లతో ఐటీ పార్కుకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి విశాఖ రియాల్టీ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతి ఇచ్చింది. ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్‌కు విశాఖలో ఇచ్చిన 10.29 ఎకరాల భూములకు లీజు గడువును 33 ఏళ్ల నుంచి 99 ఏళ్లకు పొడిగించింది. ఈ మేరకు మంగళవారం ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ విడివిడిగా ఉత్తర్వులు జారీచేశారు.

39 లక్షల మందికి స్క్రీనింగ్

వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి

సాక్షి, అమరావతి: నాన్-కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) సర్వేలో భాగంగా రాష్ట్రంలో 39 లక్షల మందికి స్క్రీనింగ్ నిర్వహించినట్టు వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించడానికి మహిళలకు నోటి, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు చేస్తున్నట్టు వివరించారు. పురుషులకు నోటి క్యాన్సర్ స్క్రీనింగ్ చేస్తున్నామన్నారు. పరీక్షలు చేయించుకున్న మహిళల్లో 9వేల మందిలో రొమ్ము, 22 వేల మందిలో గర్భాశయ క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్టు తెలిపారు. 26 వేల మంది పురుషుల్లో నోటి క్యాన్సర్ లక్షణాలున్నాయన్నారు. వీరిని మరోమారు పీహెచ్‌సీ వైద్యులు పరీక్షిస్తారని వివరించారు. మెప్మా రిసోర్స్ పర్సన్స్, వీవోఏల భాగస్వామ్యంతో ఎన్‌సీడీ స్క్రీనింగ్ కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.

IFFCO
రైతు సోదరులకు విజ్ఞప్తి
ప్రియమైన రైతు సోదరులారా,
IFFCO వారి అడ్వాన్స్‌డ్ నానో ఉత్పత్తులు - నానో యూరియా, నానో DAP, నానో జింక్, నానో కాపర్ మొదలగు వాటిని ఏదైనా ఒత్తిడితో లేదా అనుచితమైన ట్యాగింగ్ కారణంగా కొనరాదు. మీ స్వంత ఇచ్ఛను మేరకే వాటిని కొనుగోలు చేయండి.
ఎవరైనా ఒత్తిడి చేస్తే, ఆ విషయాన్ని IFFCO ప్రాంతీయ అధికారికి లేదా జిల్లా వ్యవసాయాధికారికి వెంటనే తెలియజేయండి లేదా దిగువ ఇచ్చిన టోల్-ఫ్రీ నంబరుకు కాల్ చేయండి.
మీ అప్రమత్తత మనందరికీ శ్రేయస్కరం.
ఎవరేని డీలర్, రిటైలర్ లేదా ఎరువుల అమ్మకందారు అట్టి ట్యాగింగ్ చర్యలకు పాల్పడినట్లు కనుగొనబడితే, IFFCO అట్టి వారితో అన్ని రకాల వ్యాపార సంబంధాలు రద్దు చేసుకుని, కఠినమైన చర్య తీసుకుంటుందని కూడా మేము తెలియజేస్తున్నాము.
టోల్-ఫ్రీ నం.: 1800 103 1967
చీఫ్ మేనేజర్
పౌర సంబంధాలు

మోంథా తుపానుతో నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాలి

- ఆంక్షలు లేకుండా వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించాలి
- బీమా చేసి ఉంటే ఎంత వచ్చేదో అంత పరిహారం చెల్లించాలి
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు రూ.99,734 కోట్ల లబ్ధి
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ఎం.వి.ఎస్.నాగిరెడ్డి



సాక్షి, అమరావతి: మోంథా తుపానుతో తీవ్రంగా నష్టపోయిన రైతులను మానవతా దృక్పథంతో ఆదుకోవాల్సిన ప్రభుత్వం, అందుకు భిన్నంగా పంటనష్టం అంచనాలను తక్కువగా చూపడం అత్యంత హేయమని, చంద్రబాబు ప్రభుత్వ మోసపూరిత విధానాలకు నిదర్శనమని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి (వ్యవసాయం, రైతుసంక్షేమం) ఎం.వి.ఎస్.నాగిరెడ్డి ధ్వజమెత్తారు. తుపానుతో నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాలని, ఎలాంటి ఆంక్షలు లేకుండా వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించాలని డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ తప్పిదం వల్లే రైతులకు పంటల బీమా పరిహారం రావడం లేదన్నారు. బీమా చేసి ఉంటే ఎంత వచ్చేదో అంత పరిహారం ప్రతిరైతుకు చెల్లించాలని కోరారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వ్యవసాయం పండుగలా సాగిందని, ఆ ఐదేళ్లలో వివిధ పథకాలు, కార్యక్రమాల ద్వారా రైతులకు నేరుగా రూ.99,734 కోట్ల లబ్ధి కలిగిందని చెప్పారు.

పెట్టుబడి సాయంలో రూ.19,089 కోట్లు బకాయి పెట్టిన బాబు సర్కారు

'వ్యవసాయం, రైతుల సంక్షేమం కోసం గత ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలకు చంద్రబాబు సర్కారు మంగళం పాడింది. ఇప్పుడు తుపాను నష్టాన్ని తక్కువగా చూపుతూ చంద్రబాబు రైతు వ్యతిరేకినని మరోసారి నిరూపించుకున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 24 జిల్లాల్లో తుపాను ప్రభావం ఉంది. అయినా వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో కేవలం రూ.870 కోట్ల నష్టం జరిగినట్లు అంచనా చూపారు. పంటనష్టం తక్కువ చూపించే ప్రయత్నం జరుగుతోందని ప్రాథమిక అంచనాలు రూపొందించే నాటినుంచే వైఎస్సార్‌సీపీ చెబుతోంది. వరి, మొక్కజొన్న, పత్తి, వేరుశెనగ, మినుములు, పెసలు, కంది, పొగాకు, చెరకు పంటలన్నీ కలిపి కూడా 3.99 లక్షల ఎకరాల్లోనే నష్టం జరిగినట్టు ప్రభుత్వం నివేదిక సిద్ధం చేయడం దారుణం. తుపాను వచ్చిన ప్రాంతంలోనే 29 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. అది చాలా వరకు దెబ్బతింది. అలాంటప్పుడు అన్ని పంటలు కలిపి 3.99 లక్షల ఎకరాల్లో మాత్రమే నష్టం జరిగినట్లు ఎలా చెప్పారు? పడిపోయిన వరి పొలమే కాకుండా సుంకు రాలిపోయిన వరికి కూడా దిగుబడి రాదని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ చాలా స్పష్టంగా చెప్పారు. ఈ ప్రభుత్వం సుంకు రాలిపోయిన పంటను లెక్కలోకి తీసుకోవడం లేదు..' అని నాగిరెడ్డి చెప్పారు.

కాలాన్ని వృథా చేయటం అంటే,
నిన్ను నువ్వు దోపిడీ చేసుకోవటమే!
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 12 నవంబర్ 2025

మళ్లీ ఉగ్రవాద పంజా!

సరిగ్గా పదమూడేళ్ల తర్వాత దేశ రాజధాని నగరంపై ఉగ్రవాదం పంజా విసిరిన ఆనవాళ్లు కనబడుతున్నాయి. చారిత్రక ఎర్రకోట సమీపంలో జరిగిన సోమవారం నాటి ఘటనపై అధికారిక ప్రకటన వెలువడాల్సే ఉన్నా, దాని తీరుతెన్నులు గమనిస్తే అది ఆత్మాహుతి దాడే కావొచ్చనిపిస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ సైతం దీని వెనక కుట్ర ఉండొచ్చని చెప్పడం గమనించదగ్గది. గత పక్షం రోజులుగా జమ్మూకశ్మీర్, హరియాణా, ఉత్తరప్రదేశ్‌లలో పోలీసులు జరిపిన దాడుల్లో ఎనిమిది మంది ఉగ్రవాదుల్ని అరెస్టు చేసి, 2,913 కిలోల పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకోవటం... ఆ సంగతిని ప్రకటించిన కొన్ని గంటలకే ఢిల్లీ పేలుడు ఘటన సంభవించటం గమనిస్తే వీటిమధ్య పరస్పర సంబంధం ఉండొచ్చన్న అనుమానాలు బలపడుతున్నాయి. అరెస్టయిన ఉగ్రవాదుల్లో తమ సహచర వైద్యులు ముగ్గురున్న సంగతి తెలిశాక పోలీసుల చక్రబంధం నుంచి తప్పించుకుని పరారవుతూ కావాలని ఆత్మాహుతి దాడికి దిగారా, లేక మరో లక్ష్యాన్ని చేరుకోవటం కోసం వెళ్తుండగా అనుకోకుండా పేలుడు సంభవించిందా అన్నది దర్యాప్తులో తేలాల్సి ఉంది.

ఈ ఘటనలో మృతుల సంఖ్య 13కి చేరటం, గాయపడినవారిలో పలువురి పరిస్థితి ప్రమాదకరంగా ఉండటం పేలుడు తీవ్రతను చాటుతోంది. తమ చర్యల ద్వారా సమాజంలో భయోత్పాతాన్ని సృష్టించటం, అందుకోసం జన సమ్మర్దం గల ప్రాంతాలను ఎంచుకోవటం ఉగ్రవాదుల అలవాటు. తమ మతిమాలిన చర్య వల్ల ఏ వర్గాలవారు బలవుతారు, ఎన్ని కుటుంబాలను విషాదంలో ముంచెత్తుతామన్న విచక్షణ ఉగ్రవాదులకుండదు. వీరి ఉన్మాదానికి తోపుడు బళ్లు నడిపేవారు, ఆటో డ్రైవర్లు, పగలంతా రెక్కలు ముక్కలు చేసుకుని సొంతగూటికి చేరటం కోసం వెళ్తున్న సామాన్య పౌరులు, దగ్గర్లోని దుకాణదారులు బలయిపోయారు. పేలుడు తర్వాత ఎటుచూసినా చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలూ, తెగిపడిన కాళ్లూ చేతులూ కనబడ్డాయి. కొన్ని సెకన్ల క్రితం జీవంతో తొణికిసలాడిన మనుషులు ఛిద్రమైన శరీరాలతో ఆర్తనాదాలు చేస్తూ శోకించటం... కొందరు భయంతో పరుగులు పెట్టడం, అయినవారి జాడ కోసం మరికొందరు వెదుకులాడటం తలుచుకుంటేనే గగుర్పాటు కలిగించే భీతావహ దృశ్యం.

ఏదైనా ఘటన జరిగినప్పుడు అది తమ పనేనని చెప్పుకోవటం అలవాటున్న ఉగ్రవాదులు 24 గంటలు గడిచినా కిమ్మనకపోవటం అయోమయాన్ని సృష్టించటానికే కావొచ్చనిపిస్తోంది. సాధారణంగా పేలుడు జరిగిన మూడు నాలుగు గంటల్లో ఘటన స్థలిలో లభ్యమయ్యేవాటి ఆధారంగా కారకుల విషయంలో దర్యాప్తు అధికారులు ప్రాథమిక నిర్ధారణకొస్తారు. కానీ ప్రస్తుత ఘటనలో కొంత సమయం తీసుకోకతప్పదని ఎన్ఐఏ భావించి ఉండొచ్చు. వాస్తవానికి మొదట్లో వాహనంలోని సీఎన్‌జీ ట్యాంక్ పేలివుండొచ్చనుకున్నా, ఆ వాహనం యజమాని పుల్వామా వాసిగా అర్ధరాత్రికి ధ్రువపడటం, క్రయవిక్రయాల సమయంలో తప్పుడు పత్రాలు దాఖలు చేశాడని తేలడం ఉగ్రవాద ప్రమేయాన్ని సూచిస్తోంది.

కేంద్రం తీసుకున్న అనేక చర్యల పర్యవసానంగా ఉగ్రదాడులు దేశంలో గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. ముఖ్యంగా ఢిల్లీలో 2012లో ఇజ్రాయెల్ దౌత్య కార్యాలయం దగ్గర జరిగిన పేలుడు ఘటన తర్వాత మరేదీ చోటుచేసుకోలేదు. 2008 నాటి ముంబై పేలుళ్ల ఘటన తర్వాత ఎన్ఐఏను ఏర్పర్చటం, నిఘా వ్యవస్థను పటిష్ఠపరచటం, అందుకోసం ప్రత్యేకంగా జాతీయ నిఘా గ్రిడ్(నేట్‌గ్రిడ్) రూపకల్పన, అక్రమ ద్రవ్య చలామణీ నిరోధక చట్టాన్నీ, చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టాన్నీ మరింత కఠినతరం చేస్తూ సవరణలు తీసుకురావటం ఉగ్రవాదం నియంత్రణకు గణనీయంగా తోడ్పడ్డాయి. అయితే ఎక్కడో ఒకచోట ఏర్పడే చిన్నపాటి ఉదాసీనత అయినా భారీ మూల్యం చెల్లించక తప్పదని తాజా ఉదంతం రుజువు చేస్తోంది. అరెస్టయిన ఉగ్రవాదుల్ని ప్రశ్నించాక పాకిస్తాన్ ప్రమేయం కనబడటాన్ని బట్టి 'ఆపరేషన్ సిందూర్' తర్వాత కూడా అది తన వెనకటి గుణాన్ని విడనాడలేదని అర్థమవుతోంది. అన్ని స్థాయిల్లోనూ మరింత అప్రమత్తత అవసరమని ఢిల్లీ పేలుడు ఘటనైనా, ఉగ్రవాదుల అరెస్టులైనా వెల్లడిస్తున్నాయి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు కార్తిక మాసం, **తిథి:** బ.అష్టమి రా.3.48 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** ఆశ్లేష రా.12.09 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** ప.1.08 నుండి 2.42 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.23 నుండి 12.08 వరకు, **అమృత ఘడియలు:** రా.10.42 నుండి 12.17 వరకు.

సూర్యోదయం : 6.06
సూర్యాస్తమయం : 5.21
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

సోషల్ టాక్

ఛాంపియన్

నన్ను ఉత్సాహపరచుకుంటూ ఉండటానికి నేను ఎల్లప్పుడూ ఈ మంత్రాన్ని జపిస్తాను. ప్రతి రోజూ నిద్ర లేవగానే, అద్దం చూసుకుని, "కవిన్! సవాళ్లు ఉంటాయని తెలిసీ నువ్వు ఉద్దేశపూర్వకంగా ఈ పరిశ్రమను ఎంచుకున్నావు! నువ్వొక ఛాంపియన్" అని చెప్పుకొంటాను.

– కవిన్ దవే, బాలీవుడ్ నటుడు

రెండు వైపులు

రెండు రెక్కలూ బలంగా ఉంటేనే పక్షి ఎగరగలదు. అలాగే, మానవాళి ప్రగతి పథంలో నడవాలంటే స్త్రీలు–పురుషులు ; బాలురు–బాలికలు సమాజానికి రెండు వైపులా సమానమైన శక్తిగా నిలబడాలి. సమభావన అన్నది ఇంటి నుండే ప్రారంభం కావాలి.

– తనుశ్రీ సాహా దాస్‌గుప్తా, భౌతిక శాస్త్రవేత్త

నిర్ణయ శక్తి

విడాకులు తీసుకోక తప్పని పరిస్థితి కంటే బహుశా జీవితంలో కష్టమైన సందర్భం వేరే ఏదీ ఉండదు! వంద రోజులకే మా పెళ్లి ముగిసిపోయింది. కొత్త భాగస్వామిగా నా కెరీర్‌ను ఎంచుకున్నాను. సంపాదన అనేది నిర్ణయించుకునే శక్తిని, స్వేచ్ఛనిస్తుంది.

– కవిత కె. బడ్జాత్యా, సినీ నిర్మాత

సంకల్ప బలం

నన్ను 'సర్' అని సంబోధించిన వారే ఇప్పుడు 'మేడమ్' అని అంటున్నారు. స్కూల్లో తోటి విద్యార్థులు, టీచర్లు అదొక సాధారణ విషయంలా నన్ను అవమానిస్తూ ఉండేవారు. కానీ, ప్రజలకు సేవ చేయాలనే నా సంకల్పం, పట్టుదల నేను ముందుకు సాగటానికి తోడ్పడాయి.

– ఐశ్వర్య రుతుపర్ణ ప్రధాన్, తొలి ట్రాన్స్‌జెండర్ ఐ.ఎ.ఎస్.

వ్యక్తిత్వ ప్రకటన

మీరు ఏమి ధరిస్తారు, ఎలా ధరిస్తారు అనేది మీ 'లుక్' గురించి మాత్రమే చెప్పదు. మీ ఆలోచనల్ని, పని విధానాలను కూడా నిశ్శబ్దంగా ఇతరులకు తెలియబరుస్తుంది. మంచి దుస్తులను, మీకు తగిన వాటిని ధరించండి. అది ఫ్యాషన్ స్టేట్‌మెంట్ కాదు. పర్సనాలిటీ డిక్లరేషన్!

– సునీల్ సేథీ, ఎఫ్.డి.సి.ఐ. ఛైర్మన్

మార్కెటింగ్

మార్కెట్‌ను నిర్ణయించేది కస్టమర్ కనుక, కస్టమర్‌కు ఏం కావాలో మనం నిర్ణయించకూడదు. కస్టమర్ అవసరాలను, ఆసక్తులను అర్థం చేసుకొని మార్కెటింగ్ వ్యూహాన్ని సిద్ధం చేసుకోవాలి. బ్రాండ్‌పై మనం ఏర్పరిచే విశ్వాసం, ప్రచారాల కంటే ఎక్కువ కాలం ఉంటుంది.

– పార్థో బెనర్జీ, మారుతీ సుజుకీ ఇ.వో.

ఇది భారతీయ-అమెరికన్ల విజయం

అభిప్రాయం

వివేక్ వాధ్వా

'భారతీయులు వెళ్లిపోవాలి'... ఇదే 'మాగా' (మేక్ అమెరికా గ్రేట్ అగైన్) మూకలు ఏడాదిగా చేస్తున్న నినాదం. భారతి సంతతి అమెరికన్లు వారి నినాదం విన్నారు, వెళ్లిపోయారు; కానీ ఇండియాకు కాదు. తాము ఎప్పటినుంచో మద్దతిస్తూ వచ్చి మధ్యలో వదిలేసిన డెమాక్రటిక్ పార్టీలోకి తిరిగి వెళ్లారు! న్యూయార్క్ నగర పునాదులను వారు కదిలించారు.

సినీ దర్శకురాలు మీరా నాయర్ కుమారుడు, 34 ఏళ్ల జోహ్రాన్ మమ్దానీ తాజా మేయర్ ఎన్నికల్లో బ్రహ్మాండమైన విజయం సాధించారు. మాజీ గవర్నర్ ఆండ్రూ కుమో చిత్తుగా ఓడిపోయారు. మమ్దానీ న్యూయార్క్ మొట్టమొదటి ముస్లిం మేయర్. భారత మూలాలున్న తొలి మేయర్. ఈ వందేళ్లలో ఈ పదవికి ఎన్నికైన అతి పిన్న వయస్కుడు కూడా!

కుటుంబంతో... న్యూయార్క్ నగర మేయర్‌గా ఎన్నికైన జోహ్రాన్ మమ్దానీ

◆ అమెరికా జనాభాలో ఇండియన్ అమెరికన్లు రెండు శాతం కంటే తక్కువే. కానీ ప్రభుత్వ పన్నుల ఆదాయంలో వారి వాటా దాదాపు 6 శాతం. అమెరికా అభ్యున్నతికి దశాబ్దాలుగా శ్రమిస్తున్న వాళ్లను 'గో హోమ్' అనడం ద్రోహమే! ఈ అవమానానికి తగిన జవాబే జోహ్రాన్ మమ్దానీ విజయం.

మారిన రాజకీయ మొగ్గు

'అమెరికన్ డ్రీమ్'ను సాకారం చేసుకునేందుకు వచ్చిన భారతీయులు– విద్యావంతులు, కుటుంబ జీవులు సాధారణంగా రాజకీయాలకు దూరంగా ఉంటారు. ఒక ఆదర్శప్రాయమైన సమాజంగా గుర్తింపు తెచ్చుకున్నారు. సాంప్రదాయికంగా మేము డెమాక్రటిక్ పార్టీ సానుభూతిపరులం. ఇటీవలి కాలంలో మాలో చాలామంది రిపబ్లికన్ పార్టీ వైపు మొగ్గడం మొదలైంది. క్రమశిక్షణ, వ్యాపార వ్యవస్థాపక సామర్థ్యం, కుటుంబ విలువల పరంగా అది మా జీవితానుభవానికి దగ్గరగా ఉండటం, మరోవంక డెమాక్రాట్లు రాను రానూ సాంస్కృతిక పోరాటాల్లో మునిగిపోవటం ఇందుకు కారణాలు. నేను కూడా ఈ ఆకర్షణలో పడ్డాను. 1980లో అమెరికా వచ్చినప్పటి నుంచీ నేను డెమాక్రాట్స్‌కే ఓటు వేశాను. గత అధ్యక్ష ఎన్నికలకు మాత్రం దూరంగా ఉన్నాను. జో బైడెన్‌కు వయసు మీరడం, స్పష్టమైన దిశ కొరవడటం వల్ల ఆయన అభ్యర్థిత్వం నాకు నచ్చలేదు. మరోవంక, రిపబ్లికన్ పార్టీ చెబుతున్నదీ కొంతవరకు సబబుగానే అనిపించింది.

కుటుంబం, మతవిశ్వాసం అంశాలపై డోనాల్డ్ ట్రంప్ ప్రసంగాలు, సోషలిజం గురించి ఆయన చేసిన హెచ్చరికలు నన్ను ఆకట్టుకున్నాయి. మాలో ఇండియాలో పుట్టిపెరిగిన వారున్నారు. వారికి 'సామ్యవాదం' అనేది శుద్ధమైన సిద్ధాంతంగా అనిపించదు. రేషన్ క్యూలైన్లు, సరుకుల కొరతలు, ప్రజలు ఏది తినాలో ఎంత సంపాదించాలో నిర్ణయించే అవినీతిపరులైన అధికార గణం... ఇవన్నీ సామ్యవాదపు వాస్తవికతకు అద్దం పడతాయి.

చెదిరిన ఆశలు

నాలాంటి వలసదారులకు, కింది స్థాయి నుంచి ఉన్నత స్థానాలకు ఎదిగిన నిక్కీ హేలీ, వివేక్ రామస్వామి, ఉషా వాన్స్ వంటి వారికి రిపబ్లికన్ పార్టీ ద్వారాలు తెరుస్తుందని నేను అనుకున్నాను. కానీ గడచిన ఏడాది కాలంలో మా ఆశలు హరించుకుపోయాయి. ఒకప్పుడు ఎవరితోనైతే స్నేహం చేసిందో ఇప్పుడు వారిమీదే 'మాగా' ఉద్యమం నిప్పులు చెరుగుతోంది. లారా లూమర్ వంటి ఇన్‌ఫ్లుయెన్సర్లు ఇండియన్ ప్రొఫెషనల్స్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. మార్జోరీ టేలర్ గ్రీన్ వంటి కాంగ్రెస్ సభ్యులు హెచ్–1బి వీసాలకు మంగళం పాడాలని పిలుపునిచ్చారు. భారతీయులు 'అమెరికన్ల ఉద్యోగాలు దొంగిలిస్తున్నారు' అని దుష్ప్రచారం చేశారు. సంకేతాలు స్పష్టంగా వెలువడుతున్నాయి: మేం అమెరికాకు ఎంత చేసినా, ఎప్పటికీ పూర్తి అమెరికన్లం కాబోము!

అమెరికా జనాభాలో ఇండియన్ అమెరికన్లు రెండు శాతం కంటే తక్కువే ఉండొచ్చు. కానీ ప్రభుత్వ పన్నుల ఆదాయంలో వారి వాటా దాదాపు 6 శాతం. మా సగటు కుటుంబ ఆదాయం జాతీయ సగటు కంటే దాదాపు రెట్టింపు. 'ఫార్చ్యూన్ 500' జాబితాలోని 16 కంపెనీలకు భారత సంతతి సీఈవోలే సారథ్యం వహిస్తున్నారు. వారి నాయకత్వంలోని ఈ కంపెనీల వార్షిక ఆదాయం లక్ష కోట్ల డాలర్లకు పైనే ఉంటుంది.

స్థానిక ఆర్థిక వ్యవస్థలకు పట్టుగొమ్మలుగా ఉన్న చిన్న వ్యాపారుల నుంచి యూనివర్సిటీలు, ఆసుపత్రులను నిర్వహించే సైంటిస్టులు, ఇంజినీర్లు, వైద్యుల వరకు పలు రంగాల్లో విస్తరించి ఉన్న భారత సంతతి ప్రజలు మరే ఇతర దేశాల వలసదారుల కంటే మిన్నగా అమెరికాను బలోపేతం చేస్తున్నారు. అమెరికా అభ్యున్నతికి దశాబ్దాలుగా శ్రమిస్తున్న మమ్మల్ని 'గో హోమ్' అనడం ద్రోహమే!

భారత సంతతి అమెరికన్లకు గుండెకాయ లాంటి న్యూజెర్సీలోని ఎడిసన్ ఓటర్లు ఈ అవమానానికి తగిన జవాబు చెప్పారు. 2024లో అక్కడి ఒక ప్రదేశం ట్రంప్‌కు 30 పాయింట్ల ఆధిక్యం ఇచ్చింది. ఈ నెలలో, డెమాక్రాట్ మికీ షెర్రిల్ దాన్ని 76 పాయింట్ల తేడాతో గెలుచుకున్నాడు. 106 పాయింట్ల ఈ స్వింగ్‌కు విధానాలతో సంబంధం లేదు; ఆత్మగౌరవం తెచ్చిన మార్పు ఇది.

డెమాక్రాట్లా? రిపబ్లికన్లా?

ఏమైనా, పార్టీ విధేయతకు సంబంధం లేని కారణాలతోనే భారతీయ అమెరికన్లు డెమాక్రాట్ల చెంతకు తిరిగి వస్తున్నారు. ఆత్మగౌరవం, అస్తిత్వ రక్షణ అవసరమే ఈ మార్పు తెచ్చింది. అంతేగానీ ప్రగతిశీల రాజకీయాల పట్ల మూఢభక్తి ఇందుకు కారణం కాదు.

డెమాక్రటిక్ పార్టీ అన్ని వర్గాలనూ కలుపుకొనిపోవడం గురించి మాట్లాడుతుంది. అయితే, ఒకప్పుడు తనకు కంచుకోటలా ఉన్న మధ్యతరగతితో ఇప్పుడు సంబంధం కోల్పోయింది. వలసదారులు పాటించే కుటుంబ విలువల నుంచి అది దూరం జరిగింది. శ్రామిక కుటుంబాల రోజువారీ బతుకు పోరాటాలను విస్మరించింది. అతివాదుల చేతిలో ఆ పార్టీ బందీగా మారింది. సంస్కృతుల పోరాటాల్లో అది మునిగితేలుతోంది. 'బాలికలు దుస్తులు మార్చుకునే గదుల్లో (లాకర్ రూమ్స్‌లో) బాలురు ఉండటం' అనే అంశం మీద స్కూళ్లు చర్చలు నిర్వహించేదాకా పరిస్థితి వెళ్లింది. ఒకపక్క మౌలిక విద్యా ప్రమాణాలు క్షీణిస్తున్న సమయంలో ఇలాంటి చర్చలు జరగడం పట్ల 'నా' లాంటి వలసదారులు సహా పలువురు అమెరికన్ తల్లితండ్రులు దిగ్భ్రాంతి చెందారు.

మమ్దానీ గెలుపు ఈ నూతన వాస్తవికత రెండు పార్శ్వాలను ప్రతిబింబిస్తోంది. ఒక సమాజపు ఆత్మవిశ్వాసం, స్వరం ఆయన ఎన్నిక వెనుక ఉన్నాయి. అదే సమయంలో, వాస్తవిక దృక్పథం లోపించిన సిద్ధాంతంతో ముడిపడిన ప్రమాదాలనూ అది వెల్లడిస్తోంది. నిత్యావసర వస్తువుల దుకాణాలు నిర్వహిస్తామన్న ఆయన వాగ్దానం దయాపూరితంగా కనబడుతుంది. కానీ, పాత కాలపు ఇండియన్ సోషలిస్టు మోడల్ గురించి తెలిసిన నా లాంటి వారికి ఈ కథ ముగింపు ఎలా ఉండబోతోందో బాగా తెలుసు.

అధికార గణస్వామ్యం, జనాకర్షక విధానం స్వల్పకాలంలో ప్రశంసలు కురిపించవచ్చు. అయితే అవి ప్రగతికి శత్రువులు. నాణ్యతకు బదులు నాసిరకంలో సమానత్వం వస్తుంది.

రిపబ్లికన్లకు ఇప్పటికీ అవకాశం ఉంది. అయితే వారు తమ దౌర్జన్య వైఖరిని విడనాడాలి. ఒకప్పుడు తమకు వన్నె తెచ్చిన తెగువ, యోగ్యత, ఆశావాదం వంటి విలువలను తిరిగి ఒంటబట్టించుకోవాలి. అందాకా, వారికి దూరమైన ఓటర్లు దూరంగానే ఉంటారు.

వ్యాసకర్త విశ్లేషకుడు – 'వయోనిక్స్ బయోసైన్సెస్' సీఈఓ
('ద హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

ఆంక్షలతోనా వేతన సంఘాన్ని నియమించేది?

ప్రతిభావంతులను ప్రభుత్వ ఉద్యోగాల వైపు ఆకర్షించి, సామర్థ్యం, జవాబుదారీతనం, పని సంస్కృతిలో బాధ్యతను ప్రోత్సహించే విధంగా 8వ వేతన సవరణ సంఘం వేతనాలను సిఫార్సు చేయాలని... వేతన సంఘం నియామకంపై కేంద్ర ఆర్థిక శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న భత్యాలు, అమలు చేస్తున్న షరతులను పరిశీలించి వాటి హేతుబద్ధీకరణకు సిఫార్సు చేయాలని గెజిట్ నిర్దేశించింది. ఉద్యోగుల పనితీరు, ఉత్పాదకతను మెరుగుపరిచేందుకు వీలుగా ప్రస్తుతం అమల్లో ఉన్న బోనస్ పథకాలను పరిశీలించి, మంచి పనితీరు కనబరిచిన వారిని ప్రోత్సహించేలా ఆర్థిక కొలమానాలు సిఫార్సు చేయాలని కోరింది.

గెజిట్ నోటిఫికేషన్ ఇలా ఉంటే దేశ ఆర్థిక స్థితి ఆకాశానికి ఎగిసిందని పాలకులు ప్రచారం చేస్తూ, ఆర్థిక అధోగతిని సూచించే ఆర్థిక జాగ్రత్తలను పాటించమని వేతన సవరణ యంత్రాంగానికి పరస్పర విరుద్ధమైన షరతులు విధిస్తున్నారు.

నిజానికి ఆర్థిక పరిస్థితిని పరిశీలించాల్సిన బాధ్యత వేతన సవరణ యంత్రాంగానిది కాదు. వేతన సవరణ యంత్రాంగం ఉద్యోగులు, పెన్షనర్ల ఆర్థిక స్థితిలో జీవన వ్యయం వంటి అంశాలను పరిశీలించి సిఫార్సులు చేయాలి. వారి మెరుగైన సిఫార్సులతోనే ప్రతిభావంతులైన యువకులు ప్రభుత్వ ఉద్యోగాల వైపునకు ఆకర్షింపబడుతారు. అప్పుడే ప్రభుత్వ యంత్రాంగంలో సామర్థ్యం, జవాబుదారీతనం పెరుగుతాయి. ప్రభుత్వ పథకాలు సంక్షేమ కార్యక్రమాలు అట్టడుగు ప్రజలకు చేరుతాయి. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో లక్షలాదిమంది ఉద్యోగులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధీనంలో పనిచేస్తున్నారు. వీరందరికీ రెగ్యులర్ ఉద్యోగుల వలె వేతన భత్యాలు అమలు కావడం లేదు. 'సమాన పనికి సమాన వేతనం' ఇక్కడ వర్తించడం లేదు. వేతన సవరణ సిఫార్సులు ఇటువంటి తాత్కాలిక ఉద్యోగులకు వర్తించవు. అటువంటప్పుడు సామర్థ్యం, జవాబుదారీతనం ఎలా సాధ్యమవుతాయి?

పైగా ప్రైవేటు రంగ సంస్థల ఉద్యోగుల వేతనాల తీరు, ప్రయోజనాలు, పని పరిస్థితులు కూడా పరిశీలించి, ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలను సిఫార్సు చేయాలని మరో నిబంధన ఉంది. అయితే ప్రైవేట్ రంగంలో ఉద్యోగుల శ్రమదోపిడీ ఎక్కువగా ఉంటుంది. వేతనాలు తక్కువ. పని పరిస్థితులు అధ్వాన్నం. 'ఉద్యోగుల ప్రయోజనాల కంటే యాజమాన్యాల ప్రయోజనాలకే' అక్కడ ప్రాముఖ్యం ఉంటుంది. వాటితో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను పోల్చడం... ప్రభుత్వ రంగ ఉద్యోగుల వేతనాలను, పెన్షన్లను తగ్గించడానికే! ఉద్యోగుల వాటా నిధులు లేని పెన్షన్ పథకాల ఖర్చు తగ్గింపు మరో షరతు. పాత పెన్షన్ పథకంలో కొనసాగుతున్న కొద్దిమంది ఉద్యోగుల పెన్షన్‌ను, పాత పెన్షన్ పథకాన్ని ఆపడానికి ఈ షరతులను ప్రభుత్వం నిర్దేశించింది.

పదేళ్లకోసారి జరిగే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల సవరణ ఇప్పుడు 2026 జనవరి 1 నుండి అమలు కావాల్సి ఉంది. ఇప్పటికే 2025 ఆర్థిక బిల్లు ద్వారా ఉద్యోగుల పెన్షన్లను పెంపు లేకుండా చూసే నిబంధనలను ఆమోదించుకున్న కేంద్ర ప్రభుత్వం, భవిష్యత్తులో వేతన సవరణ ద్వారా పెన్షన్ల పెరుగుదల లేకుండా రంగం సిద్ధం చేసింది. ఆ మేరకే ఈ నిబంధనలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం రాబోయే వేతన సవరణ ద్వారా ఉద్యోగుల వేతనాల బిల్లు పెరగకుండా చూడటానికి వేతన సవరణ కమిషన్ నిబంధనల ద్వారా ముందు కాళ్లకు బంధం వేయడం గమనార్హం.

– కె. వేణుగోపాల్
విద్యారంగ విశ్లేషకులు, టీపీటీఎఫ్

మానవత్వంతో వ్యవహరించాలి!

ఇన్ బాక్స్

భారత సంస్కృతిలో జంతువులకు ఉన్న స్థానం ఉన్నతమైనది– నంది, గోవు, కాలభైరవుని వాహనమైన కుక్కలను పూజిస్తాం. అహింసా సిద్ధాంతాన్ని నమ్మిన దేశం అంటాం. కానీ కుక్క వీధిలో కనిపిస్తే రాళ్లు విసురుతున్నాం! దేశ అత్యున్నత న్యాయస్థానం వీధి జంతువులను 'తొల గించండి' అని ఆదేశిస్తోంది. ఇది కేవలం చట్ట విరుద్ధం మాత్రమే కాదు, మన నాగరికతకూ విరుద్ధమే. వీధికుక్కల విషయంలో సుప్రీం కోర్టు తాజా ఉత్తర్వుల నేపథ్యంలో మన సమాజం ఏ దిశగా సాగుతుందో ఆలోచించే సమయం వచ్చింది.

తాజా సుప్రీం కోర్టు ఆదేశాలు – కొన్ని ప్రదేశాల నుంచి వీధి కుక్కలు, పశువులను తొలగించాలని చెప్పడం, ఇప్పటికే ఉన్న చట్టాలను పూర్తిగా విస్మరించటం. 'యానిమల్ బర్త్ కంట్రోల్ (డాగ్స్) రూల్స్ – 2023' ప్రకారం, వీధి కుక్కలను పట్టి, స్టెరిలైజ్ చేయించి, వ్యాక్సినేట్ చేసి తిరిగి అదే ప్రదేశంలో వదలడం తప్పనిసరి. ఇది కేవలం జంతు సంక్షేమం కోసం కాదు, మానవ సమాజం భద్రత కోసం కూడా! 'తొలగించటం' కాదు, 'వ్యవస్థీకరించటం' అని చట్టం స్పష్టంగా చెబుతోంది. కానీ, కోర్టు ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులు ఈ చట్టానికే విరుద్ధంగా ఉన్నాయి.



సాధారణంగా, చట్టం చేయటానికి పార్లమెంట్, అమలు చేయటానికి కార్యనిర్వాహక శాఖ, పర్యవేక్షించటానికి న్యాయవ్యవస్థ ఉన్నాయి. అయితే న్యాయస్థానం కొన్ని సందర్భాల్లో నేరుగా పాలనా నిర్ణయాల్లాంటి ఉత్తర్వులు ఇస్తోంది. ఇది 'జ్యుడీషియల్ ఓవర్ రీచ్' అని పిలవబడుతుంది. ఎన్నికల ద్వారా ఎన్నికవ్వని కొద్ది మంది న్యాయమూర్తులు ప్రజా జీవితంపై ఇంత ప్రభావం చూపడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం.

భారత రాజ్యాంగం ప్రతి జీవికీ 'జీవన హక్కు' (ఆర్టికల్ 21) ఇచ్చింది. సుప్రీం కోర్టే ఎన్నో తీర్పుల్లో ఈ హక్కు మానవులకే కాకుండా జంతువులకు కూడా వర్తిస్తుందని స్పష్టంగా చెప్పింది. అలాంటప్పుడు, వాటిని 'తొలగించండి' అనే ఆదేశం ఆ హక్కుకే విరుద్ధం.

జంతువుల పట్ల దయ చూపడం కేవలం 'ప్రేమ' కాదు. అది నాగరికత ప్రథమ లక్షణం. సర్కారు, న్యాయస్థానం, ప్రజలు అందరూ కలిసే ఈ విలువను కాపాడాలి. జంతువులను దూరం చేయడం కాదు, వాటితో సహజీవనం నేర్చుకోవడం మన బాధ్యత. మన దేశం తన హృదయాన్ని కోల్పోయినట్లయితే తిరిగి దాని మూలాల్ని వెతకటానికి ఇదే సరైన సమయం.

– తలకోల రాహుల్‌రెడ్డి | మౌలిక సదుపాయాల విశ్లేషకుడు

ప్రాణాలపై 'పిడుగులు'

డేటా పాయింట్

దేశంలో వరదలు, వడగాడ్పుల కంటే పిడుగుపాటుకు ఎక్కువమంది బలైపోతున్నారు. 2023లో ప్రకృతి వైపరీత్యాలకు 6,444 మంది మరణిస్తే అందులో దాదాపు 40 శాతం మంది పిడుగుపడి ప్రాణాలు కోల్పోయినవారే!



మమకారం వదులుకుంటేనే...

జ్యోతిర్మయం

కౌశికుడు అనే ఋషి ఒకసారి కఠోరమైన తపస్సు చేశాడు. మెచ్చి ధర్మదేవత ప్రత్యక్షమై 'ఈ తపస్సు ఫలితంగా నీకు చాలా గొప్పవైన, అన్యులకు సాధ్యం కాని పుణ్యలోకాలను చేరుకునే వరం ఇచ్చాను. నిశ్చింతగా వెళ్ళు!' అంది. 'వినడానికి బాగానేవుంది కాని, నాకొక సందేహం ఉంది' అన్నాడు కౌశికుడు. 'ఏమిటది?' అంది ధర్మదేవత. 'ఈ శరీరం వదిలిపెట్టి వెళ్ళవలసిన లోకాలు నాకెందుకు? అవి మేలైనవే! దుఃఖంతో బాధలు పడాల్సి వస్తున్నప్పటికీ ఈ శరీరం నాది, నేను పెట్టే బాధలన్నింటినీ భరించి నేను ఎలా కావాలంటే అలా వింటున్నది. అట్లాంటి దేహాన్ని విడిచి వెళ్ళడం ఎంతవరకు న్యాయం?' అన్నాడు.

సొంత శరీరం మీద మమకారం అంత సులభంగా వదిలేది కాదు. 'ఇది వదిలెయ్! నీకు స్వర్గంలో ఇంతకు మించిన సుఖాలను ఇస్తానని' అన్నప్పటికీ, అవి ఏమిటో తెలియని వాటిని నమ్మి, అనుభవిస్తున్న సుఖాన్ని వదిలెయ్యడానికి కౌశికుడంతటి మునిపుంగవుడే ఒప్పుకోలేదు. 'చాలా పుణ్యకార్యాలు చేశావు, ఏమీ దిగులు పడకుండా మృత్యువును ఆహ్వానించు. స్వర్గంలో నీ కోసమై బ్రహ్మాండమైన సుఖాలు ఎదురు చూస్తున్నాయి!' అని మరణశయ్య మీద ఉన్నవాడికి ఎంత మంది చెప్పినా, మొహమాటానికి 'అలాగే' అనగలుగుతాడేమో గాని, ఆ మాట అనేటప్పుడు మాత్రం అతగాడి మొహంలో ఆనందం చూడలేము. మనిషికి అన్నింటికంటె మొదటగా మమకారం తన సొంత శరీరం మీదనే ఉంటుంది. ఆ తరువాతనే మిగతావన్నీ! ఆ కారణం చేతనే, మమకారం వదిలిన మనిషి పాప పుణ్య మార్గాలకు అతీతుడనీ, అతడిది అందరినీ మించిన స్థితి అనీ 'ఆంధ్రమహాభారతం', శాంతిపర్వం, చతుర్థాశ్వాసంలోని ఈ పద్యం చెప్పింది:

కం. విను మమకార వివర్జిత / మనస్కులకు బుణ్యపాపమార్గంబులు లే / మిని లోకంబుల ద్రిమ్మర
రనఘా! పొందుదురు శాశ్వతానందంబున్. మమకార వివర్జిత మనస్కులుగా ఉండేవారికి పుణ్యము, పాపము అనే అవస్థలు ఉండవు. పాప పుణ్యలోకాల చుట్టూ తిరిగే అవస్థ కూడా ఉండదు. వారిది శాశ్వతానంద స్థితి అని సారాంశం.

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ నేతపై ఇనుపరాడ్లతో దాడి

తాడిపత్రిలో బరితెగించిన జేసీ అనుచరులు

గాయాలతో ఓబులరెడ్డి

తాడిపత్రి టౌన్: తాడిపత్రిలో టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులు బరితెగించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, తాడిపత్రి మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ ఓబులరెడ్డిపై విచక్షణా రహితంగా ఇనుపరాడ్లు, కర్రలతో దాడి చేసి పారిపోయారు. వివరాల్లోకి వెళితే... తాడిపత్రి మండలం బోడాయిపల్లి గ్రామానికి చెందిన ఓబులరెడ్డి కొంతకాలంగా తాడిపత్రి పట్టణంలో నివాసం ఉంటున్నాడు. వైఎస్సార్‌సీపీలో చురుగ్గా ఉంటున్నాడు. దీన్ని జీర్ణించుకోలేని జేసీ అనుచరులు కొద్దికాలంగా బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం తాడిపత్రి బైపాస్ రోడ్డుపై వాకింగ్ వెళ్లిన ఓబులరెడ్డిపై జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరుడు, టీడీపీకి చెందిన సెల్‌పాయింట్ హరితోపాటు మరో నలుగురు వ్యక్తులు ద్విచక్రవాహనాలపై వచ్చి ఇనుప రాడ్లు, కర్రలతో దాడికి పాల్పడ్డారు. విచక్షణా రహితంగా ఓబులరెడ్డిని కొట్టి రోడ్డు పక్కనే ఉన్న ముళ్లపొదల్లోకి విసిరేసి పారిపోయారు. కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు కావడంతో ఓబులరెడ్డి కదల్లేని స్థితిలో చాలా సమయం అక్కడే ఉండిపోయాడు. ముళ్లపొదల్లోంచి మూలుగులు వినిపించడంతో అటుగా వెళ్తున్న వారు ఆయన్ను గుర్తించి ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆస్పత్రికి చేరుకుని ఓబులరెడ్డిని పరామర్శించారు.

తురకపాలెంలో మరో మరణం

ప్రసాదరావు (ఫైల్)

గుంటూరు రూరల్: గుంటూరు జిల్లా తురకపాలెంలో మంగళవారం మరో మరణం సంభవించింది. దీంతో తురకపాలెంలో మరణాల సంఖ్య 52కు చేరింది. గ్రామానికి చెందిన యాతం ప్రసాదరావు (68) అప్పటివరకూ తిరుగుతూనే ఉన్నాడు. చిన్నపాటి నీరసం, జ్వరంగా ఉన్నట్లు అనిపించటంతో గ్రామంలోనే ఉన్న ఆస్పత్రికి వెళ్లాడు. ఆస్పత్రిలోని వైద్యులు పరీక్షిస్తుండగానే అపస్మారకస్థితికి వెళ్లాడు. వెంటనే గుంటూరు ప్రభుత్వాస్పత్రి తరలించినా ఫలితం లేకపోయింది. అప్పటికే మృత్యువు కబళించేసింది. ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపేసింది. గతంలో ఒక కంపెనీలో కార్మికుడిగా పనిచేసిన ప్రసాదరావు ప్రస్తుతం ఇంటివద్దే కూలీ పనులు చేస్తున్నాడు. ఈయనకు భార్య సుశీల, ముగ్గురు ఆడపిల్లలు, కుమారుడు ఉన్నారు. పిల్లలకు పెళ్ళిళ్ళు చేశాడు. చివరి కుమార్తె దివ్యాంగురాలు కావటంతో ఆమె తల్లిదండ్రులతోపాటే ఉంటుంది. మంగళవారం ఉదయం వరకూ బాగానే దిచక్ర వాహనంపై తిరిగిన ప్రసాదరావు విగతజీవిగా ఇంటికి చేరడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ, కనిగిరి ఈఈకి షోకాజ్ నోటీసులు

ఒంగోలు సబర్బన్: ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ప్రకాశం జిల్లా ఆర్‌అండ్‌బీ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రవినాయక్, కనిగిరి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏడీ సమర్పణకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. సీఎం చంద్రబాబు మంగళవారం పీసీపల్లి మండలం గుంటూరు లింగన్నపాలెంలోని ఎంఎస్ఎంఈ ప్రాంగణంలో శంకుస్థాపన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ క్రమంలో భద్రతా విభాగం ఎస్ఎస్‌జీ విభాగం అధికారులు హెలికాప్టర్ ట్రయల్ రన్ నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఒకసారి, 2.05 గంటల సమయంలో రెండోసారి హెలికాప్టర్ ల్యాండింగ్‌కు ప్రయత్నించింది. ఈ క్రమంలో ఎస్ఎస్‌జీ అధికారులు ఆర్‌అండ్‌బీ అధికారులకు హెలిప్యాడ్ నిర్మాణం, భద్రత, నాణ్యతకు సంబంధించిన కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. అయితే వాటిని సక్రమంగా చేయకపోవడంతో హెలీపాడ్ సక్రమంగా కనపడక హెలికాప్టర్ దిగకుండానే వెనక్కి వెళ్లిపోయింది. హెలిప్యాడ్ నిర్మాణం, నిర్వహణ విషయంలో ఇద్దరు అధికారులు చర్యలు చేపట్టలేదు. దీంతో ఇద్దరు అధికారులపై ప్రభుత్వం సీరియస్ అయింది.

డిసెంబర్‌లో రెండు ప్రయోగాలు

రెండోవారంలో ఎల్‌వీఎం3 మార్క్-6 రాకెట్ ద్వారా బ్లాక్-2 బ్లూబర్డ్ ఉపగ్రహం

చివరివారంలో పీఎస్ఎల్‌వీ సీ62 రాకెట్ ద్వారా ఓషన్‌శాట్-3ఏ ఉపగ్రహం

షార్‌లో కొనసాగుతున్న రాకెట్ల అనుసంధానం పనులు

బ్లాక్2 బ్లూబర్డ్ ఉపగ్రహం ఊహాచిత్రం

సూళ్లూరుపేట: ఈ ఏడాది ఇప్పటివరకు నాలుగు రాకెట్ ప్రయోగాలే చేసిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) డిసెంబర్ నెలలో రెండు ప్రయోగాలకు సిద్ధమవుతోంది. రెండోవారంలో ఎల్‌వీఎం3 మార్క్–6 రాకెట్ ద్వారా బ్లాక్–2 బ్లూబర్డ్ ఉపగ్రహాన్ని, చివరివారంలో పీఎస్ఎల్‌వీ సీ62 రాకెట్ ద్వారా ఓషన్‌శాట్–3ఏ ఉపగ్రహాన్ని ప్రయోగించనుంది. షార్‌లోని రెండో ప్రయోగవేదికకు అనుసంధానంగా ఉన్న రెండో వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో ఇస్రో బాహుబలి రాకెట్‌గా పేరుగాంచిన ఎల్‌వీఎం3 మార్క్–6 రాకెట్ అనుసంధానం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ప్రయోగం ద్వారా అమెరికాలోని టెక్సాస్‌లో ఉన్న ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ రూపొందించిన 6,500 కిలోల బరువు కలిగిన బ్లాక్–2 బ్లూబర్డ్ ఉపగ్రహాన్ని వాణిజ్యపరంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టనుంది. ఈ ఉపగ్రహానికి సంబంధించి అమెరికన్ శాస్త్రవేత్తలు షార్‌లో రాకెట్ అనుసంధానం పనుల్లో పాలుపంచుకుంటున్నారు. ఇస్రో చరిత్రలో 6,500 కిలోల బరువున్న ఉపగ్రహాన్ని ప్రయోగించడం ఇదే మొదటిసారి కావడం విశేషం.

డిసెంబర్ ఆఖరువారంలో పీఎస్ఎల్‌వీ సీ62 ద్వారా ప్రయోగించబోయే ఓషన్‌శాట్-3ఏ ఉపగ్రహం ఊహా చిత్రం

సాంకేతిక విప్లవం... బ్లాక్-2 బ్లూబర్డ్

టెక్సాస్‌లోని ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ సంస్థ రూపొందించిన బ్లూబర్డ్ ఉపగ్రహం విప్లవాత్మకమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగి ఉంటుంది. ఇద్దరు వ్యక్తులు అంతరిక్షం నుంచి స్మార్ట్ ఫోన్లు ఉపయోగించి కాల్స్ చేసుకోవడానికి ఉపయోగపడే విధంగా దీన్ని రూపొందించారు. భూమికి తక్కువ దూరంలోని లియో ఆర్బిట్ నుంచి పనిచేసే ఈ ఉపగ్రహానికి 64 చదరపు మీటర్ల వినూత్నమైన యాంటెన్నా ఉంది. ఇది ఉపగ్రహం నుంచి స్మార్ట్ ఫోన్‌కు ప్రత్యక్ష కనెక్టివిటీని సులభతరం చేస్తుంది. మొబైల్‌ఫోన్ వినియోగదారులు భూమిపై ఉండే టవర్ల మీద ఆధారపడకుండా అంతరిక్షం నుంచి కాల్స్ చేయడానికి, బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్‌ను యాక్సెస్ చేయడానికి ఈ ఉపగ్రహం దోహదపడుతుంది. బ్లూబర్డ్ ఉపగ్రహం కిరణాలు 40 ఎంహెచ్‌జడ్ వరకు సామర్థ్యాన్ని కలిగి ఉండేలా రూపొందించారు. ఇది 120 ఎంబీపీఎస్ వరకు గరిష్ట ట్రాన్స్‌మిషన్ వేగాన్ని అందిస్తుంది. బ్లూబర్డ్ ఉపగ్రహాల సిరీస్ యూఎస్‌ఏలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఎంపికచేసిన మార్కెట్లలో నిరంతరాయంగా సెల్యులార్ బ్రాండ్‌బ్యాండ్ సేవలు అందించాలన్నదే లక్ష్యంగా దీన్ని ప్రయోగిస్తున్నారు.

1,800 కిలోల బరువున్న ఓషన్‌శాట్-3ఏ

డిసెంబర్ ఆఖరువారంలో ప్రయోగించే పీఎస్ఎల్‌వీ సీ62 రాకెట్ అనుసంధానం పనులు మొదటి ప్రయోగవేదికకు అనుసంధానంగా ఉన్న పిఫ్ బిల్డింగ్‌లో జరుగుతున్నాయి. ఈ రాకెట్ ద్వారా 1,800 కిలోల బరువున్న ఓషన్‌శాట్–3ఏ ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నారు. ఈ రాకెట్లను షెడ్యూల్ చేసిన తేదీల్లో ప్రయోగించలేకపోవడంతో రెండు ప్రయోగాలను డిసెంబర్‌లోనే చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఏడాది రాకెట్ ప్రయోగాల జోరు తగ్గింది. జనవరి తరువాత మూడునెలలు ప్రయోగాలే లేవు. మే, జూలై నెలల్లో రెండు ప్రయోగాలు చేశారు. ఆ తరువాత మూడునెలలు ప్రయోగాలకు బ్రేక్‌పడింది. ఈ నెల 2న ఒక రాకెట్ ప్రయోగించిన విషయం తెలిసిందే. అంటే ఈ ఏడాది ఇప్పటివరకు కేవలం నాలుగు ప్రయోగాలు మాత్రమే చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు దుర్మరణం

- కృష్ణాజిల్లా ఉయ్యూరులో నలుగురు
- నెల్లూరు జిల్లాలో ముగ్గురు

షేక్ ముజాహిద్ అలీ(ఫైల్)

షేక్ ఖాజా నజీమ్ మొహిద్దీన్

నెల్లూరు (క్రైమ్)/ఉయ్యూరు/కంకిపాడు: వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. నెల్లూరు నగరంలోని ఓ కంటైనర్ బైక్‌లను ఢీకొట్టగా ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, కృష్ణాజిల్లా ఉయ్యూరులో అతివేగం నలుగురు ప్రాణ స్నేహితులను బలితీసుకుంది. వివరాల్లోకి వెళితే.. నెల్లూరు రోడ్లపై మినీ కంటైనర్ లారీ బీభత్సం సృష్టించింది. మితిమీరిన వేగంతో బైక్‌లను ఢీకొడుతూ రోడ్డుపక్కన ఉన్న దుకాణాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నెల్లూరులోని వెంకటేశ్వరపురానికి చెందిన బి.శ్రీనివాసులకు సంబంధించిన మినీ కంటైనర్ లారీకి బిహార్‌కు చెందిన శ్రావణ్ కుమార్ యాదవ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సూళ్లూరుపేటలో చేపలు, రొయ్యల లోడ్ దించిన శ్రావణ్ మంగళవారం మధ్యాహ్నం కోవూరు సమీపంలోని పడుగుపాడు లారీ యార్డుకు బయలుదేరాడు. నెల్లూరులోని ఎస్వీసీఎస్ కాలేజ్ గ్రౌండ్ సమీపంలో అతివేగంగా వెళ్తూ యూటర్న్ తీసుకుంటున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఆ వెంటనే వేగాన్ని నియంత్రించలేక మరో రెండు బైక్‌లను ఢీకొట్టి.. రోడ్డు పక్కన ఉన్న చిరు వ్యాపారుల మీదకు దూసుకెళ్లాడు. చివరకు చెట్టును ఢీకొట్టి ఆగిపోయాడు. ఈ ఘటనలో నెల్లూరు రూరల్ మండలం అల్లీపురం సిరి గార్డెన్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఎ.సురేష్ (35), బైక్‌పై వెళుతున్న రిటైర్డ్ పీఈటీ షేక్ ఖాజానజీం మొహిద్దీన్(70), అతని కుమారుడు, సచివాలయ ఉద్యోగి షేక్ ముజాహిద్ అలీ(35) ప్రాణాలు కోల్పోయారు. ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన చిరు వ్యాపారులు మంజుల, మాలకొండయ్య, నవాబుపేట సబ్‌స్టేషన్ జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న ఇ.అనిల్, కోటికి తీవ్ర గాయాలయ్యాయి. వీరు ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. శ్రావణ్‌ను సమీప ఆస్పత్రికి తరలించగా.. అక్కడి నుంచి పారిపోయాడు. ఘటనా స్థలాన్ని ఎస్పీ అజిత వేజెండ్ల పరిశీలించారు. నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతదేహాల తరలింపులో అధికారులు అమానవీయంగా ప్రవర్తించారు. మహాప్రస్థానం వాహనాల్లో కాకుండా కార్పొరేషన్ చెత్త ట్రాక్టర్‌లో మృతదేహాలను తరలించారు. దీనిపై మృతుల కుటుంబసభ్యులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరీ ఇంత దారుణంగా వ్యవహరిస్తారా? అని మండిపడ్డారు.

ఎ.సురేష్ (ఫైల్)

ప్రాణం తీసిన అతివేగం

రాకేష్‌బాబు, ప్రిన్స్‌బాబు (ఫైల్)

పాపారావు, చింతయ్య (ఫైల్)

విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతి వేగం నలుగురు స్నేహితుల ప్రాణాలను బలితీసుకుంది. కారు అదుపుతప్పి పల్టీలు కొట్టడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మరణించారు. వివరాలు.. చాట్రగడ్డ రాకేష్‌బాబు(24), ఈటె ప్రిన్స్(22), గొరిపర్తి పాపారావు(23) విజయవాడలో నివాసముంటారు. సోమవారం రాత్రి కారులో కృష్ణా జిల్లా కుందేరులో ఉంటున్న కొణతం చింతయ్య(19) వద్దకు వచ్చారు. అతన్ని కూడా కారులో ఎక్కించుకొని విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపై ఉయ్యూరు వైపు బయలుదేరారు. అర్ధరాత్రి 1.30 సమయంలో గండిగుంట పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి వీరి కారు అదుపుతప్పి.. జాతీయ రహదారి, సర్వీసు రోడ్డుకు మధ్యలో ఉన్న గుంతలోకి దూసుకెళ్లి పల్టీలు కొట్టింది. దీంతో పాపారావు మినహా మిగిలిన ముగ్గురూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. తీవ్ర గాయాలపాలైన పాపారావును విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, సీఐ టీవీవీ రామారావు మంగళవారం ఉదయం ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామారావు తెలిపారు.

అచ్చం బాబాలాగే...!

శ్రీ సత్యసాయిబాబా ప్రతిరూపాన్ని విద్యార్థులు కళ్లకు కట్టారు. చిన్నారులందరూ బాబా ఆకృతిలో నిలబడి అందరినీ అలరించారు. శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని శ్రీ సత్యసాయి గురుకులంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బాబా బోధనలను ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని 1,304 మంది విద్యార్థులు సత్యసాయిబాబా ఆకృతిగా ఏర్పడ్డారు. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ అనే మానవతా విలువలు ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో అలవరుచుకోవాలని నినదించారు.

– రాజమహేంద్రవరం రూరల్

రేపటి నుంచి సత్యసాయి శత జయంత్యుత్సవాలు

- హాజరుకానున్న ప్రధాని మోదీ, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు

పుట్టపర్తి అర్బన్: సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు ఈ నెల 13 నుంచి 23 వరకూ 10 రోజుల పాటు పుట్టపర్తిలో వైభవంగా జరగనున్నాయి. ఈ నెల 13న సాయంత్రం 4.30 గంటలకు వేదపఠనంతో ఈ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక కార్యక్రమాలు, దేశంలోనే పేరుగాంచిన సంగీత విద్యాంసులతో సంగీత కచేరీలు ఏర్పాటు చేశారు. 18న వేణుగోపాలస్వామి రథోత్సవం, 19న మహిళా దినోత్సవం, 22న సత్యసాయి విద్యాసంస్థల 45వ స్నాతకోత్సవం ఉంటాయి. 23న సత్యసాయి శత జయంతి ముగింపు వేడుకల్లో భాగంగా ట్రస్ట్ వార్షిక నివేదిక వెల్లడి, సాయంత్రం బంగారు రథం ఊరేగింపు, జోలోత్సవం ఉంటాయి. వేడుకలకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్‌లు, పలు దేశాధినేతలు రానున్నారు. ఈ సారి శత జయంతి వేడుకలు కావడంతో లక్షలాది భక్తులు విచ్చేయనున్నారు. అందుకు తగ్గట్టుగానే సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. ప్రశాంతి నిలయం వెస్ట్ గేట్ సమీపంలో భక్తులకు వసతి కోసం ఒక గ్రామాన్నే ఏర్పాటు చేశారు. లక్షలాది మంది ఉండడానికి అనుగుణంగా తాగునీరు, మరుగుదొడ్లు, సేద దీరడానికి షెడ్లు, విద్యుత్ సౌకర్యం, స్వాగత ద్వారాలు, విచారణ కేంద్రాలు ఏర్పాటు చేశారు.


ఆహ్వానం పలుకుతున్న స్వాగత తోరణం

10 కోట్ల మందిని లక్‌పతి దీదీలుగా మారుస్తాం

కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వెల్లడి

సాక్షి ప్రతినిధి, గుంటూరు/గుంటూరు రూరల్/గుంటూరు మెడికల్: రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా 10 కోట్ల మంది స్వయం సహాయక సంఘాల మహిళలను లక్‌పతి దీదీలుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ చెప్పారు. ప్రస్తుతం రెండు నుంచి మూడు కోట్ల మంది లక్‌పతి దీదీలు ఉన్నారని తెలిపారు. ఈ సంఖ్యను 10 కోట్లకు పెంచడంతోపాటు వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇచ్చి వారికి ఏటా రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షలు ఆదాయం వచ్చేలా చూస్తామని వివరించారు. వాటర్ షెడ్ మహోత్సవ్‌లో భాగంగా రెండో రోజు మంగళవారం గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెంలో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంగళాయపాలెంలో కేంద్ర ప్రభుత్వం రూ.1.20 కోట్లతో ఏర్పాటు చేస్తున్న వాటర్ షెడ్, మిషన్ వాటర్ పునరుద్ధాన్ కార్యక్రమాన్ని శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రారంభించారు. చెరువు వద్ద వాకింగ్ ట్రాక్, జిమ్, ఓపెన్ హాల్‌ను కూడా ప్రారంభించారు. అనంతరం వెంగళాయపాలేనికి సమీపంలోని లయోలా పాఠశాల మైదానంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ రూ.380 కోట్లతో రాష్ట్రంలో రోడ్ల నిర్మాణానికి సహకారం అందిస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రైతుల సంక్షేమం కోసం అందుబాటులో ఉంటానని తెలిపారు.

చెక్కుల అందజేత

'వాటర్ షెడ్ జన్ భగీరథి కప్–2025'లో భాగంగా ఎంపికైన చెరుకువారిపల్లి ప్రాజెక్టు (చిత్తూరు), మద్రికొమ్మదిన్నె ప్రాజెక్టు, గంగాలమ్మ చెరువు ప్రాజెక్టు (శ్రీ సత్యసాయి) టి.సుండుపల్లి ప్రాజెక్టు (అన్నమయ్య), తువ్వపాడు ప్రాజెక్ట్, మారెళ్ల ప్రాజెక్టు (ప్రకాశం), మెరకమూడిదాం ప్రాజెక్టు (విజయనగరం)లకు రూ.20 లక్షలు చొప్పున ఇన్సెంటివ్ నిధులను కేంద్ర మంత్రులు అందజేశారు. దేశంలో ప్రతిపక్షాలు ఓడిపోయిన ప్రతిసారీ ఓటు చోరీ అనడం ఆనవాయితీగా మారిందని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. మంగళవారం గుంటూరు ఎల్వీఆర్ క్లబ్‌లో 'ఆత్మనిర్భర్ భారత్ సంకల్ప అభియాన్' పేరిట నగర ప్రముఖుల సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, స్థానిక ఎమ్మెల్యే బి.రామాంజనేయులు, కలెక్టర్ తమీమ్ అన్సారియా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ కృష్ణతేజ, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మంత్రివర్యులు.. ప్రత్యేక విమానాల్లోనే..

పుట్టపర్తిలో సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలపై సమీక్ష

సాక్షి, పుట్టపర్తి: చంద్రబాబు సర్కార్‌లో అందరూ 'ప్రత్యేక' విమానమే ఎక్కుతున్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక విమానాల్లో విహరిస్తుండగా..తామేం తక్కువ కాదంటూ మంత్రులూ ఇప్పుడు ప్రజాధనంతో 'ప్రత్యేక' బాట పట్టారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాల నిర్వహణ కోసం చంద్రబాబు ప్రభుత్వం ఐదుగురు మంత్రులతో వేసిన కమిటీలో సవిత, సత్యకుమార్, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, కందుల దుర్గేశ్ ఉన్నారు. ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష కోసం మంత్రులు అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, ఆనం రామనారాయణరెడ్డి విజయవాడలోని గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో మంగళవారం పుట్టపర్తికి వచ్చి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. తిరుగు ప్రయాణంలోనూ ప్రత్యేక విమానాన్నే ఉపయోగించారు. కాగా, ప్రత్యేక విమాన ప్రయాణ అవకాశం రాష్ట్రపతి, గవర్నర్, ప్రధాని, ముఖ్యమంత్రికి మాత్రమే ఉంది. కానీ, చంద్రబాబు ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంతో పాటు మంత్రులు కూడా ప్రజాధనంతో ప్రత్యేక విమానాల్లో విహరిస్తుండటం గమనార్హం.

మంత్రులు వచ్చిన ప్రత్యేక విమానం

- కృష్ణా జిల్లా పెడనలోని మదరసా నుంచి ముగ్గురు మైనర్ బాలికలు అదృశ్యమయ్యారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. పట్టణంలోని 15వ వార్డులో ఉన్న మర్కజ్ దారుల్ బీర్ మదరసాలో ఒకేషనల్ కోర్సులో ఈ ఏడాది జూన్‌లో తండ్రులు లేని 14, 15, 17 ఏళ్ల వయసు గల ముగ్గురు బాలికలు చేరారు. ఒకరు కాకినాడ, మరోకరు విజయవాడ, ఇంకొకరు బంటుమిల్లి ప్రాంతాల నుంచి వచ్చారు. కాకినాడకు చెందిన బాలిక తల్లి కూడా పెడనలోనే అద్దెకు ఇల్లు తీసుకుని ఉంటున్నారు. కొద్ది రోజులుగా ఈ బాలికల నడవడికలో మార్పులను తోటి బాలికలు గమనించారు. విషయాన్ని ప్రిన్సిపల్ దృష్టికి తీసుకువెళ్లే లోపు వారు అదృశ్యమయ్యారు.

కురుపాం ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ విచారణ

క్షేత్రస్థాయిలో కమిషన్ సభ్యుల పర్యటన

సాక్షి, పార్వతీపురం మన్యం: పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలోని ఆశ్రమ పాఠశాలలో ఇటీవల విద్యార్థుల మరణాలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) విచారణ చేపట్టింది. క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించింది. కురుపాం ఆశ్రమ పాఠశాలలో పచ్చకామెర్లతో ఇద్దరు విద్యార్థుల మరణం, 200 మందికిపైగా వ్యాధి బారిన పడటంపై వైఎస్సార్‌సీపీ నేతలు ఢిల్లీలోని ఎన్‌హెచ్‌ఆర్‌సీ, జాతీయ ఎస్టీ కమిషన్‌లకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. మాజీ ఉప ముఖ్యమంత్రులు పాముల పుష్పశ్రీవాణి, పీడిక రాజన్నదొర, అరకు ఎంపీ గుమ్మ తనూజ రాణి, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఉమ్మడి విశాఖ జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పాడేరు మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, మాజీ ఎంపీ జి.మాధవి, స్వాతి రాణి, శత్రుచర్ల పరీక్షిత్‌రాజు తదితర నాయకులు.. కమిషన్ సభ్యులను కలసి ఘటనకు దారితీసిన కారణాలు, అనంతర పరిణామాలను వివరించారు. దీనిపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ స్పందిస్తూ.. క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు తీసుకుంటామని వైఎస్సార్‌సీపీ నేతలకు హామీ ఇచ్చింది. ఆ మేరకు మంగళవారం జాతీయ మానవ హక్కుల కమిషన్ దర్యాప్తు విభాగం నుంచి యతిప్రకాశ్ శర్మ, సంజయ్‌కుమార్‌తో కూడిన బృందం పార్వతీపురం మన్యం జిల్లాకు చేరుకుంది. కలెక్టరేట్‌లో గ్రామీణ నీటి సరఫరా విభాగం, డీసీహెచ్‌ఎస్, వైద్య, గురుకులాలు తదితర విభాగాల జిల్లా అధికారులతో సమావేశమైంది. ఘటనకు గల కారణాలు, తక్షణం తీసుకున్న చర్యలపై గురుకుల ప్రిన్సిపాల్, ఐటీడీఏ డీడీ, డీఎంహెచ్‌వోలను ఆరా తీసింది. అక్కడ పారిశుధ్యం, అందించిన ఆహారంపై అడిగి తెలుసుకుంది. తమ వద్ద కొన్ని ప్రశ్నలు సిద్ధంగా ఉంచుకున్న బృంద సభ్యులు.. ఆ మేరకు ఘటనతో సంబంధం ఉన్న విభాగాలను ఆరా తీసింది. ఘటన జరిగిన తర్వాత నివారణ చర్యలు ఏమేం తీసుకున్నారో రికార్డెడ్ ఆధారాలను ఇవ్వాలని ఆదేశించింది. అనంతరం కమిషన్ సభ్యులు కురుపాంలో క్షేత్రస్థాయిలో పర్యటించేందుకు వెళ్లారు. 2 రోజులపాటు ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యులు పలు కోణాల్లో నేరుగా దర్యాప్తు చేయనున్నారు. అనంతరం విశాఖ కేజీహెచ్‌ను సందర్శించి వివరాలు సేకరించనున్నారు.

కలెక్టరేట్‌లో ఎన్‌హెచ్‌ఆర్‌సీ బృంద సభ్యులు

రోజంతా పడిగాపులు... దర్శనమివ్వని పవన్

మంగళగిరి జనసేన కార్యాలయం వద్ద మల్లవల్లి భూ నిర్వాసితుల ఎదురుచూపులు

పడిగాపులు పడుతున్న మల్లవల్లి భూ నిర్వాసితులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ/హనుమాన్‌జంక్షన్ రూరల్: కృష్ణాజిల్లా బాపులపాడు మండలం మల్లవల్లిలోని ఏపీఐఐసీ పారిశ్రామికవాడ భూ నిర్వాసితులు తమకు న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద మంగళవారం రోజంతా పడిగాపులు పడినా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కలిసేందుకు అవకాశం ఇవ్వలేదు. గత ఎన్నికల ముందు పవన్‌కళ్యాణ్ మల్లవల్లి వచ్చి భూ నిర్వాసితుల ఆందోళనకు మద్దతు తెలియజేయడంతోపాటు అధికారంలోకి రాగానే న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా తమకు న్యాయం చేయలేదని బాధితులు మంగళవారం పవన్‌కళ్యాణ్‌ను కలిసేందుకు మంగళగిరిలోని జనసేన ఆఫీసుకు వచ్చారు. ఆయన అనుమతి లభించకపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎదురుచూసి ఉసూరుమంటూ వెనుదిరిగారు. పవన్‌కళ్యాణ్ తమకు ఇచ్చిన హామీని విస్మరించారని బాధిత రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. చంద్రబాబు సర్కారు పరిహారం దక్కని రైతుల నుంచి భూములను బలవంతంగా లాక్కునేందుకు ఈ ఏడాది జనవరిలో దౌర్జన్యకాండకు దిగినప్పటికీ ఆయన స్పందించలేదని వాపోతున్నారు. ఎన్నిసార్లు జనసేన కార్యాలయానికి వచ్చినా కనీసం పవన్‌కళ్యాణ్ కలవడం లేదని మల్లవల్లి భూ నిర్వాసితుల ఉద్యమనేత చిన్నాల వరప్రసాద్ తెలిపారు.

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని అనుసరించండి @SCRailwayindia
ద.మ. రైల్వే టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును

ఇ-టెండరు నోటీసు నం. 46-Dy.CE/GS/GNT

దిగువ తెలిపిన పని కోసం క్రింది సంతకందారు 01.12.2025న 15.00 గం.వరకు ఇ-టెండర్లు కోరుతున్నారు.

01. టెండరు ఐడి: 85. సెక్షన్: Dy.CE/GS/GNT. పని వివరణ: GNT-NDKD: నల్లపాడు–బండారుపల్లి స్టేషన్లలో కి.మీ. 9/13–14 వద్ద LC No. 06 స్థానంలో 2–లేన్ ROB నిర్మాణం. సుమారు విలువ: రూ. 37,90,07,655.61. బయానా: రూ. 20,45,000/-.

1. ఇ-బిడ్స్ ఆన్‌లైన్‌లో దాఖలు చేయుటకు ఆఖరి తేది: 01.12.2025న 15.00 గం.వరకు. వివరమైన సమాచారం కోసం వెబ్‌సైట్ www.ireps.gov.inకు లాగాన్ కావలెను.
2. ఏదేని తదుపరి సమాచారం/సవరణ ఇ-పోర్టల్ www.ireps.gov.in ద్వారా తెలియజేయవలెను.

డిప్యూటీ చీఫ్ ఇంజినీర్, గతిశక్తి, గుంటూరు
A1792

తదుపరి టెండరు నిబంధనలు / వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం దర్శించండి వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
జోనల్ ఆఫీసు: విశాఖపట్నం, డి.నెం.42-1-45/1/1, 1వ అంతస్తు, సౌత్ వింగ్, ఎల్ఐసి న్యూ ఇన్వెస్ట్‌మెంట్ బిల్డింగ్ (జీవన సమృద్ధి బిల్డింగ్), తిక్కన్న రోడ్డు, విశాఖపట్నం-530004

టెండర్ నోటీస్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, విశాఖపట్నం జోనల్ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలోని ప్రముఖ కమర్షియల్ ప్రింటింగ్ ప్రెస్‌ల నుండి "నాన్ సెక్యూరిటీ స్టేషనరీ వస్తువుల ముద్రణ మరియు సరఫరా కోసం ప్రింటర్లు & సరఫరాదారుల ఎంప్యానెల్‌మెంట్" కోసం మూడు (3) సంవత్సరాల కాలానికి బిడ్‌లు దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. టెక్నికల్ మరియు కమర్షియల్ బిడ్ రూ.1000/- టెండర్ ఫీజు DD మరియు రూ.10,000/- EMD DD (రెండు DD లు "UNION BANK OF INDIA" విశాఖపట్నంలో చెల్లించదగినవి)తో పాటు సమర్పించాలి. ప్రతి బిడ్‌ను సీల్ కవర్‌లో జోనల్ కార్యాలయం, విశాఖపట్నంలోని టెండర్ బాక్స్‌లో తేది. 03.12.2025 మధ్యాహ్నం 3:00 గంటలలోపు వేయాలి. వివరమైన టెండర్ పత్రం, అర్హతా ప్రమాణాలు, నిబంధనలు మరియు షరతులు ఈ క్రింది వెబ్‌సైట్లలో అందుబాటులో ఉన్నాయి. www.unionbankofindia.co.in మరియు http://eprocure.gov.in.
గమనిక: బ్యాంక్ ఏ విధమైన కారణం పేర్కొనకుండా దరఖాస్తులను స్వీకరించే లేదా తిరస్కరించే హక్కును కలిగి ఉంటుంది. ఏవిధమైన మార్పులు/సవరణలు మా వెబ్‌సైట్ లేదా ఇప్రొక్యూర్ పోర్టల్‌లో మాత్రమే ప్రచురించబడతాయి. ప్రత్యేక ప్రకటనలు ఇవ్వబడవు.

తేది: 12.11.2025
సం/- డిప్యూటీ జోనల్ హెడ్, విశాఖపట్నం

కుట్రదారులను వదిలిపెట్టం

చట్టం ముందు నిలబెట్టి, కఠినంగా శిక్షిస్తాం

- అమాయకుల ప్రాణాలు బలిగొన్న ముష్కరులకు గుణపాఠం తథ్యం
- ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరిక
- ఢిల్లీ బాంబు పేలుడులో మరణాల పట్ల దిగ్భ్రాంతి
- భూటాన్ మాజీ రాజు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మోదీ
- బాంబు పేలుడు బాధితుల కోసం ప్రత్యేక ప్రార్థనలు

థింపూ: ఢిల్లీ కారు బాంబు పేలుడు వెనుక ఉన్న కుట్రదారులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, వారిని బంధించి, చట్టం ముందు నిలబెట్టి, కఠినంగా శిక్షిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తేల్చిచెప్పారు. ఈ ఘటనపై దర్యాప్తు సంస్థలు లోతుగా విచారిస్తున్నాయని, త్వరలోనే పూర్తి వివరాలు బయటకు వస్తాయని అన్నారు. అమాయక ప్రజలను పొట్టనబెట్టుకున్న ముష్కరులకు తగిన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. ప్రధాని మోదీ మంగళవారం భూటాన్‌లో పర్యటించారు. భూటాన్ మాజీ రాజు జిగ్మే సింగ్యే వాంగ్‌చుక్ 70వ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. రాజధాని థింపూలోని చాంగ్లీమేథాంగ్ స్టేడియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మోదీ ప్రసంగించారు. భారమైన హృదయంతో థింపూ సిటీకి వచ్చానని చెప్పారు. ఢిల్లీ పేలుడు ఘటనలో సాధారణ ప్రజలు మరణించడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాల ఆవేదనను అర్థం చేసుకోగలనని అన్నారు. ఆప్తులను కోల్పోయి దుఃఖసాగరంలో మునిగిపోయారని చెప్పారు. దేశం మొత్తం వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సోమవారం రాత్రంతా దర్యాప్తు సంస్థల అధికారులతో మాట్లాడుతూనే ఉన్నానని తెలిపారు. పేలుడు సంబంధించి కీలక ఆధారాలు సేకరిస్తున్నారని వివరించారు. సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నానని వెల్లడించారు. కుట్రదారులను శిక్షించడం తథ్యమని పునరుద్ఘాటించారు.

రాజ్యాంగ ప్రజాస్వామిక రాచరికం

భారత్, భూటాన్ మధ్య శతాబ్దాలుగా బలమైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంబంధాలు ఉన్నాయని ప్రధాని మోదీ గుర్తుచేశారు. జిగ్మే సింగ్యే వాంగ్‌చుక్ జన్మదినోత్సవంలో పాల్గొనడం తన విధి అని వ్యాఖ్యానించారు. భారతీయుల తరఫున మాజీ రాజుకు, భూటాన్ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. భూటాన్ ఆధ్యాత్మిక దేశంగా ఎదుగుతోందని ప్రశంసించారు. ఇక్కడ రాజ్యాంగ ప్రజాస్వామిక రాచరికం ఉందని అన్నారు. దేశంలో గ్రాస్ నేషనల్ హ్యాపినెస్ అనే వినూత్న విధానం ప్రవేశపెట్టారని కొనియాడారు. జ్ఞానం, నిరాడంబరత, ధైర్యం, నిస్వార్థ సేవ అనే లక్షణాల కలబోత భూటాన్ రాజు అని శ్లాఘించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను నెలకొల్పడంలో, సరిహద్దుల్లో శాంతిని కాపాడడంలో ఆయన నిర్ణయాత్మక పాత్ర పోషిస్తున్నారని నరేంద్ర మోదీ తెలిపారు. ఢిల్లీ బాంబు పేలుడు బాధితుల కోసం చాంగ్లీమేథాంగ్ స్టేడియంలో భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నమ్‌గేల్ వాంగ్‌చుక్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వేలాది మంది భూటాన్ ప్రజలు హాజరయ్యారు. బాధిత కుటుంబాలకు భూటాన్ పాలకులు సంతాపం ప్రకటించారు. సానుభూతి వ్యక్తం చేశారు.

భూటాన్‌కు రూ.4,000 కోట్ల రుణం

భూటాన్‌లో విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల కోసం రూ.4,000 కోట్ల రుణం ఇవ్వనున్నట్లు భారత్ ప్రకటించింది. రెండు దేశాల మధ్య సంబంధ బాంధవ్యాలకు ఇంధన సహకారమే మూలస్తంభమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భూటాన్ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి భారత్ అండగా నిలుస్తున్న విధానాన్ని రాజు వాంగ్‌చుక్ ప్రశంసించారు. పునరుత్పాదక ఇంధనం, ఆరోగ్య సంరక్షణ–ఔషధాలు, మానసిక ఆరోగ్య సేవల రంగంలో సహకారానికి భారత్, భూటాన్ మధ్య మూడు ఒప్పందాలు కుదిరాయి. భూటాన్‌లోని గెలెఫూ, సామ్‌త్సేలను భారత్‌లో రైలు నెట్‌వర్క్ ద్వారా అనుసంధానించబోతున్నామని మోదీ ప్రకటించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే భూటాన్ పారిశ్రామికవేత్తలు, రైతులకు భారత మార్కెట్లు సులభంగా అందుబాటులోకి వస్తాయని చెప్పారు. రెండు దేశాలు కేవలం సరిహద్దులతోనే కాకుండా సంస్కృతులతో అనుసంధానం అవుతున్నాయని గుర్తుచేశారు.

భూటాన్ రాజుతో మోదీ భేటీ

భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నమ్‌గేల్ వాంగ్‌చుక్‌తో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. భారత్, భూటాన్ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చించారు. ఇంధనం, అనుసంధానం, టెక్నాలజీ, రక్షణ వంటి కీలక రంగాల్లో పరస్పర సహకారంపై అభిప్రాయాలు పంచుకున్నారు. రెండు దేశాల మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు సైతం జరిగాయి. అనంతరం 1,020 మెగావాట్ల పునత్సాంగ్‌చు–2 హైడ్రోఎలక్ట్రిక్ పవర్ ప్రాజెక్టును మోదీ, వాంగ్‌చుక్ ఉమ్మడిగా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టును భారత్, భూటాన్ ఉమ్మడిగా అభివృద్ధి చేశాయి. ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను రెండు దేశాలూ పంచుకుంటాయి. భూటాన్ అభివృద్ధి ప్రయాణంలో తాము భాగస్వామి కావడం ఆనందంగా ఉందని మోదీ సోషల్ మీడియాలో పోస్టుచేశారు.

బిహార్ పీఠంపై మళ్లీ ఎన్డీయే!

- మహాగఠబంధన్‌కు మరోసారి నిరాశే
- ప్రశాంత్ కిశోర్ పార్టీకి ఘోర పరాభవం
- ఎగ్జిట్ పోల్స్ ఫలితాల్లో వెల్లడి

న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికలు మంగళవారం ముగిశాయి. రెండు విడతల్లో జరిగిన పోలింగ్‌లో రికార్డుస్థాయిలో ఓటింగ్ నమోదైంది. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసిన తర్వాత ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెల్లడయ్యాయి. బిహార్ అధికార పీఠం మరోసారి జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్డీయే)కే దక్కబోతున్నట్లు మెజార్టీ ఎగ్జిట్ పోల్స్ తేల్చిచెప్పాయి. విపక్ష మహాగఠబంధన్‌కు నిరాశ తప్పదని పేర్కొన్నాయి. ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన సురాజ్ పార్టీకి ఘోర పరాభవం ఎదురుకాబోతున్నట్లు స్పష్టంచేశాయి. యాక్సిస్ మై ఇండియా, టుడేస్ చాణక్య ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు బుధవారం వెల్లడికానున్నాయి. బిహార్‌లో మొత్తం అసెంబ్లీ స్థానాలు 243. ప్రభుత్వ ఏర్పాటుకు 122 మంది సభ్యుల మద్దతు అవసరం. మెజార్టీ మార్కును ఎన్డీయే సులభంగా చేరుకుంటుందని మంగళవారం ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ పాలనకు ఈ ఎన్నికలు రిఫరెండమేనన్న వాదనలు వినిపించిన సంగతి తెలిసిందే.

ఎగ్జిట్ పోల్స్‌లో ఎవరికి ఎన్ని సీట్లు

సంస్థ	ఎన్డీయే	మహాగఠబంధన్	జన సురాజ్ పార్టీ	ఇతరులు
మ్యాట్రిజ్	147-167	70-90	0-2	0
దైనిక్ భాస్కర్	145-160	73-91	0	0
పీపుల్స్ ఇన్‌సైట్	133-148	87-102	0-2	0
పీపుల్స్ పల్స్	133-159	75-101	0-5	0
జేవీసీ	135-150	88-103	0	0
పోల్‌స్ట్రాట్	133-148	87-102	0	0
చాణక్య స్ట్రాటజీస్	130-138	100-108	0	0
పి-మార్క్	142-162	80-98	1-4	0

బిహార్‌లో 69 శాతం ఓటింగ్

- ముగిసిన రెండో విడత పోలింగ్
- మొదటి దశకు మించి ఓటేసిన జనం
- కిషన్‌గంజ్‌లో అత్యధికంగా 76.26%
- నవాడాలో అత్యల్పంగా 57.31శాతం

పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల తుది విడత పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎక్కువ కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన నితీశ్ కుమార్‌పై ప్రజాభిప్రాయ సేకరణగా భావిస్తున్న అత్యంత కీలకమైన రెండో విడత పోలింగ్‌లో అత్యధికంగా సుమారు 69 శాతం ఓటింగ్ నమోదైంది. నవంబర్ 6వ తేదీన మొదటి విడత పోలింగ్‌లో రికార్డు స్థాయిలో 65.09 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకోగా, ఈసారి అంతకుమించి జనం పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. సమయం పూర్తయిన తర్వాత కూడా బూత్‌ల వద్ద బారులు తీరి కనిపించారు. పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశాలున్నాయని పరిశీలకులు అంటున్నారు. ముఖ్యంగా, ముస్లింల ప్రాబల్యమున్న కిషన్‌గంజ్‌లో ఏకంగా 76.26 శాతం ఓటింగ్ నమోదు కావడం విశేషం. పొరుగునున్న కటిహార్‌లో 75.23 శాతం, పుర్నియాలో 73.79 శాతం, అరారియాలో 67.79 శాతం నమోదైంది. అత్యల్పంగా నవాడాలో 57.31 శాతం మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం 5 గంటల సమయానికి రాష్ట్రంలో 60 శాతం మార్కును దాటని ఏకైక జిల్లా కూడా ఇదే కావడం గమనార్హం. మొదటి విడతలో 121 నియోజకవర్గాల్లోని 3.75 కోట్ల మంది అర్హులైన ఓటర్లకుగాను 65.09 శాతం మంది ఓటేశారు. ఈసారి 122 స్థానాల్లో 3.70 కోట్ల మంది ఓటర్లుండగా 1,302 మంది పోటీ చేస్తున్నారు.

గతం కంటే 9 శాతం ఎక్కువ

రాష్ట్రంలో రెండో విడత పోలింగ్‌లో రికార్డుస్థాయిలో 68.79 శాతం ఓటింగ్ నమోదైందని చీఫ్ ఎలక్టోరల్ అధికారి(సీఈవో) వినోద్ సింగ్ గుంజియాల్ తెలిపారు. రెండు విడతల్లో కలిపి 66.91 శాతం మంది ఓటేసినట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు. 1951 తర్వాత మొదటిసారిగా భారీ ఓటింగ్ నమోదైందని చెప్పారు. అదేవిధంగా, పురుషుల కంటే మహిళలే అత్యధికంగా ఓటేశారని చెప్పారు. 2020 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఇది 9.6 శాతం ఎక్కువని ఆయన వివరించారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో 57.29 శాతం ఓటింగ్ నమోదైందని గుర్తు చేశారు. మరో 2 వేల పోలింగ్ స్టేషన్ల ఓటింగ్ వివరాలు అందాల్సి ఉన్నందున, ఓటింగ్‌శాతం పెరిగే అవకాశముందన్నారు. తాజా ఫలితాలపై ఇండియా కూటమి నేతలు..ప్రభుత్వ వ్యతిరేక పవనాలు బలంగా వీస్తున్నాయడానికి ఇదే నిదర్శనమని పేర్కొనగా, గతంలోనూ ఇలాంటి సందర్భాల్లోనూ ప్రభుత్వాలు కొనసాగిన ఉదాహరణలున్నాయని ఎన్డీయే నేతలంటున్నారు. మొదటి, రెండో విడత పోలింగ్ సందర్భంగా అత్యధికంగా 70 శాతానికి మించి ఓటింగ్ నమోదైన జిల్లాలు గంగా నది ఉత్తర ప్రాంతంలోని అత్యధిక జనసాంద్రత కలిగి, ఎన్డీయేకు గట్టి పట్టున్న ప్రాంతాలు కావడం విశేషం. అదే సమయంలో, ముస్లింలు ఎక్కువగా ఉన్న కిషన్‌గంజ్, కటిహార్, పుర్నియా జిల్లాల్లో గత ఎన్నికల్లో ఇండియా కూటమి వైపు మొగ్గు చూపారు. ప్రజలు ప్రత్యామ్నాయం వైపు ఎదురు చూస్తున్నా రనేందుకు ఓటింగ్ శాతాలే తార్కాణమని వ్యూహ కర్త ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు. ఫలితాలు తమకు అనుకూలంగా ఉంటాయని అంచనా వేశారు.

ఓటేసిన ప్రముఖులు..

జేడీయూ యాక్టింగ్ ప్రెసిడెంట్ సంజయ్ ఝా, కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ, జన్ సురాజ్ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్, రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ రాజేశ్ రామ్, రాష్ట్రమంత్రి నితీశ్ మిశ్రా తదితరులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

డేవిడ్ సలాయ్‌కు బుకర్ ప్రైజ్

- సాధారణ వ్యక్తి జీవనాన్ని హృద్యంగా వర్ణించిన 'ఫ్లెష్' నవలకు దక్కిన గౌరవం
- ట్రోఫీతోపాటు 50,000 పౌండ్ల నగదు బహుమతి అందజేత

లండన్: హంగేరీ నుంచి బ్రిటన్‌కు వలసవచ్చిన ఓ సాధారణ వ్యక్తి జీవితంలోని సుఖదుఃఖాలు, విషాదాల కలబోతగా రూపుదిద్దుకున్న ఊహాత్మక 'ఫ్లెష్' నవల రచించిన హంగేరీ–బ్రిటన్ రచయిత డేవిడ్ సలాయ్‌కు 2025 బుకర్ ప్రైజ్ వరించింది. 51 ఏళ్ల సలాయ్‌కు సోమవారం లండన్‌లోని ప్రఖ్యాత ఓల్డ్ బిల్డింగ్స్‌గేట్ వేదికపై బుకర్ అవార్డ్‌ను గత ఏడాది విజేత సమంతా హార్వే ప్రదానం చేశారు. అవార్డ్‌తో పాటు 50,000 పౌండ్ల నగదు పురస్కారం సలాయ్‌కు అందజేశారు. ఫేవరెట్‌లుగా నిలిచిన తొలి ఐదుగురు పోటీదారులను వెనక్కినెట్టి సలాయ్ ఈ అవార్డ్‌ను గెల్చుకోవడం విశేషం. భారతీయ రచయిత కిరణ్ దేశాయ్ సైతం గట్టిపోటీనిచ్చినా ఆద్యంతం అద్భుతంగా సాగే ఫ్లెష్ రచనకు ప్రాణంపోసిన సలాయ్‌కు అవార్డ్ దక్కింది. ఒకవేళ కిరణ్ దేశాయ్ ఈ అవార్డ్‌ను గెల్చుకుని ఉంటే 56 ఏళ్ల అవార్డ్ చరిత్రలో దీనిని రెండుసార్లు గెల్చుకున్న తొలి రచయితగా ఈమె రికార్డ్ నెలకొల్పేది. ది ఇన్‌హెరిటెన్స్ ఆఫ్ లాస్ రచనకు దేశాయ్‌కు 2006లో బుకర్ ప్రైజ్ దక్కింది. 'ఫ్లెష్' నవల మొత్తం హంగేరీకి చెందిన ఇస్త్వాన్ అనే వలసదారుని చుట్టూ తిరుగుతుంది. ఇస్త్వాన్ టీనేజీలో పక్కింటి వివాహితతో సాన్నిహిత్యం మొదలు సైన్యంలో చేరి ఇరాక్ యుద్ధంలో పాల్గొనడం, తర్వాత దిక్కులేక లండన్‌కు శరణార్థిగా వెళ్లడం దాకా ఎన్నెన్నో అంశాలను ఎంతో వాస్తవిక కోణంలో రచయిత సలాయ్ రాసుకొచ్చారు. బ్రిటన్‌లో ప్రైవేట్ సెక్యూరిటీ నిపుణుడికి బౌన్సర్‌గా, డ్రైవర్‌గా పనిచేయడం ఈ క్రమంలో సంపన్న క్లయింట్‌తో



వివాహం తర్వాత లండన్ ధనిక సమాజంలో పరపతి, పలుకుబడితో విలాసవంత జీవనం గడపడం దాకా ఇస్త్వాన్ జీవిత ఘట్టాలను రచయిత ఏకబిగిన చదివేలా చేశారు. మానసిక సంఘర్షణలతో ఇస్త్వాన్ చివరకు ఏకాకిగా మారి సాధారణ జీవితం గడుపుతాడు. ఈ నవల పేజీల పేరాల మధ్య రచయిత కొంత ఖాళీ స్థలాన్ని వదిలేశారు. పాఠకుడు సైతం నవలలో పూర్తిగా లీనమై ఇస్త్వాన్ వ్యక్తిత్వాన్ని తనదైన శైలిలో రాసుకునేందుకు ఈ స్థలాన్ని వదిలేశారు. ఈ ఏడాది 153 నవలలు పోటీపడగా సలాయ్ రచన అవార్డ్‌ను ఎగరేసుకుపోయింది. రచయిత సలాయ్ కెనడాలో పుట్టారు. తర్వాత బ్రిటన్‌లో పెరిగారు. తాజాగా వియన్నాలో స్థిరపడ్డారు. ఈయన గతంలో రచించిన 'ఆల్ దట్ మ్యాన్ ఈజ్' నవల 2016లో తుది జాబితాకు ఎంపికైనా అవార్డ్‌ను గెలవలేకపోయింది.

పాకిస్తాన్ మళ్లీ రక్తసిక్తం

- ఇస్లామాబాద్ కోర్టు బయట ఆత్మాహుతి దాడి
- 12 మంది మృతి.. 36 మందికి గాయాలు

పేలుడుతో దగ్ధమైన కారు

ఇస్లామాబాద్: పాకిస్తాన్ మరోసారి రక్తమోడింది. రాజధాని ఇస్లామాబాద్‌లో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఆత్మాహుతి దాడిలో 12 మంది బలయ్యారు. మరో 36 మంది క్షతగాత్రులుగా మారారు. ఇస్లామాబాద్ జిల్లా జ్యుడీషియల్ కోర్టు కాంప్లెక్స్ బయటే ఈ దాడి జరగడం గమనార్హం. దుస్తుల లోపల పేలుడు పదార్థాలు ధరించి వచ్చిన దుండగుడు తొలుత కోర్టు ప్రాంగణంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించాడని, అది సాధ్యం కాకపోవడంతో గేటు వద్ద పోలీసు వాహనం పక్కన నిల్చొని తనను తాను పేల్చేసుకున్నాడని పాక్ అంతర్గత వ్యవహారాల మంత్రి మొహిసిన్ నఖ్వీ వెల్లడించారు. ఆయన ఘటనా స్థలాన్ని పరిశీలించారు. భద్రతా సిబ్బంది, ఒక లాయర్ సహా 12 మంది మృతి చెందినట్లు తెలిపారు. పేలుడు శబ్దం ఆరు కిలోమీటర్ల దాకా వినిపించడం గమనార్హం. ఘటనా స్థలంలో భయానక దృశ్యాలు కనిపించాయి. పేలుడు ధాటికి పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఆ ప్రదేశమంతా రక్తసిక్తంగా మారింది. జనం భయంతో పరుగులు తీశారు. ఈ దాడికి కారకులు ఎవరన్నది ఇంకా తెలియరాలేదు. ఏ ఉగ్రవాద సంస్థ కూడా ప్రకటన చేయలేదు. సాధారణంగా ఇలాంటి ఆత్మాహుతి దాడులు చేయడంలో తెహ్రీక్–ఇ–తాలిబన్ పాకిస్తాన్(టీటీపీ) ఆరితేరిందని పాక్ అధికారులు చెప్పారు.

తాలిబన్లు మతిలేని యుద్ధం ఆపాలి: ఖవాజా అసిఫ్

ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడి జరిగినట్లు పాకిస్తాన్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ, రక్షణ శాఖ మంత్రి ఖవాజా అసిఫ్ ధ్రువీకరించారు. దాడిని తీవ్రంగా ఖండించారు. బాధిత కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గాయపడిన వారిలో ఎక్కువ మంది న్యాయవాదులు, కోర్టు సిబ్బందే ఉన్నారు. పేలుడు తీవ్రతకు సూసైడ్ బాంబర్ తల తెగి దూరంగా పడిపోయింది. ఆత్మాహుతి దాడికి అఫ్గాన్‌లోని తాలిబన్ పాలకులు కారణం కావొచ్చని ఖవాజా అసిఫ్ అనుమానం వ్యక్తంచేశారు. తమపై ఈ మతిలేని యుద్ధం ఆపాలని, లేకపోతే భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని తాలిబన్లను హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని అరికట్టడంపై పాక్ ప్రభుత్వం, తాలిబన్ల మధ్య చర్చలు జరుగుతున్న సమయంలోనే రాజధానిలో దాడి జరగడం కలకలం సృష్టించింది.

సురేంద్ర కోలీ నిర్దోషి

- నిఠారీ హత్యల కేసులో సుప్రీంకోర్టు తీర్పు
- కిందికోర్టు విధించిన శిక్ష, జరిమానా రద్దు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నిఠారీ వరుస హత్యల కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో గతంలో దోషిగా తేలిన సురేంద్ర కోలీని మంగళవారం నిర్దోషిగా ప్రకటించింది. దీంతో అతడు జైలు నుంచి విడుదలయ్యేందుకు అడ్డంకులు తొలగిపోయాయి. నిఠారీ హత్యల కేసులో తనను దోషిగా తేల్చడాన్ని సవాలు చేస్తూ సురేంద్ర కోలీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ కోలీని నిర్దోషిగా ప్రకటించింది. ఈ కేసులో అతడికి విధించిన శిక్షను, జరిమానాను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది. అంతేకాకుండా కోలీపై ఇతర కేసులు గానీ, విచారణ గానీ లేకుంటే తక్షణమే జైలు నుంచి విడుదల చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది.

హంతకులెవరో ఇప్పటికీ తెలియకపోవడం విచారకరం

నిఠారీ వరుస హత్యల వెనుక అసలు సూత్రధారులను గుర్తించలేకపోవడం తీవ్ర విచారకరమని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. సుదీర్ఘకాలం విచారణ జరిగినప్పటికీ హంతకులెవరో ఇప్పటికీ నిర్ధారణ కాలేదని వెల్లడించింది. పోలీసులు ఇంతకాలం శ్రమించినా నేరస్థులను పట్టుకోలేకపోయారని వ్యాఖ్యానించింది. అభంశుభం తెలియని, చిన్నారులను హత్యచేయడం చాలా ఘోరమని, వారి తల్లిదండ్రుల ఆవేదనను వర్ణించలేమని స్పష్టంచేసింది. కేవలం ఊహాగానాల ఆధారంగా ఒకరిని దోషిగా తేల్చడాన్ని 'క్రిమినల్ లా' అంగీకరించబోదని ధర్మాసనం తన తీర్పులో వివరించింది. అస్థిపంజరాలు దొరికిన ఘటనా స్థలాన్ని సరిగ్గా సంరక్షించలేదని, ఆ తర్వాత హడావుడిగా తవ్వకాలు చేపట్టారని అసంతృప్తి వ్యక్తంచేసింది. కేసు దర్యాప్తులో అధికారులు కీలకమైన విషయాలను విస్మరించారని తప్పుపట్టింది.

ఏమిటీ కేసు?

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నోయిడాలోని నిఠారీ అనే ప్రాంతంలో 2006 డిసెంబర్ 29న వ్యాపారవేత్త మనీందర్ సింగ్ ఇంటి వెనుక మురికి కాలువలో ఎనిమిది అస్థిపంజరాలు బయటపడ్డాయి. అవన్నీ చిన్నారులకు సంబంధించినవే. మనీందర్ సింగ్ ఇంట్లో సురేంద్ర కోలీ సహాయకుడిగా పని చేస్తుండేవాడు. ఎనిమిది అస్థిపంజరాల ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. బాలికలను లైంగికంగా వేధించి, హత్య చేసి మురికికాలువలో పడేసినట్లు పోలీసులు గుర్తించారు. 15 ఏళ్ల బాలికపై అత్యాచారం, హత్య కేసులో సురేంద్ర కోలీని కింది కోర్టు దోషిగా గుర్తించింది. మరణశిక్ష విధించింది. దీన్ని 2011 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు సైతం సమర్థించింది. 2015 జనవరిలో అలహాబాద్ హైకోర్టు ఈ మరణశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చింది. 2023 అక్టోబర్‌లో నిఠారీకి సంబంధించిన ఇతర హత్యల కేసుల్లో కోలీని, సహ నిందితుడు మనీందర్ సింగ్‌ను అలహాబాద్ హైకోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. కోలీకి మొత్తం 12 కేసుల్లో విముక్తి లభించింది. మరో హత్య కేసులో ఆయనకు కింది కోర్టు విధించిన శిక్ష, జరిమానాను సుప్రీంకోర్టు తాజాగా రద్దు చేసింది. వంట గదిలో దొరికిన కత్తి ఆధారంగానే దర్యాప్తు జరిగిందని, కోలీని దోషిగా నిర్ధారించడానికి ఈ సాక్ష్యం సరిపోదని సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది.

పారాషూట్ టెస్టు విజయవంతం

అంతరిక్ష యాత్రలో మరో ముందడుగు: ఇస్రో

బెంగళూరు: గగన్‌యాన్ యాత్రకు సంబంధించి కీలకమైన పరీక్షను విజయవంతంగా నిర్వహించినట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) మంగళవారం ప్రకటించింది. భారత అంతరిక్ష యాత్రలో ఇదొక ముందుడుగు అని అభివర్ణించింది. ఈ నెల 3వ తేదీన ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఝాన్సీలోని బబీనా ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్(బీఎఫ్ఎఫ్ఆర్)లో గగన్‌యాన్ క్రూ మాడ్యూల్ కోసం పారాషూట్ల టెస్టు నిర్వహించామని ఇస్రో తెలియజేసింది. ప్రస్తుతం కొనసాగుతున్న ఇంటిగ్రేటెడ్ మెయిన్ పారాషూట్ ఎయిర్‌డ్రాప్ పరీక్షల(ఐమ్యాట్) శ్రేణిలో ఇదొక భాగమని ఒక ప్రకటనలో పేర్కొంది. గగన్‌యాన్ మిషన్ కోసం పారాషూట్ వ్యవస్థ అర్హతను పరీక్షించమే వీటి ఉద్దేశమని స్పష్టంచేశారు. మొట్టమొదటి మానవ సహిత స్పేస్‌ఫ్లైట్‌ను అంతరిక్షంలోకి పంపించడమే గగన్‌యాన్ యాత్ర లక్ష్యం. ముగ్గురు స్వదేశీ వ్యోమగాములు అంతరిక్షంలోకి వెళ్తారు. అనంతరం భూమిపైకి క్షేమంగా తిరిగివస్తారు. ఇది మొత్తం మూడు రోజుల యాత్ర.

గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా ఇస్రో ఒక ప్రత్యేక లాంచ్ వెహికల్, ఆర్బిటాల్ మాడ్యూల్, క్రూ–ఎస్కేప్ వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది. ఆయా పరికరాలు, వ్యవస్థలను పరీక్షించడానికి తొలుత మానవ రహిత యాత్రలు నిర్వహిస్తారు. అన్నీ సక్రమంగా ఉన్నట్లు తేలిన తర్వాత మానవ సహిత యాత్ర జరుగుతుంది. గగన్‌యాన్ క్రూ మాడ్యూల్‌లోని పారాషూట్ సిస్టమ్‌లో నాలుగు రకాల పారాషూట్‌లు మొత్తం 10 ఉంటాయి. వ్యోమగాములు భూమిపైన క్షేమంగా దిగడానికి ఇవి తోడ్పడుతాయి. తాజా పరీక్షలో భాగంగా భారత వైమానిక దళానికి చెందిన ఐఎల్–76 విమానం ద్వారా పారాషూట్లను 2.5 కిలోమీటర్ల ఎత్తుకు తీసుకెళ్లి, కిందికి జారవిడిచారు. ఎలాంటి లోపాలు లేకుండా షెడ్యూల్ ప్రకారం అవి భూమిపైకి చేరుకున్నట్లు ఇస్రో వెల్లడించింది. ఇస్రోతోపాటు విక్రమ్ సారాభాయి స్పేస్ సెంటర్, డీఆర్‌డీఓ, భారత సైన్యం, వైమానిక దళం కూడా ఈ టెస్టులో పాల్గొన్నాయి.

అమెరికా షట్‌డౌన్ ముగిసినట్టే!

- బిల్లుకు సెనేట్ ఆమోదం
- నేడు ప్రతినిధుల సభలో ఓటింగ్

వాషింగ్టన్: అమెరికా చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా 41 రోజులపాటు ప్రజలను అష్టకష్టాలకు గురిచేసిన షట్‌డౌన్ ఎట్టకేలకు ముగింపు దశకు చేరింది. షట్‌డౌన్‌ను ముగించి, ప్రభుత్వ సేవలను మళ్లీ ప్రారంభించడానికి వీలుగా సంబంధిత బిల్లును సోమవారం సెనేట్‌లో ఆమోదించారు. బిల్లుకు మద్దతివ్వడాన్ని విపక్ష డెమొక్రటిక్ పార్టీలో కొందరు సభ్యులు వ్యతిరేకించారు. అయినప్పటికీ మెజార్టీ సభ్యులు బిల్లుకు ఆమోదం తెలిపారు. అధికార రిపబ్లికన్ పార్టీతో అవగాహన కుదరడమే ఇందుకు కారణం. సెనేట్‌లో బిల్లుకు అనుకూలంగా 60 ఓట్లు, వ్యతిరేకంగా 40 ఓట్లు వచ్చాయి. ఇకపై కాంగ్రెస్‌లోని ప్రతినిధుల సభలో ఆమోదం పొందాల్సి ఉంది. ఈ విషయంలో ట్రంప్ ప్రభుత్వం పట్టుదలతో వ్యవహరిస్తుండడంతో అతి త్వరలో షట్‌డౌన్ ముగిసిపోనున్నట్లు తెలుస్తోంది. బిల్లుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా మద్దతు ప్రకటించారు. ప్రభుత్వ సేవలను చాలా వేగంగా పునరుద్ధరించబోతున్నామని చెప్పారు. ఇదిలా ఉండగా, షట్‌డౌన్ ముగింపు బిల్లును బుధవారం మధ్యాహ్నమే ప్రతినిధుల సభలో ప్రవేశపెట్టబోతున్నట్లు తెలిసింది. ఈ సభలో కూడా ఆమోదం పొందితే బుధవారమే షట్‌డౌన్‌కు తెరపడే అవకాశం ఉంది. గత నెలలో వార్షిక నిధుల బిల్లుకు సెనేట్ ఆమోదం తెలపకపోవడంతో దేశమంతటా షట్‌డౌన్ మొదలైన సంగతి తెలిసిందే. దీంతో ప్రభుత్వ సేవలు చాలావరకు నిలిచిపోయాయి. అత్యంత ముఖ్యమైన సేవలు మాత్రమే కొనసాగాయి. వేతనాలు హఠాత్తుగా ఆగిపోవడంతో ఉద్యోగుల ఇక్కట్లపాలయ్యారు. నిధులు లేక సంక్షేమ పథకాలు నిలిచిపోయాయి. పలు కీలక రంగాలు ప్రభావితమయ్యాయి. విమానయాన సేవలు కూడా ఆగిపోయాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

భారత్‌లో అమెరికా రాయబారిగా నియమితుడైన సెర్గియో గోర్‌తో సోమవారం వైట్‌హౌస్ ఓవల్ ఆఫీసులో అధ్యక్షుడు ట్రంప్ సమక్షంలో ప్రమాణం చేయిస్తున్న ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్

ఘనంగా అయ్యప్ప పడిపూజ

రొంపిచర్ల: తుంగపాడులో మాజీ సర్పంచ్ ఏనుగంటి వెంకటరత్నం స్వామి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అయ్యప్ప స్వామి పడి పూజ మహోత్సవం వైభవంగా జరిగింది.

శివ స్వాముల పాదయాత్ర

రొంపిచర్ల: శ్రీశైలం బయలు దేరిన శివస్వాముల పాదయాత్ర మంగళవారం మూడవ రోజు ప్రకాశం జిల్లా త్రిపురాంతకం చేరింది. ఆదివారం ఇక్కడి నుంచి వారు శ్రీశైలం వెళ్లారు.

రామనామ ఏకాహం ప్రారంభం



రొంపిచర్ల: కొత్తపల్లి డొంక వద్ద వేంచేసి ఉన్న శ్రీ సంజీవ ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళ వారం కార్తిక రామ నామ ఏకాహం ప్రారంభమైంది. ప్రసాదాలు పంపిణీ చేశారు.

న్యూస్‌రీల్

విరిగిన రైల్వే గేటు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్) : గుంటూరు సంజీవయ్య నగర్ రైల్వే గేటు మంగళవారం ఉదయం 9 గంటల తరువాత హఠాత్తుగా విరిగిపోయింది. దీంతో వాహనదారుల రాకపోకలను నిలిపివేసి రైల్వే సిబ్బంది గేటుకు మరమ్మతులు చేపట్టారు. గంటకు పైగా రాకపోకలు సాగవని చెప్పడంతో వాహనదారులు చేసేదేమీ లేక వెను తిరిగి వెళ్లాల్సి వచ్చింది. శంకర్ విలాస్ ఫ్లయ్ ఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో 2 టౌన్ నుంచి వన్‌టౌన్‌కి రావాలంటే మూడు వంతెనలు, కంకరగుంట ఫ్లయ్ ఓవర్ తరువాత ఎక్కువగా వినియోగించే దారి సంజీవయ్యనగర్ రైల్వే గేటు. ఈ గేటు తరుచు మరమ్మతులకు గురికావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

అంతర్రాష్ట్ర సరిహద్దులో హైఅలర్ట్

విజయపురిసౌత్: ఢిల్లీలో బాంబు పేలుడు ఘటన నేపథ్యంలో నాగార్జున సాగర్ అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద మాచర్ల రూరల్ సీఐ షేక్ నఫీజ్ బాషా, విజయపురిసౌత్ ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో మంగళవారం పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. సరిహద్దుకు వచ్చి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అంతర్ రాష్ట్ర చెక్ పోస్ట్ పరిధిలో డ్రోన్ కెమెరాతో పరిశీలన జరిపారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే తమకు సమాచారం ఇవ్వాలని రూరల్ సీఐ కోరారు. ఢిల్లీలో బాంబు పేలుడు ఘటన నేపథ్యంలో అంతర్ రాష్ట్ర సరిహద్దులో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

సబ్ జైలు తనిఖీ

వినుకొండ : స్థానిక సబ్ జైలును గుంటూరు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ సయ్యద్ జియావుద్దీన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను, ఆరోగ్య పరిస్థితులను, జైలులో అందిస్తున్న భోజన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలులో అందిస్తున్న మెనును పరిశీలించారు. వంట గదిని, స్టోర్ రూమ్‌లను తనిఖీ చేసి తగు సూచనలు చేశారు. న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని వారికి న్యాయవాదిని నియమిస్తామని, ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ పఠాన్ గౌస్ మొహిద్దీన్‌ఖాన్, లోక్ అదాలత్ సిబ్బంది, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

పునీత అంతోనిని విశ్వాసంతో ప్రార్థించాలి

ఫాదర్ బాలస్వామి



రెంటచింతల: తోటి వారిని ప్రేమించే కృపను దయ చేయమని పునీత అంతోని వారిని నిండు విశ్వాసంతో కుటుంబ ప్రార్థన చేయాలని మాచర్ల నిత్య సహాయమాత చర్చి విచారణ గురువులు రెవ. ఫాదర్ జూజిగిరి బాలస్వామి కోరారు. స్థానిక అంతోని వారి చర్చిలో నిర్వహిస్తున్న 9 మంగళ వారోత్సవాలను పురస్కరించుకుని కానుక మాత చర్చి విచారణ గురువులు రెవ.ఫాదర్ ఏరువ లూర్దు మర్రెడ్డి నేతృత్వంలో 4వ మంగళవారం సమిష్టి దివ్య పూజా బలిని సమర్పించారు. ఈ సందర్భంగా రెవ. ఫాదర్ బాలస్వామి భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ పునీత అంతోని వారు ఏసుక్రీస్తు సూక్తులను ఆచరించి బోధనలు చేస్తూ తాను కూడా క్రీస్తు సువార్తను ప్రచారం చేయడం వలన పునీతుడయ్యారన్నారు. అంతోనివారిని ఆదర్శంగా తీసుకుని నిజమైన కథోలికులుగా సమాజంలో మెలగాలన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంతోని చర్చిని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ పూజాబలిలో సహాయక గురువులు రెవ. ఫాదర్ ప్రసన్న కుమార్, భక్తులు పాల్గొన్నారు.

'ప్రైవేటీకరణ'పై వైఎస్సార్ సీపీ

నేడు పోరుబాట

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు చంద్రబాబు సర్కారు చేస్తున్న ప్రయత్నాలపై వైఎస్సార్ సీపీ పోరుబాట పట్టింది. పేద విద్యార్థుల భవిష్యత్ కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 17 వైద్య కళాశాలల నిర్మాణం ప్రారంభిస్తే.. వాటిని ప్రైవేటుపరం చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న కుట్రలపై ఉద్యమం ఊపందుకుంటోంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాల సేకరణకు వైఎస్సార్‌సీపీ శ్రీకారం చుట్టింది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సంతకాల సేకరణ కార్యక్రమం ఉద్యమంలా సాగింది. అన్ని వర్గాల ప్రజల నుంచి భారీగా మద్దతు లభించింది. ప్రభుత్వ ఆధీనంలోనే వైద్య కళాశాలల నిర్మాణం చేపట్టాలని, నిర్వహణ బాధ్యత కూడా తీసుకోవాలని ప్రజల నుంచి డిమాండ్ వస్తోంది. ఈ నేపథ్యంలో సర్కారు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీలు నిర్వహించనున్నారు.

- చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయంపై నిరసనగళం విప్పేందుకు ఏర్పాట్లు
- నేడు అన్ని నియోజకవర్గాలలో వైఎస్సార్‌సీపీ భారీ ర్యాలీలు

ప్రభుత్వ వైద్య కళాశాలలపై సర్కారు కుట్రకు నిరసన

చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యంతో పునాదుల్లో నిలిచిపోయిన బాపట్ల వైద్య కళాశాల భవనం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్రంలో పేద విద్యార్థులకు వైద్యవిద్య, పేదలకు ఉచిత వైద్యం అందేలా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుమారు రూ.8,500 కోట్లతో 17 వైద్య కళాశాలల నిర్మాణాలను ప్రారంభించారు. వీటిలో ఐదింటిని పూర్తి చేసి, ప్రారంభించారు. కళాశాలలు కూడా ప్రారంభమయ్యాయి. ఎన్నికలు రావడంతో ప్రభుత్వం మారింది. మిగిలిన పది వైద్య కళాశాలల నిర్మాణాలు పూర్తిచేసే అవకాశం ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పిడుగురాళ్ల, బాపట్లలో కళాశాలలు మంజూరు చేశారు. పిడుగురాళ్లలో దాదాపుగా పూర్తి కాగా, బాపట్లలో పనులు ప్రారంభం అయ్యాయి. చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత వీటిని తన వారికి పీపీపీ పద్ధతిలో కట్టబెట్టేందుకు జీఓ జారీ చేశారు. పేద విద్యార్థులు వైద్య విద్య చదువుకునేందుకు వీలుగా రూ.5 వేల కోట్లు ఖర్చు చేయలేరా? అనే ప్రశ్న ఉత్పన్నం అవుతోంది.

నియోజకవర్గాల్లో ఏర్పాట్లు

అధికారంలోకి వచ్చిన 18 నెలలకే రూ. లక్షల కోట్లు అప్పు చేసిన చంద్రబాబు... వైద్య కళాశాలలకు మాత్రం ఖర్చు చేయకుండా ప్రైవేటు వారికి కట్టబెట్టడం వెనుక పెద్ద కుట్ర ఉందని వైఎస్సార్‌సీపీ ఆరోపిస్తోంది. కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసి గవర్నర్‌కు ప్రజల అభిప్రాయాలతో వివరాలు అందజేయడానికి సన్నద్ధం అవుతోంది. మరోవైపు బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో స్వామి థియేటర్ సెంటర్ నుంచి ర్యాలీగా వెళ్లి ఆర్‌డీవోకు నాయకులు వినతిపత్రం అందించనున్నారు. తూర్పు నియోజకవర్గంలో పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ ఆఫీసు వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. ప్రత్తిపాడు మల్లయపాలెం రోడ్డులో గల దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహం వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి, పెదనందిపాడు రోడ్డులోని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తారు. తాడికొండలో ర్యాలీ అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తారు. మంగళగిరిలో పార్టీ కార్యాలయం నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరి వడ్లపూడి సెంటర్, మిద్దె సెంటర్, పూల మార్కెట్ మీదుగా గాలిగోపురం వరకు చేరుకుంటారు. అక్కడి నుంచి కాలినడకగా మంగళగిరి తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లి వినతిపత్రం అందిస్తారు. తెనాలిలో స్థానిక పాత ప్రభుత్వ ఆసుపత్రి నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. పొన్నూరులో పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తారు.

తుది దశలో పనులు ఆగిన పిడుగురాళ్ల కళాశాల భవనం

ప్రభుత్వం దిగొచ్చేలా ప్రజా ఉద్యమం నిర్మిస్తాం

అంబటి రాంబాబు

పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలను చంద్రబాబు ప్రభుత్వం దుర్మార్గంగా పీపీపీ పేరుతో ప్రైవేటీకరణ చేస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు విమర్శించారు. సర్కారు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ బుధవారం ఉదయం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద విద్యార్థులకు వైద్యవిద్య అందించేలా, పేద ప్రజలకు ఉచిత వైద్యం అందేలా చేపట్టిన కళాశాలల ఏర్పాటును సీఎం చంద్రబాబు కక్షపూరితంగా అడ్డుకోవడం తగదన్నారు. వాటిని పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వారి పరం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మార్చుకునేలా ప్రజా ఉద్యమం నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని అంబటి పిలుపునిచ్చారు.

ప్రజా ఉద్యమ ర్యాలీని జయప్రదం చేయండి

పోలూరి వెంకటరెడ్డి

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం నిర్వహించతలపెట్టిన ప్రజా ఉద్యమ ర్యాలీల్లో న్యాయవాదులు భారీసంఖ్యలో పాల్గొనాలని వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పోలూరి వెంకటరెడ్డి మంగళవారం పిలుపునిచ్చారు. అరండల్‌పేటలోని ఆయన కార్యాలయంలో విలేకరులసమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాల్లో జరగనున్న భారీ ర్యాలీల్లో ఆయా నియోజకవర్గాల్లోని న్యాయవాదులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టేందుకు న్యాయవాదులు అందరూ ముందుకు రావాలన్నారు. పేద వైద్య విద్యార్థులు, పేదల ఆరోగ్యంతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆయన మండిపడ్డారు.

అనుమతి ఉన్న ప్లాట్లు మాత్రమే కొనండి

రాజధాని గ్రామాలపై ఏపీ సీఆర్డీఏ సూచన

తాడికొండ: అనుమతి పొందిన లే ఔట్‌లలో మాత్రమే ప్లాట్లు కొనుగోలు చేయాలని ఏపీ సీఆర్డీఏ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీసీఆర్డీఏ) పరిధిలో గల కొన్ని గ్రామాలలో ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా ఏర్పాటైన లేఔట్‌లను మరియు అనధికార భవనాలను అధికారులు తొలగించారు. సదరు లే ఔట్ లలోని ప్లాట్లు కొనుగోలు చేస్తే భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయబోమని, అలాగే మౌలిక సదుపాయాలకు ఇబ్బందులు తప్పవని తెలిపారు. అనుమతి పొందిన లే ఔట్‌లలో మాత్రమే ప్లాట్లు కొనుగోలు చేసుకోవాలని పేర్కొన్నారు. అనధికార లేఔట్‌లు, కట్టడాలను గుర్తిస్తే ఫోను నంబర్లు 70955 99838 (మెసేజ్), 0866-2527154లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

తురకపాలెంలో ఆగని మృత్యుఘోష

- కారణాలు తెలియకుండా మృతి చెందుతున్న ప్రజలు
- ఈ నెల ఒకటో తేదీ నుంచి 11 వరకు ఆరుగురు మృత్యువాత
- ఏం జరుగుతుందో తెలియక భయాందోళనల్లో స్థానికులు



బాలయోగయ్య (ఫైల్)

సుజానమ్మ(ఫైల్)

ప్రసాదరావు (ఫైల్)

గుంటూరు రూరల్: గత ఏడాది మొదలు సెప్టెంబర్ నెల వరకు జరిగిన మరణాలతో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బతికిన ప్రజలకు మరోసారి వరుస మరణాలు సంభవిస్తుండటంతో కంటిమీద కునుకులేకుండా పోతోంది. రెండు నెలలు ప్రశాంతంగా ఉన్న గ్రామంలో మళ్లీ ఏదో ఒక అనారోగ్యంతో రోజుకొకరు మరణించటంతో మళ్లీ ఏం జరుగుతోంది? అనే అనుమానం రేకెత్తుతోంది. తమ గ్రామానికి ఏం జరిగింది, పరిష్కారం లేదా? అని ప్రతి ఇంట చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే... మండలంలోని తురకపాలెం గ్రామంలో గడిచిన రెండు నెలలుగా ప్రశాంతంగా జీవిస్తున్న ప్రజలకు నవంబర్ 1వ తేదీనుంచి చోటుచేసుకుంటున్న వరుస మరణాలు మరోసారి భయాందోళన కలిగిస్తున్నాయి.

ఉన్నట్టుండి మృత్యుఒడిలోకి...

అప్పటివరకు తిరుగుతూ ఉన్న వారే అకస్మాత్తుగా అనారోగ్యానికి గురవ్వటం, గంటల వ్యవధిలో ప్రాణాలను కోల్పోవటం చూస్తే గ్రామంలో ప్రజలు ప్రాణభయంతో వణికిపోతున్నారు. ఈ నెల 1వ తేదీన గ్రామానికి చెందిన బత్తుల బాలయోగయ్య (70) ఒకరోజు తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా గ్రామంలోని విలేజ్ క్లినిక్ వైద్యులు, నర్సులు అతనికి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం బాలయోగయ్య చికిత్స పొందుతూ రెండవ రోజు మృతి చెందాడు. ఈ నెల 6వ తేదీన గ్రామానికి చెందిన గుణకాల పద్మావతి (47) హైదరాబాద్‌కు పనిమీద కారులో వెళుతుండగా మార్గ మధ్యలో స్ట్రోక్‌తో మృత్యువాతకు గురైంది. అనంతరం 7వ తేదీన దొడ్డా సుజానమ్మ (చిట్టెమ్మ) (70) జ్వరంతో బాధపడుతూ గుంటూరు జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం వెళ్లింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ స్ట్రోక్‌కు గురై మృతి చెందింది. 9వ తేదీన తురిమెళ్ళ విజయరాజు (58) లంగ్స్ ప్రాబ్లంతో పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఇంటి వద్దే మృత్యువాత పడ్డాడు. 10వ తేదీన రమాదేవి అనే మహిళ కొన్ని సంవత్సరాలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతూ చనిపోయింది. 11వ తేదీన యాతం ప్రసాదరావు (68) ఉదయం స్వల్పంగా జ్వరంగా ఉన్నట్లు అనిపించటంతో తన ద్విచక్రవాహనంపై గ్రామంలోని విలేజ్ క్లినిక్‌లో చికిత్స కోసం వెళ్లాడు. అక్కడ వైద్యులు చికిత్సలో భాగంగా బీపీ పరీక్షిస్తుండగా ఒక్కసారిగా పల్స్ పడిపోవటంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే వైద్యులు తేరుకుని పరీక్షించగా పరిస్థితి విషమంగా అనిపించటంతో సీపీఆర్ చేశారు. చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు.

బిక్కుబిక్కుమంటూ...

ఇలా కేవలం పదిరోజు వ్యవధిలో ఆరుగురు మృతి చెందడంతో గ్రామంలో మరోసారి విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామంలో అసలు ఏం జరుగుతోంది? అనే విషయం మళ్లీ చర్చనీయాంశంగా మారింది. దీంతో గ్రామంలో ఎప్పటినుంచో వస్తున్న నానుడి మంగళవారం నాడు ఎవరైనా చనిపోతే దానికి కొనసాగింపుగా ఎవరో ఒకరు చనిపోతూనే ఉంటారని గ్రామంలో ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇంతకు ముందు మెలియాయిడోసిస్‌తో వరుస మరణాలు సంభవించగా... ఇప్పుడు అనారోగ్యంతో అకాల మృత్యువాత పడుతున్నారు. దీంతో గ్రామంలోని ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. తమ సమస్యలకు పరిష్కారం లేదా అని ఆవేదన చెందుతున్నారు.

'కమీషన్' కక్కుర్తి.. నాణ్యత నాస్తి!

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో జరిగే ఏ అభివృద్ధి పనికైనా ప్రజాప్రతినిధులకు కమీషన్ ఇవ్వాల్సిందే. కొబ్బరికాయ కొట్టడానికి ముందు ముట్టజెప్పాల్సిందే. ఇవ్వకపోతే ఆ పనిని ఏదో ఒక వంక చెప్పి ప్రారంభం కాకుండా అడ్డుకుంటున్నారు. వీరికి అధికారులు కూడా తోడు కావడంతో కమీషన్లకే అధిక మొత్తం పోతుండటంతో ఇక చేసే పనుల్లో నాణ్యత ఏ మేరకు ఉంటుందని నగర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- కార్పొరేషన్‌లో ప్రజాప్రతినిధుల వసూళ్ల దందా
- అధికార పార్టీ ఎమ్మెల్యే, కార్పొరేటర్‌లకు చెరో రెండు శాతం
- ఏ పని మొదలుపెట్టినా ముందుగా చెల్లించాల్సిందే
- లేదంటే పనులకు అడుగడుగునా తప్పని అడ్డంకులు
- అధికారుల వాటాతో కలిపి 15 శాతానికిపైగా కమీషన్లకే
- ఇక పనుల్లో నాణ్యత ఎక్కడుంటుందని ప్రజల ఆగ్రహం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు నగర పరిధిలో కొన్ని రూ.కోట్ల అభివృద్ధి పనులు నిత్యం జరుగుతుంటాయి. అవి సక్రమంగా సాగాలంటే ముందుగా అధికార పార్టీ కార్పొరేటర్ నుంచి స్థానిక ఎమ్మెల్యే వరకు, సచివాలయ ఎమినిటీ కార్యదర్శి నుంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు కమీషన్లు ఇవ్వాల్సిందే. లేకపోతే పనుల్లో లోపాలు ఉన్నాయంటూ నిత్యం ఇబ్బందులకు గురిచేస్తూ బిల్లులు సక్రమంగా ప్రాసెస్ చేయడం లేదని కాంట్రాక్టర్లు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

చెరో రెండు శాతంతో మొదలు...

ఎక్కడైనా అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపన కార్యక్రమాలు చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులను పిలిపించి కొబ్బరికాయ కొట్టించి, ప్రారంభిస్తుంటారు. అయితే సదరు శంకుస్థాపన కార్యక్రమానికి రాకముందే అధికార పార్టీ స్థానిక కార్పొరేటర్‌కు, ఒకవేళ అక్కడ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ ఉంటే ఆ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షునికి రెండు శాతం కమీషన్ ఇవ్వాల్సి వస్తోందని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. అదే విధంగా స్థానిక ఎమ్మెల్యేకు రెండు శాతం ఇవ్వాల్సి వస్తోందని, లేకపోతే వారు కొబ్బరికాయ కూడా కొట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాగో అలా పనులు మొదలుపెడితే స్థానికులతో లేనిపోని ఫిర్యాదులు చేయించి ఆ పనిని ఆపడం ద్వారా కమీషన్ ఇచ్చేలా కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

అంతటితో ఆగకుండా...

ఈ వ్యవహారం ఇంతటితో ఆగడం లేదు. వార్డు ఎమినిటీ సెక్రటరీకి ఒక శాతం, ఏఈకి రెండు శాతం, డీఈకి ఒక శాతం, ఈఈకి ఒక శాతం, ఎస్‌ఈకి అర శాతం చొప్పున కమీషన్లు సమర్పించుకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆరోపణలు వస్తున్నాయి. ఎవరికైనా కొంత తక్కువైతే చాలు ఇక కాంట్రాక్టర్ పని అయిపోయినట్లేనని ప్రచారం సాగుతోంది. మెటీరియల్ తక్కువగా వాడారు.. నాణ్యత లోపించింది కాబట్టి బిల్లు ప్రాసెస్ కాదని తెగేసి చెబుతున్నారు. వీరి తరువాత డ్రాయింగ్ బ్రాంచ్‌కి అరశాతం, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ అర శాతం, అకౌంట్ సెక్షన్‌లోకి బిల్లు వెళితే కాంట్రాక్టర్ అవసరాన్ని బట్టి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 2 నుంచి 6 శాతం వరకూ తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు కొత్తగా నిధి పోర్టల్ ద్వారా బిల్లులు ప్రాసెస్ చేస్తుండటంతో సదరు బిల్లులు పీఏఓ (పే అండ్ అకౌంట్స్) సెక్షన్‌కి వెళ్లి అక్కడ మంజూరు కావాలంటే వారికి మరో అర శాతం సమర్పించుకోవాల్సిందేనని ఆరోపణలు వస్తున్నాయి.

ఇక నాణ్యత ఏముంటుంది?

ఒక వర్కు ప్రారంభించి పూర్తయ్యే సరికి 15 నుంచి 18 శాతం వరకు కమీషన్ల రూపంలోనే పోతే తమకేం మిగులుతుందని, నాణ్యంగా పనులెక్కడ చేస్తామని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఒకవేళ ఎక్కడైనా మెటీరియల్ తక్కువ వాడితే.. వర్కుల పర్యవేక్షణ కోసం వచ్చే థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ వారు నాణ్యత లేదని కాంట్రాక్టర్ బిల్లుల్లో కోత విధించాలని కమిషనర్‌కు సిఫార్సు చేయడంతో వారు లబోదిబోమంటున్నారు. ఇంజినీరింగ్ అధికారులను, సిబ్బందిని బాధ్యులను చేయకుండా తమను నిందిస్తే ఎలా అని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమీషన్ల దందాపై నగరవాసులు మండిపడుతున్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించే అవకాశం ఉందని, మండిపడుతున్నారు.

ప్రత్యేక రైళ్లు కేటాయింపు

లక్ష్మీపురం: గుంటూరు డివిజన్ ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను కేటాయించినట్లు పీఆర్‌ఓ వినయ్‌కాంత్ మంగళవారం తెలిపారు. నంబర్ 07455 నరసాపూర్ – సికింద్రాబాద్ రైలు డివిజన్ మీదుగా బుధవారం కేటాయించామని పేర్కొన్నారు. ఈ రైలు పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ళ, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్‌ల మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. నంబర్ 07179 అనకాపల్లి – సికింద్రాబాద్ రైలును ఈ నెల 5వ తేదీన డివిజన్ మీదుగా కేటాయించామని వివరించారు. ఈ రైలు తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ళ, మిర్యాలగూడ, నల్గొండ, చర్లపల్లి స్టేషన్‌ల మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి విద్యుత్ అదాలత్

వినియోగదారునితో మాట్లాడుతున్న విక్టర్ ఇమ్మానుయేల్

తెనాలి టౌన్: విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను అదాలత్‌లో పరిష్కరించుకునే అవకాశం కల్పించినట్టు విశ్రాంత డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి, ఏపీసీపీడీసీఎల్, సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ ఎన్.విక్టర్ ఇమ్మానుయేల్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక, విజయవాడ ఆధ్వర్యంలో విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సును మంగళవారం కొత్తపేటలోని ఎన్జీవో కల్యాణమండపంలో నిర్వహించారు. సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ అధ్యక్షత వహించారు. సమస్యలపై పలువురు వినతిపత్రాలను సమర్పించారు. వాటి పరిష్కారానికి ఆయన కృషి చేశారు. గుణదలలో కోర్టు హాలు వంటి శాశ్వత భవనంలో కార్యకలాపాలు జరుపుతున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు ఏడు జిల్లాల్లో సర్కిళ్లలో 280 అదాలత్‌లను నిర్వహించి వెయ్యి కేసులను పరిష్కరించామని వివరించారు. వినియోగదారులు తమ సమస్యను రెండేళ్లలోపే తమ దృష్టికి తీసుకురావాలని స్పష్టంగా చెప్పారు. విద్యుత్ అదాలత్‌లో సాంకేతిక సభ్యుడు డి.కృష్ణానాయక్, ఆర్థిక సభ్యుడు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, జిల్లా పర్యవేక్షక అధికారి సీహెచ్ రమేష్, స్వతంత్ర సభ్యులు ఎ.సునీత పాల్గొన్నారు. తెనాలి విద్యుత్ ఈఈ అక్కల సత్యనారాయణ పర్యవేక్షించారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

గుంటూరు వెస్ట్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని నీటి వనరుల సంరక్షణ ద్వారానే ఇది సాధ్యం అవుతుందని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమం, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. మంగళవారం స్థానిక వెల్కమ్ గ్రాండ్ హోటల్లో గత రెండు రోజుల నుంచి జరుగుతున్న వాటర్ షెడ్ మహోత్సవ్ జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో కేంద్ర మంత్రి మాట్లాడారు. వేల సంవత్సరాలుగా నీటిని దేవుడిగా పూజించే అమృతం సమానం అని అన్నారు. ఆ భావనతోనే వాటర్ షెడ్ పథకం పనిచేస్తుందన్నారు. నదుల పునర్జీవనం చాలా ముఖ్యం అని స్పష్టం చేశారు. రెండు రోజుల జాతీయ సదస్సులో ఈ అంశాలన్నింటినీ చర్చించారని, భవిష్యత్తులో మోదీ నాయకత్వంలో ముక్తి భారత్ వికసిత్ భారత్ భావనతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్ర శేఖర్ మాట్లాడుతూ నీటి వనరుల సంరక్షణకు ప్రతి గ్రామంలోనూ వాటర్ షెడ్ కార్యక్రమాలను మిషన్ మోడ్ లో ముందుకు తీసుకెళ్లాలన్నారు. కేంద్ర ప్రభుత్వ భూ వనరుల విభాగం కార్యదర్శి మనోజ్ జోషి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.శశిభూషణ్ కుమార్, కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరీ నితిన్ కడే, రాష్ట్ర పంచాయతీ రాజ్ సంస్థలు మైదవరపు కృష్ణ తేజ, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ సి.పి.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహం

తాడేపల్లి రూరల్: ప్రకాశం బ్యారేజ్ దిగువన పుష్కర ఘాట్లకు, బ్యారేజీకి మధ్య భాగంలో నీటిలో వ్యక్తి మృతదేహాన్ని స్థానిక మత్స్యకారులు మంగళవారం గుర్తించారు. తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ ప్రతాప్‌కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించి, పరిశీలించగా ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతుడి శరీరంపై బ్లాక్ కలర్ జీన్స్ ప్యాంట్, షర్ట్‌మీద తెలుపు, లేత ఆకు పచ్చ నలుపు రంగులో డిజైన్, చేతికి కాశీదారం కలిగి ఉన్నాడని, వయస్సు సుమారు 30 నుంచి 35 మధ్య ఉండవచ్చని, ఎవరైనా గుర్తిస్తే వెంటనే తాడేపల్లి పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ ప్రతాప్‌కుమార్ కోరారు.

SATTENAPALLE MUNICIPALITY : SATTENAPALLE
e - Procurement Tender Notice

Tender Notice No.23/2025-26/E1/SAPMPLTY, Dt.11-11-2025

1	No. of works	14 Nos.
2	Total Value of Works	Rs. 56.80 Lakhs
3	Bid Document Download Starting Date	12-11-2025 11:00 AM
4	Bid Document Download End Date	26-11-2025 1:00 PM
5	Last Date & Time for receipt of bids	26-11-2025 2:00 PM
6	Bid Opening Date	26-11-2025 3:00 PM

Further details can be seen @ e-Procurement market place at
www.tender.apeprocurement.gov.in
Sd/- Commissioner, SATTENAPALLE MUNICIPALITY : SATTENAPALLE

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ గుంటూరు మిర్చి యార్డ్ ప్రక్కన చిలకలూరిపేట రోడ్డు నందు 1530 గజాలు, ఆర్.సి.సి. గోడౌన్ అమ్మకానికి కలదు. ✆ 9848752471

SERVICES

■ ప్రముఖ బ్యాంకుల నందు గల హౌసింగ్ లోన్‌లు మా యొక్క బ్యాంకుకు టేక్ ఓవర్ చేయబడును & కొత్త లోనులు చేయబడును కమీషన్ అవసరం లేదు. & DSAలు కావలెను. కమిషన్ వెంటనే ఇవ్వబడును. సంప్ర: 8121847536, 9966617161

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ ✆ 8790741166

WANTED

■ గుంటూరు కొత్తపేటలోని హాస్పటల్ నందు ANM, GNM M/F Work అనుభవం ఉన్న నర్సింగ్ స్టాఫ్, నర్సింగ్ ఇన్‌చార్జ్ Female కావలెను. 7997777108

■ గుంటూరు పరిసర ప్రాంతాలలోని ప్రముఖ పారిశ్రామిక సంస్థలలో మా సంస్థ తరుపున పని చేయుటకు అనుభవము కలిగిన సెక్యూరిటీ సూపర్ వైజర్లు, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. సూపర్‌వైజర్స్ అర్హతలు: వయస్సు:30-45సం,ఇంటర్/ డిగ్రీ, ఎత్తు: 05'-06" పైన, రిటైర్డ్ ఆర్మీ, పారా మిలిటరీ వారికి ప్రాధాన్యత. గార్డ్ అర్హతలు: వయస్సు:23-45 సం, 10th,ఎత్తు: 05'-05"పైన లేబర్ యాక్ట్ ప్రకారం జీతం ఉదయం 11 గం.నుండి మీఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో సం: సత్యా ఇన్వెస్టిగేషన్&సెక్యూరిటీ సర్వీసెస్,బృందావన్ గార్డెన్స్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రక్కన, గుంటూరు. 7095125556, 0863-2951838

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు క్లాసు ఇన్‌ఛార్జీస్, హాస్టల్ ఇన్‌ఛార్జీస్, వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము, వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 89784 80429

■ అమరావతిలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ కావలెను. వెంటనే సంప్రదించండి. శ్రీ రాజరాజేశ్వరి సెక్యూరిటీ సర్వీసెస్. 9346138743, 8008202789

■ ఎలక్ట్రికల్ ఆటోలు & ట్రాక్టర్లుకు గుంటూరు జిల్లాలో బ్రాంచిల కొరకు 1.సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ Q:ఏదైనాడిగ్రీ (ఫ్రెషర్స్ / అనుభవం ఉన్న వారు) 2. సర్వీస్ టెక్నీషియన్స్ ITI/ ఎలక్ట్రికల్ బ్యాక్‌గ్రౌండ్ (ఫ్రెషర్స్/ అనుభవం ఉన్న వారు) కావలెను. సం. 80089 31038, 91338 65966, hr.shreelakshmi infraequipments@gmail.com

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ఎడిషన్ రూ.475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన పిదప స్పందించాల్సిందిగా పాఠకులకు ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించవలెను.

మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు ఘననివాళి

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో జయంతి వేడుకలు

అబుల్‌కలాం ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అంబటి రాంబాబు, తదితరులు

పట్నంబజారు: స్వాతంత్య్ర సమరయోధులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, పార్టీ నేతలు, అనుబంధ విభాగాల నేతలు, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు హాజరై నివాళులు అర్పించారు. అనంతరం ముఖ్య నేతలు మౌలానా అబుల్‌కలాం ఆజాద్ చేసిన సేవలను కొనియాడారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా ఒక విప్లవాన్ని తీసుకు వచ్చిన మహనీయుడని కీర్తించారు. వైఎస్సార్ సీపీ నేతలు మండేపూడి పురుషోత్తం, బైరెడ్డి రవీంద్రారెడ్డి, గెడ్డేటి సురేంద్ర, అబ్దుల్లాఖాన్, సూరసాని వెంకటరెడ్డి, సింగు నరసింహారావు, కొరిటిపాటి ప్రేమ్‌కుమార్, నందేటి రాజేష్, ఓర్సు శ్రీనివాసరావు, దానం వినోద్, వేలూరి అనిల్‌రెడ్డి, కీసరి సుబ్బులు, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా పశ్చిమడెల్టా పంటకాల్వలను ఆధునికీకరించాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తెనాలి డివిజన్ కమిటీ మహాసభ తీర్మానం

తెనాలి: కృష్ణా పశ్చిమ డెల్టాలో పంట కాల్వలు, మురుగు కాల్వలను ఆధునికీకరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తెనాలి డివిజన్ కమిటీ మహాసభ తీర్మానించింది. స్థానిక అయితానగర్‌లోని నన్నపనేని సీతారామయ్య - సరస్వతి కళ్యాణ మండపంలో మధ్దన సాంబశివరావు అధ్యక్షతన రైతు సంఘం డివిజన్ మహాసభ జరిగిన విషయం తెలిసిందే. మహాసభ తీర్మానాలను కార్యదర్శి ములకా శివసాంబిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. దుగ్గిరాల శివ మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అగ్నిప్రమాద బాధిత రైతులకు మిగిలిన పరిహారం కూడా వెంటనే ఇవ్వాలని, పాల రైతులకు బ్యాంకు ద్వారా రుణాలు ఇవ్వాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నూతన చట్టం తీసుకురావాలని మహాసభ డిమాండ్ చేసిందని తెలిపారు. మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన పొలాలను ఎన్యూమరేట్ చేసి నష్టపరిహారం ఇవ్వాలని కోరింది. రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో మద్దన సాంబశివరావు జిల్లా అధ్యక్షుడిగా, ములకా శివసాంబిరెడ్డి జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. వేజెండ్ల తబిత, పసుపులేటి శివ నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, రెడ్డాబత్తుల మహేశ్వరరావు సహాయ కార్యదర్శి ఉపాధ్యక్షులుగా 12 మందితో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వివరించారు.

ఘనంగా యూనియన్ బ్యాంక్ స్థాపన దినోత్సవం

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, బ్యాంకు అధికారులు

కొరిటెపాడు: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 107వ స్థాపన దినోత్సవం గుంటూరులోని బొబ్బా కోర్ట్ కల్యాణ మండపంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థికాభివృద్ధిలో యూనియన్ బ్యాంక్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రత్యేక అతిథి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ప్రమోద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రజల ఆర్థిక సుస్థిరతకు బ్యాంక్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ ఎస్.జవహర్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ 107 ఏళ్ల విజయయాత్రలో కస్టమర్ల విశ్వాసమే ప్రధాన బలమని, భవిష్యత్తులో మరిన్ని ఆధునిక సేవలను అందించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా విశిష్ట సేవలందించిన ఉద్యోగులను సత్కరించారు. బ్యాంకు సిబ్బంది, వారి పిల్లలచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

పేకాట నిర్వాహకుడిగా పెదకాకాని ఎస్ఐ

స్పెషల్ టాస్క్‌ఫోర్స్ దాడుల్లో పట్టుబడిన వైనం !

పెదకాకాని: పేకాట స్థావరంపై పోలీసులు జరిపిన దాడుల్లో ఎస్ఐతో పాటు పలువురు పోలీసు సిబ్బంది పట్టుబడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పెదకాకాని పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కొమ్మూరి వెంకట్రావు స్వగ్రామం అదే మండలంలోని తక్కెళ్లపాడు కావడంతో గతంలో ఇంట్లోనే పేకాట ఆడించేవాడు. పేకాట ఆడుకుందుకు దాదాపు పోలీసు సిబ్బంది అక్కడికే వచ్చేవారు. ఇంట్లో పేకాట ఆడిస్తున్న సమయంలో విలేకరులు అప్పటి సీఐకి సమాచారం ఇవ్వడం, ఆయన మందలించడంతో కొంతకాలం నిలిపివేశారు. గత కొంతకాలంగా ఆయన ఐటీసీ సమీపంలో ఉన్న వీఐర్ గెస్ట్‌హౌస్‌లో పేకాట ఆడిస్తున్నారు. ఐజీవల వీఐర్ గెస్ట్‌హౌస్‌(లాడ్జి)పై స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ కొమ్మూరి వెంకట్రావుతో పాటు పలువురు పోలీసు సిబ్బంది పట్టుబడినట్లుగా సమాచారం.

యువకుడిపై హత్యాయత్నం!

- అడ్డుకున్న ట్రాఫిక్ కానిస్టేబుల్
- పోలీసుల అదుపులో రౌడీషీటర్, మరో ఇద్దరు?

తాడేపల్లి రూరల్: తాడేపల్లి బైపాస్ రోడ్‌లోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద ఓ వ్యక్తిని ఒక రౌడీషీటర్ మరో వ్యక్తి కలిసి దారుణంగా కొట్టిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం తాడేపల్లి క్రిస్టియన్ పేటలో నివాసముండే ఇసుకపల్లి ప్రకాష్ గతంలో ఓ యువకుడి హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఇది మనసులో పెట్టుకుని హత్యకు గురైన వ్యక్తి బావమరిది సాయి, రౌడీషీటర్ వికాస్ అలియాస్ బన్నిలు ప్రకాష్ ఒంటరిగా ఉండడం గమనించి అతనిపై దాడికి పాల్పడ్డారు. గొడవ తీవ్రస్థాయిలో జరగడంతో రోడ్డుపై కొట్టుకుంటూ రాళ్లు, బీరు సీసాలు విసిరివేసుకోవడంతో రోడ్డుపై ప్రయాణించేవారు తీవ్ర ఆందోళన చెందారు. ఇసుకపల్లి ప్రకాష్‌ను రౌడీషీటర్ అయిన వికాస్ అలియాస్ బన్ని, ఆటోలో తీసుకువెళ్లేందుకు ప్రయత్నించి బీరు బాటిల్ పగలకొట్టి బెదిరింపులకు పాల్పడ్డారు. ప్రకాష్ సైతం మరో బీరు బాటిల్ పగలకొట్టి సాయి, బన్నీలపై దూసుకువెళ్లినట్లు సమాచారం. ఈ గొడవలో ప్రకాష్‌పై సాయి, బన్నిలు ఒక్కసారిగా తిరగబడి పొడిచేందుకు యత్నించగా అక్కడే విధులు నిర్వహిస్తున్న ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ వారిని అడ్డుకుని తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. తాడేపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ముగ్గురిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు విశ్వసనీయ సమాచారం. గతంలో బన్ని అనేక గొడవల్లో తలదూర్చి పలువురిని గాయపరిచాడు. ఆటో డ్రైవర్ ఆటో ఎక్కించుకోలేదని తీవ్రంగా కొట్టిన సంఘటనలు కూడా ఉన్నాయి. అర్ధరాత్రిళ్లు రోడ్లపై తిరుగుతూ బండికి నెంబర్ ప్లేట్ లేకుండా దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు నెలల క్రితం బోసుబొమ్మ సెంటర్‌లో బట్టలు విప్పుకొని వీరంగం చేశారు. బన్నీ అండ్ గ్యాంగ్ నిత్యం ఏదో ఒక గొడవకు పాల్పడుతుండడంతో ఆప్రాంత వాసులు విసిగివేసారిపోయారు. జరిగిన ఈ సంఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకుంటారా లేదా పెట్టీ కేసులు పెట్టి వదిలివేస్తారా అనేది వేచి చూడాలి.

గల్లంతైన వ్యక్తి మృతి

మృతదేహాన్ని బయటకు తీస్తున్న ఎస్‌డీఆర్ఎఫ్ బృందం

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధిలోని శ్రీ లక్ష్మీ నరసింహ కాలనీ సమీపంలో సోమవారం స్నానం చేయడానికి వెళ్లి కాలువలో జారిపడిన యువకుడి మృతదేహం మంగళవారం లభ్యమైంది. ఏపీఎస్‌డీఆర్ఎఫ్ బృందం గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడు తాడేపల్లి క్వారీ రోడ్‌కు చెందిన యేసు (22)గా పోలీసులు గుర్తించారు. పట్టణ పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఎయిమ్స్ వైద్యశాలకు తరలించారు.

మధ్యాహ్న భోజనంలో బల్లి పడిందని వదంతులు

బ్రాడీపేట ఎల్ఎంపీ స్కూల్‌కు వెళ్లి పరిశీలించిన డీఈఓ

గుంటూరు ఎడ్యుకేషన్: బ్రాడీపేటలోని ఎల్ఎంపీ హైస్కూల్లో మంగళవారం విద్యార్థులకు వడ్డించిన మధ్యాహ్న భోజనంలో బల్లి పడిందని వదంతులు వ్యాపించాయి. దీంతో విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక హటాహుటిన పాఠశాలకు వెళ్లి పరిశీలించిన తరువాతే అదంతా ఒట్టిదేనని తేల్చారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న సమయంలో ఈ విషయమై పుకార్లు చెలరేగాయి. బ్రాడీపేటలోని బీసీ సంక్షేమ వసతి గృహంలో ఉంటూ, ఎల్ఎంపీ హైస్కూల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఒకరు గత వారం రోజులుగా కడుపులో నొప్పితో బాధ పడుతుండటంతో సంబంధిత హాస్టల్ వార్డెన్, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన డీఈఓ రేణుక తక్షణమే విద్యార్థినికి ఆస్పత్రికి పంపించారు. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలించిన డీఈఓ మధ్యాహ్న భోజనం ఆరగించిన మిగిలిన విద్యార్థులతో స్వయంగా మాట్లాడారు. అయితే మధ్యాహ్న భోజనం ఆరగించిన విద్యార్థుల్లో ఎవరికీ ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకపోవడంతో ఎవరో పుకార్లు వ్యాపింపచేశారని డీఈఓ రేణుక చెప్పారు. అనంతరం ఆమె పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. అదే విధంగా ఎస్‌వీఆర్ఎన్ నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు.

కృష్ణానదిలో గల్లంతైన వారి మృతదేహాలు గుర్తింపు

తాడికొండ: తుళ్లూరు మండలం రాయపూడి ఘాట్ వద్ద కృష్ణానదిలో ఈతకు దిగి గల్లంతైన వారి మృతదేహాలను పోలీసులు గుర్తించారు. తూర్పు గోదావరి జిల్లా చల్లపల్లికి చెందిన పి.గణేశ్వరరావు (22), గిద్దలూరుకు చెందిన పమిడిమర్రి దినేష్ (23)లు రాజధాని నిర్మాణ పనుల్లో భాగంగా తుళ్లూరు మండలానికి వచ్చి ఆదివారం రాయపూడి ఘాట్ వద్ద స్నానాలకు దిగి గల్లంతయ్యారు. రక్షించేందుకు స్థానికులు యత్నించినా నీటిలోకి జారిపోయారు. సోమవారం ఓ యువకుడి మృతదేహాన్ని గుర్తించగా, మంగళవారం మరో యువకుడు మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్లూరు పోలీసులు తెలిపారు.

పది సవర్ల బంగారం, నగదు చోరీ

లక్ష్మీపురం: కుటుంబ సభ్యులందరూ కలిసి ఊర్లెళ్లి వచ్చి చూసే సరికి ఇంటి బీరువాలో ఉన్న 10 సవర్ల బంగారం, రూ.15వేలు నగదు మాయమైన ఘటనపై అరండల్‌పేట పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని శారదాకాలనీ 2వ లైన్ ప్రాంతానికి చెందిన పల్లా శ్రీనివాసరావు అనే వ్యక్తి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అక్టోబర్ 30వ తేదీన కుటుంబ సభ్యులందరూ కలిసి చెన్నైకి వెళ్లారు. తిరిగి ఈనెల 10న సోమవారం ఇంటికి వచ్చి చూసే సరికి బీరువా ఓపెన్ చేసి చిందర వందరగా ఉంది. దీంతో పరిశీలించగా బీరువాలో ఉన్న 10 సవర్ల బంగారం, రూ.15వేల నగదు చోరీ అయినట్లు గుర్తించారు. అరండల్‌పేట పోలీసులకు సమాచారం తెలియజేసి ఇంట్లో అద్దెకు ఉండే వ్యక్తి పైన అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

यूनियन बैंक Union Bank of India

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అస్సెట్ రికవరీ బ్రాంచ్ (79170), విజయవాడ, చిరునామా : 4వ ఫ్లోర్, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520001.
E-mail: arb.vijayawada@unionbankofindia.bank

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)ల నిబంధనలతో చదివే సెక్యూరిటైజేషన్ & రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకపు నోటీసు)

[illegible] "ఎక్కడ ఎలా ఉన్నది అలాగే" "ఏది ఉంటే అది & ఎక్కడ ఏది ఉన్నదో అలాగే" పద్ధతిలో తేది:28-11-2025న అమ్మకం చేయుటకు నిర్ణయించినారు.

ఇ-వేలం తేది&సమయం: 28-11-2025, మ॥ 12.00 గం॥ల నుండి సా॥ 05.00 గం॥ల వరకు
ధరావత్తు సమర్పించుటకు ఆఖరు తేది: ఇ-వేలం ప్రారంభానికి ముందు వరకు

ఋణగ్రహీతలు / హామీదారులు / సహ ఋణగ్రహీతలు, బకాయి మరియు రిజర్వుధర, ధరావత్తు వివరములు దిగువ తెలుపబడినవి.

1 ఋణగ్రహీత కో-అప్లికెంట్ మరియు హామీదారు: మెస్సర్స్ లక్ష్మీ నరసింహ కాటన్, ప్లాంట్ & ఆఫీస్: [illegible] గుంటూరు - 522001. [illegible] గుంటూరు - 522003.
బకాయి మొత్తం: తేది.30-09-2025 నాటికి రూ.4,01,34,711.69 పై + తదుపరి వడ్డీ, కాస్ట్ మరియు ఇతర ఖర్చులు వెరసగునవి.
స్థిరాస్తి వివరములు: ఆస్తి-1: గుంటూరు, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో, [illegible] ఉత్తరం : 18 అడుగుల వెడల్పు రోడ్డు.
రిజర్వు ధర: రూ.63,16,000/-, ధరావత్తు: రూ.6,31,600/-, బిడ్ పెంపుదల : రూ.63,160/-
ఆస్తి-2: గుంటూరు, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో, [illegible] డి.నెం.24-15-19/ఎ, డి.నెం.80/1బి వద్ద 711.50 చ॥గజాల [illegible] డి.నెం.24-17-186 [illegible] సేల్ డీడ్ నెం.2168/2016 ప్రకారం). స్థల విస్తీర్ణం ఎ.711.50 చ॥గజాలు). [illegible]
రిజర్వు ధర: రూ.58,41,000/-, ధరావత్తు: రూ.5,84,100/-, బిడ్ పెంపుదల : రూ.58,410/-

2 ఋణగ్రహీత కో-అప్లికెంట్ మరియు హామీదారు: మెస్సర్స్ ఫరూక్ ట్రేడర్స్, ప్రొప్రయిటర్ : శ్రీ షేక్ అబ్దుల్ రజాక్, [illegible] గుంటూరు - 522001. [illegible]
బకాయి మొత్తం: తేది.30-09-2025 నాటికి రూ.66,48,200.50 పై + తదుపరి వడ్డీ, కాస్ట్ మరియు ఇతర ఖర్చులు వెరసగునవి.
స్థిరాస్తి వివరములు: [illegible]
రిజర్వు ధర: రూ.27,83,000/-, ధరావత్తు: రూ.2,78,300/-, బిడ్ పెంపుదల : రూ.27,830/-

3 ఋణగ్రహీత కో-అప్లికెంట్ మరియు హామీదారు: [illegible]
బకాయి మొత్తం: తేది.30-09-2025 నాటికి రూ.104,40,37,513.87 పై + తదుపరి వడ్డీ, కాస్ట్ మరియు ఇతర ఖర్చులు వెరసగునవి.
స్థిరాస్తి వివరములు: ఆస్తి-1: [illegible]
రిజర్వు ధర: రూ.26,28,900/-, ధరావత్తు: రూ.2,62,890/-, బిడ్ పెంపుదల : రూ.26,289/-
ఆస్తి-2: [illegible]
రిజర్వు ధర: రూ.20,68,87,000/-, ధరావత్తు: రూ.2,06,88,700/-, బిడ్ పెంపుదల : రూ.20,68,870/-

4 ఋణగ్రహీత కో-అప్లికెంట్ మరియు హామీదారు: [illegible]
బకాయి మొత్తం: తేది.30-09-2025 నాటికి రూ.2,84,38,645.15 పై + తదుపరి వడ్డీ, కాస్ట్ మరియు ఇతర ఖర్చులు వెరసగునవి.
స్థిరాస్తి వివరములు: [illegible] Google Coordinates 16.304258,80.459490
రిజర్వు ధర: రూ.23,10,000/-, ధరావత్తు: రూ.2,31,000/-, బిడ్ పెంపుదల : రూ.23,100/-

5 ఋణగ్రహీత కో-అప్లికెంట్ మరియు హామీదారు: [illegible]
బకాయి మొత్తం: తేది.30-09-2025 నాటికి రూ.34,30,457.42 పై + తదుపరి వడ్డీ, కాస్ట్ మరియు ఇతర ఖర్చులు వెరసగునవి.
స్థిరాస్తి వివరములు: [illegible] Google Coordinates: 15.484860,80.006058.
రిజర్వు ధర: రూ.12,34,200/-, ధరావత్తు: రూ.1,23,420/-, బిడ్ పెంపుదల : రూ.12,342/-

6 ఋణగ్రహీత కో-అప్లికెంట్ మరియు హామీదారు: [illegible]
బకాయి మొత్తం: తేది.30-09-2025 నాటికి రూ.42,96,653.61 పై + తదుపరి వడ్డీ, కాస్ట్ మరియు ఇతర ఖర్చులు వెరసగునవి.
స్థిరాస్తి వివరములు: [illegible]
రిజర్వు ధర: రూ.30,33,000/-, ధరావత్తు: రూ.3,03,300/-, బిడ్ పెంపుదల : రూ.30,330/-

7 ఋణగ్రహీత కో-అప్లికెంట్ మరియు హామీదారు: 1. శ్రీమతి [illegible] ప్రకాశం జిల్లా - 523001, ఆంధ్రప్రదేశ్ (ఋణగ్రహీత & తనఖాదారు), 2. శ్రీ [illegible] ప్రకాశం జిల్లా - 523001, ఆంధ్రప్రదేశ్ (హామీదారు).
బకాయి మొత్తం: తేది.30-09-2025 నాటికి రూ.44,30,637.93 పై + తదుపరి వడ్డీ, కాస్ట్ మరియు ఇతర ఖర్చులు వెరసగునవి.
స్థిరాస్తి వివరములు: ఆంధ్రప్రదేశ్, గుంటూరు జిల్లా, [illegible]
రిజర్వు ధర: రూ.34,83,000/-, ధరావత్తు: రూ.3,48,300/-, బిడ్ పెంపుదల : రూ.34,830/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం https://baanknet.com మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్ www.unionbankofindia.co.in నందు చూడగలరు. అధీకృత అధికారి / చీఫ్ మేనేజర్ గారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు, ఆసక్తి గల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం Mail ID : arb.vijayawada@unionbankofindia.bank లో సంప్రదించవచ్చును.
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)/రూల్ 9(1)ల ప్రకారం చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం ఈ నోటీసు ప్రకటన పైన తెలిపిన లోనుకు సంబంధించిన ఋణగ్రహీత(ల)కు, హామీదారు(ల)కు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8ల క్రింద పైన తెలిపిన తేదిన వేలం అమ్మకం జరుపబడునని తెలియజేస్తూ ఇచ్చిన ప్రకటనగా కూడా పరిగణించవలెను.

తేది : 11.11.2025
ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచ్, విజయవాడ

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నాయకుడికి నివాళులు

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణంలో అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ 30వ వార్డు యువజన విభాగ అధ్యక్షులు కు(రా మురళీకుమార్(35) భౌతిక కాయానికి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి మంగళవారం పూలమాల వేసి నివాళులర్పించారు. మురళీకుమార్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడి పనిచేశారని.. ఎంతో భవిష్యత్తు ఉందని.. అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని పలువురు పార్టీ నాయకులు పేర్కొన్నారు. మురళీకుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని అన్నారు. మండల అధ్యక్షులు నాలి వెంకట కృష్ణ తదితర నాయకులు ఉన్నారు.

ప్రభుత్వం పేదలకు న్యాయం చేయాలి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కేఎల్ రావు కాలనీలో నివాసం ఉంటున్న పేద ప్రజలకు ప్రభుత్వం న్యాయం చేయాలని.. ఇళ్లు తొలగించే ప్రతి ఒక్కరికీ రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేఎల్ రావు కాలనీలో నివసించే వారందరూ జీవనోపాధి కోసం ఇతర జిల్లాల నుంచి 50 ఏళ్ల కిందట ఇక్కడకు వలస వచ్చారని తెలిపారు. ప్రభుత్వం సీడ్ యాక్సెస్ రోడ్ కింద 87 మంది నివాసాలు పోతున్నట్లు గుర్తించి వారికి 1 సెంటు 12 గజాలు ఇస్తున్నారని.. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు పట్టణ పరిధిలో రెండు సెంట్లు, గ్రామీణ పరిధిలో మూడు సెంట్లు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. దీంతో కాలనీలోని 87 మంది కాకుండా మిగిలిన పేదలను కూడా గుర్తించి ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్‌శాఖ అధికారుల విస్తృత తనిఖీలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కృష్ణనగర్, పెనుమాక, పోలకంపాడు, సీతానగరం, ఉండవల్లిలో మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డీపీఈ ఎస్ఏ కరీమ్, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సంజీవరావులు మాట్లాడుతూ.. తాడేపల్లి ప్రాంతంలోని సీఆర్‌డీఏ సర్కిల్ విభాగం ఇంజినీర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించామని అన్నారు. ఏకకాలంలో 40 మంది అధికారులు 119 మంది సిబ్బంది 40 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశామని పేర్కొన్నారు. అనుమతించిన కేటగిరీ కాకుండా ఇతర కేటగిరీలో విద్యుత్ వాడుతున్న నలుగురికి రూ.45 వేల అపరాధ రుసుము విధించగా, అనుమతికి మించి అదనంగా విద్యుత్ వినియోగిస్తున్న 40 మందికి రూ.3,75,000లు అపరాధ రుసుము విధించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డి.ఇ.సురేష్‌బాబు, డీపీఈ విజిలెన్స్ డీఈలు కె.రవికుమార్, మల్లిఖార్జున ప్రసాద్, ఎస్.శ్రీనివాసరావు, ఏఈలు షణ్ముఖరావు, డీపీఈ విజిలెన్స్ ఏఈఈలు కోటేశ్వరరావు, సతీష్‌కుమార్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లాయపాలెం లంకలో దొంగలు హల్‌చల్

తాళ్లాయపాలెం(తాడికొండ): రాజధాని తుళ్లూరు మండలం తాళ్లాయపాలెంలో సోమవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. కరకట్ట లోపల గల లంక గ్రామంలో చొరబడి ఇళ్లలో చోరీకి యత్నించారు. చివరకు వారు కోళ్లను దొంగిలించి తీసుకెళ్లిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ఇళ్లలో చొరబడి ఉంటే పరిస్థితి ఏంటని పలువురు వాపోతున్నారు. దీనిపై బాధితులు తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

ఫిరంగిపురం: గుంటూరు–కర్నూలు రాష్ట్ర రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళుతున్న యువకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని నుదురుపాడు శివారులో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండాలపాడు గ్రామానికి చెందిన బ్రహ్మం ద్విచక్ర వాహనంపై తన గ్రామానికి వెళుతున్నారు. ఈ క్రమంలో నుదురుపాడు రైల్వే స్టేషన్‌రోడ్డు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో అతని తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు స్పందించి యువకుడుని వాహనంలో చికిత్సకోసం నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

నేడు రాజవోలులో పశువైద్య శిబిరం

చెరుకుపల్లి: రాజవోలు గ్రామంలోని పాలకేంద్రం ఆవరణలో బుధవారం పశువైద్య శిబిరం జరుగుతుందని గూడవల్లి పశువైద్యాధికారిణి బొలగాని జ్యోత్స్న తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పశు గణాభివృద్ధి సంస్థ మరియు పశు సంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల పశు వైద్య శిబిరం నిర్వహించటం జరుగుతుందని, ఈ వైద్య శిబిరంలో పశువులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు.

ప్రమాదం మాటున ప్రయాణం!

ఫిరంగిపురం నుంచి సత్తెనపల్లి వెళ్లేదారిలో నేరెళ్లవాగుపై ఉన్న వంతెన

గుంతకు సూచికగా పెట్టిన రాళ్లు

- శిథిలావస్థకు చేరిన వంతెన
- పట్టించుకోని అధికారులు

ఫిరంగిపురం: ఫిరంగిపురం నుంచి సత్తెనపల్లి వెళ్లే దారిలో విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలోని నేరెళ్ల వాగుపై ఉన్న వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఎన్నో ఏళ్ల కిందట నిర్మించిన వంతెన కావడంతో నేడు శిథిలంగా దర్శనమిస్తోంది. రోజూ ఈ దారిలో అనేక ద్విచక్ర వాహనాలు, లారీలు, బస్సులు, కార్లు ప్రయాణిస్తుంటాయి. ఫిరంగిపురం నుంచి సత్తెనపల్లి వెళ్లేందుకు ఇది దగ్గర ప్రయాణం కావడంతో అనేక మంది వాహనదారులు ఈ దారినే ప్రయాణిస్తుంటారు.

దశాబ్దాల కిందట నిర్మాణం..

నేరెళ్లవాగుపై బ్రిటీష్ కాలంలో ఏడు, ఎనిమిది దశాబ్దాల కిందట దీనిని నిర్మించారు. అప్పటి నుంచి ఈ వంతెన మీదుగా అనేక వాహనాలు ప్రయాణిస్తున్నాయి. ఇటీవల భారీ వాహనాలు తిరుగుతుండడంతో వంతెనకు ఇరువైపులా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. వంతెన మధ్యన కూడా నెర్రెలిచ్చి ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయపడుతున్నారు. ఇటీవల వంతెన ముందు భాగంలో గుంతలు ఏర్పడడంతో వాహనదారులు అటువైపునకు వెళ్లకుండా చుట్టూ రాళ్లు ఏర్పాటు చేశారు.

పట్టించుకోని అధికారులు..

ఎన్నో నెలలుగా వంతెనకు నెర్రెలిచ్చి, ముందు భాగాన కుంగినట్లు ఉన్నా.. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. భారీ వాహనాలు తిరుగుతున్న నేపథ్యంలో వంతెనకు పెద్ద ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులతో వెళుతున్న ఆటోలు, పొలాల పనులకు ట్రాక్టర్లపై వెళ్లే కూలీలు, పలు పనులకు వెళ్లే వాహనదారులు రోజూ ఇటువైపునే వెళుతుంటారు. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటుచేసి నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి..

రోజూ ఈమార్గం మీదుగా అనేక వాహనాలు వెళుతుంటాయి. వంతెన శిథిలావస్థకు చేరింది. పూర్తిగా దెబ్బతిని ప్రమాదం సంభవించకముందే అధికారులు స్పందించాలి. తగిన చర్యలు తీసుకోవాలి.

– చుక్కా అన్నలరాజు, ఆటో డ్రైవర్, శిరంగిపాలెం

నూతన వంతెన నిర్మించాలి..

భారీ వాహనాలు రాకపోకలతో వంతెన పై భాగం కుంగింది. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయపడాల్సి వస్తుంది. అధికారులు స్పందించి నూతన వంతెన నిర్మించాలి.

– చేవూరి రామమోహన్‌రెడ్డి, 113.తాళ్లూరు

భూమన కరుణాకరరెడ్డికి సత్కారం

కరుణాకరరెడ్డిని సత్కరిస్తున్న అంబటి రాంబాబు, బాల వజ్రబాబు

తాడికొండ: గుంటూరు మల్లిఖార్జునపేట 5వ లైన్‌లోని తాడికొండ నియోజకవర్గ కార్యాలయానికి మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మంగళవారం విచ్చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు(డైమండ్)లు ఆయనను శాలువాతో సత్కరించారు. అనంతరం పలు అంశాలపై ఆయనతో చర్చించారు. కార్యక్రమంలో పలు విభాగాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రైతు సంఘం మండల 3వ మహాసభ

రైతు సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

మంగళగిరి టౌన్: మంగళగిరి మండల పరిధి కాజా గ్రామంలో ప్రజా సంఘాల కార్యాలయంలో రైతు సంఘం మండల 3వ మహాసభను మంగళవారం నిర్వహించారు. సభకు సంఘ మండల కార్యదర్శి తమ్మ ప్రసాద్‌రెడ్డి కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టగా గండికోటబాబు వరప్రసాద్ అధ్యక్షత వహించారు. ముందుగా రైతు సంఘం నాయకులు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జొన్న శివశంకర్ మాట్లాడుతూ.. పాలకులు మారుతున్నా రైతుల సమస్యలు పరిష్కారం కావడంలేదన్నారు. ఎన్నికల సమయంలో, ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు మాత్రమే ప్రభుత్వానికి రైతులు గుర్తుకు వస్తారని విమర్శించారు. మద్దతు ధరలు లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆళ్ల సాంబిరెడ్డి, ములక శివసాంబిరెడ్డి, వల్లూరు భారతి, డి.వెంకటరెడ్డి, కోటేశ్వరి, ఈదా ప్రతాపరెడ్డి, దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఫిరంగిపురం: విద్యార్థులు సృజనాత్మక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని మానవత సంస్థ సెక్రటరీ కె.సతీష్ అన్నారు. మండలకేంద్రంలోని డాక్టర్ రంజన్‌బాబు కమ్యూనిటీ జూనియర్ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని మానవతా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి విద్యాశాఖమంత్రిగా పనిచేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆజాద్ చేసిన సేవలను గురించి సతీష్ వివరించారు. విద్యార్థులకు పలురకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కె.పావని, ఎం.రాధాకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ సుదర్శన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ జట్టుకు విద్యార్థుల ఎంపిక

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

మంగళగిరి టౌన్: నక్కపల్లిలో ఈనెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు చినకాకాని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెండం రామారావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 10వ తేదీన నందిగాం జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన హాకీ పోటీల్లో 19 మంది బాలబాలికలు పాల్గొన్నారని, అందులో తమ పాఠశాల విద్యార్థులు జి.జగన్‌మోహన్‌రెడ్డి, షేక్ ఉమీర, సీహెచ్ కీర్తిశ్వేత, డి.వర్షిలు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు జి.ప్రతాప్‌రెడ్డి, కాకుమాన సునీత, క్రీడాకారులను పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు అభినందించారు.

ప్రజా ఉద్యమ ర్యాలీని జయప్రదం చేయాలి

మాట్లాడుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి టౌన్: మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం జరగనున్న ప్రజా ఉద్యమ ర్యాలీని జయప్రదం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పిలుపునిచ్చారు. ఆత్మకూరు నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల కాలేజీల ప్రైవేటీకరణకు చంద్రబాబు సర్కార్‌పై వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం ర్యాలీని నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ర్యాలీ నియోజకవర్గ పార్టీ కార్యాలయం నుంచి ఉదయం 10 గంటలకు వాహనాలతో బయలుదేరి వడ్లపూడి సెంటర్, మిద్దె సెంటర్, పూల మార్కెట్ మీదుగా గాలిగోపురం వరకు చేరుకుంటుందని వివరించారు. అక్కడి నుంచి కాలినడకతో మంగళగిరి తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని తాహసీల్దార్‌కు వినతి పత్రం అందజేయనున్నామన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావులు హాజరుకానున్నారని.. కావున కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

బాలోత్సవం బ్రోచర్లు అందజేత

తాడేపల్లి రూరల్: బాలోత్సవం 3వ పిల్లల పండుగ బ్రోచర్‌ను ప్రతినిధులు మంగళవారం తాడేపల్లిలోని పలు పాఠశాలల్లో అందజేశారు. ఈ సందర్భంగా బాలోత్సవ ప్రతినిధులు మాట్లాడుతూ.. మంగళగిరి పట్టణ పరిధిలోని అరవింద మోడల్ స్కూల్‌లో ఈనెల 29, 30వ తేదీల్లో మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం 3వ పిల్లల పండుగను ఘనంగా నిర్వహించనున్నామన్నారు. మంగళగిరి పట్టణం, రూరల్ ప్రాంతాల్లోనూ బ్రోచర్లను పంపిణీ చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, బిట్ర రామారావు, తాడేపల్లి మెయిన్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు కేవీఆర్ మాస్టర్, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు భీమిరెడ్డి తాతిరెడ్డి, భాస్కర్, ఎస్ఏ బాజీసైదా, అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యాయత్నం

ఆత్మహత్యాయత్నానికి కృష్ణానది వద్ద కూర్చున్న యువకుడు

తాడేపల్లి రూరల్: తీసుకున్న అప్పు.. దానికి వడ్డీ చెల్లించలేక మనస్థాపం చెందిన ఓ యువకుడు కృష్ణానదిలోకి దూకి మంగళవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు సకాలంలో స్పందించి ఆ యువకుడిని కాపాడారు. సేకరించిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల గాంధీనగర్‌కు చెందిన ఓ యువకుడు విజయవాడ రూరల్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్నారు. కుటుంబ అవసరాల నిమిత్తం రూ.5 లక్షలు అప్పు చేశారు. అప్పు చేసిన డబ్బులకు వడ్డీ, అసలు కట్టలేకపోవడం.. అప్పు ఇచ్చిన వారు ఒత్తిడి తీసుకురావడంతో మనస్తాపం చెంది ప్రకాశం బ్యారేజ్ 14వ కానా వద్ద తన ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి నదిలో దూకాడు. సమీపంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులు పెద్దగా కేకలు వేయడంతో యువకుడు ప్రాణభయంతో పైకి లేచి గేటు మీద కూర్చుండిపోయాడు. వెంటనే విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం మెట్ల వద్ద ఉన్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి వచ్చి యువకుడిని బోటు సహాయంతో విజయవాడ తీసుకువెళ్లి వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి వారికి అప్పగించారు.

రాజధానిలో దసపల్లా-4 స్టార్ హోటల్‌కు శంకుస్థాపన

తాడికొండ: రాజధాని ప్రాంతమైన గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలోని శాఖమూరు గ్రామంలో నిర్మింప తలపెట్టిన దాసపల్లా-4 స్టార్ హోటల్‌ను మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్ ద్వారా ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్ సుమారు రూ.200 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్నారు. ప్రత్యక్షంగా 400 మందికి ఉద్యోగావకాశాలు కల్పించనుందని హోటల్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి అతిథులుగా తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ సీఈవో-ఏపీ టీడీసీ ఎండీ శ్రీమతి అమ్రపాలి, జాయింట్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, దసపల్లా గ్రూప్ హోటల్స్ చైర్మన్, ఎండీ మందవ రాఘవేంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

మోడీ పాలనలో దేశం విచ్ఛిన్నం

మంగళగిరి టౌన్: భారతదేశాన్ని మోడీ పాలన విచ్ఛిన్నం చేస్తోందని సీపీఐ జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. మంగళగిరి పట్టణ పరిధిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం పార్టీ నియోజకవర్గ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో పెరిగిపోతున్న మత వైషమ్యాలు, ఆర్థిక అసమానతలు, కుల ఆధారిత రాజకీయాలపై మండిపడ్డారు. బీసీలకు హామీ ఇచ్చిన రిజర్వేషన్లు, ఉద్యోగ అవకాశాలు, ప్రోత్సాహక చర్యలన్నీ మాటలకే పరిమితమయ్యాయని ఎద్దేవా చేశారు. ప్రత్యేక హోదా కోసం పోరాడతామన్న పవన్ కల్యాణ్ నేడు మోడీకి దండం పెడుతున్నారని విమర్శించారు. డిసెంబరు 26న ఖమ్మంలో జరిగే మహాసభలకు రాష్ట్ర వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు జాలాది జాన్‌బాబు, కోట మాల్యాద్రి, చిన్ని తిరుపతయ్య, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వైద్య విద్య దూరం

ఆత్మకూరులో సంతకాల సేకరిస్తున్న పార్టీ నాయకులు

తుళ్లూరు కార్యక్రమంలో పార్టీ నాయకులు

మంగళగిరి టౌన్: మంగళగిరి మండల పరిధి ఆత్మకూరు, చినకాకాని గ్రామాల్లో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆత్మకూరు, చినకాకాని గ్రామ అధ్యక్షులు కొల్లి శ్యామ్‌కుమార్ రెడ్డి, మల్లవరపు కాంతారావు ఆధ్వర్యంలో గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి సంతకాలు సేకరణ చేశారు. ప్రైవేటీకరణతో కలిగే నష్టాన్ని ప్రజలు, విద్యార్థులకు వివరించారు. చంద్రబాబు సర్కార్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు పార్టీ నాయకులు పులివర్తి రాంబాబు, శివ, విజయ్, తురక యేసుబాబు, జాలాది ప్రేమ్‌చంద్, సాంబశివరావు, కిషోర్‌రెడ్డి, బుజ్జిబాబు, వెంకటేష్, చినకాకాని పార్టీ నాయకులు రామకృష్ణారెడ్డి, రామనాగు, చిన్న, గోపి, గోపీకృష్ణ, నరేంద్ర, వెంకటేశ్వరరావు, రమేష్, కాటంరాజు, రామ్మోహనరావు, ప్రసాద్, చిన్నోడు, యువజన విభాగ రాష్ట్ర నాయకులు నూతక్కి జోష్ తదితరులు పాల్గొన్నారు.

తాడికొండ: చంద్రబాబు సర్కారు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ చేసేందుకు కుట్రలు పన్నుతోందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. తుళ్లూరులో పలువురు నాయకులు మంగళవారం ఇంటింటికీ వెళ్లి సంతకాలు సేకరించి మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. గ్రామపార్టీ అధ్యక్షుడు కంతేటి చిన వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు కొప్పుల శేషగిరిరావు, మండల ఉపాధ్యక్షుడు కొయ్యగూర వినోద్, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి నేలపాటి నాగేంద్ర, గ్రామ యువత అధ్యక్షుడు కంతేటి కిరణ్ దాస్, కంతేటి బ్రహ్మనాయుడు, నేలపాటి వినిత్ కుమార్, మేరిగ తిరుపతిరావు, కంతేటి బాలు, మేరగ మోజేస్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ లేక అష్టకష్టాలు

చిన్నారులకు వాక్సినేషన్, పౌష్టికాహారం నిల్

తమ పిల్లలతో నాని, లక్ష్మీ దంపతులు

మంగళగిరి టౌన్: కుటుంబ సభ్యులు లేని యువతి లక్ష్మీని చిన్నతనంలో తల్లిదండ్రులను కోల్పోయి గుంటూరు రైల్వేస్టేషన్‌లో పనిచేసుకునే బోయ నాని వివాహం చేసుకున్నారు. వివాహమైన ఏడాదికి లక్ష్మీ ఒక మగబిడ్డకు తిరుపతి ప్రభుత్వ ఆసుపత్రిలో జన్మనిచ్చింది. అయితే లక్ష్మీకి ఆధార్ కార్డు లేకపోవడంతో పుట్టిన బిడ్డకు జనన ధృవీకరణ పత్రం ఇచ్చేందుకు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు నిరాకరించారు. కొంతకాలం తరువాత లక్ష్మీ ఆడబిడ్డకు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో జన్మనిచ్చింది. ఈ క్రమంలో తల్లిదండ్రులిద్దరికీ ఆధార్ కార్డు ఉంటేనే జనన ధృవీకరణ పత్రం ఇస్తామని ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది తేల్చి చెప్పారు. కాగా యర్రబాలెంలో గ్రామ చిరునామాతో బోయ నాని ఆధార్ కార్డ్ కలిగి ఉన్నారు. భార్య, ఇద్దరు పిల్లలకు తన ఆధార్ కార్డు ఆధారంగా ఆధార్ కార్డులు మంజూరు చేయాలని నాని అధికారులను వేడుకుంటున్నారు. తన ఇద్దరు చిన్నారులకు ఆధార్ కార్డులు లేకపోవడంతో టీకాలు వేయడం లేదని.. అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి, బిడ్డలకు ఇచ్చే పౌష్టికాహారాన్ని కూడా పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నష్టపరిహారం మంజూరు చేయాలి

జనసేన పార్టీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మల్లవల్లి రైతులు

మంగళగిరి టౌన్: కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గ పరిధిలోని బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామ రైతులు భూములు నష్టపోయిన కారణంగా నష్టపరిహారం అందజేయాలని కోరుతూ మంగళగిరి నగర పరిధిలోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనవాణిలో వినతి పత్రం అందజేశారు. భూములు కోల్పోయి నష్టపరిహారం పొందని పలువురు రైతులు మాట్లాడుతూ.. మల్లవల్లిలోని రీ సర్వే నం.11లో 1,460 ఎకరాల ప్రభుత్వ భూమిని 2016లో నాటి టీడీపీ ప్రభుత్వం పారిశ్రామిక అవసరాల నిమిత్తం ఏపీఐఐసీకి కేటాయించిందని పేర్కొన్నారు. అప్పటికే ఆ భూమిని దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్నామని.. ఎకరాకు రూ.7.5 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తామని ఆనాటి ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ స్వయంగా మల్లవల్లి వచ్చి ఆందోళనకు మద్దతు తెలిపారని, తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే నిర్వాసితులకు న్యాయం చేస్తారని హామీ ఇచ్చారని వివరించారు. ఇప్పటికైనా భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని అభ్యర్థించారు.

విత్తనాలను లైసెన్సు దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి

తెనాలిటౌన్: ఈ-క్రాప్ నమోదుకు గడువు పూర్తికానున్నందున రైతుసోదరులు ఎవరైనా మిగిలిపోతే వెంటనే చేయించాలని సూచించారు. ఖరీఫ్ సీజనులో సాగుచేసిన వరిపైరు మరికొద్ది రోజుల్లో కోతకు రానున్న తరుణంలో రబీ పైర్ల సాగుకు సంబంధింది వ్యవసాయశాఖ మంగళవారం బుర్రిపాలెం, తెనాలి అయితానగర్‌లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. బుర్రిపాలెంలోని రైతుసేవా కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మండల వ్యవసాయ అధికారి కె.సుధీర్‌బాబు మాట్లాడుతూ రబీలో జొన్న, మొక్కజొన్న సాగుకు రైతుసోదరులు లైసెన్సు ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన దుకాణం నుంచి తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని చెప్పారు. తుఫాన్ వర్షాలకు పడిపోయిన వరిలో పాముపొడ, మెడవిరుపు కనిపిస్తోందని, వ్యవసాయశాఖ సిఫార్సు చేసిన మందులను పిచికారీ చేసి నివారించుకోవాలని సూచించారు. అదేవిధంగా ఎరువులను కూడా సిఫార్సు చేసిన మోతాదు ప్రకారమే వినియోగించాలని కోరారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయనుందని చెప్పారు. మద్దతు ధర క్వింటాలుకు గ్రేడ్–1కు రూ.2,389, సాధారణ రకం రూ.2,369గా గుర్తుచేశారు. ఏఈవో పి.మురళి, వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

క్లుప్తంగా...

సోషల్ మీడియా వేదికల ద్వారా ఉగ్రవాద కుట్ర

చార్జ్‌షీట్‌లో పేర్కొన్న ఎన్ఐఏ

సాక్షి, అమరావతి: విజయనగరం జిల్లాకు చెందిన సిరాజ్ ఉర్ రహమాన్, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ సమీర్ సోషల్ మీడియా వేదికల ద్వారా దేశంలో ఉగ్రవాద కార్యకలాపాల విస్తరణకు కుట్రపన్నారని ఎన్ఐఏ పేర్కొంది. ఉగ్రవాద కార్యకలాపాల కేసులో వీరిద్దరినీ పోలీసులు ఇటీవల అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఏపీ, తెలంగాణ పోలీసుల నుంచి ఈ కేసు దర్యాప్తును స్వీకరించిన ఎన్ఐఏ..సిరాజ్ ఉర్ రహమాన్, సయ్యద్ సమీర్‌లు ఉగ్రవాద సంస్థ ఐసీస్ భావజాలాన్ని వ్యాప్తి చేసి యువతను పెడదోవ పట్టించేందుకు యత్నించారని సాక్ష్యాధారాలను సేకరించింది. ఇన్‌స్ట్రాగామ్, సిగ్నల్ యాప్‌లలో అకౌంట్లు సృష్టించి జిహాదీ, ఉగ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేసేందుకు యత్నించినట్లు ఎన్ఐఏ గుర్తించింది. ఈ మేరకు వారిపై విశాఖలోని ఎన్ఐఏ కోర్టులో మంగళవారం చార్జ్‌షీట్‌ను సమర్పించింది. కేసు దర్యాప్తు కొనసాగుతోందని ఎన్ఐఏ తెలిపింది.

చిన్నప్పన్నను కస్టడీకి కోరుతూ సీబీఐ, సిట్ పిటిషన్లు

నెల్లూరు (లీగల్): కల్తీ నెయ్యి కేసులో అక్రమంగా అరెస్ట్ అయి నెల్లూరు కేంద్రకారాగారంలో రిమాండ్‌లో ఉన్న కదురు చిన్నప్పన్న కస్టడీ కోరుతూ మంగళవారం నెల్లూరు ఏసీబీ కోర్టులో సీబీఐ, సిట్ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. సిట్ తరఫున పీపీ జయశేఖర్, సీబీఐ తరఫున పీపీ కళ్యాణ్ చక్రవర్తి వాదనలు వినిపించారు. ఈ కేసులో చిన్నప్పన్న కీలక వ్యక్తి అని, టీటీడీ మాజీ చైర్మన్‌కు పర్సనల్ సెక్రటరీగా ఉన్నారని, అతన్ని వారం రోజుల పాటు విచారణకు అనుమతించాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఎన్.సరస్వతి తదుపరి విచారణను 14కు వాయిదా వేశారు.

సీఐఐ సదస్సులో ఉపాధి ఊసేది?: సీపీఎం

సాక్షి, అమరావతి: విశాఖపట్నంలో నిర్వహిస్తున్న సీఐఐ సదస్సులో ఉపాధి కల్పన ఊసేలేదని, కార్మిక సంక్షేమం, ప్రాంతీయ అభివృద్ధి, ఉపాధి గ్యారంటీని అజెండాలో చేర్చి ప్రత్యేక సెషన్ నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విజయవాడలో మంగళవారం శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా భాగస్వామ్య సదస్సుకు అర్థమేలేదని, పీ–4 ఒట్టి బూటకమన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)పై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేశారు. దీనిపై ఈనెల 16న విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో మోంథా తుపాను బాధిత రైతులకు కేంద్రం రూ.వెయ్యి కోట్ల సాయం అందించాలని డిమాండ్ చేశారు.

మోసం చంద్రబాబు నైజం: సీపీఐ

అనంతపురం అర్బన్/ సాక్షి, అమరావతి: 'మోసం చేయడం సీఎం చంద్రబాబు నైజం. ద్వంద్వ విధానాలతో పాలన సాగిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ భూములను బహూకరిస్తున్నారు. ఇచ్చిన హామీల అమలు డిమాండ్ చేస్తూ ప్రభుత్వంపై దండయాత్ర చేపడతాం.' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య ధ్వజమెత్తారు. మంగళవారం అనంతపురంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర సంపదను చంద్రబాబు కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టే పనిలో ఉన్నారని మండిపడ్డారు. ఓటర్ల జాబితా ప్రత్యేక ఎస్ఐఆర్‌ను రాష్ట్రంలో అమలుచేయకుండా నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

జీవ వైవిధ్యానికి 'కార్చిచ్చు'

చెట్ల నరికివేత కంటే దీంతోనే అడవులకు పెనుముప్పు

- ప్రపంచవ్యాప్తంగా 73 శాతం తగ్గిపోయిన వన్యప్రాణులు
- ప్రమాదం అంచున మరో 3,500 రకాల జాతులు
- మేల్కొనకపోతే ఆహార, పర్యాటక, ఆర్థిక రంగాలకు దెబ్బ
- వెల్లడించిన 'ఎ ప్లానెట్ ఆన్ ది బ్రింక్ '

సాక్షి, అమరావతి: అడవిలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. పర్యావరణంపై పంజా విసురుతున్నాయి. ఇప్పటివరకు చెట్ల నరికివేత, కాంక్రీట్ జంగిల్‌గా మార్చడమే పచ్చదనం తగ్గడానికి కారణంగా భావించాం. అయితే, ఎ ప్లానెట్ ఆన్ ది బ్రింక్ అనే సంస్థ ఆశ్చర్యకర విషయాలు వెల్లడించింది. పలు దేశాలలోని అడవుల్లో రేగుతున్న కార్చిచ్చు పర్యావరణానికి పెను సవాల్‌గా మారిందని పేర్కొంది. గ్లోబల్ ట్రీ కవర్ నష్టం 2023లో పోల్చితే ఏకంగా 370 శాతం పెరిగిందని వివరించింది. అడవుల్లో చెలరేగిన మంటల కారణంగా 3.1 గిగా టన్నుల కర్బన ఉద్గారాలు వెలువడినట్లు తెలిపింది. ఇది మానవ ప్రేరేపిత ఉద్గారాల్లో సుమారు 8 శాతమని, జీవ వైవిధ్యంపై తీవ్ర ప్రభావం చూపిందని వెల్లడించింది. రెండేళ్ల కిందటి పరిస్థితి ప్రస్తుతం కూడా కొనసాగుతోందని, మేల్కొనకపోతే పర్యావరణంతో పాటు మానవ మనుగడకు ముప్పు తప్పదని హెచ్చరించింది. ఎ ప్లానెట్ ఆన్ ది బ్రింక్ అధ్యయనం ప్రకారం...

- అమెరికాలోని కాలిఫోర్నియాలో జనవరిలో చెలరేగిన మంటల కారణంగా 57 వేల ఎకరాలకుపైగా దహనమయ్యాయి. 250 మిలియన్ డాలర్ల ఆర్థిక నష్టం వాటిల్లింది. మార్చిలో జపాన్‌లో చెలరేగిన కార్చిచ్చుతో 370 హెక్టార్లలో, దక్షిణ కొరియాలో 48 వేల హెక్టార్ల విస్తీర్ణంలో అడవులు దెబ్బతిన్నాయి. వాతావరణ మార్పుల కారణంగా చెలరేగిన మంటలు కెనడాలో 1.58 మిలియన్ హెక్టార్ల అటవీ ప్రాంతాన్ని బూడిద చేశాయి. ఇలాంటి సమయంలో భారీగా విడుదలయ్యే కర్బన ఉద్గారాలు భూతాపాన్ని పెంచుతాయి.
- కార్చిచ్చు ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతోంది. పొగ కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు అనారోగ్యం బారిన పడడంతో పాటు మరణాలు అధికమవుతున్నాయి.
- పలు దేశాల్లో అడవుల్లో ఏదో ఒకరకంగా విధ్వంసం జరుగుతోంది. అమెజాన్‌కు నెలవైన బ్రెజిల్‌లో మొక్కల పెంపకం, పక్కాగా పరిరక్షణ చర్యలు చేపట్టడంతో అడవుల్లో అలజడి తగ్గింది. కానీ, తీవ్రమైన కరువు కారణంగా ఈ ప్రాంతంలో కార్చిచ్చు గణనీయంగా పెరిగింది.

73 శాతం తగ్గిపోయిన వన్యప్రాణులు

ఐదు దశాబ్దాల్లో వన్యప్రాణుల సంఖ్య 73 శాతం పడిపోయింది. వాతావరణంలో వచ్చిన మార్పులు జీవ వైవిధ్యాన్ని అతలాకుతలం చేశాయి. అడవులు తగ్గిపోవడం భౌగోళిక ప్రాంతంతో పాటు వాటి పరిధిలోని జాతులను ప్రభావితం చేస్తోంది. వాతావరణ మార్పుల కారణంగా 3,500 కంటే ఎక్కువ వన్యప్రాణుల జాతుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. అనేక జాతులు ఇప్పటికే అంతరించిపోయే దశకు చేరుకున్నాయి.

వాతావరణ మార్పులతో ముప్పు

అతిపెద్ద అడవి అమెజాన్ ప్రాంతంలో వచ్చిన వాతావరణ మార్పులు మానవ మనుగడకు ముప్పుగా పరిణమించాయి. ఇలాంటి పరిస్థితుల్లో అడవులను కాపాడుకోవడంతో పాటు అగ్నికి ఆహుతైన ప్రాంతాల్లో భారీగా పచ్చదనం పెంపు చర్యలు చేపట్టాలి.

ఆర్థిక రంగంపైనా దెబ్బ

అడవుల క్షీణత వల్ల తలెత్తుతున్న పరిణామాలను అర్థం చేసుకుని ప్రభుత్వాలు తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలి. లేదంటే పర్యావరణం దెబ్బతినడంతో పాటు ఆర్థిక సంక్షోభం ఏర్పడుతుంది. వాతావరణ వ్యత్యాసాలు పెరిగి వ్యవసాయం, ఆహార భద్రత, వినోదం, పర్యాటక రంగాలపై ప్రభావం పడుతుంది. వ్యాధుల ముప్పు కూడా పొంచి ఉంది. వాతావరణ మార్పుల కారణంగా జంతువులకు వ్యాధులు సంక్రమించి, వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది.

పగడపు దీవులపై దాడి

పర్యావరణ మార్పులు ఆఖరికి సముద్రపు జీవుల మనుగడను కూడా ప్రశ్నార్థకం చేస్తున్నాయి. జీవ వైవిధ్యానికి ప్రతీకగా నిలిచే పగడపు దీవులు నాశనమవుతున్నాయి. సముద్రం వేడెక్కడం, మత్స్య సంపదను అతిగా వేటాడడంతో పాటు కాలుష్యం పగడపు దీవులకు శాపంగా పరిణమించింది.

ఆ తీర్పు ఇప్పటికీ అమలు చేయరా?

- పదోన్నతుల ప్రక్రియను మూడు నెలల్లో ముగించాలని చెప్పినా వినరా?
- స్వయంగా హాజరు కావాలని సీఎస్, సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శికి హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ డిసెంబర్ 15కి వాయిదా

సాక్షి, అమరావతి: అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగోన్నతులు కల్పించే విషయంలో 2018లో తాము తీర్పునిచ్చినా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు దానిని అమలు చేయకపోవడాన్ని హైకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియను మూడు నెలల్లో ముగించాల్సిందేనని గతంలో ఆదేశాలు ఇచ్చినా, ప్రభుత్వం దానిని అమలుచేయకపోవడాన్ని తప్పుపట్టింది. స్వయంగా తమ ముందు హాజరై వివరణ ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) విజయానంద్, సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.ఎం. నాయక్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 15కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ తూటా చంద్ర ధనశేఖర్ ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ధిక్కార పిటిషన్లు దాఖలు

ఉద్యోగోన్నతుల్లో అన్యాయం జరిగిందంటూ పలువురు ఉద్యోగులు ఉమ్మడి హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన అప్పటి హైకోర్టు ధర్మాసనం, ఉద్యోగోన్నతుల విషయంలో అన్ని వర్గాలకు తగిన ప్రాతినిధ్యం ఉందా?లేదా? అన్న విషయాన్ని కనీస స్థాయిలో కూడా పరిశీలించకుండానే రిజర్వేషన్లను అమలు చేశారంటూ ప్రభుత్వాన్ని తప్పుపట్టింది. అందరి వాదనలు విని ప్రతీ ఉద్యోగి పదోన్నతిని సమీక్షించాలని ఆదేశించింది. రిజర్వ్ కేటగిరి ఉద్యోగులు నిర్దేశిత పరిమితికి మించి ఉద్యోగోన్నతులు పొందనట్లయితే, రిజర్వేషన్ పరిధిలోకి రాని ఉద్యోగులకు పదోన్నతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి హైకోర్టు 2018లో తీర్పునిచ్చింది. అయితే ప్రభుత్వం ఈ తీర్పును అమలు చేయడం లేదంటూ ది సెక్రటేరియట్ బీసీ అండ్ ఓసీ ఎంప్లాయీస్ అసోసియేషన్, మరి కొందరు హైకోర్టులో వేర్వేరుగా కోర్టు ధిక్కార పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై ఇప్పటికే పలుమార్లు విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్‌రావు ధర్మాసనం తాజాగా మంగళవారం వాటిపై మరోసారి విచారణ జరిపింది.

మరింత సమయం పడుతుంది

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) సింగమనేని ప్రణతి వాదనలు వినిపించారు. ఇదే విషయంపై ఇటీవల తెలంగాణ హైకోర్టు కూడా తీర్పునిచ్చిందన్నారు. దానిని అధ్యయనం చేసి తగిన నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ఇందుకు కొంత సమయం పడుతుందని, అందువల్ల విచారణను వాయిదా వేయాలని కోరారు. అయితే ఈ అభ్యర్థనను ధర్మాసనం తోసిపుచ్చింది. 2018లో ఇచ్చిన ఆదేశాలను ఇప్పటికీ అమలు చేయకపోవడం ఏమిటంటూ అసహనం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిని ధర్మాసనం ఆదేశించింది.

నకిలీ మద్యం కేసులో బెయిల్ పిటిషన్లపై కౌంటర్‌కు ఆదేశం

విజయవాడలీగల్/ములకలచెరువు: నకిలీ మద్యం కేసులో ఏ–1 అద్దేపల్లి జనార్ధనరావు, ఏ–2 అద్దేపల్లి జగన్మోహనరావు, ఏ–4 నకిరికంటి రవి, ఏ–7 బాదల్ దాస్, ఏ–8 ప్రదీప్ దాస్, ఏ–11 శ్రీనివాస రెడ్డి, ఏ–12 అంగలూరు కళ్యాణ్, ఏ–13 తిరుమల శెట్టి శ్రీనివాసరావు, ఏ–17 చెక్కా సతీష్‌కుమార్‌ల బెయిల్ పిటిషన్లపై డిఫెన్స్ న్యాయవాదులు కౌంటర్ దాఖలు చేయాలని 6వ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు ఆదేశిస్తూ ఈనెల 13కి వాయిదా వేశారు.

కస్టడీకి అనుమతి

నకిలీ మద్యం కేసులో ఏ–17గా ఉన్న చెక్కా సతీష్‌కుమార్‌ను విచారించేందుకు కస్టడీ కోరుతూ ఎక్సైజ్ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి ఐదు రోజులపాటు కస్టడీకి అనుమతిస్తూ మంగళవారం ఆదేశాలు జారీచేశారు. ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు ఎక్సైజ్ పోలీసులు కస్టడీకి తీసుకోనున్నారు. ఇదే కేసులో అద్దేపల్లి జనార్ధనరావు, అద్దేపల్లి జగన్మోహనరావులను మరోసారి కస్టడీ కోరుతూ ఎక్సైజ్ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం నెల్లూరు జైలులో జనార్ధనరావు, విజయవాడ జైలులో జగన్మోహన్‌రావు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. దీనిపై డిఫెన్స్ న్యాయవాదులు కౌంటర్ దాఖలు చేయడంతో విచారణను న్యాయమూర్తి ఈనెల 17కి వాయిదా వేశారు. ఈ కేసులో ఏ–18 జోగి రమేష్, ఏ–19 జోగి రాములను కస్టడీ కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై డిఫెన్స్ న్యాయవాదులు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను ఈనెల 13కి న్యాయమూర్తి వాయిదా వేశారు. అలాగే నకిలీ మద్యం కేసులో రిమాండ్‌లో ఉన్న జోగి రమేష్ జైలులో ములాఖత్ కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై ఇరు పక్షాల వాదనలు మంగళవారం ముగియడంతో న్యాయమూర్తి తీర్పును ఈనెల 13కి న్యాయమూర్తి వాయిదా వేశారు.

నిడుగుంట అరుణ కస్టడీ పిటిషన్ వాయిదా

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురి నుంచి డబ్బులు వసూలుచేసి మోసం చేసిన కేసులో నెల్లూరు జైలులో రిమాండ్‌లో ఉన్న నిడిగుంట అరుణను(నిబంధనలకు విరుద్ధంగా పెరోల్ పొందిన జీవితఖైదు శ్రీకాంత్ సన్నిహితురాలు) పోలీసు కస్టడీ విచారణకు కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణను న్యాయమూర్తి 12వ తేదీకి వాయిదా వేశారు.

ముగిసిన పోలీసు కస్టడీ

నకిలీ మద్యం కేసులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న బాదల్‌దాస్, ప్రదీప్‌దాస్, శ్రీనివాసరెడ్డి, అంగలూరు కళ్యాణ్, నకిరికంటి రవి, రమేష్‌బాబు, అల్లాభక్షుల ఐదు రోజుల పోలీసు కస్టడీ మంగళవారం ముగియడంతో ఎక్సైజ్ పోలీసులు న్యాయస్థానంలో హాజరుపరిచారు. అనంతరం వారిని జైళ్లకు తరలించారు.

నకిలీ మద్యం కేసులో నిందితుల పీటీ వారెంట్‌కు కోర్టు అనుమతి

రాష్ట్రంలో సంచలనం రేపిన అన్నమయ్య జిల్లా ములకలచెరువు నకిలీ మద్యం కేసులో అరెస్టయిన నలుగురు నిందితులపై పీటీ వారెంట్‌కు మంగళవారం కోర్టు అనుమతించింది. ములకలచెరువు కేసులో ఏ2 కట్టారాజు, ఏ3 సయ్యద్ హాజీ, ఏ10 మిథున్‌దాస్, ఏ11 అంతాదాస్ మదనపల్లి సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్నారు. విజయవాడ ఇబ్రహీంపట్నంలో నమోదైన నకిలీ మద్యం కేసులోనూ వీరు నిందితులుగా ఉండడంతో విజయవాడ భవానీపురం పోలీసులు వీరిని తీసుకెళ్లేందుకు పీటీ వారెంట్ దాఖలు చేశారు. వాదనల అనంతరం తంబళ్లపల్లె జడ్జి వారికి రెండు రోజుల పాటు కస్టడీకి అప్పగించినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

ఇప్పటికి 21 మంది అరెస్టు

ములకలచెరువు నకిలీ మద్యం కేసులో 25 మందిని నిందితులుగా చేర్చి 21 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక టీడీపీ నేతలు దాసరపల్లి జయచంద్రారెడ్డి, మంత్రి గిరిధర్‌రెడ్డి, పీఏ రాజేష్, అన్బురసులను అరెస్టు చేయాల్సి ఉంది.

బీసీ జనగణన, వర్గీకరణ చేపట్టేలా

సర్కారును ఆదేశించండి

- వీటిని పూర్తిచేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లడం రాజ్యాంగ విరుద్ధం
- ముందుకెళ్లకుండా ఏపీ ప్రభుత్వాన్ని నియంత్రించండి
- హైకోర్టులో ఏపీ బీసీ సంక్షేమ సంఘం పిల్
- నేడు విచారణ జరపనున్న సీజే ధర్మాసనం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బీసీ జనగణన, బీసీ వర్గీకరణ చేపట్టకుండానే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతోందని, దీనిని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. వెంటనే బీసీ జనగణన చేపట్టేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. బీసీ జనగణన చేపట్టకుండా ఎలాంటి ఎన్నికలు నిర్వహించరాదని, ఆ దిశగా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోర్టును కోరారు. ఈ వ్యాజ్యంపై బుధవారం ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరపనుంది. రాజ్యాంగంలోని అధికరణలు 243డీ, 243టీ ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు వారి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తున్నారని, అయితే బీసీల విషయంలో జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు ఇవ్వడం లేదని, ఇది రాజ్యాంగ విరుద్ధమని కేశన శంకరరావు తన పిటిషన్‌లో పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లపై ఎలాంటి నిషేధం లేదని వివరించారు. 1986లో బీసీ జనగణన జరిగిందని, అప్పటి నుంచి ఇప్పటి వరకు మళ్లీ జరగలేదని తెలిపారు. అప్పటి గణాంకాల ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తున్నారని, ఇది అన్యాయమని వెల్లడించారు.

ఏదో ఒక సాకు చెబుతూ జనగణన చేపట్టడం లేదు..

రాష్ట్ర విభజన తరువాత కూడా బీసీ జనగణన చేపట్టలేదని శంకరరావు వివరించారు. జనగణన చేపట్టాలని హైకోర్టు గతంలోనే ఆదేశించినా ప్రభుత్వం ఏదో ఒక సాకు చెబుతోందన్నారు. తమిళనాడు, కర్ణాటక స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ కూడా రానున్న ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను అమలు చేస్తామని చెప్పిందన్నారు. ఏపీ మాత్రం ఈ విషయంలో ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. 2026లో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బీసీ జనగణన, వర్గీకరణ చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా సర్కారును ఆదేశించాలని హైకోర్టును అభ్యర్థించారు.

వరి పండిస్తే క్యాన్సర్ తప్పదు

వరి పండించిన పంజాబ్ క్యాన్సర్ బారిన పడింది

- రోజు రెండు బస్సుల్లో పంజాబ్ రైతులు ఢిల్లీకి క్యాన్సర్ పేషెంట్లుగా వెళ్తున్నారు
- టెక్నాలజీని నేనే తీసుకొచ్చా
- ఇంజినీరింగ్ కాలేజీలను కూడా నేనే తెచ్చా
- ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తెస్తున్నా
- ఎంఎస్ఎంఈ పార్కు శంకుస్థాపనలో సీఎం చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు/ అమరావతి: వరి పండిస్తే క్యాన్సర్ తప్పదని, వరి పండించటం వల్లే పంజాబ్ రైతులకు క్యాన్సర్ సోకిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గంలోని పీసీపల్లి మండలం గుంటూరు లింగన్నపాలెంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కు శంకుస్థాపనకు చంద్రబాబు హాజరయ్యారు. ఇక్కడ శిలాఫలకాన్ని ఆవిష్కరించి, కర్నూలు, అచ్యుతాపురం, గుంటూరు జిల్లా శాఖమూరులో దసపల్లా స్టార్ హోటల్ సహా రాష్ట్రవ్యాప్తంగా 49 ఎంఎస్ఎంఈ పార్కులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు చేశారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. పంజాబ్ రాష్ట్రంలో ఎక్కువమంది రైతులు క్యాన్సర్‌తో బాధపడుతున్నారన్నారు. ప్రతిరోజు పంజాబ్ నుంచి రెండు బస్సుల్లో ఢిల్లీలోని క్యాన్సర్ ఆస్పత్రులకు వెళుతున్నారని చెప్పారు. పురుగు మందులు, రసాయన ఎరువులు వాడటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని చెప్పారు.

కాకి లెక్కలతో గొప్పలు

సీఎం చంద్రబాబు ప్రసంగం కాకి లెక్కలతో ప్రజలను మభ్యపెట్టేలా సాగింది. ఎంఎస్ఎంఈలకు సంబంధించిన లెక్కలు చెబుతూ తడబడ్డారు. నిధులు అని చెప్పబోయి సంస్థలు అని చెప్పారు. 50 ఎంఎస్ఎంఈ పార్కులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు చేస్తున్నామని చెప్పి.. 87 ప్రాంతాల నుంచి ఆన్‌లైన్‌లో ఉన్నారన్నారు. ఇప్పటివరకూ రాష్ట్రంలో 75 ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపనలు చేశామని చెప్పుకొచ్చారు. ఏపీఐఐసీలో ఇప్పటివరకు 25 ఇంజినీరింగ్ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ఆ వెంటనే 1,595 ఎంఎస్ఎంఈలకు శంకుస్థాపనలు చేశామని చెప్పారు. మళ్లీ ఈ వారంలో 99 కంపెనీలకు శంకుస్థాపన చేశామన్నారు. చంద్రబాబు చెప్పిన ఈ లెక్కలకు ఒక దానితో ఒకటి పొంతన లేకపోవడంతో జనాలకు అర్థంకాక ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. రూ.లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షల్లో ఉద్యోగాలు, ఉపాధి అని అంకెల గారడీ చేశారు. రానున్న 10 సంవత్సరాల్లో గతంలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన దానికంటే రెట్టింపు అభివృద్ధి, సంక్షేమం చేస్తానని గొప్పలు పోయారు.

సెల్‌ఫోన్ గురించి మాట్లాడితే.. నన్ను 420 అన్నారు

30 ఏళ్ల క్రితం హైదరాబాద్‌కు టెక్నాలజీని తానే తెచ్చానని, దీనివల్లే హైదరాబాద్‌కు దేశంలోనే అత్యధికంగా తలసరి ఆదాయం వస్తోందని సీఎం చంద్రబాబు చెప్పారు. అప్పట్లో సెల్‌ఫోన్ గురించి మాట్లాడితే తనను కొందరు 420 అన్నారని.. ఆ తరువాత అసలు విషయం తెలుసుకున్నారని చెప్పుకొచ్చారు. ఇంజినీరింగ్ కాలేజీలను తానే తెచ్చానని, ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ని కూడా తానే తీసుకొస్తున్నానని, భవిష్యత్ మొత్తం టెక్నాలజీదేనని గొప్పలు వల్లెవేశారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నాకే అర్థం కావట్లేదు

తనకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అర్థం కావట్లేదని సీఎం చంద్రబాబు అన్నారు. మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం రాత్రి మైనార్టీ సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించిన చంద్రబాబు మాట్లాడుతూ.. 'సుపరిపాలన తెస్తానని చెప్పినట్టుగానే ఏ పని కావాలన్నా సెల్‌ఫోన్‌లో అయిపోయేలా చేశా. ఏఐ పెడుతున్నాం. మీ ఇంటి పక్కనే ఉండే ఎమ్మార్వో ఆఫీసులో పని కూడా ఇంట్లో ఉంటే అయిపోయేలా టెక్నాలజీని ప్రమోట్ చేస్తున్నా. అన్ని విషయాల్లో ఐవీఆర్ఎస్ ద్వారా మిమ్మల్నే అడుగుతున్నా. ఇంటికి వచ్చే గ్యాస్ ఇచ్చి బాయ్ ప్రవర్తన బాగుందా? లేదా? బాయ్ డబ్బులు అడుగుతున్నాడా అని కూడా అడుగుతున్నా. ఏ చిన్న పని అయినా ప్రజలను అడిగి మీరు శభాష్ అన్నాకే అది చేస్తున్నా. లేదంటే పక్కన పెడుతున్నా' అని చంద్రబాబు చెప్పారు.

హైదరాబాద్ బిర్యానీని ప్రపంచానికి పరిచయం చేసింది నేనే..

'బిర్యానీ అంటే హైదరాబాద్ బిర్యానీ అనేలా నేనే ప్రమోట్ చేశా. ప్రపంచానికి పరిచయం చేశా. దూరదృష్టితోనే హైదరాబాద్ ఓల్డ్ సిటీ పక్కన విమానాశ్రయం కట్టాను. అవుటర్ రింగ్ రోడ్డుతో అక్కడి లక్షాధికారులు కోటీశ్వరులు అయ్యారు. తొమ్మిదేళ్లపాటు ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఇటుక ఇటుక పేర్చి హైదరాబాద్ అభివృద్ధికి కష్టపడ్డా. అవుటర్ రింగ్‌రోడ్డు, ఫార్మా, హైటెక్ ఐటీ ఇలా హైదరాబాద్‌లో అన్నీ నేనే చేశా. హైదరాబాద్‌లో ఐటీతో ప్రారంభించా. ఏపీలో గూగుల్‌తో ప్రారంభించా. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ 18 నెలల పాలనలో పెట్టుబడుల వరద వస్తోంది. ఇప్పటికే రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయి. విశాఖ సీఐఐ సదస్సులో మరో రూ.9 లక్షల కోట్ల నుంచి రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులు వస్తాయి' అని చంద్రబాబు చెప్పుకొచ్చారు. మౌలానా అబుల్ కలామ్ ఆజాద్, అబ్దుల్ హక్ అవార్డులతోపాటు ఉర్దూ భాషాభివృద్ధికి పాటుపడుతున్న సాహితీవేత్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మొత్తం 139 మందికి అవార్డులు అందించారు.

కల్తీ నెయ్యికి తావే లేదు

సీబీఐ నేతృత్వంలోని సిట్ విచారణలో టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డి

తిరుపతి క్రైమ్: టీటీడీ నెయ్యి వ్యవహారంలో సీబీఐ నేతృత్వంలోని సిట్ అధికారులు టీటీడీ మాజీ ఈవో ఏవీ ధర్మారెడ్డిని మంగళవారం విచారణ చేశారు. తిరుపతి అలిపిరి సమీపంలోని భూదేవి కాంప్లెక్స్‌లోని సీబీఐ కార్యాలయంలో జరిగిన విచారణకు మంగళవారం ఉదయం 10:58 గంటలకు ధర్మారెడ్డి హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటలకు భోజన విరామం ఇచ్చారు. భోజన విరామ సమయంలో మీడియా సిబ్బంది మాట్లాడండి.. అని కోరగా ధర్మారెడ్డి మీడియా ముందుకు వచ్చి ఫొటోలు వీడియోలు తీసుకోమని చెప్పారు. ఇదే సమయంలో జనసేన పార్టీ బహిష్కృత నేత కిరణ్ రాయల్ సిట్ కార్యాలయం వద్ద ఓవర్ యాక్షన్ చేశారు. ఎవరో తెచ్చిన లడ్డూలను తానే తిరుమల నుంచి తెచ్చా.. ధర్మారెడ్డికి ఇస్తా అంటూ హల్‌చల్ చేశారు. పబ్లిసిటీ స్టంట్ కోసమే కిరణ్ రాయల్ అక్కడకు వచ్చినట్లు తెలుస్తోంది. అనంతరం ధర్మారెడ్డి భోజనానికి వెళ్లి.. 3.10 గంటలకు తిరిగి విచారణకు హాజరయ్యారు. రాత్రి 9.15 గంటల వరకు విచారణ కొనసాగింది.

ప్రశ్నలకు సూటిగా సమాధానాలు

ఏవీ ధర్మారెడ్డిని సీబీఐ డీఐజీ మురళి రంభ, ఏఎస్పీ వెంకట్రావు విచారించారు. ధర్మారెడ్డి వాంగ్మూలాన్ని నమోదుచేసుకున్నారు. టెండర్ల ప్రక్రియలపై అనేక ప్రశ్నలు వేసినట్లు సమాచారం. సీబీఐ అడిగిన ప్రతి ప్రశ్నకూ ధర్మారెడ్డి స్పష్టంగా, సూటిగా సమాధానం ఇచ్చారని తెలిసింది. టీటీడీలో ల్యాబ్ లేని కారణంగా నాణ్యతను ఎలా గుర్తిస్తారు? నాణ్యత పరిశీలనకు నెయ్యి శాంపిళ్లను ఏ ల్యాబ్‌కు పంపించి టెస్ట్ చేయించారు? ల్యాబ్ రిపోర్ట్ ఆధారంగా నాణ్యత లేని నెయ్యి సరఫరాకు టెండర్ ఎలా ఖరారు చేశారు? మీ ప్రమేయం లేకుండా, మీకు తెలియకుండా కల్తీ నెయ్యి వ్యవహారం జరిగిందంటే ఎంతవరకు నమ్మదగింది? నాసిరకం నెయ్యిని సరఫరా చేసిన డెయిరీ యాజమాన్యంతో ఎందుకు మాట్లాడుతూ వచ్చారు? భోలే బాబా, వైష్ణవి, ఏఆర్ డెయిరీల సామర్థ్యంపై విచారణ జరిపారా..? '' అంటూ అధికారులు ప్రశ్నించినట్టు తెలుస్తోంది. వీటన్నింటికీ ధర్మారెడ్డి సూటిగా సమాధానాలు ఇచ్చారని సమాచారం. ఎలాంటి తప్పూ చేయలేదని, నిబంధనల ప్రకారమే అన్ని టెండర్లూ ఖరారు చేశామని చెప్పినట్లు తెలిసింది. కల్తీ జరిగినా మీరు ఎందుకు చర్యలు తీసుకోలేదన్న ప్రశ్నకు.. అసలు కల్తీ జరగకుండానే యాక్షన్ ఎలా తీసుకుంటామని ఎదురు ప్రశ్నించినట్టు సమాచారం. భక్తుల అభిప్రాయ సేకరణ ఎందుకు చేపట్టలేదని, కల్తీ నెయ్యి వ్యవహారంలో మీ, వైవీ సుబ్బారెడ్డి పాత్ర ఏంటి..? అనే ప్రశ్నకు నెయ్యి కల్తీ జరగనప్పుడు తమ పాత్ర ఏమి ఉంటుందని ధర్మారెడ్డి స్పష్టం చేసినట్లు తెలిసింది. అధికారిగా నిర్ణయం తీసుకున్నారా.. పాలకమండలి నిర్ణయం మేరకు సంతకం చేశారా? అని సీబీఐ అధికారులు ప్రశ్నిస్తే.. చట్టబద్ధంగా చేసిన రికార్డులు ఉంటాయని, వాటిని చూస్తే మీకే అర్థం అవుతుందని ధర్మారెడ్డి చెప్పారని సమాచారం. ఈవోగా ఉన్న మీరు బాధ్యతారాహిత్యంగా ఎందుకు వ్యవహరించారు? అన్న ప్రశ్నకు స్వామి వైభవాన్ని పెంచేలా కృషిచేశామే తప్ప.. ఎక్కడా బాధ్యతారాహిత్యంగా నడచుకోలేదని ధర్మారెడ్డి స్పష్టం చేసినట్టు సమాచారం.

“కోపాన్ని అదుపులో పెట్టుకోవడం, కోపం రాకుండా చూసుకోవడం బ్రహ్మవిద్య కాదు. మనకు కోపం తెప్పించిన సంఘటన గురించి అవతల వ్యక్తి కోణంలో కూడా ఆలోచించడం అలవాటు చేసుకోవాలి. తరచుగా కోపం తెప్పించే విషయాలను నోట్ చేసుకొని విశ్లేషించుకోవాలి. ఆ విశ్లేషణలోనే ‘కోప నివారణ’కు పరిష్కార మార్గాలు కనిపిస్తాయి.”

అధ్యయనం

సోషల్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా స్త్రీల ఇష్టాయిష్టాల వ్యక్తీకరణకు చోటు దొరికిందని భావిస్తున్నంతలోనే కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. ట్రోలింగ్ చేసే ధోరణికి బదులు డీప్‌ఫేక్స్, న్యూడిటీ యాప్స్ ద్వారా స్త్రీలను భయభ్రాంతం చేయడం దేశంలో పెరిగిందని న్యూఢిల్లీకి చెందిన ‘బ్రేక్‌త్రూ ఇండియా’ అనే ఎన్.జి.ఓ. తన అధ్యయనం ద్వారా తెలిపింది. స్త్రీలను వంటగదికే పరిమితం చేసినట్టుగా సోషల్ మీడియాకు బయటే వారిని ఉంచే ప్రయత్నం జరుగుతున్నది. వివరాలు

డీప్‌ఫేక్ ఇప్పటి విలన్

పురుష అహంకారం చాటుకోవడానికి మగవారికి స్త్రీలను అణిచే పద్ధతులు కావాలి. స్త్రీలు ముందుకు అడుగు వేసినా, ఆత్మవిశ్వాసం ప్రదర్శించినా, గట్టి రాజకీయ అభిప్రాయాలు వ్యక్తపరిచినా, ఫ్యాషనబుల్‌గా ఉన్నా, ఆనవాయితీలను ఉల్లంఘించినా వారిని ‘అదుపు’ చేసి అహాన్ని సంతృప్తి పరుచుకోవాలనుకుంటారు పురుషులు. ఈ పని ఇళ్లల్లో, సంఘంలో ఒక విధంగా జరిగితే సోషల్ మీడియాలో మరో విధంగా జరుగుతోంది.

సోషల్ మీడియాలో వివిధ ఆసక్తులతో గుర్తింపు పొందుతున్న స్త్రీలను బెదరగొట్టే ట్రోలింగులు గతంలో చూస్తే ఇప్పుడు ‘డీప్‌ఫేక్’లతో వారి మీద అంకుశం విసరాలని చూస్తున్నారు కొందరు. అంతే కాదు, డీప్‌ఫేక్ ఉపయోగిస్తూ ఆడవాళ్ల చిత్రాలను అసభ్యంగా రూపొందించి అవి చూపించి బెదిరించడం, డబ్బు వసూలు చేయడం, తాము చెప్పిన పనులకు ఉపయోగించడం చేస్తున్నారు. సామాన్య మహిళల నుంచి సెలబ్రిటీల వరకూ ఈ డీప్‌ఫేక్ బారిన పడి ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల నటి అనుపమ పరమేశ్వరన్ తన డీప్‌ఫేక్ చిత్రాలను చూసి హతాశురాలై పోలీస్ కంప్లయింట్ ఇచ్చింది.

సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఫొటోలతో..

భారతదేశం ఏఐ వినియోగ మార్కెట్‌లో ప్రపంచంలో రెండోస్థానంలో ఉంది. ఏఐలో వస్తున్న అప్‌డేట్లను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుని మన దేశంలో అనేకరంగాలు అద్భుతాలు సృష్టిస్తున్నాయి. ఇదే సమయంలో నేరగాళ్లు ఏఐని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. స్త్రీలు సోషల్‌మీడియాలో పోస్ట్ చేసిన ఫొటోలను తీసుకుని, ఏఐ ద్వారా తమకు నచ్చిన రీతిలో మార్చుకుంటున్నారు. అసభ్యంగా, నగ్నంగా తయారు చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారు. అవి నిజమైన చిత్రాలలాగే ఉండటంతో బాధితులు కంగారు పడుతున్నారు. అవి బయటకు వస్తే తమ పరువు పోతుందని బాధపడుతూ మానసిక వేదనకు గురవుతున్నారు. అనేక కుటుంబాల్లో ఇది తీవ్రమైన సమస్యగా పరిణమిస్తోంది.

సోషల్ మీడియాలో పెట్టిన నిమిషాల్లోనే..

సెలబ్రిటీల చిత్రాలతోపాటు సామాన్యుల సోషల్ మీడియా అకౌంట్లపైనా మాయగాళ్లు నిరంతరం కన్నేసి ఉంచుతున్నారు. ఎవరైనా కొత్తగా చిత్రాలు పోస్ట్ చేస్తే నిమిషాల్లోనే వాటిని సేవ్ చేసుకుంటున్నారు. అనంతరం ఏఐ సాయంతో తమకు నచ్చినట్టుగా మార్చుకుంటున్నారు. ఇటీవల పోలీసుల వద్ద నమోదవుతున్న కేసుల్లో డీప్‌ఫేక్ కేసులు పెరుగుతున్నాయని ‘బ్రేక్‌త్రూ ఇండియా’ అధ్యయనంలో తేలింది. ఢిల్లీకి చెందిన ఈ ఎన్.జి.ఓ. సోషల్ మీడియాలో స్త్రీలు ఎదుర్కొంటున్న సవాళ్లపై ఇటీవల అధ్యయనం చేసింది. ‘డబ్బుకోసమే కాకుండా మహిళల పట్ల కక్ష పెంచుకున్న కొందరు కావాలని ఆ మహిళల డీప్‌ఫేక్ అశ్లీల ఫొటోలు వారి కుటుంబసభ్యులకు పంపుతూ రాక్షసానందం పొందుతున్నారు. ప్రేమలో ఫెయిలైన అబ్బాయిలు తమ మాజీ ప్రియురాళ్ల చిత్రాలను ఇలా తయారు చేసి వాళ్లను బెదిరిస్తున్నారు. కొన్ని లోన్‌యాప్స్ తమ వద్ద లోన్ తీసుకున్నవారి చిత్రాలను మార్ఫింగ్ చేసి, వారి కుటుంబసభ్యులకు పంపిన ఉదంతాలు జరిగాయి’ ఆ అధ్యయనంలో తెలిసింది.

కట్టడి చేయడమెలా?

సోషల్ మీడియా వాడకం సర్వసాధారణంగా మారిన నేపథ్యంలో డీప్‌ఫేక్ నేరాలను అడ్డుకోవడం కత్తిమీద సాముగా మారింది. ప్రొఫైల్ లాక్ వంటివి కొంత ఉపకరిస్తున్నా, పూర్తిస్థాయిలో అవీ రక్షణ కల్పించలేకపోతున్నాయని బాధితులు అంటున్నారు. ఈ నేరాలకు భయపడి సోషల్ మీడియాకు పూర్తి దూరంగా ఉంటున్నామని అంటున్నారు. అయితే డీప్‌ఫేక్‌లు వచ్చినప్పుడు బయటకు వచ్చి ధైర్యంగా ఆ విషయం తెలపాలని నిపుణులు అంటున్నారు. అలాగే సోషల్ మీడియా పరిచయంతో ఇతరులకు ఫొటోలు, వీడియోలు పంపడం మానుకోవాలని సూచిస్తున్నారు. మరీ అభ్యంతరకరంగా తోచేవి, పూర్తి వ్యక్తిగతమైన చిత్రాలను పోస్ట్ చేయకపోవడం మంచిదంటున్నారు. ఎవరైనా డీప్‌ఫేక్ ఫొటోలు చూపించి బెదిరిస్తే భయపడక వెంటనే పోలీసులను సంప్రదించాలని అంటున్నారు.

డీప్‌ఫేక్‌ని గుర్తించే ప్రత్యేక చట్టాలేవీ?

డీప్‌ఫేక్ రాజకీయ రంగాన్ని కూడా ప్రభావితం చేస్తోంది. రాజకీయ నేతల చిత్రాలను మార్ఫింగ్ చేసి, అసభ్యకరంగా మార్చి, వారి గౌరవాన్ని దెబ్బతీస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్, ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వ శాఖ అన్ని సోషల్ మీడియా సంస్థలకు డీప్‌ఫేక్ చిత్రాలు, వీడియోలను తక్షణం తొలగించాలని తెలిపాయి. అయినా ఆగడాలు ఆగడం లేదు. ఈ డీప్‌ఫేక్ మోసాలతో మహిళలతోపాటు పురుషులూ మానసికంగా ఆందోళన చెందుతూ ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ తరహా నేరాల తీవ్రత పెరుగుతున్నా డీప్‌ఫేక్‌ని నేరంగా గుర్తించే ప్రత్యేక చట్టం మన దేశంలో లేదు. ప్రస్తుతానికి ఈ తరహా నేరాలను మహిళలపై వేధింపులు, సైబర్ నేరాల పరిధిలోనే పోలీసులు నమోదు చేస్తున్నారు.

చైల్డ్ ప్రాడిజీ



కిడ్స్

మనీష్కా సమర్పించు... టింకర్ టెక్కీ

మనీష్కా దూబే

మనీష్కా దూబే వయసు పన్నెండు సంవత్సరాలు. పదకొండు సంవత్సరాల వయసులో ‘టింకర్ టెక్కీ’ స్టార్టప్‌ను ప్రారంభించింది. స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం)పై ఆమె ఆసక్తి ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన అవార్డ్‌లను తెచ్చిపెట్టింది. ‘కలర్స్ ఇన్ఫినిటీ’ టీవీలో ‘ది ఇన్వెంటర్’ చాలెంజ్‌ను గెలుచుకుంది. చైల్డ్ సేఫ్టీ బ్యాండ్ తయారు చేసిన దూబే సైప్రస్‌లో జరిగిన పోటీలో బంగారు పతకాన్ని గెలుచుకుంది.

దృష్టి లోపం ఉన్న పిల్లల కోసం రూపొందించిన స్మార్ట్ సెల్ఫ్–ట్యూటర్ పరికరానికి ‘నేషనల్ రీసెర్చ్ కౌన్సిల్ ఆఫ్ థాయిలాండ్’ నుంచి బంగారు పతకం గెల్చుకుంది.

టెక్నాలజీలో దూబే వినూత్న ఆవిష్కరణలు ‘ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్’లో గుర్తింపు పొందడమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది పిల్లలకు ఆమె రోల్‌మోడల్ అయింది.

బాలికలకు నాణ్యమైన ‘స్టెమ్’ విద్యను అందించాలనే లక్ష్యంతో ‘టింకర్ టెక్కీ’ని ప్రారంభించింది.

‘పిల్లలు, ముఖ్యంగా బాలికలు సాంకేతిక, సాంకేతికేతర నైపుణ్యాలను నేర్చుకోగల వేదికగా టింకర్ టెక్కీని తీర్చిదిద్దాలనుకుంటున్నాను’ అంటుంది మనీష్కా దూబే.

ఆస్ట్రోనాట్ కావాలనేది ఆమె కల.

‘నేను ఇతర దేశాలలో భారత జెండాను ఎగుర వేసినట్లే, ఇతర గ్రహాలలో కూడా మరింత ఎత్తుగా మన జెండాను ఎగరేయాలనుకుంటున్నాను. అంతరిక్షంలో అన్వేషించడానికి ఎంతో ఉంది’ అంటుంది మనీష్కా దూబే.

గూగుల్ బాయ్ ఆఫ్ చత్తీస్‌గఢ్

అర్మాన్ ఉబ్రానీ

‘గూగుల్ బాయ్ ఆఫ్ చత్తీస్‌గఢ్’గా పేరు తెచ్చుకున్న అర్మాన్ ఉబ్రానీ వంద సంక్లిష్టమైన పజిల్స్‌ను 13 నిమిషాల లోపు పరిష్కరించి రికార్డ్ సాధించాడు. అయిదు సంవత్సరాల అర్మాన్ మూడు పుస్తకాలు రాశాడు. ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అందుకున్నాడు.

బిలాస్‌పూర్‌లోని ఒక వ్యాపారవేత్త ఏకైక కుమారుడు అయిన అర్మాన్ చిన్నప్పటి నుంచే తన వయసుకు మించిన తెలివితేటలను ప్రదర్శించేవాడు. మ్యాథ్స్ ప్రాబ్లమ్స్ సాల్వ్ చేయడానికి తన కంటే చాలా పెద్ద వయసు వాళ్లు కుస్తీలు పడుతుంటే...

‘ఇదిగో ఇలా చేస్తే సరిపోతుంది’ అని నిమిషాల వ్యవధిలో ఆ ప్రాబ్లమ్స్ సాల్వ్ చేసి వారిని ఆశ్చర్యపరిచేవాడు.

‘నంబర్–సాల్వింగ్ స్కిల్స్’ విభాగంలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, హార్వర్డ్ వరల్డ్ రికార్డ్స్, ఆన్‌లైన్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సాధించాడు.

అర్మాన్ రాసిన ‘పింక్ డాల్ఫిన్’ ‘ప్లానెక్స్’ ‘మై కాంటినెంట్’ పుస్తకాలకు మంచి ఆదరణ లభించింది. ఈ పుస్తకాలు అమెజాన్, గూగుల్ బుక్స్, కోబో బుక్స్‌లో అందుబాటులో ఉన్నాయి.

‘ఎప్పుడూ ఏదో ఒక కొత్త విషయం తెలుసుకోవాలనే తపన అర్మాన్‌లో కనిపిస్తుంది. మామూలుగా మ్యాథ్స్ పాఠాలు చెబుతుంటే పిల్లల్లో ఆసక్తి ఉండదు. అయితే అర్మాన్ మాత్రం చాలా ఆసక్తిగా వినేవాడు’ అని కుమారుడి గురించి చెప్పింది తల్లి నైనా ఉబ్రానీ.

సోషల్ మీడియా

పేలుడుకు కొన్ని నిమిషాల ముందు...

‘జీవితాలు మారడానికి ఒక రోజు చాలు’ అంటారు.

‘జీవితమే లేకుండా పోవడానికి కొన్ని నిమిషాలు చాలు’ అనిపిస్తుంది ఈ వైరల్ పోస్ట్ చూసిన తరువాత.

ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడుకు సంబంధించి వేణి గుప్తా అనే మహిళ ‘ఎక్స్’లో చేసిన పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

‘పేలుడు జరగడానికి కొన్ని నిమిషాల ముందు నేను, మా అమ్మ సంఘటన స్థలంలోనే ఉన్నాం. పెళ్లి దుస్తులు కొనడానికి వెళ్లాం. చాలామంది లాగే రుచికరమైన పాత ఢిల్లీ వంటకాలను ఆస్వాదించాం. పని పూర్తి కాగానే ఎర్రకోట నుండి ఆటో మాట్లాడుకొని మెట్రో స్టేషన్‌కు వెళ్లడం సాధారణ విషయమే. అయితే ఇప్పుడు ఏది సాధారణం అనిపించడం లేదు. జీవితం ఎంత అనూహ్యమైనది!

నగరం భయం దుప్పటి కప్పుకొని ఉంది. ఢిల్లీ దుఃఖిస్తోంది. బాధిత ఆత్మలకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను’ అని రాసింది వేణి గుప్తా.

పేలుడుకు ముందు ఆ పరిసర ప్రాంతాలలో తాను తీసిన ఫొటోలను షేర్ చేసింది వేణి.



అనుబంధం

అమ్మ ఆఖరి కోరిక

‘ఏం కావాలి ఈ జీవితానికి?’ అనే ప్రశ్నకు జవాబు... ‘చిన్న ఆనందం’

క్యాన్సర్ బారిన పడిన ఆ తల్లికి తన జీవితం ముగింపు దశకు వచ్చిందనే విషయం తెలిసిపోయింది.

‘నాకు తాజ్‌మహల్ చూపెట్టరా’ అని కుమారుడిని అడిగింది.

అడిగిందే తడవుగా తల్లితో పాటు తండ్రిని కూడా తీసుకెళ్లి తాజ్‌మహల్ చూపించాడు.

‘ఈ జీవితానికి ఇది చాలురా’ అన్నట్లుగా ఉంది ఆమె కళ్లలోని సంతోషం.

భర్త యూఎన్ శాంతి పరిరక్షక దళంలో పనిచేస్తున్నందు వల్ల చికిత్స కోసం ప్రతి రెండు వారాలకు ఒంటరిగా గ్వాలియర్ నుండి ఢిల్లీకి వెళ్లేది.

ఆగ్రా, కాన్పూర్‌ల మధ్య ఒక చిన్న గ్రామంలో జన్మించిన ఆమె తాజ్‌మహల్ గురించి వినడమే తప్ప ఎప్పుడూ ప్రత్యక్షంగా చూడలేదు.

కుమారుడు ‘ది ఒబెరాయ్ అమర్‌విలాస్’లో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించాడు. ‘తాజ్ మహల్ చూడాలని ఉంది’ అని తల్లి అడిగిన తరువాత తల్లిదండ్రులను ఆగ్రాకు తీసుకువెళ్లి తాను ఉద్యోగం చేసే హోటల్లో వారికి బస ఏర్పాటు చేశాడు. హోటల్ నుంచి అల్లంత దూరాన తాజ్‌మహల్ కనిపిస్తోంది. ‘ఎప్పుడు వెళుతున్నాం అక్కడికి?’ అని అడిగింది తల్లి. ఆ తరువాత కొద్దిసేపట్లోనే తల్లికి తాజ్ చూపించి ఆమెను ఆనందంలో ముంచెత్తాడు కుమారుడు. తాజ్‌మహల్ చూసిన పదిహేనురోజులకు ఆమె చనిపోయింది.

తన తల్లి చివరి కోరిక గురించి రెడిట్‌లో చేసిన పోస్ట్ నెటిజనుల హృదయాలను కదిలించింది.

నిరీక్షణ

నీ కోసం

అన్నాచెల్లెళ్ల అనుబంధం గురించి వెండితెరపై ఎన్నో సీన్‌లు చూస్తుంటాం. అడపాదడపా కన్నీళ్లు కూడా పెడుతుంటాం. ఇది కూడా అలాంటి భావోద్వేగ దృశ్యమే. అయితే ఇది నిజ జీవిత సంఘటన.

తన సోదరుడికి భారతీయ అధికారుల నుంచి అవసరమైన చట్టపరమైన, వైద్యసహాయం కోరుతూ ప్రముఖ బాలీవుడ్ నటి సెలీనా జైట్లీ హైకోర్ట్‌ను ఆశ్రయించింది.

నాలుగు వారాల లోపు అతడి గురించి స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీస్ జారీ చేసింది హైకోర్ట్. జైట్లీ సోదరుడి పరిస్థితి తెలుసుకోవడానికి నోడల్ ఆఫీసర్‌ని నియమించాలని ఢిల్లీ హై కోర్టు ఆదేశించింది.

కోర్టు ఆదేశం తరువాత సెలీనా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన పోస్ట్ వైరల్ అయింది.

లీగల్

స్త్రీలకు వారి ఆస్తి వారికి ఇవ్వాల్సిందే!

మా నాన్నగారికి నలుగురు అక్క చెల్లెళ్లు. అందరికీ 1990లలోనే పెళ్ళిళ్లు కూడా అయిపోయాయి. మా నాన్నగారి తల్లిగారి పేరిట ఉన్న ఆస్తిని, తను చనిపోయాక మా నాన్నగారు తన పేరుతో పట్టా పాస్ పుస్తకం తీసుకున్నారు. కొంత భూమిని అమ్మే క్రమంలో కొనేవారు మా అత్తయ్యల అంగీకారం కూడా కావాలి అని అడిగారు. అయితే అందుకు అత్తయ్యలు అంగీకరించలేదు. మా నాన్నగారు వాళ్లకి కట్నకానుకలు ఇచ్చి పెళ్ళిళ్లు చేశారు.. ఇప్పుడు మా నలుగురు అత్తయ్యలకు కూడా ఆస్తిలో వాటా ఇవ్వాలా? ఇవ్వకుండా ఉండే మార్గం ఏమైనా ఉంటే చెప్పండి.

– ఫణీంద్ర, చిత్తూరు జిల్లా

ఇంట్లో ఆడపిల్లలకి పెళ్లి చేసి పంపించాను కాబట్టి ఇక వారికి ఆస్తిలో ఎటువంటి భాగమూ ఉండదు అని చాలామంది భ్రమ పడుతూ ఉంటారు. పూర్వికులు ఆస్తి మగవారి హక్కు అని ఆడవారు కూడా నమ్మేస్తూ ఉంటారు. మీ అత్తయ్య గార్లకి పెళ్ళిళ్లు చేయకముందు – చేసిన తర్వాత కూడా ఆస్తిని మీ నాన్నగారు – మీరే కదా అనుభవిస్తున్నారు? మీరు అనుభవించిన దానితో పోలిస్తే వాళ్లకి చేసిన పెళ్ళిళ్లు సరితూగుతాయా? చట్టంలో ఎన్నో మార్పులు వచ్చాయి కానీ సమాజంలో ఇంకా రాలేదు. ఆడపిల్లలకు/స్త్రీలకు సమానమైన ఆస్తి హక్కులను చట్టం కల్పించినప్పటికీ తమ హక్కు కోసం ఎంతోమంది మహిళలు కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

ఏది ఏమైనా, హిందూ వారసత్వ (సవరించబడిన) చట్టం, 2005 లోని సెక్షన్ 6 ప్రకారం స్త్రీలకు పురుషులతో సమానమైన హక్కులు ఉన్నాయి. ఇదే విషయాన్ని సుప్రీం కోర్టు కూడా వినితా శర్మ వర్సెస్ రాకేష్ శర్మ కేసులో మరోసారి తేల్చి చెప్పింది. మీరు వివరించిన దాని ప్రకారం మీకు సెక్షన్ 15 వర్తిస్తుంది.

వీలునామా రాయకుండా మరణించిన మహిళ ఆస్తి సెక్షన్ 15 ప్రకారం తన వారసులకు అనగా:

1. ప్రథమంగా కొడుకులకు (లేని పక్షంలో అతని వారసులకు), కూతుళ్ళకు (లేని పక్షంలో ఆమె వారసులకు) – భర్తకు సమానంగా సంక్రమిస్తుంది.
2. ద్వితీయంగా భర్త వారసులకు
3. తృతీయంగా తల్లి – తండ్రులకు
4. లేదా నాలుగవ పక్షంలో తండ్రి గారి వారసులకు
5. ఆఖరున తల్లిగారి వారసులకు;

ఇలా క్రమపద్ధతిలో మొదటివారు, లేదా రెండవ వారు, ఎవరూ లేకుంటే ఆఖరున సూచించినవారికి ఆస్తి సంక్రమిస్తుంది. సెప్టెంబర్ 9, 2005 కంటే ముందు ఆస్తి పంపకాలు (పార్టిషన్) జరిగి ఉంటే తప్ప, స్త్రీలకు వారి ఆస్తి వారికి ఇవ్వాల్సిందే! పెళ్ళి చేశాము, కట్నం ఇచ్చాము, పురుడు పోశాము, సంక్రాంతికి కొత్త బట్టలు కొన్నాము అంటే కుదరదు. వారి హక్కును వారికి ఇవ్వండి. వారి ఆస్తిని వారికి ఇవ్వండి. మీ అత్తయ్యలకి తెలియకుండా ఆస్తిని అమ్మేస్తే అది మోసం చేసినట్టే. అలాంటి అమ్మకం చెల్లదు.

– శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాల కోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

సేద్యం చేయడానికి సెంటు భూమి లేదు. రోగమో రొష్టో వచ్చినప్పుడు కాస్త సేద దీరుదామంటే పెద్దలు అందించిన ఆస్తులు కానీ, కూడబెట్టుకున్న కాసులు కానీ లేవు. అయితేనేం... ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. స్వయంకృషితో పేదరిక కష్టాలు దాటింది. ఎంతోమంది గ్రామీణ మహిళలు ఆర్థికంగా సొంత కాళ్ల మీద నిలబడేలా చేస్తోంది... ఆమె బిహార్‌కు చెందిన బీనాదేవి. ఆమె విజయ గాథను అవలోకిద్దాం.

ఓ ‘మష్రూమ్ లేడీ’ విజయగాథ

బీనాదేవి

బిహార్‌లోని ముంగేర్ జిల్లాకు చెందిన బీనాదేవి ఒకప్పుడు కడు పేదరికాన్ని అనుభవించింది. తన నలుగురు పిల్లలకు భోజనం పెట్టడానికి ఎన్నో కష్టాలు పడింది. సాధారణంగా కష్టాలు చుట్టుముట్టినప్పుడు కన్నీటి సముద్రం తప్ప ఏమీ కనిపించదు. కాని బీనాదేవి ఒక శక్తిమంతమైన మార్గాన్ని చూసింది. అది తన భవిష్యత్‌ను మార్చిన మార్గం. తనను ‘ది మష్రూమ్ లేడీ’గా మార్చిన మార్గం.

ఆ మార్గం పేరు... పుట్టగొడుగుల పెంపకం.

తన ఇంటి ఇరుకైన గదిలోనే పుట్టగొడుగుల పెంపకం ప్రారంభించింది బీనాదేవి. చాలా చిన్న స్థాయిలో మొదలైన పుట్టగొడుగుల పెంపకం గ్రామీణ సాధికారత ఉద్యమంగా మారింది. వందకు పైగా గ్రామాలలో వేలాది మంది మహిళల జీవితాల్లో మార్పు తీసుకువచ్చింది.

ఒక కిలోవిత్తనాలతో తొలి ప్రయత్నం మొదలుపెట్టింది. మొదటి అడుగు అయితే వేసిందిగానీ పుట్టగొడుగుల పెంపకం అనుకున్నంత తేలిక కాదని అర్థమైంది. అందుకు శిక్షణ తీసుకోవడం తప్పనిసరని గ్రహించింది.

భాగల్‌పూర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పుట్టగొడుగుల పెంపకంలో శిక్షణ తీసుకుంది. తగిన పరిజ్ఞానంతో పుట్టగొడుగుల పెంపకం ప్రారంభించిన బీనాదేవికి లాభాలను అందుకోవడానికి ఎంతోకాలం పట్టలేదు. ఒక పూట తింటే మరో పూట పస్తు అన్నట్లుగా ఉండే బీనాదేవి సంవత్సరానికి లక్షలు అర్జించే స్థాయికి చేరుకుంది. స్థిరమైన ఆదాయం వల్ల పిల్లలను బాగా చదివించింది. ఇప్పుడామె పెద్ద కుమారుడు ఇంజనీరింగ్ చేస్తున్నాడు.

విజయం తనకే పరిమితం కావాలనుకోలేదు బీనాదేవి. ఆ విజయాన్ని ఇతరులకు కూడా పంచాలనుకుంది. పుట్టగొడుగుల పెంపకంలో ఎంతోమంది మహిళలకు తానే స్వయంగా శిక్షణ ఇచ్చింది.

‘మహిళలు ఆర్థికంగా సొంత కాళ్ల మీద నిలబడడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. సమాజంలో వారి పట్ల గౌరవం పెరుగుతుంది. వారి కుటుంబజీవితం మెరుగు పడుతుంది’ అంటున్న బీనాదేవి బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నుంచి అభినందనలు అందుకుంది. ‘కిసాన్ అభినవ’ పురస్కారాన్ని అందుకుంది.

తిల్కారి గ్రామానికి చెందిన బీనాదేవికి పేదరికం కష్టాలు ఎన్ని ఉన్నా అపారమైన సంకల్పబలం ఉంది. ఆ బలమే ఆమెను స్ఫూర్తినిచ్చే మహిళ స్థాయికి తీసుకువెళ్లింది.

స్ఫూర్తిదాయకమైన బీనాదేవి గురించి ‘ఎక్స్’లో రాసింది కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ.

‘మష్రూమ్ మహిళ బీనాదేవి పుట్టగొడుగుల పెంపకంలో తాను విజయం సాధించడమే కాదు ఎంతోమంది గ్రామీణ మహిళలు విజయం సాధించేలా స్ఫూర్తిని ఇచ్చింది. సహకారాన్ని అందించింది’ అని రాసింది.

బీనాదేవి పుట్టగొడుగుల పెంపకం దగ్గర మాత్రమే ఆగిపోలేదు. గ్రామీణ ప్రాంతాలలో సేంద్రియ వ్యవసాయం, అక్షరాస్యతపై ఉద్యమ స్థాయిలో పనిచేస్తోంది.

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
నవంబర్ 11న ముగింపు రూ.లలో

నగరం	బంగారం (24 క్యారెట్లు)	బంగారం (22 క్యారెట్లు)	వెండి
హైదరాబాద్	1,25,010	1.13,570	1,57,000
విజయవాడ	1,28,640	1,15,750	1,59,600
విశాఖపట్నం	1,25,840	1,15,350	1,70,000
రాజమండ్రి	1,28,640	1,19,220	1,59,600
ప్రొద్దుటూరు	1,24,300	1,14,360	1,57,600
చెన్నై	1,27,630	1,17,000	1,70,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

దక్షిణాఫ్రికాతో సవాల్‌కు సిద్ధంగా ఉన్నాను: సిరాజ్

ఇంగ్లండ్ గడ్డపై టెస్టు సిరీస్‌ను 'డ్రా' చేయడంలో కీలకపాత్ర పోషించిన భారత పేసర్ మొహమ్మద్ సిరాజ్ ఇప్పుడు స్వదేశంలో మరో పటిష్ట జట్టుపై చెలరేగాలని పట్టుదలగా ఉన్నాడు. శుక్రవారం నుంచి దక్షిణాఫ్రికాతో జరిగే టెస్టు సిరీస్‌లో మన టీమ్ పైచేయి సాధిస్తుందని అతను విశ్వాసం వ్యక్తం చేశాడు. 'వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ పాయింట్లపరంగా మనకు ఇది చాలా కీలక సిరీస్. పైగా దక్షిణాఫ్రికా చాంపియన్ కూడా. ఆ జట్టు ఇటీవల పాక్‌పై సిరీస్ 1-1తో 'డ్రా' చేసుకున్నది వాస్తవమే. అయితే మా జట్టు కూడా చాలా బలంగా ఉంది. ఇంగ్లండ్‌తో చాలా బాగా ఆడి ఇటీవల వెస్టిండీస్‌పై అలవోకగా గెలిచాం. ఈ ఫామ్ కారణంగా టీమ్‌లో ఆత్మవిశ్వాసం పెరిగి అంతా సానుకూల వాతావరణం ఉంది. వ్యక్తిగతంగా నా బౌలింగ్ మంచి లయతో సాగుతోంది. కాబట్టి అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వగలనని నమ్ముతున్నా. పెద్ద జట్లను ఎదుర్కొనేటప్పుడు మన లోపాలు ఏమిటో తెలిసి వాటిని సరిదిద్దుకునే అవకాశం కలుగుతుంది. దక్షిణాఫ్రికాతో తలపడేందుకు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా' అని సిరాజ్ చెప్పాడు. భారత్ తరఫున 43 టెస్టులు ఆడిన సిరాజ్ 133 వికెట్లు పడగొట్టాడు.

హరికృష్ణ గేమ్ 'డ్రా'

పనాజీ: పురుషుల ప్రపంచకప్ చెస్ టోర్నీ నాలుగో రౌండ్‌లోని తొలి గేమ్‌లో ఐదుగురు భారత గ్రాండ్‌మాస్టర్లు 'డ్రా'తో సరిపెట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్లు పెంటేల హరికృష్ణ, కార్తీక్ వెంకటరామన్... తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్... తమిళనాడు గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, ప్రణవ్ 'డ్రా' నందం కలిగింది. అర్జున్–పీటర్ లెకో (హంగేరి) గేమ్ 20 ఎత్తుల్లో... ప్రజ్ఞానంద –దుబోవ్ డానిల్ (రష్యా) గేమ్ 41 ఎత్తుల్లో... హరికృష్ణ –నిల్స్ గ్రాండెలియస్ (స్వీడన్) గేమ్ 32 ఎత్తుల్లో... కార్తీక్ వెంకటరామన్–లె క్వాంగ్ లియెమ్ (వియత్నాం) గేమ్ 36 ఎత్తుల్లో... ప్రణవ్–నొదిర్‌బెక్ యాకుబోయెవ్ (ఉజ్బెకిస్తాన్) గేమ్ 82 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి. నేడు జరిగే రెండో గేమ్‌లో గెలిచిన వారు ప్రిక్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధిస్తారు. రెండో గేమ్ కూడా 'డ్రా' అయితే గురువారం టైబ్రేక్ నిర్వహించి విజేతలను నిర్ణయిస్తారు.

సెమీఫైనల్లో జ్యోతి సురేఖ, ధీరజ్

ఢాకా: ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్లేయర్లు వెన్నం జ్యోతి సురేఖ, బొమ్మదేవర ధీరజ్ పతకాలకు విజయం దూరంలో నిలిచారు. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో జ్యోతి సురేఖ, ప్రీతిక... పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ధీరజ్, రాహుల్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. క్వార్టర్ ఫైనల్లో జ్యోతి సురేఖ 147–145తో ఓ యూహాన్ (దక్షిణ కొరియా)పై, ప్రీతిక 148–146తో తెలంగాణ అమ్మాయి తనిపర్తి చికితపై గెలిచారు. పురుషుల రికర్వ్ క్వార్టర్ ఫైనల్లో ధీరజ్ 6–5తో సాదికోవ్ (ఉజ్బెకిస్తాన్) పై, రాహుల్ 6–2తో లిన్ జి సియాంగ్ (చైనీస్ తైపీ)పై విజయం సాధించారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

జోరుగా హుషారుగా...

నెట్స్‌లో శ్రమించిన భారత్, దక్షిణాఫ్రికా ఆటగాళ్లు ● శుక్రవారం నుంచి ఈడెన్ గార్డెన్స్‌లో తొలి టెస్టు

జైస్వాల్, గిల్

నితీశ్ కుమార్ రెడ్డి

కోల్‌కతా: భారత్, దక్షిణాఫ్రికా మధ్య తొలి టెస్టుకు మూడు రోజుల ముందు ఇరు జట్ల సన్నాహకం మొదలైంది. ఈడెన్ గార్డెన్స్ మైదానంలో ఆటగాళ్లు సుదీర్ఘ సమయం పాటు నెట్స్‌లో శ్రమించారు. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్లు కీలకం కావడంతో సిరీస్ ప్రతిష్టాత్మకంగా మారింది. సొంతగడ్డపై సత్తా చాటేందుకు భారత్ సన్నద్ధమవుతుండగా, డబ్ల్యూటీసీ డిఫెండింగ్ చాంపియన్‌గా సఫారీ బృందం తమ స్థాయిని ప్రదర్శించాలని భావిస్తోంది. ప్రధానంగా పిచ్‌కు సంబంధించి కూడా చర్చ జరుగుతోంది. ప్రత్యర్థి టీమ్‌లోనూ మంచి స్పిన్నర్లు ఉండటంతో భారత మేనేజ్‌మెంట్ కూడా పూర్తిగా స్పిన్ పిచ్ గురించి ఆలోచన చేయడం లేదు. ఇటీవల పాకిస్తాన్ గడ్డపై కూడా దక్షిణాఫ్రికా ఆకట్టుకుంది. పిచ్ రూపకల్పన విషయంలో తమకు ఎలాంటి సూచనలు రాలేదని బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ (క్యాబ్) అధ్యక్షుడు, మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఇప్పటికే స్పష్టం చేశాడు.

టాప్-3పై దృష్టి...

టెస్టు జట్టు కెప్టెన్ శుబ్‌మన్ గిల్ ఇటీవల ఆస్ట్రేలియాతో వన్డే, టి20ల్లో పెద్దగా రాణించ లేదు. మంగళవారం నెట్స్‌లో గిల్ సుదీర్ఘ సమయం పాటు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. ఎర్ర బంతితో మళ్లీ లయ అందుకోవాలని అతను పట్టుదలగా ఉన్నాడు. హెడ్ కోచ్ గంభీర్, అసిస్టెంట్ కోచ్ సితాన్షు కొటక్‌లతో కొద్ది సేపు చర్చించిన తర్వాత గిల్ నెట్స్‌లోకి వెళ్లాడు. ముందుగా జడేజా, సుందర్ స్పిన్‌ను ఎదుర్కొన్న అతను, ఆ తర్వాత ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి పేస్ బౌలింగ్‌లో సాధన చేశాడు. అనంతరం అదనపు బౌన్స్‌ను ఎదుర్కొనేందుకు అర గంట పాటు 'త్రో డౌన్స్'తో ప్రాక్టీస్ చేశాడు. మరోవైపు యశస్వి జైస్వాల్ కూడా కెప్టెన్‌తో సమాంతరంగా పక్కనే ఉన్న మరో నెట్‌లో సాధన కొనసాగించాడు. అతను ఎలాంటి తడబాటు లేకుండా బౌలర్లను స్వేచ్ఛగా ఎదుర్కొన్నాడు. యువ బ్యాటర్ సాయి సుదర్శన్ ప్రాక్టీస్‌ను కూడా కోచ్ గంభీర్ పర్యవేక్షించాడు. పేసర్లలో బుమ్రా ఒక్కడే ప్రాక్టీస్‌కు వచ్చాడు. బ్యాటర్ లేకుండా కేవలం రెండు స్టంప్‌లు పెట్టి ఆఫ్ స్టంప్‌పై బంతులు విసరడంపైనే అతను దృష్టి పెట్టాడు. ఏడుగురు భారత ఆటగాళ్లు ప్రాక్టీస్‌కు రాగా... పంత్, జురేల్, రాహుల్, సిరాజ్, కుల్దీప్, ఆకాశ్‌దీప్, దేవదత్ పడిక్కల్, అక్షర్ పటేల్ మంగళవారం సాధనకు దూరంగా ఉన్నారు. అనంతరం గంభీర్ సహా టీమ్ మేనేజ్‌మెంట్ టెస్టు మ్యాచ్‌కు ఉపయోగించనున్న పిచ్‌ను పరిశీలించారు.

అటాకింగ్ ఆటతో...

దక్షిణాఫ్రికా జట్టు కూడా సుదీర్ఘ సమయం పాటు ప్రాక్టీస్ చేసింది. భారత్‌లో ఎదురయ్యే స్పిన్ పిచ్‌ను దృష్టిలో ఉంచుకుంటూ ఆటగాళ్లు సాధన చేశారు. స్పిన్ బౌలర్లనే ప్రత్యేకంగా ఎదుర్కొంటూ అటాకింగ్ ఆటను ప్రదర్శించారు. నెట్స్‌లో సఫారీలను చూస్తే స్పిన్‌ను తడబడకుండా ఎదురుదాడి చేయడమే వ్యూహంగా కనిపిస్తోంది. ఇటీవల పాకిస్తాన్‌లో స్పిన్‌కు అనుకూల పిచ్‌పై టెస్టు గెలవడం వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. గాయం నుంచి కోలుకొని వచ్చిన కెప్టెన్ తెంబా బవుమా ఎక్కువ సేపు నెట్స్‌లో తన బ్యాటింగ్‌కు పదును పెట్టాడు. తక్కువ దూరం నుంచి త్రో డౌన్స్ తీసుకుంటూ తన ఫిట్‌నెస్ చురుకుదనానికి అతను స్వయంగా పరీక్ష పెట్టుకున్నాడు. ఓపెనర్లు మార్క్‌రమ్, రికెల్టన్ కూడా స్పిన్నర్లతోనే చాలా సేపు సాధన చేశారు. భారత్ 'ఎ'పై రెండో అనధికారిక టెస్టులో గెలిచిన దక్షిణాఫ్రికా 'ఎ' జట్టులోని సభ్యులు చాలా మంది సీనియర్ టీమ్‌లోనూ ఉన్నారు. వారంతా ఇక్కడి పిచ్‌కు అలవాటు పడినట్లుగా కనిపించింది.

తెంబా బవుమా

ఇషా-సామ్రాట్ జోడీకి రజతం

- ఐశ్వర్య ప్రతాప్ సింగ్ ఖాతాలోనూ రజతం
- ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల జోరు

కైరో (ఈజిప్ట్): ఏకాగ్రత కోల్పోకుండా లక్ష్యంపైనే గురి పెడుతూ... ప్రపంచ రైఫిల్, పిస్టల్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్లు తమ పతకాల వేట కొనసాగిస్తున్నారు. పోటీల నాలుగో రోజు భారత్ ఖాతాలో రెండు రజత పతకాలు చేరాయి. పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో మధ్యప్రదేశ్‌కు చెందిన 24 ఏళ్ల ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ రజతం నెగ్గగా... 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ఇషా సింగ్–సామ్రాట్ రాణా జోడీ రజతం సొంతం చేసుకుంది. 62 జోడీలు పోటీపడ్డ ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ క్వాలిఫయింగ్‌లో ఇషా సింగ్ (తెలంగాణ)–సామ్రాట్ రాణా (హరియాణా) ద్వయం 586 పాయింట్లు... కియాన్‌జున్ యావో–హు కాయ్ (చైనా) జంట 583 పాయింట్లు స్కోరు చేసి టాప్–2లో నిలిచి ఫైనల్లోకి చేరుకున్నాయి. ఫైనల్లో ఇషా–సామ్రాట్ జోడీ 10–16 స్కోరుతో కియాన్ జున్–హు కాయ్ ద్వయం చేతిలో ఓడిపోయి రజత పతకంతో సంతృప్తి పడింది. ఈ మెగా ఈవెంట్‌లో సామ్రాట్‌కిది మూడో పతకం కావడం విశేషం. సోమవారం సామ్రాట్ టీమ్, వ్యక్తిగత విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించాడు.

చివరి షాట్‌లో తడబడి...

గతేడాది పారిస్ ఒలింపిక్స్‌లో నిరాశ పరిచిన ఐశ్వర్య ప్రతాప్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మాత్రం మెరిశాడు. 66 మంది పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో ప్రతాప్ 600 పాయింట్లకుగాను 597 పాయింట్లు సాధించి ప్రపంచ రికార్డును సమం చేశాడు. అగ్రస్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత పొందాడు. భారత్‌కే చెందిన మరో షూటర్ నీరజ్ కుమార్ 592 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి ఫైనల్ బెర్త్ దక్కించుకున్నాడు. ఫైనల్లో ప్రతాప్ 466.9 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని గెల్చుకున్నాడు. చివరి షాట్ వరకు ఐశ్వర్య త్రాప్ 457.1 పాయింట్లతో తొలి స్థానంలో, లియు యుకున్ (చైనా) 457 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నారు. ఆఖరి షాట్‌లో ప్రతాప్ 9.8 పాయింట్లు సాధించగా ... లియు యుకున్ 10.1 పాయింట్లు స్కోరు చేసి ఓవరాల్‌గా 467.1 స్కోరుతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. నీరజ్ కుమార్ 432.6 పాయింట్లతో ఐదో స్థానంలో నిలువగా... రొమైన్ (ఫ్రాన్స్; 454.8 పాయింట్లు) కాంస్యాన్ని సాధించాడు. నాలుగో రోజు పోటీలు ముగిశాక భారత్ 3 స్వర్ణాలు, 5 రజతాలు, 3 కాంస్యాలతో కలిపి 11 పతకాలతో రెండో స్థానంలో ఉంది. చైనా 15 స్వర్ణాలు, 4 రజతాలు, 2 కాంస్యాలతో కలిపి 15 పతకాలతో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

సాక్షి సినిమా

దేశం మొత్తం మీద ఒక్క మహిళ కూడా కనిపించలేదా!

● ఇఫీ జ్యూరీలో మహిళలకు దక్కని చోటు ● సోషల్ మీడియా వేదికగా విమర్శలు

'**ఇఫీ**' (ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా) 56వ ఎడిషన్ ఈ నెల 20 నుంచి 28 వరకు గోవాలో జరగనున్న సంగతి తెలిసిందే. దాదాపు 80 దేశాలకు చెందిన 240 చిత్రాలు ఈ చిత్రోత్సవాల్లో ప్రదర్శితం కానున్నాయి. ఈ వేడుకలకు ప్రముఖ ఫిల్మ్ మేకర్ శేఖర్ కపూర్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కాగా 'ఇఫీ'లోని ఇండియన్ పనోరమా సెక్షన్ జ్యూరీ చైర్మన్‌గా దర్శక–నిర్మాత–నటుడు రాజ్ బుందేలా నియమితులయ్యారు. తాజాగా ఈ విభాగానికి సంబంధించిన జ్యూరీ సభ్యులను అధికారికంగా ప్రకటించారు. కృష్ణ హెబ్బాళే, కమలేష్ కె. మిశ్రా, మలయ్ రే, సుభాష్ సెహగల్, అరుణ్ భక్షి, అసీమ్ సిన్హా, అశోక్ శరణ్, సుకుమార్ జతానియా, బీఎస్ బసవ రాజు, అమరేష్ చక్రవర్తి, నెపోలియన్ థంగా, జడుమోని దత్తా జ్యూరీ సభ్యులుగా ఉన్నారు. అయితే ఈ ప్యానెల్‌లో మహిళలకు చోటు దక్కకపోవడంతో విమర్శలు వస్తున్నాయి. 'జ్యూరీలో మహిళలకు చోటు లేదనే విషయం స్పష్టంగా తెలుస్తోంది', 'ఉమెన్ జ్యూరీ అంటూ ప్రత్యేకమైన పోస్ట్ ఏమైనా ఉందా?' (వ్యంగ్యంగా..), 'మహిళల కోసం మహిళలు నటించిన సినిమాలను ఎంపిక చేసేందుకు అందరూ మహిళలే ఉండేలా ప్రత్యేకమైన జ్యూరీ ఏదైనా ఉందా?', 'జ్యూరీలో భాగం చేయడానికి దేశం మొత్తం మీద మీకు ఒక్క మహిళ కూడా కనిపించలేదా?' అంటూ... సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు స్పందిస్తున్నారు. మరోవైపు... లోకల్ టాలెంట్‌ని ప్రోత్సహించడం లేదంటూ కొంకణి దర్శక–రచయిత ఎస్. లక్ష్మీకాంత్ 'ఇఫీ' వైఖరిని తప్పు పట్టారు. పలు అవార్డులు, రివార్డులు పొందిన కొంకణి షార్ట్ ఫిల్మ్ 'ఆన్సెస్సావో'ని ప్రదర్శనకు ఎంపిక చేయకపోవడాన్ని ఆయన విమర్శించారు. ఇక ఇండియన్ పనోరమా విభాగంలో 'సంక్రాంతికి వస్తున్నాం' (తెలుగు), 'అమరన్' (తమిళం), 'తుడరుమ్' (మలయాళం) 'సు ఫ్రమ్ సో' (కన్నడ), గ్రౌండ్ జీరో, తన్వి ది గ్రేట్, ఛావా, ది బెంగాలీ ఫైల్స్ (హిందీ)..' వంటి చిత్రాలతో పాటు పలు భాషలకు చెందిన దాదాపు ముప్పై చిత్రాలు పోటీ పడుతున్నాయి.

ఇకపై అలాంటి సినిమాలు చేయను - అనూ ఇమ్మాన్యుయేల్

''**నా** కెరీర్‌లో తెలుగు, తమిళ్‌లో చాలామంది హీరోలతో స్క్రీన్ షేర్ చేసుకున్నాను. ఆ విషయంలో నటిగా సంతృప్తిగా ఉన్నప్పటికీ కెరీర్ పరంగా అసంతృప్తిగా ఉన్నాను. అయితే అవకాశాల కోసం ఆరాటపడే తత్వం కాదు నాది. నాకు రావాల్సిన సినిమా తప్పకుండా నాకు దక్కుతుందని నమ్ముతాను'' అని అనూ ఇమ్మాన్యుయేల్ తెలిపారు. రష్మికా మందన్నా, దీక్షిత్ శెట్టి జంటగా రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న విడుదలైంది. ఈ సినిమాలో దుర్గ అనే ముఖ్య పాత్రలో నటించిన అనూ ఇమ్మాన్యుయేల్ మాట్లాడుతూ– ''ధీరజ్‌గారితో గతంలో 'ఊర్వశివో రాక్షసివో' సినిమా చేశాను. 'ది గర్ల్ ఫ్రెండ్' మూవీ కోసం తొలుత ఆయన నుంచే నాకు ఫోన్ వచ్చింది. ఆ తర్వాత రాహుల్ కలిసి కథ, నా పాత్ర చెప్పినప్పుడు ఈ మూవీలో నటించాలనిపించింది. నాకెంతో సంతృప్తినిచ్చిన చిత్రమిది. నా పాత్రకి నాతోనే అమెరికన్ యాక్సెంట్‌లో డబ్బింగ్ చెప్పించారు. దాంతో దుర్గ పాత్ర స్క్రీన్‌పై సహజంగా కనిపించింది. కొన్ని సీన్స్‌కి అబ్బాయిలూ క్లాప్స్ కొట్టడం హ్యాపీ. నా కెరీర్‌లో కొన్ని సినిమాలు చేసి ఉండకూడదని పశ్చాత్తాపపడుతున్నాను. కొన్ని వాణిజ్య సినిమాల్లో నటించడం వల్ల నటిగా సంతృప్తి లభించలేదు. నాలుగు డ్యాన్సులు, ఏవో డైలాగ్స్ చెప్పిస్తారు. ఆ మూవీస్ చేసేటప్పుడు రియలైజ్ కాలేదు గానీ ఇకపై అలాంటివి చేయకూడదని నిర్ణయించుకున్నా'' అని చెప్పారు.

విలన్ ఎవరో ఊహించలేరు - 'అల్లరి' నరేశ్

● నరేశ్, కామాక్షి

''**నే**నిప్పటివరకు చాలా జానర్స్ చేశాను. కానీ '12ఏ రైల్వే కాలనీ'లాంటి థ్రిల్లర్స్ చేయలేదు. ఈ సినిమా చూసి రెండు మూడు చోట్ల జర్క్ అవుతారు. మా మూవీలో విలన్ ఎవరు? అని ఊహించలేరు'' అని 'అల్లరి' నరేశ్ చెప్పారు. 'పొలిమేర, పొలిమేర 2' చిత్రాల ఫేమ్ డైరెక్టర్ అనిల్ విశ్వనాథ్ ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందించి, షో రన్నర్‌గా వ్యవహరించారు. నాని కాసరగడ్డ దర్శకత్వంలో 'అల్లరి' నరేశ్, కామాక్షీ భాస్కర్ల జోడీగా నటించారు. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న రిలీజ్ కానుంది. ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నాని మాట్లాడుతూ– ''నవంబర్ 21 తర్వాత నాని అనే నా పేరు గట్టిగా వినిపిస్తుందని బలంగా నమ్ముతున్నాను'' అని చెప్పారు. ''ఈ సినిమా తర్వాత నన్ను ఆరాధన అని పిలుస్తారనే నమ్మకం ఉంది'' అన్నారు కామాక్షి. ''సస్పెన్స్ థ్రిల్లర్స్‌ని ఎంజాయ్ చేసేవారికి మా సినిమా ఓ మంచి ట్రీట్ '' అని అనిల్ విశ్వనాథ్ చెప్పారు.

వాస్తవ ఘటనలతో...

● కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జయశేఖర్, సురేష్

రామ్ అడ్డగిరి, భానుప్రసాద్, మాస్టర్ విజయ్, రేణుకుమార్, బ్రహ్మానంద రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో పులిజాల సురేష్ నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రిలీజ్ చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు చెప్పారు. దర్శకుడు సముద్ర ఈ సినిమా లిరికల్ సాంగ్‌ను విడుదల చేయగా, నటి ప్రీతి నిగమ్ టీజర్‌ను లాంచ్ చేశారు. ''యానిమల్' సినిమాలా 'రాబందు' టైటిల్ మాస్‌గా ఉంది'' అన్నారు సముద్ర. ''కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా తీశాం'' అన్నారు జయశేఖర్. ''మంచి కథతో సందేశాత్మకంగా తీసిన సినిమా ఇది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చెప్పారు పులిజాల సురేష్. సెన్సార్ బోర్డు సభ్యుడు ఉపేంద్ర, నటుడు రాజశేఖర్ మాట్లాడారు.

కుమారిని సవాల్‌గా తీసుకున్నాను!

● భాగ్యశ్రీ బోర్సే

''**తె**లుగులో నేను విన్న తొలి స్క్రిప్ట్, ఒప్పుకున్న సినిమా 'కాంత'. అయితే కొన్ని కారణాల వల్ల ఈ మూవీ కాస్త ఆలస్యంగా మొదలైంది. ఆ గ్యాప్‌లో 'మిస్టర్ బచ్చన్, కింగ్‌డమ్' సినిమాలు చేశాను. 'కాంత' నాకు చాలా ప్రత్యేకమైన సినిమా. పూర్తి స్థాయిలో నటనకి అవకాశం ఉన్న కుమారి పాత్రను ఈ చిత్రంలో చేశాను'' అని హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే చెప్పారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జోడీగా నటించిన చిత్రం 'కాంత'. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో రానా, సముద్ర ఖని కీలక పాత్రలు చేశారు. రానా, దుల్కర్ సల్మాన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా భాగ్యశ్రీ బోర్సే మాట్లాడుతూ– ''నాలాంటి కొత్త అమ్మాయికి 'కాంత'లో కుమారిలాంటి పాత్ర దొరకడం అదృష్టం. సవాల్‌గా తీసుకుని ఈ క్యారెక్టర్ చేశాను. ఈ సినిమా కోసం శ్రీదేవి, సావిత్రిగార్ల నటనని స్ఫూర్తిగా తీసుకున్నాను. ఇప్పటి వరకు నన్ను కమర్షియల్ నటి అన్నారు. 'కాంత' తర్వాత గొప్ప నటి అంటారని ఆశిస్తున్నా. కుమారి పాత్రని సెల్వ రాజ్‌గారు రాసుకున్న విధానం ఆశ్చర్యపరిచింది. నేను నటించిన 'కాంత, ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమాలు ఒకే నెలలో విడుదలవుతుండటం ఎగ్జయిటింగ్‌గా ఉంది. నా వరకు 100 శాతం కష్టపడ్డాను. మంచి ఫలితం దక్కుతుందనే నమ్మకం ఉంది. మంచి కథ కుదిరితే తమిళ్‌లోనూ సినిమా చేస్తాను. అయితే నా తొలి ప్రాధాన్యం తెలుగు సినిమాకే. ప్రస్తుతం కొన్ని తెలుగు, హిందీ సినిమాలు చేస్తున్నాను '' అని చెప్పారు.

ఆ ఇష్టంతోనే జానకి రాముడు సినిమా చేశాను - నాగార్జున

● చైతన్య రెడ్డి, దుష్యంత్, నాగార్జున, ఆషికా రంగనాథ్

''**నా**కు గత జన్మ సినిమాలంటే ఇష్టం . నాన్నగారి 'మూగమనసులు' సినిమాతో నాకు బాగా పరిచయం. నేనూ అదే ఇష్టంతో 'జానకి రాముడు' సినిమా చేశాను. ఈ రెండు సినిమాలు సూపర్ హిట్ అయ్యాయి. 'గత వైభవం' చిత్రం నాలుగు జనరేషన్ల కథ. ట్రైలర్ చూస్తే టీమ్ కష్టం తెలుస్తోంది. ఈ మూవీ బ్లాక్‌బస్టర్ కావాలి'' అని చెప్పారు నాగార్జున. ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ నటించిన ఫ్యాంటసీ డ్రామా 'గత వైభవం'. సింపుల్ సుని దర్శకత్వంలో దీపక్ తిమ్మప్ప, సుని నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానుంది. ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో, ఉత్తర అమెరికా, కెనడాలో విడుదల చేస్తున్నారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా నాగార్జున హాజరయ్యారు. ''గత వైభవ' స్క్రీన్‌ప్లే కొత్తగా ఉంటుంది'' అన్నారు దుష్యంత్. ''చాలా ఎమోషనల్‌గా, ప్రేమతో మేం చేసిన సినిమా ఇది'' అని పేర్కొన్నారు ఆషిక. ''కమర్షియల్ హంగులున్న ప్రయోగాత్మక చిత్రమిది'' అని చెప్పారు సింపుల్ సుని. ''ఈ సినిమా టీజర్ చూడగానే 'జగదేకవీరుడు అతిలోక సుందరి' సినిమా వైబ్ వచ్చింది'' అన్నారు చైతన్య రెడ్డి.

సందేశం ఉన్న ఈ చిత్రాన్ని ఆదరించాలి - తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

● రాజేంద్రప్రసాద్, భట్టి విక్రమార్క, మహేశ్‌చంద్ర

''**ప్రే**యసి రావే' ఫేమ్ దర్శకుడు మహేశ్ చంద్ర తెరకెక్కించిన తాజా చిత్రం 'పిఠాపురంలో..'. డా. రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు. దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్ఎం మురళి (గోదారి కిట్టయ్య) ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ– ''ఈ సినిమా కాన్సెప్ట్ గురించి దర్శకుడు చెప్పారు. సందేశాత్మక చిత్రం అనిపిస్తోంది. యువతరం కుటుంబ సమేతంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి? ఎలా ఎదగాలనే సందేశం ఈ సినిమాలో ఉంది. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు. ''ఆ నలుగురు, మీ శ్రేయోభిలాషి, ఓనమాలు' చిత్రాల తరహాలోనే సందేశాన్ని అందిస్తూనే యువతరాన్ని ఆకట్టుకునే అంశాలు ఉన్న సినిమా ఇది'' అని చెప్పారు రాజేంద్రప్రసాద్. ''ముగ్గురు తండ్రుల కథలా అనిపిస్తూనే మూడు జంటల మధ్య జరిగే కథ ఇది. వచ్చే నెలలోనే ఈ సినిమాను విడుదల చేస్తాం'' అని తెలిపారు మహేశ్ చంద్ర.

ట్రైలర్ చాలా బాగుంది - దర్శకుడు బాబీ

● బాబీ, సంజీవ్ రెడ్డి, విక్రాంత్

''**సం**తాన ప్రాప్తిరస్తు'లో ఇన్‌ఫెర్టిలిటీ లాంటి సెన్సిటివ్ సబ్జెక్ట్‌ను అందరికీ నచ్చేలా చెప్పే ప్రయత్నం చేశారు. ఈ కథను స్క్రీన్ మీదకు తీసుకొచ్చేందుకు ఆరేళ్లు వెయిట్ చేశారు దర్శకుడు సంజీవ్‌గారు. ఓపికగా ఉండటం అనేది గొప్ప విషయం. శ్రీధర్, హరిప్రసాద్‌గార్లకు మంచి విజయం దక్కాలి'' అని దర్శకుడు బాబీ చెప్పారు. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటించిన సినిమా 'సంతాన ప్రాప్తిరస్తు'. సంజీవ్ రెడ్డి దర్శకత్వంలో శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానుంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు దర్శకులు బాబీ, సందీప్ రాజ్, శైలేష్ కొలను, బీవీఎస్ రవి, నిర్మాతలు లగడపాటి శ్రీధర్, శింగనమల కల్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరై, మాట్లాడారు. ''సంతాన సమస్యలు ఉన్నవారు చికిత్స తీసుకోవచ్చు. కానీ అన్నీ బాగుండి లైఫ్ స్టైల్ వల్ల సంతాన లేమితో బాధపడేవారిని ఈ మూవీలో అడ్రస్ చేశాం'' అని తెలిపారు సంజీవ్ రెడ్డి.

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
336	121
83,871	25,695

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	23,397	▼	130
డోజోన్స్	47,758	▲	399
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,910	▲	123
డాక్స్	24,096	▲	136
షాంఘై	4,003	▼	16
నికాయ్	50,641	▼	271

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.25	89.27
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.41	118.36
€	యూరో	ఎస్‌బీఐ	101.19	103.97
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	56.84	58.25
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	56.80	59.07
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.70	69.41
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.74	24.23
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.24	24.48
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.57	13.39

అదానీ మెగా బ్యాటరీ స్టోరేజ్!

- ప్రపంచంలో అతిపెద్ద ప్రాజెక్టుల్లో ఒకటి..
- గుజరాత్‌లో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటన
- 2026 మార్చికల్లా సిద్ధం..



న్యూఢిల్లీ: దేశీ కార్పొరేట్ దిగ్గజం అదానీ గ్రూప్ పునరుత్పాదక (రెన్యూవబుల్) ఇంధన రంగంలో మరిన్ని భారీ ప్రణాళికలకు తెరతీసింది. బ్యాటరీ విద్యుత్ స్టోరేజీ రంగంలోకి అడుగుపెడుతున్నట్లు ప్రకటించింది. దీనిలో భాగంగా గుజరాత్‌లోని ఖావ్డాలో 1,126 మెగావాట్లు/3,530 మెగావాట్ అవర్ (ఎండబ్ల్యూహెచ్) సామర్థ్యం గల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్)ను నెలకొల్పనున్నట్లు పేర్కొంది. ఇది ప్రపంచంలోనే భారీ స్టోరేజ్ ప్రాజెక్టుల్లో ఒకటిగా, భారత్‌లో అతిపెద్ద కేంద్రంగా నిలుస్తుందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఈ స్టోరేజ్ కేంద్రంలో 700కు పైగా బీఈఎస్ఎస్ కంటెయినర్లు ఉంటాయని, మొత్తం ప్రాజెక్ట్ 2026 మార్చి నాటికి సిద్ధమవుతుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. కాగా, ఇదే చోట నిర్మిస్తున్న ప్రపంచంలోనే అతిపెద్ద పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ సముదాయంలో భాగంగానే తాజా ప్రాజెక్టును అదానీ చేపడుతోంది.

బ్యాకప్ అవసరాలకు...

రెన్యూవబుల్ విద్యుత్‌ను మరింత నమ్మకమైన ఇంధన వనరుగా ఉపయోగించుకోవడంతో పాటు బ్యాకప్ పవర్‌ను అందించడానికి, గ్రిడ్ స్థిరత్వాన్ని మెరుగుపరచడానికి బ్యాటరీ స్టోరేజ్ చాలా అవసరం. సౌర, పవన తదితర వనరుల నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను నిల్వ చేసి, అవి అందుబాటులో లేని సమయాల్లో, అంటే రాత్రి పూట లేదా తక్కువ గాలి వేగం ఉండే సమయాల్లో ఉపయోగించుకోవడానికి బ్యాటరీ స్టోరేజ్ వీలు కల్పిస్తుంది. దీనివల్ల గ్రిడ్‌పై, శిలాజ ఇంధనాలపై ఆధారపడటం తగ్గుతుంది, అదేవిధంగా కరెంట్ బిల్లులు తగ్గడంతో పాటు నిరంతర విద్యుత్ సరఫరాకు తోడ్పడుతుంది. 'గ్రిడ్‌పై మరింత విశ్వాసం పెంచడంతో పాటు, పీక్ లోడ్ ఒత్తిళ్లను తగ్గించడం, సరఫరాపరమైన సమస్యలకు చెక్ పెట్టడం, రోజంతా పర్యావరణహిత విద్యుత్ అందించడాన్ని ఈ ప్రాజెక్ట్ లక్ష్యంగా పెట్టుకుంది. మరింత మెరుగైన పనితీరు కోసం విద్యుత్ నిర్వహణ వ్యవస్థలతో అనుసంధానించిన అధునాతన లిథియం–అయాన్ బ్యాటరీ టెక్నాలజీని ఇందులో వినియోగించడం జరుగుతుంది' అని అదానీ గ్రూప్ వెల్లడించింది. ఈ బీఈఎస్ఎస్ ప్రాజెక్టులో 3,530 ఎండబ్ల్యూహెచ్ విద్యుత్‌ను నిల్వ చేయగలుగుతారు, అంటే 1,126 మెగావాట్ల విద్యుత్‌ను 3 గంటల పాటు సరఫరా చేయడానికి వీలవుతుంది. కాగా, 2027 ఆర్థిక సంవత్సరం నాటికి స్టోరేజ్ సామర్థ్యాన్ని 15 జీడబ్ల్యూహెచ్‌కు, ఐదేళ్లలో 50 జీడబ్ల్యూహెచ్‌కు పెంచే ప్రణాళికల్లో ఉన్నట్లు అదానీ గ్రూప్ పేర్కొంది.

చరిత్రాత్మక ప్రాజెక్ట్...

> పునరుత్పాదక విద్యుత్ భవిష్యత్తుకు ఎనర్జీ స్టోరేజ్ అత్యంత కీలకమైనది. ఈ చరిత్రాత్మక ప్రాజెక్ట్ అనేది ప్రపంచ ప్రమాణాలను నెలకొల్పడమే కాకుండా భారతదేశ ఇంధన అవసరాలు, పునరుత్పాదక విద్యుత్ విషయంలో మన నిబద్ధతను మరింత చాటి చెబుతుంది.
>
> – గౌతమ్ అదానీ, అదానీ గ్రూప్ చైర్మన్

ఫెడరల్ కార్డ్ భారీ పెట్టుబడులు

దేశీయంగా రూ. 2,200 కోట్లకు రెడీ

ముంబై: కార్డుల తయారీ యూఎస్ కంపెనీ ఫెడరల్ కార్డ్ సర్వీసెస్ దేశీయంగా 25 కోట్ల డాలర్లు(రూ. 2,200 కోట్లు) ఇన్వెస్ట్ చేయనుంది. పుణేలో మెటల్, బయోడీగ్రేడబుల్ కార్డుల తయారీ ప్లాంటును ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ పేర్కొంది. టెక్నాలజీ, రియల్టీ, సర్వీసు రంగాలలో పెట్టుబడులతో ప్రత్యక్షంగా 1,000 మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో ఉన్నట్లు వెల్లడించింది. పుణే ప్లాంటులో 100 శాతం మెటల్, బయోడీగ్రేడబుల్ కార్డుల తయారీ చేపట్టనున్నట్లు పేర్కొంది. 2026 ఫిబ్రవరికల్లా ప్లాంటును ప్రారంభించే యోచనలో ఉన్నట్లు తెలియజేసింది. తొలి దశలో 32,000 చదరపు అడుగులలో ప్లాంటును నెలకొల్పనున్నట్లు తెలియజేసింది. వార్షికంగా 20 లక్షల కార్డుల తయారీ సామర్థ్యంతో ప్రారంభంకానున్నట్లు వెల్లడించింది. తదుపరి 26.7 మిలియన్లకు సామర్థ్యాన్ని విస్తరించనున్నట్లు తెలియజేసింది. దేశీ మార్కెట్ పట్ల ఆసక్తిని చూపిస్తున్న కంపెనీ ప్రపంచవ్యాప్త వృద్ధిలో భారత్ కేంద్రంగా నిలవనున్నట్లు వివరించింది. పుణేలో పెట్టుబడులు దేశీయంగా దీర్ఘకాలిక కట్టుబాటుకు ప్రారంభమని పేర్కొంది. తద్వారా అంతర్జాతీయంగా పేమెంట్ సొల్యూషన్లను భారత్ నుంచి సమకూర్చనున్నట్లు తెలియజేసింది. కంపెనీ ఇప్పటికే యాక్సిస్ బ్యాంక్, వీసా, మాస్టర్‌కార్డ్, ఎఫ్‌పీఎల్ టెక్నాలజీస్(వన్‌కార్డ్)తో భాగస్వామ్యాలు కుదుర్చుకుంది.

నష్టాల్లోంచి లాభాల్లోకి..

- మైనస్ 411 నుంచి ప్లస్ 366 పాయింట్లకు సెన్సెక్స్
- 121 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- అమెరికా–భారత్ వాణిజ్య ఒప్పందంపై ఆశలు
- రాణించిన ఐటీ, టెలికం షేర్లు

ముంబై: ట్రేడింగ్ ఆరంభ నష్టాల నుంచి తేరుకున్న స్టాక్ సూచీలు మంగళవారం అరశాతం లాభపడ్డాయి. అమెరికా–భారత్ మధ్య వాణిజ్య ఒప్పందంపై ఆశలు ఇన్వెస్టర్లకు ఊరటనిచ్చాయి. ఫలితంగా సెన్సెక్స్ 336 పాయింట్లు పెరిగి 83,871 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 121 పాయింట్లు బలపడి 25,695 వద్ద నిలిచింది. ఢిల్లీలో పేలుడు ఘటన ఆందోళనలతో సూచీలు ఉదయం బలహీనంగా మొదలయ్యాయి. వీక్లీ ఎక్స్‌పైరీ రోజు కావడంతో మరింత ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 411 పాయింట్లు కోల్పోయి 83,124 వద్ద, నిఫ్టీ 125 పాయింట్లు పతనమై 25,449 వద్ద కనిష్టాన్ని తాకాయి. అయితే అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూలతలు, దేశీయ కార్పొరేట్ ఆర్థిక ఫలితాలు మెప్పించడంతో కనిష్ట స్థాయిల వద్ద కీలక రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ముఖ్యంగా ఐటీ, ఆటో, మెటల్, ఎఫ్‌ఎంసీజీ షేర్లకు భారీ డిమాండ్ నెలకొంది. దీంతో సూచీలు ఆరంభ నష్టాలు భర్తీ చేసుకోవడమే కాకుండా.. అరశాతం లాభంతో ట్రేడింగ్‌ను ముగించాయి. అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ ముగించేందుకు ప్రవేశపెట్టిన తీర్మానానికి సెనెట్ ఆమోదం తెలపడంతో ఆసియాలో కొరియా, హాంగ్‌కాంగ్, జపాన్ సూచీ లు లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు 1% పెరిగాయి. లాభాల స్వీకరణతో అమెరికా స్టాక్ సూచీలు అరశాతం నష్టంతో ట్రేడవుతున్నాయి.

- డాలర్ మారకంలో రూపాయి విలువ 23 పైసలు బలపడి 88.50 వద్ద స్థిరపడింది. అమెరికా–భారత్‌ల మధ్య వాణిజ్య ఒప్పందంపై ఆశలు, యూఎస్ ప్రభుత్వం షట్‌డౌన్ ముగింపు అంశాలు దేశీయ కరెన్సీ ర్యాలీకి దన్నుగా నిలిచాయి.
- బీఎస్ఈలో రంగాల వారీ ఇండెక్సుల్లో సర్వీసెస్ 1.6%, టెలికం 1.59%, ఐటీ 1.21% రాణించాయి.

ప్రత్యక్ష పన్ను వసూళ్ల జోరు

7% అప్; 12.92 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: ప్రత్యక్ష పన్ను వసూళ్లు బలంగా నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) ఏప్రిల్ 1 నుంచి నవంబర్ 10 వరకు రూ.12.92 లక్షల కోట్ల నికర పన్ను వసూలైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో వచ్చిన రూ12.08 లక్షల కోట్లతో పోల్చితే 7 శాతం పెరిగింది. కార్పొరేట్ పన్ను రూపంలో నికరంగా రూ.5.37 లక్షల కోట్లు వచ్చింది. క్రితం ఆర్థిక సంవత్సరం సరిగ్గా ఇదే కాలంలో వచ్చిన మొత్తం రూ.5.08 లక్షల కోట్లుగా ఉంది. ఈ కాలంలో రిఫండ్‌లు (పన్ను చెల్లింపుదారులకు వాపసు) 18% తగ్గి రూ.2.42 లక్షల కోట్లుగా ఉన్నాయి. 2025–26 మొత్తం మీద రూ.25.2 లక్షల కోట్లు ప్రత్యక్ష పన్నుల రూపంలో సమకూరుతుందని కేంద్ర సర్కారు బడ్జెట్‌లో అంచనా వేసింది.

ఓఎన్‌జీసీ లాభం డౌన్

- క్యూ2లో రూ. 9,848 కోట్లు
- షేరుకి రూ. 6 డివిడెండ్

న్యూఢిల్లీ: ఇంధన రంగ పీఎస్‌యూ దిగ్గజం ఓఎన్‌జీసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 18 శాతం క్షీణించి రూ. 9,848 కోట్లకు పరిమితమైంది. ముడిచమురు ధరలు నీరసించడం ప్రభావం చూపింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 11,984 కోట్లు ఆర్జించింది. ముడిచమురు బ్యారల్ ధరలు 78.33 డాలర్ల నుంచి 67.34 డాలర్లకు క్షీణించడం లాభాలను దెబ్బతీసినట్లు కంపెనీ పేర్కొంది. అయితే పురాతన బావుల నుంచి వెలికితీసే నేచురల్ గ్యాస్ ధర 3.8 శాతం పుంజుకుని ఒక్కో ఎంఎంబీటీయూ 6.75 డాలర్లను తాకింది. కొత్త బావుల నుంచి వెలికితీసిన గ్యాస్ ధర 9.42 డాలర్ల నుంచి 8.36 డాలర్లకు తగ్గింది. దేశీయంగా నిర్ణయించే ఏపీఎం ధరలతో పోలిస్తే వీటికి 20 శాతం ప్రీమియంకు వీలుంటుంది. దీంతో వీటి నుంచి అధికంగా గ్యాస్ ఉత్పత్తికి కంపెనీ ప్రాధాన్యత ఇస్తోంది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 6 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఇందుకు రూ. 7,548 కోట్లు వెచ్చించనుంది. కాగా.. సమీక్షా కాలంలో ఓఎన్‌జీసీ స్థూల ఆదాయం 2.5 శాతం క్షీణించి రూ. 33,031 కోట్లకు పరిమితమైంది. ఈ కాలంలో 4.63 మిలియన్ టన్నుల ముడిచమురుతోపాటు.. 4.918 బిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్‌ను ఉత్పత్తి చేసింది.

ఫలితాల నేపథ్యంలో ఓఎన్‌జీసీ షేరు బీఎస్ఈలో 0.8 శాతం నష్టంతో రూ. 249 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
హైరింగ్ 'పండగ'! 2.16 లక్షల గిగ్ జాబ్స్ | ఈక్విటీ ఫండ్స్‌కు తగ్గుతున్న ఆకర్షణ!

పేరుకే ఈసీలు.. దిక్కుతోచని వీసీలు

విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తున్న చంద్రబాబు ప్రభుత్వం

- 16 నెలలుగా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశాలు లేవు
- ఈసీ సమావేశాల నిర్వహణకు వీసీలకు అనుమతి ఇవ్వని ఉన్నతవిద్య కీలక అధికారి
- తాను చెప్పినప్పుడు, తనకు నచ్చిన అజెండా ప్రకారమే నిర్వహించాలంటూ హుకుం
- 2025–26 బడ్జెట్‌కు ఈసీ అప్రూవల్ లేకుండానే ఆర్థిక వ్యవహారాల నిర్వహణ
- ఇప్పటికీ అరడజను వర్సిటీల్లో ఒక్కసారి కూడా ఈసీ సమావేశం పెట్టలేని దుస్థితి

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేలా వ్యవహరిస్తోంది. స్వతంత్ర సంస్థలుగా విద్యాసేవలను అందించాల్సిన విశ్వవిద్యాలయాలను అనధికారిక నిబంధనల పేరుతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. రాజ్యాంగం, చట్టాలు కల్పించిన హక్కులను కాలరాస్తూ కనీసం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) సమావేశాలు నిర్వహించకుండా వర్సిటీల పాలన కుంటుపడేలా చేస్తోంది. 2025–26 ఆర్థిక సంవత్సరం ప్రారంభమై ఏడునెలలు గడిచినా వర్సిటీల్లో ఇంతవరకు వార్షిక బడ్జెట్‌కు ఈసీ అప్రూవల్స్ లేవంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. మరోవైపు వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రపోజల్స్ సైతం సిద్ధమవుతున్న తరుణంలో ప్రస్తుత బడ్జెట్‌కే అప్రూవల్స్ లేకపోవడం వర్సిటీల ఆర్థిక వ్యవహారాల నిర్వహణపై తీవ్రప్రభావం చూపనుంది. బడ్జెట్ ఆమోదం లేకుండా ఖర్చు చేసేసిన తర్వాత వాటిని రాటిఫై చేసుకోవడం అనేది ఇంతవరకు జరగలేదని విద్యావేత్తలు విమర్శిస్తున్నారు. వర్సిటీల చట్టం ప్రకారం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌కి అధిపతిగా వైస్ చాన్సలర్ (వీసీ) వ్యవహరిస్తారు. ప్రభుత్వం నుంచి ఉన్నత విద్యామండలి చైర్మన్, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి, ఆర్థికశాఖ కార్యదర్శి, కళాశాల విద్యా శాఖ కమిషనర్/డైరెక్టర్లతో పాటు వర్సిటీలోని ఆచార్యులు, పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛందసంస్థల వారు, విద్యావేత్తలు సభ్యులుగా నామినేట్ అవుతారు. మూడునెలలకు ఒకసారి ఈసీ సమావేశం నిర్వహించాలనేది ప్రాథమిక నిబంధన. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చట్టాలను కాలగర్భంలో కలిపేసింది. 16 నెలలుగా వర్సిటీల్లో పూర్తిస్థాయి ఈసీ సమావేశాలు నిర్వహించకుండానే కాలం గడిపేస్తోంది. దీంతో వర్సిటీల్లో పాలన, ఆర్థిక వ్యవహారాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాస్తవానికి అత్యవసరంగా తీసుకున్న నిర్ణయాలను రాటిఫై పేరుతో తర్వాత ఈసీ సమావేశాల్లో ఆమోదిస్తారు. కానీ కూటమి పాలనలో సాధారణ నిర్ణయాలను కూడా ఈసీ సమావేశాల్లేక రాటిఫై చేసుకోవడానికి వీలుకలగడంలేదు. వర్సిటీల్లో కీలకంగా వ్యవహరించే రిజిస్ట్రార్ల నియామకం విషయంలోను ఈసీ ఆమోదం తప్పనిసరి. ఉత్తరాంధ్రలోని ప్రముఖ వర్సిటీలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రిజిస్ట్రార్‌గా నియమితులైన వ్యక్తికి ఈసీ ఆమోదం పొందడానికి ఏడాది పట్టింది. ఇంతలో ఆ వ్యక్తి మారిపోయారు. వీసీ మరొకరిని రిజిస్ట్రార్‌గా నియమించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈసీ సమావేశమే జరగలేదు. అసలు ఈసీ ఆమోదం లేని వ్యక్తి వర్సిటీలో కీలక ఆర్థిక వ్యవహారాలు నడిపిస్తూ వాటిని రాటిఫై చేసుకునే ఆలోచన మొత్తం వర్సిటీ పారదర్శకతనే ప్రశ్నిస్తోంది. ఇప్పటికీ అరడజనుకుపైగా వర్సిటీల్లో ఒక్కసారి కూడా ఈసీ సమావేశం నిర్వహించలేదంటే విశ్వవిద్యాలయాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం తెలుస్తోంది.

అంతా తానే అంటున్న అధికారి

వైస్ చాన్సలర్ ముందుస్తు సమాచారంతో ఈసీ సమావేశం ఏర్పాటుచేసి కోరం ఉంటే అజెండా ప్రకారం నిర్ణయాలు ఆమోదింపజేసుకోవచ్చు. కానీ కూటమి ప్రభుత్వంలో ఉన్నత విద్యాశాఖలోని ఓ కీలక అధికారి వర్సిటీలపై పట్టుకోసం వీసీలు, రిజిస్ట్రార్ల అధికారాలకు కత్తెర వేస్తూ ఈసీ సమావేశాలు జరగనివ్వకుండా చూడటం వర్సిటీ వర్గాల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. ఈసీలో మెంబర్ మాత్రమే అయిన ఆ అధికారి.. గవర్నర్ ఆమోదంతో నియమితులైన వీసీలను, ఉన్నత విద్యామండలి చైర్మన్ అధికారాలను బైపాస్ చేస్తూ ఈసీల నిర్వహణకు అడ్డుకట్టు వేస్తుండటం గమనార్హం. తనకు వీలైనప్పుడు, తనకు నచ్చిన అజెండా ప్రకారమే ఈసీ సమావేశం నిర్వహించాలని నిర్దేశిస్తున్నారు. అందుకు అనుగుణంగా ఉన్నప్పుడే ఈసీ సమావేశం నిర్వహణకు ఓకే చెబుతున్నారు. ఆ అధికారికి సమయం లేకపోతే ఎంత కాలమైనా వీసీలు అనుమతి కోసం వేచిచూడాల్సిన దుస్థితి నెలకొంది. మరో విచిత్రం.. ఆ అధికారి మాత్రం ఈసీ సమావేశానికి వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరవుతారు. మిగిలిన సభ్యులు నేరుగా హాజరుకావాలని హుకుం జారీచేస్తుంటారు. కొన్ని జిల్లాల్లో కలెక్టర్లు సైతం వీసీలను తీవ్రంగా అవమానిస్తున్నట్లు విమర్శలున్నాయి. తన పరిధిలోకి రాని ఉన్నతవిద్య అంశంలో రాయలసీమ జిల్లాల్లోని ఓ కలెక్టర్ జోక్యం చేసుకోవడమేగాక, గౌరవంగా కలిసి సమస్యను వివరించేందుకు వెళ్లిన వీసీని బయట కూర్చోబెట్టి అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా పంపించటం విమర్శలకు దారి తీసింది.

షాడోల రాజ్యం

ఉన్నత విద్యాశాఖలో షాడోల పాలన నడుస్తోంది. విద్యాశాఖ మంత్రి ఓఎస్‌డీ షాడో మంత్రిగా వ్యవహరిస్తుంటే.. ఉన్నత విద్యాశాఖలోని కీలక అధికారికి ఎన్నడూ పాఠాలు చెప్పని ఓ సీనియర్ లెక్చరర్ అనుమతి లేని ఓఎస్‌డీ పోస్టు సృష్టించుకుని షాడో పాత్ర పోషిస్తున్నారు. ఈ ఇద్దరు షాడోల దెబ్బకి ఉన్నత విద్యావ్యవస్థ, వర్సిటీలు కుప్పకూలిపోతున్నాయి. మంత్రి షాడోగా ఉన్న వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా ఆర్డర్లు ఇస్తుంటే.. ఉన్నతాధికారి షాడో అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా సమాచారం పేరుతో ఫోన్లు చేయడమేగాక అజెండాలు కూడా నిర్దేశిస్తున్నారని పలువురు వీసీలు ఆవేదన చెందుతున్నారు. వాస్తవానికి మంత్రికి, కీలక ఉన్నతాధికారికి విద్యాసంబంధిత అంశాలను పట్టించుకునే తీరకలేదని, తమకు కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వటంలేదని వర్సిటీల అధికారులు పేర్కొంటున్నారు. కూటమి పాలనలో విశ్వవిద్యాలయాలు నిర్వీర్యమవుతున్నాయని విద్యావేత్తలు ఆవేదన చెందుతున్నారు.

ప్రభుత్వ వైద్యుడి ప్రైవేటు దందా..

మదనపల్లెలో కిడ్నీ రాకెట్

గ్లోబల్ ఆస్పత్రిలో రహస్యంగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు

- ఆపరేషన్ వికటించి విశాఖ జిల్లా మహిళ మృతి
- గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాన్ని తరలించేందుకు యత్నం

పోలీసుల అదుపులో దళారులు సత్య, పద్మ (ఇన్‌సెట్‌లో) యమున (ఫైల్)

మదనపల్లె రూరల్/తగరపువలస (విశాఖ): అన్నమయ్య జిల్లా మదనపల్లెలో మంగళవారం వెలుగుచూసిన కిడ్నీ రాకెట్ వ్యవహారం కలకలం రేపింది. జిల్లా ప్రభుత్వాస్పత్రుల సమన్వయాధికారి(డీసీహెచ్ఎస్)గా పనిచేస్తున్న ప్రభుత్వ వైద్యుడు ఆంజనేయులుకు చెందిన గ్లోబల్ ఆస్పత్రిలో రహస్యంగా నిర్వహించిన కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స వికటించి విశాఖ జిల్లా ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెం గ్రామానికి చెందిన సాడి యమున (29) అనే మహిళ మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యమున భర్త కృష్ణ తొమ్మిదేళ్ల క్రితం మరణించగా.. ఆమె మధురవాడలో ఒక దుకాణంలో పనిచేస్తూ పదేళ్ల కుమారుడిని పోషించుకుంటోంది. ఆమెకు డబ్బు ఆశచూపి కొందరు దళారులు మదనపల్లె తీసుకొచ్చారు. శస్త్ర చికిత్స వికటించి యమున మృతి చెందగా.. కిడ్నీ రాకెట్ వ్యవహారం బయటపడుతుందనే ఉద్దేశంతో మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా విశాఖకు తరలించేందుకు దళారులు చేసిన ప్రయత్నం విఫలమైంది. మృతురాలిని ఇక్కడకు తీసుకొచ్చిన దళారుల్లో ఒకరైన సూరిబాబుకు, మిగిలిన దళారులకు మధ్య వివాదం తలెత్తగా.. సూరిబాబు 112 నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించడంతో తిరుపతి ఈస్ట్ పోలీసులు రంగంలోకి దిగారు. ప్రాథమిక విచారణ అనంతరం దళారులు సూరిబాబు, పద్మ, సత్యతోపాటు మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రి డయాలసిస్ సెంటర్ టెక్నీషియన్ బాలరంగడును అదుపులోకి తీసుకుని టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం గ్లోబల్ ఆస్పత్రికి వెళ్లి డీసీహెచ్ఎస్ ఆంజనేయులును విచారించారు. ఆయన కోడలు డాక్టర్ శాశ్వతి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి డయాలసిస్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. రాకెట్ వెనుక ప్రధాన సూత్రధారుల వివరాలను రాబట్టే పనిలో పోలీసులు నిమగ్నమై ఉన్నారు. ఈ విషయమై టూటౌన్ సీఐ రాజారెడ్డి మాట్లాడుతూ.. కేసు విచారణ దశలో ఉందని, త్వరలోనే వివరాలు వెల్లడిస్తామన్నారు. ప్రభుత్వ వైద్యుడికి చెందిన ఆస్పత్రిలో నిబంధనలకు విరుద్ధంగా, అనధికారికంగా అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు చేయడం పట్టణంలో కలకలం రేపింది.

పిక్నిక్‌కు వెళ్లి తిరిగి రాలేదు

మధురవాడలో ఒక దుకాణంలో పనిచేస్తున్న యమున ఈ నెల 6న స్నేహితులతో కలిసి పిక్నిక్‌కు అని ఇంటినుంచి వెళ్లింది. ఆ తరువాత ఇంటికి తిరిగిరాలేదు. మదనపల్లెలో కిడ్నీ రాకెట్ కారణంగా యమున చనిపోయినట్టు బొడ్డపాలెం వాసులకు సమాచారం అందడంతో బంధువులు, గ్రామస్తులు మంగళవారం రాత్రి మదనపల్లె బయలుదేరి వెళ్లారు.

మైనార్టీల సంక్షేమ దినోత్సవం నిర్వహించే అర్హత చంద్రబాబుకు లేదు

బాబు పాలనలో ముస్లిం మైనారిటీల ప్రాణాలకు రక్షణ లేదు

వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ ఖాదర్ బాషా ధ్వజం

సాక్షి, అమరావతి: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంత్యుత్సవాన్ని మైనార్టీల సంక్షేమ దినోత్సవంగా నిర్వహించే అర్హత చంద్రబాబుకు లేదని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఖాదర్ బాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ హఫీజ్ ఖాన్ ధ్వజమెత్తారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తయినా ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయకపోగా ముస్లిం మైనార్టీలపై దాడులకు పాల్పడుతూ, ఇళ్లను కూల్చివేస్తూ తమపైనే అక్రమ కేసులు నమోదు చేసి వేధింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలను ద్వితీయశ్రేణి పౌరులుగానే చూస్తున్నారని చెప్పారు. పెళ్లిళ్లలో జగనన్న పాటలు పెట్టుకున్నా ఈ ప్రభుత్వం ఓర్వలేకపోతోందని, జావీర్ అనే యువకుడిని పోలీసులు తీసుకెళ్లి దారుణంగా కొట్టి అక్రమ కేసు పెట్టారని వివరించారు. వినుకొండలో నడిరోడ్డు మీద రషీద్‌ను అత్యంత కిరాతకంగా నరికి చంపితే నిందితులను శిక్షించాల్సిన ప్రభుత్వం, రషీద్ కుటుంబసభ్యులపైనే కేసులు పెట్టి వేధిస్తోందని, ఈ కేసులో సాక్ష్యం చెప్పడానికి వచ్చిన వారిని కూడా బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఇఫ్రత్ జహాన్ అనే పదో తరగతి బాలిక పదో తరగతిలో 600 మార్కులకు 599 మార్కులు సాధించినందుకు గవర్నర్ అబ్దుల్ నజీర్, మాజీ వైఎస్ జగన్ అభినందించినా చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేశ్ కనీసం స్పందించలేదని ధ్వజమెత్తారు. ఇమామ్‌లు, మౌజమ్‌లకు పెండింగ్ వేతనాలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ భూములను కాపాడేలా మాజీ సీఎం వైఎస్ జగన్ జీవో నంబర్ 40 తీసుకొస్తే, 2024లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని, టీడీపీ నేతలు వక్ఫ్ ఆస్తులను దోచేస్తున్నారని విమర్శించారు. దీనిపై ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఢిల్లీలో ఎర్రకోట వద్ద జరిగిన బాంబు దాడిని తీవ్రంగా ఖండించారు. నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు జరిగినప్పుడు దేశమంతా ఒక్కటై బాధితులకు అండగా నిలవాలని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్టేట్ సెక్రటరీ షేక్ శిరాజ్ బాషా, మైనార్టీ నాయకులు జె. నజీర్ బాషా, పీఎస్ ఖాన్, ఖాదర్, జాబిర్, రషీద్ బ్రదర్స్, గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

తిరుమల లడ్డూపై ఆధారాల్లేని ఆరోపణలు

మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్

సాక్షి, అమరావతి: తిరుమల లడ్డూపై ఆధారాల్లేని ఆరోపణలు చేస్తూ.. లేని కల్తీ జరిగిందంటూ చంద్రబాబు ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. కేవలం వైఎస్సార్‌సీపీ నేతలపై కక్షసాధింపు కోసం చివరకు దేవుడినీ రాజకీయాల్లోకి లాగడం దుర్మార్గమని మండిపడ్డారు. నెయ్యి నాణ్యతపై ఈవో, చంద్రబాబు, లోకేశ్ తలోమాట మాట్లాడుతూ కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఆక్షేపించారు.

హిందువులపై బాబు సర్కారు కపట ప్రేమ

'చంద్రబాబు ప్రభుత్వం హిందువులపై కపట ప్రేమ నటిస్తోంది. ఈ ప్రభుత్వం వచ్చాక 17 నెలల్లో ఆలయాల్లో వరుసగా అపచారాలు జరుగుతూనే ఉన్నాయి. తిరుపతి, సింహాచలం, కాశీబుగ్గ ఆలయాల్లో జరిగిన దుర్ఘటనలతో ఏ ఆలయానికి వెళితే భద్రత ఎలా ఉంటుందోనన్న ఆందోళన భక్తుల్లో నెలకొంది. తిరుమలలో ముందెన్నడూ లేనివిధంగా మాంసాహారం తినడం, మద్యం తాగడం, చెప్పులతో దర్శనానికి రావడం వంటి అపచారాలు చోటుచేసుకున్నాయి. భక్తుల రక్షణలో విఫలమైన కూటమి ప్రభుత్వం కేవలం డైవర్షన్ పాలిటిక్స్ కోసమే ఆరోపణలు చేస్తోంది. ఎక్కడ అపచారం జరిగినా దానినుంచి దృష్టి మరల్చడానికి వెంటనే తిరుమల లడ్డూ అంశాన్ని తెరపైకి తీసుకురావడం బాబు సర్కారుకు అలవాటుగా మారింది. ప్రభుత్వం తన దగ్గర ఆధారాలుంటే చర్యలు తీసుకోవాలే తప్ప అనవసరమైన ఆరోపణలు చేయకూడదు' అని వెలంపల్లి ఎద్దేవా చేశారు.

అప్పుడెందుకు నోరు మెదపలేదు బాబూ!

'లడ్డూ ప్రసాదంలో జూన్ నెలలో జంతు కొవ్వు కలిసిందన్న చంద్రబాబు సెప్టెంబరు వరకు ఎందుకు నోరు విప్పలేదు. చంద్రబాబు సీఎం అయిన వెంటనే టీటీడీ పాలకమండలితో పాటు ఈవోను కూడా మార్చారు. జూన్ 21న అప్పటి ఈవో శ్యామలరావు టీటీడీలో అంతా సక్రమంగా ఉందన్నారు. ఆ తర్వాత వెజిటబుల్ ఫ్యాట్ ఉందని ఆయన చెబితే.. చంద్రబాబు మాత్రం యానిమల్ ఫ్యాట్ కలిసిందన్నారు. ఇద్దరూ పొంతనలేని ప్రకటనలు చేశారు. నాలుగు లారీల నెయ్యిని వెనక్కి పంపించామని ఒకరు, లడ్డూ ప్రసాదంలో వాడామని మరొకరు చెప్పారు. ఆధారాల్లేకుండా సీఎం స్థాయి వ్యక్తి ఎలా మాట్లాడతారని సుప్రీం కోర్టే ప్రశ్నించింది. నెయ్యి కల్తీపై ఆధారాలు ఉన్నాయని సిట్ ఎందుకు మీడియాకు చెప్పడం లేదు? లోకేశ్ వైఎస్సార్‌సీపీపై బురద చల్లుతూ ఎందుకు ట్వీట్ చేస్తున్నారు?' అని వెలంపల్లి నిలదీశారు.

క్లుప్తంగా...

వెబ్ ఆప్షన్‌ల నమోదుకు అవకాశం

సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్ బీ, సీ కేటగిరీ సీట్లలో ప్రవేశాల కోసం మూడో దశ కౌన్సెలింగ్‌కు బుధవారం సాయంత్రం 4 గంటల్లోపు వెబ్‌ఆప్షన్లు నమోదు చేసుకోవాలని హెల్త్ వర్సిటీ మంగళవారం నోటిఫికేషన్ ఇచ్చింది. కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 12 సెల్ఫ్ ఫైనాన్స్, రెండు ఎన్ఆర్ఐ, ప్రైవేట్, మైనార్టీ కళాశాలల్లో బీ కేటగిరీ 240, 146 ఎన్ఆర్ఐ, పద్మావతిలో 2 ఎన్ఆర్ఐ సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొంది. ఆప్షన్‌ల నమోదులో సాంకేతిక సమస్యలు తలెత్తితే 9000780707, 8008250842 నంబర్‌లను సంప్రదించాలని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి సూచించారు.

ఏపీ యువతకు జర్మనీలో హెల్త్ కేర్ ఉద్యోగాలు

సాక్షి, అమరావతి: జర్మనీకి చెందిన యూరోప్ కెరీర్స్‌తో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ), ఓవర్సీస్ మ్యాన్‌పవర్ ఏపీ సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీంతో రాష్ట్ర యువతకు జర్మనీలో హెల్త్ కేర్ రంగంలో అంతర్జాతీయ ఉద్యోగాలు పొందేందుకు అవకాశం ఉంటుందని స్కిల్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోహర్ మంగళవారం తెలిపారు. జర్మనీలో నర్సులు, ఫిజియోథెరపిస్ట్‌లు, టెక్నీషియన్లు, పారా మెడికల్ ఉద్యోగాలకు భారీగా డిమాండ్ ఉందని చెప్పారు. ఈ ఒప్పందంలో భాగంగా యూరోప్ కెరీర్స్ సంస్థ ఏపీ యువతకు జర్మన్ భాషలో శిక్షణ ఇచ్చి, ఇంటర్వ్యూలు, జాబ్ కాంట్రాక్ట్‌లు, వీసా సమకూర్చడంతో పాటు జర్మనీ చేరిన తరువాత సంపూర్ణ సహకారాన్ని అందించనుందని పేర్కొన్నారు.

దుబ్బిగానిపల్లెకు జాతీయ నీటి అవార్డు

నీటి సంరక్షణ కుంటను పరిశీలిస్తున్న కేంద్రబృందం (ఫైల్)

మదనపల్లె: జాతీయస్థాయిలో ఉత్తమ పంచాయతీ, జల వనరుల పరిరక్షణ, నిర్వహణపై ఏటా ఇచ్చే ఆరో జాతీయ జల అవార్డులను కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ మంగళవారం ప్రకటించింది. ఇందులో అన్నమయ్య జిల్లా మదనపల్లె రూరల్ మండలంలోని దుబ్బిగానిపల్లె పంచాయతీ పై రెండు విభాగాలకు కలిపి ఉమ్మడి విజేతగా మొదటి ర్యాంకు దక్కించుకుంది. ఈ నెల 18న న్యూఢిల్లీలో జరిగే అవార్డుల ప్రదానోత్సవంలో ట్రోఫీ, ప్రశంసా పత్రం, రూ.2 లక్షల బహుమతిని అందజేయనున్నారు. నీటి సంరక్షణ, వాటివల్ల ప్రజలకు కలిగిన ప్రయోజనాల ఆధారంగా కేంద్రం ఈ అవార్డును ఇస్తుంది. దుబ్బిగానిపల్లె పంచాయతీలో నీటి వనరుల అభివృద్ధి, సంరక్షణ, వాటి ఫలితాల ఆధారంగా అవార్డుకు ఎంపిక చేశారు. ఈ పంచాయతీలో 2022 నుంచి ఇప్పటివరకు వాటర్‌షెడ్ పథకం కింద రూ.74 లక్షలతో చేపట్టిన నీటి కుంటలు, నీటి ఊటకుంటలు తదితర పనులను కేంద్ర బృందం ఈ ఏడాది జూన్ 11న పరిశీలించి కేంద్రానికి నివేదించింది. ఈ నివేదిక ఆధారంగా దుబ్బిగానిపల్లె పంచాయతీ జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధిస్తూ అవార్డుకు ఎంపికైంది.

గోదావరి టు హైదరాబాద్

తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు స్టాక్ పాయింట్‌లో ఇసుక నింపుతున్న యంత్రం

ఒకే బిల్లుపై అనేకసార్లు

కొవ్వూరు, తాళ్లపూడి మండలాల్లో 15 స్టాక్ పాయింట్లున్నాయి. వీటి వద్ద కనీస పర్యవేక్షణ లేదు. సీసీ కెమెరాలు, వేబ్రిడ్జి లేవు. నిత్యం ఒక అధికారి ఉండాలి. మామూళ్లు తీసుకుని వారు కనపడకుండా పోతున్నారు. ఎక్కడ ఉంటున్నారో తెలియడం లేదు. పై అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడే కనిపిస్తున్నారు. దీనికితోడు సరిహద్దుల్లో నిఘా లేకపోవడంతో ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది.

- స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక టన్ను రూ.160కు విక్రయించాల్సి ఉండగా కూటమి నేతల కనుసన్నల్లో రూ.300–రూ.350 వసూలు చేస్తున్నారు.
- కొవ్వూరు, చిడిపి, తాళ్లపూడి, కుమారదేవం, అరికిరేవుల తదితర స్టాక్ పాయింట్లలో ఇసుకను లారీల్లో నింపి రాష్ట్రం దాటిస్తున్నారు. గోపాలపురం, ఏలూరు జిల్లా చింతలపూడి పరిసర ప్రాంతాల మీదుగా పరిమితికి మించి రవాణా చేస్తుండడంతో ఇసుక రోడ్డుపైకి జారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దొంగ వే బిల్లులు, ఇతర పత్రాలు సృష్టించి హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒక లారీకి బిల్లు తీసుకుని అనేక ట్రిప్పులు వేస్తున్నారు. ఒకవేళ పట్టుకుంటే లారీ మరమ్మతుకు వెళ్లింది, రెండ్రోజులు ఆగిందని బుకాయిస్తున్నారు.

కొవ్వూరు, తాళ్లపూడి కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా

గోదావరి ఇసుకను అక్రమార్కులు సరిహద్దులు దాటించేస్తున్నారు. రాష్ట్ర అవసరాలకు ఉపయోగపడాల్సిన ప్రకృతి వనరును స్వప్రయోజనాలకు వాడుకుంటున్నారు. అయినా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు నుంచి నిత్యం వందల లారీల ఇసుక హైదరాబాద్ తరలిపోతోంది. నియోజకవర్గ ప్రజాప్రతినిధి అండదండలతో టీడీపీ కీలక నేత కనుసన్నల్లో రూ.కోట్లలో ఈ దందా సాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతా తెలిసినా అధికారులు మామూళ్లు దండుకుని చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే విమర్శలున్నాయి.

సాక్షి, రాజమహేంద్రవరం

తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలో కూటమి నేతల అండదండలతో ఇసుక మాఫియా బరితెగించింది. గామన్ బ్రిడ్జి సమీపంలో కుమారదేవం, ఆరికిరేవుల, పంగిడి, తాళ్లపూడి, చిడిపి, కొవ్వూరు తదితర చోట్ల నుంచి రోజుకు 200 లారీలకు పైగా ఇసుకను హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తోంది. లారీకి రూ.50 వేల నుంచి రూ.70 వేలు వసూలు చేస్తున్నారు. రోజుకు రూ.కోటిన్నర నెలకు రూ.45 కోట్లు కూటమి నేతలు దండుకుంటున్నారు. నియోజకవర్గంలోని ద్విసభ్య కమిటీ సభ్యులు, ఓ కీలక నేతకు చెందిన ఉద్యోగులు, ఓ ప్రజాప్రతినిధి అనుచరులు వ్యవహారమంతా దగ్గరుండి నడిపిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. నెల మామూళ్లు దండుకుంటున్న మైనింగ్ అధికారులు కళ్లెదుటే లారీలు తరలుతున్నా కన్నెత్తి చూడడం లేదు. ఇటీవల హైదరాబాద్ వెళ్తున్న లారీలను పట్టుకున్నట్లు హడావుడి చేసిన రెవెన్యూ అధికారులు రెండ్రోజుల తర్వాత మిన్నకున్నారు.

కలెక్టర్ దృష్టిసారిస్తేనే...

స్టాక్ పాయింట్ల నుంచి నిత్యం వందల లారీల ఇసుక తెలంగాణకు తరలుతోంది. మైనింగ్, రెవెన్యూ, పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లున్నారు. నామమాత్రంగా జరిమానాలు, కేసులు పెట్టి వదిలేస్తున్నారు. మామూళ్లు ముట్టజెప్పి మరుసటి రోజే ఇసుక మాఫియా రంగంలోకి దిగుతోంది. తిరిగి అవే లారీలతో అక్రమ రవాణా చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. జిల్లా కలెక్టరైనా దృష్టిసారిస్తేనే దీనికి అడ్డుకట్ట వేయవచ్చన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

ఉద్యోగాల కల్పనలో అట్టడుగున ఏపీ!

▶ మొదటి పేజీ తరువాయి

లేబర్ ఫోర్స్ సర్వే వెల్లడించింది.

- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 15 ఏళ్లు పైబడి అన్ని వయసుల వారికి సంబంధించి నిరుద్యోగితలో ఆంధ్రప్రదేశ్ 8.2 శాతంతో రెండో స్థానంలో ఉంది. అదే జాతీయ సగటు నిరుద్యోగిత 5.2 శాతం మాత్రమే ఉంది. జాతీయ సగటును మించి ఏపీలో నిరుద్యోగిత నమోదైంది. అత్యధికంగా 8.9 శాతం నిరుద్యోగంతో ఉత్తరాఖండ్ తొలి స్థానంలో ఉంది.
- గ్రామీణ, పట్టణప్రాంతాల్లో కలిపి ఆంధ్రప్రదేశ్‌లో పురుషుల్లో నిరుద్యోగిత 7.2 శాతం ఉండగా మహిళల్లో 10.1 శాతంగా ఉంది.
- రాష్ట్రంలో పట్టణాల్లో కన్నా గ్రామీణ ప్రాంతాల్లోనే అత్యధికంగా 8.5 శాతం నిరుద్యోగ సమస్య వేధిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో 7.7 శాతం నిరుద్యోగిత ఉందని నివేదిక తెలిపింది.
- ఏపీలో గ్రామీణ ప్రాంతాల్లో పురుషుల్లో నిరుద్యోగిత 7.3 శాతం ఉండగా, మహిళల్లో 10.5 శాతం ఉంది. పట్టణ ప్రాంతాల్లో పురుషుల్లో నిరుద్యోగిత 7.0 శాతం ఉండగా, మహిళల్లో 9.3 శాతం ఉందని నివేదిక పేర్కొంది.

యువతలో నిరుద్యోగులు 21 శాతం

ప్రత్యేకంగా యువతీ యువకుల నిరుద్యోగితలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నాలుగో స్థానంలో ఉంది. ఏపీలో 29 ఏళ్ల లోపు వయసున్న యువతీ యువకుల నిరుద్యోగిత 21.0 శాతంగా ఉందని నివేదిక తెలిపింది. ఇది జాతీయ స్థాయి కంటే చాలా ఎక్కువ. జాతీయ స్థాయిలో యువతీ యువకుల్లో నిరుద్యోగిత 14.8 శాతం మాత్రమే ఉంది. ఏపీ గ్రామీణ ప్రాంతాల్లో పురుషుల్లో 19.5 శాతం, మహిళల్లో 21.9 శాతం నిరుద్యోగిత ఉంది. పట్టణ ప్రాంతాల్లో పురుషుల్లో 19.7 శాతం, మహిళల్లో 28.8 శాతం ఉందని నివేదిక తెలిపింది.

ఈ ఏడాది జూలై నుంచి సెప్టెంబర్ వరకు నిరుద్యోగత ఇలా ((15 ఏళ్లు పైబడిన వారు))

రాష్ట్రం	నిరుద్యోగితా శాతం		
ఉత్తరాఖండ్	8.9	తెలంగాణ	5.7
ఆంధ్రప్రదేశ్	8.2	ఛత్తీస్‌గఢ్	5.6
కేరళ	8.0	అసోం	5.2
హిమాచల్ ప్రదేశ్	7.9	మహారాష్ట్ర	5.1
రాజస్థాన్	7.4	బిహార్	4.8
ఢిల్లీ	6.6	ఒడిశా	4.5
పంజాబ్	6.5	జార్ఖండ్	4.3
హరియాణ	6.2	పశ్చిమబెంగాల్	3.7
జమ్మూ-కాశ్మీర్	6.1	మధ్యప్రదేశ్	3.7
ఉత్తరప్రదేశ్	5.9	కర్ణాటక	2.8
తమిళనాడు	5.7	గుజరాత్	2.2
		ఆల్ ఇండియా	5.2

ఏడాదిలో 85 గంటలు!

- హైదరాబాద్‌లో ఒక్కో ప్రయాణికుడు ట్రాఫిక్‌లో గడిపే సమయం
- 10 కి.మీ. దూరానికి పట్టే సమయం 31 నిమిషాల 30 సెకన్లు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ అంటే ముందుగా గుర్తొచ్చేది ట్రాఫిక్ రద్దీ. ఏడాదిలో ఇక్కడ ట్రాఫిక్‌లో గడిపే సమయం 85 గంటలు. నగరంలో 10 కిలోమీటర్ల దూరానికి పట్టే సమయం 31 నిమిషాల 30 సెకన్లు. అయితే బెంగళూరు, చెన్నై వంటి దక్షిణాది నగరాలతో పోలిస్తే ట్రాఫిక్ రద్దీలో గడిపే సమయం ఇక్కడే తక్కువ కావడం కాస్త ఊరట కలిగించే అంశం. వాహనాల సంఖ్య గణనీయంగా పెరుగుతుండటం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, ట్రాఫిక్ క్రమశిక్షణ లేకపోవడం, అధ్వాన్నమైన రహదారులు, ప్రణాళికబద్ధంగా పట్టణీకరణ జరగకపోవడం వంటివి హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీకి ప్రధాన కారణాలు.

కి.మీ.కు 9,500 వాహనాలు

దేశంలో అత్యంత రద్దీ కలిగిన ఆరో నగరంగా హైదరాబాద్ అవతరించింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో 85 లక్షలకు పైగా వ్యక్తిగత వాహనాలున్నాయి. కిలోమీటరుకు దాదాపు 9,500 వాహనాల సాంద్రత ఉంది. మరీ ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో కార్యాలయాలు, విద్యాసంస్థల పనివేళల్లో ఈ రద్దీ ఎక్కువగా ఉంటుంది.

ఏం చేయాలంటే..

- ప్రతీ చిన్న అవసరానికి వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించాలి.
- రోడ్లపై వాహనాలు సజావుగా సాగేలా అక్రమ పార్కింగ్‌లను తొలగించాలి.
- ట్రాఫిక్ ఉల్లంఘనలు చేసే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.
- ఆర్టీసీ బస్‌లు, ఎంఎంటీఎస్, మెట్రో వంటి ప్రజా రవాణాను విరివిగా వినియోగించాలి.
- చిన్న వయసు నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలి.
- అత్యవసరమైతే తప్ప పీక్ అవర్స్‌లో ప్రయాణం చేయొద్దు.
- నావిగేషన్ యాప్‌లను వినియోగిస్తూ, ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించడం ఉత్తమం.

నగరాల వారీగా ఏడాదిలో ట్రాఫిక్‌లో గడిపే సమయం (గంటల్లో):

నగరం	గంటలు
బెంగళూరు	117
కోల్‌కతా	110
పుణే	108
ముంబై	103
చెన్నై	94
హైదరాబాద్	85
జైపూర్	83
ఢిల్లీ	76
అహ్మదాబాద్	73

(నోట్: టామ్ టామ్ ట్రాఫిక్ ఇండెక్స్)

నగరాల వారీగా 10 కి.మీ. దూరానికి పట్టే సమయం

నగరం	సమయం
కోల్‌కతా	34 ని. 33 సె.
బెంగళూరు	34 ని. 10 సె.
పుణే	33 ని. 22 సె.
హైదరాబాద్	31 ని. 30 సె.
చెన్నై	30 ని. 20 సె.
ముంబై	29 ని. 26 సె.
అహ్మదాబాద్	29 ని. 03 సె.
జైపూర్	28 ని. 28 సె.
ఢిల్లీ	23 ని. 24 సె.



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

చిన్నారికి టీకా

నూరేళ్ల జీవితానికి భరోసా

టీకాలపై అపోహలు తొలగాలి

మహారాణిపేట: పిల్లలు వ్యాధుల బారిన పడకుండా ఎదిగితేనే ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుంది. పూర్వం పురిట్లోనే ప్రాణాలు వదలడం, మాతాశిశు మరణాలు ఉండేవి. చిన్నారి ఎదిగే క్రమంలో అంతుచిక్కని రోగాల బారిన పడి మృత్యువాత పడే వారు. వైద్య విజ్ఞానం అప్పట్లో అంతగా అభివృద్ధి చెందకపోవడంతో కుటుంబాల్లో జననాల సంఖ్య పెంచుకునే వారు. ప్రస్తుతం వైద్య రంగంలో పెను మార్పులు వచ్చాయి. శాస్త్ర, పరిశోధనలు అనేక రోగాల నివారణకు అద్భుత ఔషధాలను తెచ్చాయి. పుట్టిన క్షణం మొదలు పిల్లలకు 16 ఏళ్లు వచ్చే వరకు ఆరోగ్య శాఖ వేస్తున్న టీకాలతో ఆరోగ్యవంతంగా ఎదిగి వారంతా రేపటి పౌరులుగా మారుతున్నారు.

అపోహలు వీడదాం.. ఆరోగ్యాన్ని కాపాడుదాం

వ్యాధులు దరిచేరకుండా ఉండాలంటే టీకాలు వేయించుకోవడం చాలా ముఖ్యం. అప్పుడే పుట్టిన చిన్నారుల నుంచి పెద్ద వారి వరకు ప్రతి ఒక్కరూ వివిధ వయసులో టీకాలు కచ్చితంగా వేయించుకోవాలి. అప్పుడే రోగనిరోధక శక్తి పెరిగి అందరూ ఆరోగ్యంగా ఉంటారు. అయితే ఈ టీకాలపై ప్రజల్లో చాలా అపోహలు ఉన్నాయి. టీకాలు వేయించడం ద్వారా జ్వరాలు రావడం, బలహీనపడతారని అపోహలతో వాటికి దూరంగా ఉంటున్నారు. టీకాలపై అవగాహన కల్పించడం కోసం ప్రపంచ వ్యాప్తంగా నవంబర్ 10న అంతర్జాతీయ టీకాల దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం 'అందరికీ రోగ నిరోధకత మానవులకు సాధ్యమే'అనే థీమ్‌తో ముందుకెళ్తున్నారు.

ఆరోగ్య వ్యవస్థకు బలమైన కవచం

టీకాలు మన ఆరోగ్య వ్యవస్థకు బలమైన కవచం లాంటివి. స్మాల్ ఫాక్స్, పోలియో వంటి వ్యాధులను నిర్మూలించిన టీకాలు.. కోట్లాది ప్రాణాలను రక్షించాయి. టీకాలు అందరికీ చేరినప్పుడే సమగ్ర రోగనిరోధకత సాధ్యమవుతుంది. కేంద్ర ప్రభుత్వం యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ కింద ఏటా లక్షలాది శిశువులకు, గర్భిణులకు ఉచిత టీకాలను అందిస్తోంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజా ఆరోగ్య కార్యక్రమంగా నిలుస్తోంది. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎం, నర్సులు అంకితభావంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారు.

ఏ టీకా.. ఏ వ్యాధి నుంచి రక్షణ?

టీకా పేరు	నివారించే వ్యాధి
బీసీజీ	క్షయ వ్యాధి
హెపటైటిస్ బి	కాలేయ సంబంధ వ్యాధి (కామెర్లు)
ఓపీవీ, ఎఫ్ఐపీవీ	పోలియో వ్యాధి
డీపీటీ/ప్రీవెంటీవ్	డిఫ్తీరియా, పర్టుసిస్ (కోరింత దగ్గు), టెటనస్, హెపటైటిస్-బి
ఎంఆర్	పొంగు /తట్టు, రుబెల్లా
పీసీవీ వ్యాక్సిన్	న్యుమోకోకల్ ఇన్ఫెక్షన్లు
రోటవైరస్ వ్యాక్సిన్	చిన్నారుల్లో రోటవైరస్ వల్ల వచ్చే అతిసార
టీడీ వ్యాక్సిన్	ధనుర్వాతం, డిఫ్తీరియా

ఏ టీకా.. ఎప్పుడు వేయాలి?

ప్రసవం నుంచి 24 గంటలు: టీబీ నుంచి రక్షణకు బీసీజీ, పోలియో నివారణకు ఓపీవీ జిరో డోసు, కామెర్ల వ్యాధి అరికట్టేందుకు హెపటైటిస్-బి

- **45 రోజులకు:** పోలియో నివారణకు ఓపీవీ-1, ఓపీవీ-2, ఓపీవీ-3, ఐపీవీ
- **75 రోజులకు:** కంఠసర్పి, కోరింత దగ్గు, ధనుర్వాతం, మెదడువాపు, న్యూమోనియా నివారణకు పెంటావాలెంట్-1, 2, 3
- **105 రోజులకు:** తీవ్ర నీళ్ల విరోచనాలు, వాంతులు, జ్వరం, కడుపునొప్పి, మూత్ర విసర్జన, బరువు తగ్గడం వంటి సమస్యల నివారణకు ఆర్‌వీవీ-1, 2, 3
- **9-12 నెలలకు:** తట్టు, రుబెల్లా వ్యాధుల నివారణకు ఎంఆర్-1, అంధత్వ నివారణకు విటమిన్-ఎ, మెదడువాపు నివారణకు జేఈ-1, దగ్గు, జ్వరం, శ్వాసలో ఇబ్బందుల నివారణకు ఎఫ్ఐపీవీ-3, పీసీవీ-బీ
- **16-24 నెలలు:** కంఠసర్పి, కోరింత దగ్గు, ధనుర్వాతం నివారణకు డీపీడీ-1 బూస్టర్, పోలియో నివారణకు ఓపీవీ బూస్టర్, తట్టు రుబెల్లా నివారణకు ఎంఆర్-2, మెదడువాపు వ్యాధికి జేఈ-2, అంధత్వ నివారణకు విటమిన్-ఎ2
- **5-6 సంవత్సరాలు:** కంఠసర్పి, కోరింత దగ్గు, ధనుర్వాతం నివారణకు డీపీటీ-2
- **10 సంవత్సరాలు:** ధనుర్వాతం, కంఠ సర్పి నివారణకు టీడీ-1 బూస్టర్
- **16 ఏళ్ల వయసు:** ధనుర్వాతం, కంఠ సర్పి నివారణకు టీడీ-2 బూస్టర్

ప్రతి బుధవారం, శనివారాల్లో వ్యాక్సిన్

పుట్టిన బిడ్డ నుంచి 16 ఏళ్ల వయసు వరకు పిల్లలు ఆరోగ్యవంతంగా ఎదిగేందుకు 12 రకాల వ్యాక్సిన్‌లు వేస్తున్నారు. ప్రతి బుధవారం, శనివారాల్లో ఆస్పత్రులు, పంచాయతీ కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాల వద్ద సిబ్బంది అందుబాటులో ఉంటూ టీకాలు వేస్తున్నారు. గర్భిణులు, బాలింతలు అశ్రద్ధ చేయకుండా క్రమం తప్పకుండా టీకాలు వేయించుకుని వ్యాధుల నుంచి రక్షణ పొందాలని డాక్టర్ బి.లూసీ సూచించారు.

ఆపదలో తల్లీబిడ్డ



ప్రతి మహిళ జీవితంలో అమ్మ కావడం అద్భుత ఘట్టం. బిడ్డ కోసం ఎన్నో కలలుగన్న ఆ తల్లి పొత్తిళ్లలో చేరిన పాపాయిని తనివితీరా చూసుకోకుండానే తనువు చాలిస్తే.. నవమాసాలు మోసిన ఆశల రేడుకు పురిట్లోనే నూరేళ్లు నిండిపోతే.. ఆ ఇంట జీవితాలు తల్లకిందులై పోతాయి. మంత్రసానుల నుంచి పురిటి నొప్పులు లేకుండానే ప్రసవం చేసేంతగా వైద్యం అభివృద్ధి చెందినా జీరో శాతం మాతాశిశు మరణాల లక్ష్యం కలగానే మిగులుతోంది. గత కొద్ది నెలల్లో పశ్చిమ గోదావరి జిల్లాలో నలుగురు మాతృమూర్తులు, 42 మంది నవజాత శిశువులు మృతిచెందారు.

కొద్ది నెలల వ్యవధిలో 4 మాతృ మరణాలు
- 42 మంది నవజాత శిశువుల మృతి
- ఫ్రైవేట్ ఆస్పత్రులపై కొరవడుతున్న పర్యవేక్షణ
- కలగానే జీరో శాతం మాతా శిశు మరణాలు

సాక్షి, భీమవరం: ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు గత ఆరు నెలల కాలంలో పశ్చిమ గోదావరి జిల్లాలోని 42 ప్రభుత్వ ఆస్పత్రుల పరిధిలో 3,561 ప్రసవాలు జరిగితే వీటిలో సిజేరియన్లు 2,102 ఉన్నాయి. ప్రభుత్వ రికార్డుల్లో నమోదైన మేరకు 103 ప్రైవేట్ ఆస్పత్రుల్లో 5,452 ప్రసవాలు జరగగా వాటిలో అత్యధికంగా 4,135 సిజేరియన్ ప్రసవాలు ఉన్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 59 శాతం, ప్రైవేట్ ఆస్పత్రుల్లో 79 శాతం సిజేరియన్ ప్రసవాలు జరిగాయి.

ఈ ఆర్థిక సంవత్సరం మూడు క్వార్టర్లలో నమోదైన నాలుగు మాతృ మరణాలు డెలివరీలు జరిగింది ప్రైవేట్ ఆస్పత్రుల్లోనే కావడం గమనార్హం. ప్రసూతి సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల్లో కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. సాధారణ ప్రెగ్నెన్సీ కేసును ఎలా ట్రీట్ చేయాలి, హై రిస్క్ ప్రెగ్నెన్సీ కేసును ఏ విధంగా ట్రీట్ చేయాలి అనే వ్యత్యాసాన్ని పూర్తిగా అవగాహన చేసుకున్న తర్వాత మాత్రమే వైద్యాన్ని అందించాలి. వారికి అనుకూలంగా లేని కేసులను మెరుగైన వసతులు ఉన్న మరో ఆస్పత్రికి రిఫర్ చేయాలి. చాలా ప్రైవేట్ ఆస్పత్రులు ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. వైద్యం మొదలుపెట్టి పరిస్థితి చేజారిపోయాక మరో ఆస్పత్రికి సిఫార్సు చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో వారి నిర్లక్ష్యం మాతా శిశు మరణాల రూపంలో అయినవారికి తీరని శోకం, ఆర్థిక భారం మిగుల్చుతున్నాయి. ఇలాంటి ఆస్పత్రులపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఏం చర్యలు తీసుకుంటున్నారనేది ప్రశ్నార్థకం.

- ''పాలకోడేరుకు చెందిన గర్భిణి మే 24న ఆకివీడులోని ప్రైవేట్ ఆస్పత్రిలో బిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం అనంతరం ఆమె అనారోగ్యానికి గురికావడంతో మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ 27న మృతిచెందింది. ఇన్ఫెక్షన్ వ్యాపించడం వల్ల మృతిచెందినట్టుగా విచారణలో గుర్తించారు.''
- ''గొల్లవానితిప్పకు చెందిన గర్భిణి ఆగస్టు 12న భీమవరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో పురుడుపోసుకుంది. మరుసటి రోజున సుగర్ ఎక్కువగా ఉండటంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఫిట్స్ ఆగకుండా రావడం వలన మృతిచెందినట్టుగా నిర్ధారించారు.''
- ''తాడేపల్లిగూడెంకు చెందిన గర్భిణి జూలై 2 స్థానికంగా ప్రైవేట్ ఆస్పత్రిలో బిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవానంతరం తీవ్ర రక్తస్రావంతో అదేరోజు రాత్రి మృతిచెందింది.''
- ''మొగల్లుకు చెందిన గర్భిణి గత నెల 29న డెలివరీ కోసం భీమవరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. రెండు రోజుల తర్వాత మెరుగైన వైద్యం కోసం అక్కడి వైద్యుల సూచన మేరకు స్థానికంగా మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. 2న బిడ్డకు జన్మనిచ్చిన ఆ తల్లి 3వ తేదీన కన్నుమూసింది. ఈ ఘటనపై ప్రస్తుతం విచారణ జరుగుతోంది.''

''ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు పశ్చిమ గోదావరి జిల్లాలో 42 మంది నవజాత శిశువులు (పుట్టిన నాటి నుంచి 28 రోజుల లోపు) మృతిచెందారు. వీరిలో ఆక్సిజన్ సమస్యతో నలుగురు, నెలలు నిండకుండా పుట్టిన వారు ఐదుగురు, తక్కువ బరువుతో పుట్టిన వారు ఏడుగురు, గుండె సంబందిత సమస్యలతో ముగ్గురు, ఇతర అనారోగ్య కారణాలతో మిగిలిన వారికి పరిట్లోనే నూరేళ్లు నిండిపోయాయి. 29 రోజుల వయస్సు నుంచి ఏడాదిలోపు శిశువులు తొమ్మిది మంది మృతిచెందారు.''

ప్రసవ వేదన

గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం వరకు స్కానింగ్‌లు, రక్త పరీక్షల పేరిట నిరంతర వైద్య పర్యవేక్షణ ఉంటున్నా నవజాతి శిశువుల్లో ఆరోగ్య సమస్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. వేలల్లో వెచ్చించి వైద్యం చేయించుకున్నాం, పండంటి బిడ్డకు జన్మిస్తాడనుకుంటే పూర్తిగా నెలలు నిండకుండా, తక్కువ బరువుతో, ఆరోగ్య సమస్యలతో పుడుతున్నారు. ఇందుకు కొందరిలో సాంకేతికంగా జన్యుపరమైన కారణాలుంటే మరికొందరిలో సరైన పోషణ, వైద్యం అందకపోవడం కారణంగా తెలుస్తోంది. గత ఐదు నెలల్లో జరిగిన ప్రసవాల్లో జిల్లాలో నెలలు నిండకుండానే 525 మంది, తక్కువ బరువుతో 741 మంది శిశువులు జన్మించారు.

ఎప్పటికప్పుడు సమీక్షలు

జిల్లాలో జీరో శాతం మాతా శిశు మరణాలు లక్ష్యంగా కలెక్టర్ నాగరాణి ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో సమీక్షిస్తున్నారు. హై రిస్క్ ప్రెగ్నెన్సీ కేసుల్లో చివరి వరకు వేచి చూడకుండా గర్భం దాల్చిన నాటి నుంచే ఎక్కువ జాగ్రత్త తీసుకోవాలని, ఒకవేళ గర్భవతి అయితే ఇబ్బంది ఉన్నప్పుడు వారికి ముందే అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆస్పత్రులపై చర్యలకు ఆదేశిస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి

ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ డిమాండ్

సాక్షి, అమరావతి: అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూల్ పిల్లలతో బలోపేతం చేయాలని ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) విజ్ఞప్తి చేసింది. దీనిపై ఐసీడీఎస్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.బేబీరాణి, కె.సుబ్బరావమ్మ తదితర నాయకులు మంగళవారం వినతిపత్రమిచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ పిల్లలు తగ్గిపోతున్నారని, ఆ కారణం చూపి అంగన్‌వాడీ కేంద్రాలను విలీనం చేయాలని ప్రభుత్వం ప్రతిపాదన చేయడం సరికాదన్నారు. ప్రీ స్కూల్ బలోపేతం చేయాలంటే మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలను రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఉండేలా జీఓ ఇవ్వాలన్నారు. ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం అమలు చేయాలని, మెనూ క్వాంటిటీని పెంచాలని, సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలని, యూనిఫామ్, టై, బెల్ట్, బూట్లు ఇవ్వాలని కోరారు. ఈ డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి మెయిల్ చేశారు.

అధ్యాపకుల క్రమబద్ధీకరణలో హైకోర్టు ఆదేశాలను పాటించాలి

ఏపీ ప్రభుత్వ కాలేజీల కాంట్రాక్ట్ అధ్యాపకుల అసోసియేషన్

సాక్షి, అమరావతి: కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరిస్తూ గత ప్రభుత్వం 2023 అక్టోబర్ 23న లో విడుదల చేసిన ఉత్తర్వులను హైకోర్టు ఆదేశాలతో ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఏపీ ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపకుల అసోసియేషన్ మంగళవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. ఎన్నికలకు ముందే అన్ని శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించారని, ఎన్నికల కోడ్ రావడంతో అధ్యాపకుల అంశం నిలిచిపోయిందని పేర్కొంది. 18 నెలలుగా ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవట్లేదని, ఫలితంగా ఉద్యోగులు న్యాయ స్థానాన్ని ఆశ్రయించగా హైకోర్టు 8 వారాల్లో చర్యలు తీసుకోవాలని తీర్పు ఇచ్చిందని వివరించింది.

ఎన్నికలప్పుడే బాంబు పేలుళ్లా?

కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

మైసూరు : దేశ రాజధాని ఢిల్లీలో చారిత్రక ఎర్రకోట వద్ద సోమవారం సాయంత్రం జరిగిన కారు బాంబు పేలుడు బిహార్ ఎన్నికల పోలింగ్‌పై ప్రభావం చూపొచ్చని, ఎన్నికల సమయంలో బాంబు విస్ఫోటాలు జరగడంపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మైసూరులోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఘటన మంగళవారం జరిగిన ఎన్నికల్లో బీజేపీకి అనుకూలంగా ప్రభావం చూపి ఉంటుందని అభిప్రాయపడ్డారు. బాంబు పేలుళ్లు మంచి పద్ధతి కాదని, అమాయక ప్రజల ప్రాణాలు పోతాయని అన్నారు. ఢిల్లీలో, అది కూడా ఎర్రకోట వద్ద జరగడం బాధాకరమని అన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం భారతదేశం అన్ని వర్గాల దేశమని, హిందూ దేశంగా చేయడానికి కొంత మంది కంకణం కట్టుకున్నారని, ఇది సాధ్యమయ్యే పని కాదని వ్యాఖ్యానించారు.

విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ అథారిటీ కమిషనర్‌గా తేజ్ భరత్

సాక్షి, అమరావతి: మెప్మా డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్‌ను విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జవాబు పత్రాలను హాయ్‌ల్యాండ్‌కు తరలించాలన్న నిర్ణయం ఎవరిదో తెలియదు

- అందుకు సంబంధించి మా వద్ద ఎలాంటి సమాచారం లేదు
- చెల్లింపులు తాలూకు జిరాక్స్ కాపీలు ఉన్నాయి
- ఆ చెల్లింపులు ఎందుకు చేశారో తెలియదు
- ఏపీపీఎస్సీ తరఫున హైకోర్టుకు నివేదించిన అడ్వొకేట్ జనరల్
- తదుపరి విచారణ నవంబర్ 17కి వాయిదా

సాక్షి, అమరావతి: గ్రూప్ 1 ప్రధాన పరీక్ష జవాబు పత్రాలను మూల్యాంకనం నిమిత్తం హాయ్‌ల్యాండ్‌కు తరలించాలన్న నిర్ణయం ఎవరిదో తెలియదని, ఇందుకు సంబంధించి తమ వద్ద ఎలాంటి సమాచారం లేదని ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు నివేదించారు. తమ వద్ద ఉన్న రికార్డుల ప్రకారం జవాబు పత్రాలను 2021 డిసెంబర్ 5న హాయ్‌ల్యాండ్‌కు తరలించారని, ఆ తరువాత 2022 ఫిబ్రవరి 26న వాటిని ఏపీపీఎస్సీ కార్యాలయానికి తీసుకొచ్చారని ఆయన తెలిపారు. చెల్లింపులకు సంబంధించి బిల్లుల జిరాక్స్ కాపీలు ఉన్నాయని చెప్పారు. అయితే ఆ చెల్లింపులు ఎందుకు చేశారన్న వివరాలు మాత్రం లేవన్నారు. 2022 మార్చి నుంచి మే వరకు ఏపీపీఎస్సీ, రెండు ప్రభుత్వ కాలేజీల్లో జరిగిన మాన్యువల్ మూల్యాంకనం కోసం అదనంగా ఓఎంఆర్ షీట్లు, బార్‌కోడ్‌లు, కంట్రోల్ బండిల్స్‌ను ముద్రించారని వివరించారు. వాటన్నింటినీ కూడా సీల్డ్ కవర్‌లో కోర్టు ముందుంచామని పేర్కొన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, అదనపు అఫిడవిట్‌ను ఏపీపీఎస్సీ కార్యదర్శి కాకుండా మరో అధికారి దాఖలు చేయడాన్ని తప్పుపట్టింది. ఇంత సీరియస్ వ్యవహారంలో కార్యదర్శి కాకుండా మరో అధికారి ఎలా అదనపు అఫిడవిట్ దాఖలు చేస్తారని ప్రశ్నించింది. ఇకపైన పారదర్శకంగా వ్యవహరించాలంది. లేని పక్షంలో అధికారులపై సుమోటోగా కోర్టు ధిక్కార చర్యలు చేపడుతామంది. అన్నీ వివరాలతో అదనపు అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 17కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ అవధానం హరిహరనాథశర్మ ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ధర్మాసనం ముందు అప్పీళ్లు

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షా పత్రాల మూల్యాంకనంపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఏపీపీఎస్సీ హైకోర్టు ధర్మాసనం ముందు అప్పీల్ చేసింది. అదేవిధంగా ఉద్యోగాలు పొంది ప్రస్తుతం వివిధ హోదాల్లో కొనసాగుతున్నవారు కూడా అప్పీళ్లు దాఖలు చేశారు. ఈ అప్పీళ్లపై న్యాయమూర్తి జస్టిస్ దేవానంద్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ జరిపింది. గత విచారణ సమయంలో ధర్మాసనం లేవనెత్తిన సందేహాలకు అడ్వొకేట్ జనరల్ సమాధానం ఇచ్చారు.

సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు సమయం ఆసన్నమైంది

'తిరుమల లడ్డు'ను ప్రస్తావిస్తూ పవన్‌కళ్యాణ్ ట్వీట్

సాక్షి, అమరావతి: తిరుమల లడ్డూ అంశాన్ని ప్రస్తావిస్తూ ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ 'సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును స్థాపించాల్సిన సమయం ఆసన్నమైంది' అంటూ తన 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. 'ప్రపంచవ్యాప్తంగా హిందూ సమాజానికి, తిరుమల తిరుపతి దేవస్థానం ఒక తీర్థయాత్ర కేంద్రం కంటే ఎక్కువ. ఇది ఒక పవిత్రమైన ఆధ్యాత్మిక నివాసం. తిరుపతి లడ్డూ కేవలం తీపి పదార్థం కాదు. అది ఒక ఉమ్మడి భావోద్వేగం. ఎందుకంటే అది మా సమష్టి విశ్వాసం, లోతైన విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది. సగటున, ప్రతి సంవత్సరం దాదాపు 2.5 కోట్ల మంది భక్తులు తిరుమలను సందర్శిస్తారు. సనాతనుల భావాలు, ఆచారాలు ఎగతాళి చేసినా, అణగదొక్కబడినా, అది కేవలం బాధ కలిగించేది మాత్రమే కాదు. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది విశ్వాసం, భక్తిని విచ్ఛిన్నం చేస్తుంది. లౌకికత్వం రెండు వైపులా ఉండాలి. మన విశ్వాసం పట్ల రక్షణ, గౌరవం రాజీపడని అంశాలు. మన సనాతన ధర్మం అత్యంత పురాతనమైన, నిరంతరం అభివృద్ధి చెందుతున్న నాగరికతలలో ఒకటి. భాగస్వామ్యులందరి ఏకాభిప్రాయంతో మనం సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును స్థాపించాల్సిన సమయం ఆసన్నమైంది'' అంటూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

పరిపాలన ఆటంకాల వల్ల రైతులకు తీవ్ర కష్టాలు

- కేంద్రం నుంచి సహాయం, దీర్ఘకాల వ్యవసాయ సుస్థిరత చర్యలు అత్యవసరం
- బీజేపీ కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఆ పార్టీ నేతల వినతి
- కొద్దిసేపటికే ఆ పదాలను తొలగించి మరో ప్రకటన విడుదల చేసిన బీజేపీ రాష్ట్ర కార్యాలయం

సాక్షి, అమరావతి: 'ఇటీవల సంభవించిన మోంథా తుపాను కారణంగా రాష్ట్రంలో పంటలు, తోటలు, వ్యవసాయ వసతులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ విపత్తుతో పాటు, రాష్ట్ర స్థాయి పరిపాలన ఆటంకాల వల్ల రైతులు తీవ్రమైన కష్టాల్లో ఉన్నారు. అందువల్ల, తక్షణమే కేంద్రం నుంచి సహాయం, దీర్ఘకాల వ్యవసాయ సుస్థిరతకు చర్యలు అత్యవసరం' అంటూ రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంగళవారం రాష్ట్ర బీజేపీ నేతలు వినతిపత్రం అందించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సమక్షంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, నేతలు మెమోరాండం అందించినట్టు బీజేపీ రాష్ట్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. అయితే, కొద్దిసేపటికే దానిని సవరించి 'రాష్ట్ర స్థాయి పరిపాలనా ఆటంకాల వల్ల రైతులు తీవ్రమైన కష్టాల్లో ఉన్నారు' అన్న వాక్యాన్ని తొలగించి పార్టీ కార్యాలయం మరొక ప్రకటనను విడుదల చేసింది. ఈ ఘటనపై రాష్ట్రంలో చంద్రబాబు పరిపాలన ఏవిధంగా సాగుతుంతో కూటమి పార్టీ నేతలకు స్పష్టంగా తెలుసని, కానీ అధికారం కోసం ఎవరికి వారు తేలు కుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్నారంటూ నెటిజన్లు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.

పశువుల ఆస్పత్రుల్లో మందుల్లేవు

- రూ.70 కోట్లకు పేరుకుపోయిన బకాయిలు
- తక్షణమే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్
- ప్రభుత్వానికి పాల రైతులు, షీప్, గోట్ బ్రీడర్స్ యూనియన్ వినతి

సాక్షి, అమరావతి: బకాయిలు చెల్లించకపోవడంతో మందుల కంపెనీలు పశువైద్యశాలలకు మందుల సరఫరా నిలిపివేశాయని, మూగజీవాలకు నాణ్యమైన పశువైద్యసేవలందక అలమటిస్తున్నాయని పాడి రైతులు, మేకలు, గొర్రెల బ్రీడర్స్ ఉత్పత్తిదారుల యూనియన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈమేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శికి రాసిన లేఖను మంగళవారం మీడియాకు విడుదల చేశారు. రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లినా అంటువ్యాధుల నివారణకు మందుల్లేవని పశువైద్యులనుంచి సమాధానం వస్తోందన్నారు. కనీసం టెరామైసిన్, టించర్, అయోడిన్, కాఫ్‌సిరప్‌తో పాటు అధిక జ్వరాన్ని నియంత్రించే మందులు కూడా లేవన్నారు. దాదాపు 42 రకాలకుపైగా మందులు లేవని గుర్తించామన్నారు. కంపెనీలు ఎందుకు సరఫరా చేయడం లేదని ప్రశ్నిస్తే ప్రభుత్వం నుంచి రూ.70 కోట్లకుపైగా బకాయిలు పేరుకుపోయాయని, అవి విడుదల చేస్తే కానీ సరఫరా చేయలేమని తెగేసి చెప్పాయని పేర్కొన్నారు. తక్షణమే ఈ బకాయిలు విడుదల చేసి మందులు గ్రామ స్థాయిలో ఆస్పత్రులకు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా మూగజీవాలకు ఆరోగ్య భద్రత కల్పించాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మొనపాటి రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పాఠశాలలు, ప్రభుత్వ భవనాలకు సోలార్ రూఫ్ టాప్

- యూనిట్‌కు రూ.2.09 రేటుకు సౌర విద్యుత్ కొనుగోలు
- డిస్కంలు, ఏడీబీ అధికారుల సమీక్షలో సీఎస్ కె.విజయానంద్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పాఠశాలలు, ప్రభుత్వ సంస్థల భవనాలపై సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థను అమర్చనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. మొత్తంగా 50/100 మెగా వాట్ అవర్ (ఎంవీఏ) బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్) ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వం లబ్ధిదారుల నుంచి అధిక సౌర విద్యుత్‌ను యూనిట్‌కు రూ.2.09 రేటుకు కొనుగోలు చేస్తుందని ప్రకటించారు. రూఫ్‌టాప్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎస్ఆర్ఐపీ)పై ఏపీ సచివాలయం నుంచి డిస్కంల సీఎండీలు ఎల్.శివశంకర్ (ఏపీఎస్పీడీసీఎల్), ఐ.పృథ్వీతేజ్ (ఏపీఈపీడీసీఎల్), పి.పుల్లారెడ్డి (ఏపీసీపీడీసీఎల్)తో పాటు ఏడీబీ, నాబార్డ్ (ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్)ప్రతినిధులతో మంగళవారం ఆయన వర్చువల్‌గా సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వ పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ (ఎంఎన్ఆర్ఈ) ఇప్పటికే 3.88 లక్షల రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటుకు ఆమోదం తెలిపిందని, కాంట్రాక్టర్ల ఎంపికకు టెండర్లు విడుదలైనట్లు సీఎస్ చెప్పారు. 804 మెగావాట్ల సామర్థ్యానికి లెటర్స్ ఆఫ్ అవార్డ్ జారీ అయ్యాయని, మరో 200 మెగావాట్లు తుది దశలో ఉన్నాయన్నారు. యుటిలిటీ లెడ్ అగ్రిగేషన్ మోడల్ అమలుకు ఆర్థిక శాఖ ప్రభుత్వ గ్యారంటీని ఆమోదించినట్లు ఆయన వివరించారు. రాష్ట్ర డిస్కంలకు సబ్సిడీ రుణం అందించడానికి ఫైనాన్షియల్ ఇంటర్మీడియరీగా నాబార్డ్‌ను నియమించబడినట్లు సీఎస్ వెల్లడించారు.

సాగుబడి

విశాఖ కార్తె:
నవంబర్ 6 నుంచి

సాయిల్ హెల్త్‌కూ ఓ చట్టం!

- సాగు భూముల ఆరోగ్య భద్రతా చట్టం రూపుకల్పన దిశగా ముందడుగు 'మిషన్ 007- సాయిల్ సెక్యూరిటీ లా' తీర్మానం

- ఏటా 87,800 కోట్ల డాలర్ల మేరకు ఆర్థిక నష్టం అంటున్న ఐరాసకు చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ)

- భూగోళంపై నేలల ఆరోగ్యం నానాటికీ తీసికట్టు అవుతోంది... అందుకు కారణాలు అనేకం..

మట్టి అతి వేగంగా అంతరిస్తోంది. మట్టిని బతికించండి.. అని 'ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్)' అబుదాబిలో జరిగిన ద్వైవార్షిక అంతర్జాతీయ మహాసభ ఇటీవల పిలుపునిచ్చింది. అంతర్జాతీయంగా ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలన్నీ కట్టుబడి అమలు చేసేలా 'సాయిల్ సెక్యూరిటీ లా' చెయ్యాల్సిన అవసరం ఉందని ఐయూసీఎన్ మహాసభ తీర్మానం చేసింది. 'మిషన్ 007 - సాయిల్ సెక్యూరిటీ లా' పేరిట చరిత్రలో మొట్టమొదటి సారి ఈ తీర్మానం ఆమోదం పొందింది. నేల ఆరోగ్యమే మన ఆరోగ్యం, ఆహార భద్రతలకు మూలాధారం. భూగోళంపై జీవం మనుగడకు ముఖ్యమైన 8 అంశాల్లో మట్టి ఆరోగ్యం కూడా ఉంది. సాగు భూములు / నేలలు ప్రపంచవ్యాప్తంగా అతి వేగంగా క్షీణతకు గురవుతున్నాయి. 2050 నాటికి 1.6 కోట్ల చదరపు కిలోమీటర్ల నేల నిస్సారమవుతుందని, ఏటా 87,800 కోట్ల డాలర్ల మేరకు ఆర్థిక నష్టం చేకూరుతుందని ఐరాసకు చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) తాజాగా అంచనా వేసింది. ఈ అత్యవసర పరిస్థితిని ప్రతిఫలించేలా ఐయూసీఎన్ తీర్మానం చేసింది. అన్నీ సజావుగా జరిగితే త్వరలోనే చట్టబద్ధమైన ఒడంబడిక రూపుదిద్దుకునే క్రమంలో ఇది కీలక ముందడుగు. మరికొన్ని దశలు దాటి చట్టం జరిగితే, మరింత ఫోకస్‌తో సాగు భూముల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు నడుము బిగించేందుకు దోహదం చేస్తుంది.

మట్టిని బతికించుకోవటానికి అంతర్జాతీయ సమాజం ఒక అడుగు ముందుకు వేసింది. ఇది కేవలం ప్రారంభం మాత్రమే, అయినా సందేశం స్పష్టంగా ఉంది. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) ఐక్యరాజ్య సమితికి అనుబంధ సంస్థ. భూగోళంపై పర్యావరణం, జీవజాతుల పరిరక్షణ స్థితిగతులపై ఐయూసీఎన్ దృష్టిని కేంద్రీకరిస్తుంది. ప్రతి రెండేళ్లకోసారి వరల్డ్ కన్జర్వేషన్ కాంగ్రెస్‌ను నిర్వహిస్తూ జాతీయ, రాష్ట్రీయ ప్రభుత్వాలకు సూచనలు అందిస్తుంటుంది. గత నెలలో అబుదాబిలో జరిగిన ఐయూసీఎన్ వరల్డ్ కన్జర్వేషన్ కాంగ్రెస్‌లో 'మోషన్ 007: సాయిల్ సెక్యూరిటీ లా'పై అధికారిక తీర్మానాన్ని సభ్యులు ఆమోదించారు. నేలల భద్రతకు అవసరమైన తక్షణ కార్యాచరణ ప్రణాళికకు చట్టపరమైన గుర్తింపును అందించడమే ఈ తీర్మానం లక్ష్యం. నేలల భద్రతపై ప్రపంచవ్యాప్తంగా అనుసరించదగిన చట్టాన్ని రూపొందించడానికి భావనలను, విధివిధానాలను అభివృద్ధి చేయాలని ఈ మహాసభ పిలుపునిచ్చింది. నేల భద్రతపై అంతర్జాతీయ చట్ట ప్రకారం సభ్య దేశాలన్నీ విధిగా కట్టుబడి ఉండేలా లేదా అనుసరించమని సూచించేలా సాయిల్ సెక్యూరిటీ చట్టం చేసే విషయాన్ని ఆలోచించమని వరల్డ్ కమిషన్ ఆన్ ఎన్విరాన్‌మెంటల్ లాకు ఐసీయూఎన్ 'మోషన్ 007' తీర్మానం ద్వారా విజ్ఞప్తి చేసింది.

8 అస్తిత్వ సమస్యల్లో ఇదొకటి..

భూగోళంపై పర్యావరణ సమతుల్యత కొనసాగింపునకు కీలకమైన విధులను నిర్వర్తిస్తూ, అవసరమైన పర్యావరణ సేవలను, జీవభౌతిక సేవలను అందించడంతో పాటు.. భూమిపై జీవులను ముప్పుల నుంచి రక్షించటానికి మానవాళి నేలలను బాధ్యతాయుతమైన రీతిలో సంరక్షించుకోవటం అవసరమని ఐసీయూఎన్ మహాసభ పిలుపునిచ్చింది. విధానాల రూపుకల్పన, కార్యాచరణ ప్రణాళికల్లో నేలల భద్రత అంశాన్ని ప్రాధాన్యంతో అంతర్భాగం చేయడానికి అంతర్జాతీయ ఒడంబడికను రూపొందించే దిశగా ముందడుగు పడింది. భూగోళంపై మానవ మనుగడ ప్రమాదంలో ఉంది. భూగోళం ఎదుర్కొంటున్న 8 అస్తిత్వ సమస్యలలో నేలల క్షీణత సమస్య కూడా ఒకటని ఐయూసీఎన్ మహాసభ నొక్కి చెప్పింది. వాతావరణ మార్పు, ఆహారం, నీటి కొరత, జీవవైవిధ్య పరిరక్షణ, విద్యుత్తు సుస్థిరత, పర్యావరణ నిర్వహణ, మానవ శ్రేయస్సుతో పాటు నేల ఎనిమిదో అస్తిత్వ సమస్యగా పేర్కొంది.

90 దేశాల్లో నేలల పరిరక్షణకు చుక్కాని

ప్రకృతిలో జీవవైవిధ్యాన్ని పరిరక్షించేందుకు మార్గనిర్దేశనం చేసే ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్సర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) కృషితో ప్రపంచంలోనే మొట్టమొదటగా నేలల పరిరక్షణకు అంతర్జాతీయ చట్టబద్ధ వ్యవస్థను ఏర్పాటు చెయ్యడానికి తొలి అడుగుపడింది. 'మోషన్ 007– సాయిల్ సెక్యూరిటీ లా' తీర్మానం ఈ దిశగా అత్యంత కీలకమైన, శుభప్రదమైన చర్య. ఇది 90 దేశాల్లో, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న, అల్పాదాయ దేశాల్లో, సాగు భూముల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక పథకాల ప్రారంభానికి దోహదం చేసే జాతీయ చట్టాల రూపుకల్పనకు భూమిక కానుంది. ప్రకృతి, సేంద్రియ పద్ధతుల ప్రోత్సాహానికి, ప్రభుత్వాల జవాబుదారీతనానికి ఇది దన్నుగా నిలుస్తుంది. అబుదబిలో గత నెలలో జరిగిన ఐయూసిఎన్ ద్వైవార్షిక మహాసభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టడానికి తెర వెనుక జరిగిన కృషిలో భారతీయ స్వచ్ఛంద సంస్థ సేవ్ సాయిల్ (ఈషా అవుట్‌రీచ్), ఆస్ట్రేలియా సంస్థ ఆరోరా, అమెరికాకు చెందిన పేస్ యూనివర్సిటీలోని గ్లోబల్ సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ లీగల్ స్టడీస్ కీలకపాత్ర పోషించాయి.

సేవ్ సాయిల్ చీఫ్ సైంటిస్ట్, టెక్నికల్ ఆఫీసర్ ప్రవీణ శ్రీధర్ హర్షం వ్యక్తం చేస్తూ.. 'ఆహారం, నీరు, జీవవైవిధ్యం, క్లైమెట్ రిసైలియన్స్‌లకు నేల ఆరోగ్యమే పునాది అని ఒక అంతర్జాతీయ పరిరక్షణ సంస్థ మొట్టమొదటిగా మోహన్ 007 తీర్మానం ద్వారా గుర్తించటం హర్షదాయకం. ఇది నేలమ్మకు దక్కిన గౌరవం. ఈ విజయం వెనుక ప్రపంచవ్యాప్తంగా ఎందరెందరో చెమటోడ్చి సుదీర్ఘకాలంగా చేస్తున్న కృషి దాగి ఉంది..' అని వ్యాఖ్యానించారు. తీర్మానం నేపథ్యంలో ఐయూసీఎన్ ఒక వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేయనుంది. నేలల పరిరక్షణకు కుదరబోయే అంతర్జాతీయ ఒడంబడిక లేదా ఏర్పాటు కాబోయే ప్రపంచ చట్టబద్ధ సంస్థకు సంబంధించిన భావనలను, విధివిధానాలను ఈ వర్కింగ్ గ్రూప్ రూపొందిస్తుంది.

వార్షిక నష్టం 87,800 కోట్ల డాలర్లు

నేలలకు జరుగుతున్న నష్టాన్ని నిలువరించడానికి దేశాలు తక్షణ ఉపశమన చర్యలు తీసుకోకపోతే 2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా 1.6 కోట్ల చదరపు కిలోమీటర్ల భూమి జీవాన్ని కోల్పోయి సాగుయోగ్యం కాకుండా పోతుందని ఎడారీకరణపై పోరుకు సంబంధించిన అంతర్జాతీయ ఒడంబడిక హెచ్చరిస్తోంది. దీని ఆర్థిక నష్టం అపారమైనది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు వార్షికంగా 87,800 కోట్ల డాలర్ల నష్టం. నేలల వినియోగానికి సంబంధించి పర్యావరణపరమైన పరిమితులను ఇప్పటికే దాటేశాం. నేలల క్షీణత ఎంత ఎక్కువైందంటే.. అది భూగ్రహానికి ఉండే మానవాళిని నిలబెట్టే సామర్థ్యాన్ని దెబ్బతీయడం ప్రారంభించిందని ఐయూసీఎన్ మహాసభ పేర్కొంది. అడవులు, నీరు, వాతావరణ పరిరక్షణ వంటి అంశాలపై ఐయూసీఎన్ మహాసభలు గతంలో చర్చించి అంతర్జాతీయ ఒడంబడికలను కుదిర్చింది. కానీ నేలల పరిరక్షణపై గతంలో ఎప్పుడూ ఇలాంటి శ్రద్ధ చూపలేదు.

జీవితానికి పునాది

'నేల.. జీవితానికి నిశ్శబ్ద పునాది. ఆహార ఉత్పత్తికి కీలకం. నీటిని నియంత్రిస్తుంది. కార్బన్‌ను నిల్వ చేస్తుంది. జీవవైవిధ్యాన్ని నిలబెట్టుకుంటుంది. అయినప్పటికీ ప్రకృతిలో దీనికి రక్షణ తక్కువగా ఉంద'ని ఆస్ట్రేలియాకు చెందిన అరౌరా అనే సంస్థకు చెందిన డా. జూలియో పచాన్ మాల్డోనాడో చెప్పారు. నేలల పరిరక్షణను ప్రపంచ ప్రాధాన్యతగా మార్చడానికి ఈ సంస్థ ప్రచారోద్యమం నిర్వహిస్తుంటుంది. 'ప్రతి భూసంబంధమైన ప్రతి పర్యావరణ వ్యవస్థకు నేల పునాది. నేలలు సురక్షితంగా లేకపోతే.. ఆహారం లేదు, నీటి భద్రత లేదు, భవిష్యత్తు లేదు' అని సిడ్నీ(ఆస్ట్రేలియా) విశ్వవిద్యాలయంలోని నేల శాస్త్రవేత్త డా. జూలియా ఫీత్ అంటున్నారు. నేల సంక్షోభాన్ని పరిష్కరించకుండా మనం వాతావరణం లేదా జీవవైవిధ్య సంక్షోభాలను పరిష్కరించలేం అని ఆమె స్పష్టం చేశారు. ఐక్యరాజ్య సమితి నిర్దేశిత 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో కనీసం 12 లక్ష్యాలు నెరవేరడానికి నేల ఆరోగ్యం కూడా అవసరం. ఈ లక్ష్యాలను 2030 నాటికి సాధించాలి. ముఖ్యంగా, ఆకలిని నిర్మూలించడం అనే లక్ష్య సాధనకు నేల ఆరోగ్యం కీలకం.

చర్చలతో కాలక్షేపం ఇంకెన్నాళ్లు?

వాతావరణం, జీవవైవిధ్యం, నీరు, ఎడారీకరణపై ఇప్పటికే ఉన్న అంతర్జాతీయ ఒడంబడికలు లేదా చట్టబద్ధంగా కట్టుబడి ఉండే ఒప్పందాలు అంతర్జాతీయ మహాసభల్లో ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు ఏకాభిప్రాయానికి రావటానికి సాధారణంగా చాలా సంవత్సరాలు పడుతుంది. ఇంకా చెప్పాలంటే, ఈ సంక్లిష్టమైన చర్చల ప్రక్రియ ఒక కొలిక్కి రావటానికి దశాబ్దాల కాలం పడుతుంటుంది. ఈ అనుభవం దృష్ట్యా.. నేలల క్షీతను ఆపేందుకు అంతర్జాతీయ ఒడంబడక లేదా చట్టపరమైన సంస్థ సృష్టిపై చర్చల ప్రక్రియను వేగవంతం చేయడమే ఐయూసీఎన్ లక్ష్యంగా పెట్టుకుంది. నేలలకు భద్రత కల్పించే బాధ్యతను ప్రత్యేక ఒడంబడికగా కాకుండా ఇప్పటికే అమల్లో ఉన్న వాతావరణ మార్పు, జీవవైవిధ్యం లేదా ఎడారీకరణపై ఒడంబడికలలో దేనికైనా అనుబంధంగా మార్చితే చర్చలతో కాలం వెల్లబుచ్చకుండా వెంటనే పని ప్రారంభం కావటానికి ఉపయోగపడుతుందని చాలామంది నిపుణులు సూచిస్తున్నారు. అయితే, నేలల భద్రతపై ఇప్పుడు ఐయూసీఎన్ ద్వైవార్షిక మహాసభలో ఆమోదం మోషన్ 007 అధికారిక తీర్మానం చెయ్యటం కూడా అంత చిన్న విషయమేమీ కాదు. ఇది నిస్సందేహంగా ఒక ముఖ్యమైన మైలురాయి. మృత్తికా శాస్త్రవేత్త డా. క్వెంటిన్ స్టైక్ అభివర్ణించినట్లుగా 'ఇది మానవత్వం చేపట్టగల ఒక శక్తివంతమైన ఐక్యతా చర్య'గా గుర్తించటం అవసరమని డౌన్‌టుఎర్త్‌కు చెందిన ప్రసిద్ధ పర్యావరణ పాత్రికేయుడు రిచర్డ్ మహాపాత్ర చక్కగా వ్యాఖ్యానించారు.

– నిర్వహణ:
పంతంగి రాంబాబు
సాక్షి సాగుబడి డెస్క్

హైరింగ్ 'పండగ'!

ఈ సీజన్‌లో 2.16 లక్షల గిగ్, తాత్కాలిక జాబ్స్

- గతేడాదితో పోలిస్తే 25 శాతం జంప్..
- రిటైల్, ఈ–కామర్స్, బీఎఫ్ఎస్ఐ, లాజిస్టిక్స్, ఆతిథ్యంలో జోరు
- అడెకో నివేదికలో వెల్లడి

ముంబై: ఈ ఏడాది పండగ సీజన్‌లో నియామకాల దుమ్మురేగిపోయింది. సానుకూల కన్జూమర్ సెంటిమెంట్‌కు తోడు ఆకర్షణీయమైన ప్రమోషన్లు, భారీగా విస్తరణ దన్నుతో 2025 ఆగస్ట్–అక్టోబర్ మధ్య భారీగా ఉద్యోగ కల్పన జరిగిందని హైరింగ్ సొల్యూషన్స్ సంస్థ అడెకో ఇండియా తాజా నివేదికలో పేర్కొంది. గతేడాది పండగ సీజన్‌తో పోలిస్తే మొత్తంమీద హైరింగ్ 17 శాతం పెరిగిందని, గిగ్, తాత్కాలిక జాబ్స్ 25 శాతం ఎగబాకినట్లు వెల్లడించింది. 2025 పండగ సీజన్ మూడు నెలల్లో 2.16 లక్షల గిగ్, తాత్కాలిక ఉద్యోగాలు లభించినట్లు అంచనా వేసింది. కాగా, తాత్కాలిక జాబ్స్ 37 శాతం వృద్ధి చెందగా, గిగ్ వర్కర్ల నియామకాలు 15–20 శాతం పుంజుకున్నాయని నివేదిక తెలిపింది. 'ఈ ఏడాది పండగ హైరింగ్‌ను గమనిస్తే, కంపెనీల ఆర్థికపరమైన విశ్వాసం, గిగ్ ఎకానమీ అంతకంతకూ బలోపేతం అవుతోందనే దాన్ని ప్రతిబింబిస్తోంది. నియామకాల సంఖ్య, వేతన చెల్లింపులు గత మూడేళ్ల స్థాయిని అధిగమించాయి. తద్వారా కోవిడ్ తదనంతర సాధారణ స్థాయి తర్వాత అత్యంత పటిష్టమైన ఏడాదిగా 2025 నిలిచింది. ముఖ్యంగా రిటైల్, కస్టమర్ సపోర్ట్, లాజిస్టిక్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్‌లలో భారీగా నియామకాలు జరిగాయి' అని అడెకో ఇండియా డైరెక్టర్, జనరల్

స్టాఫింగ్ హెడ్ దీపేష్ గుప్తా పేర్కొన్నారు. నివేదికలో ఇతర ముఖ్యాంశాలివీ...

- రిటైల్, ఈ–కామర్స్, బీఎఫ్ఎస్ఐ, లాజిస్టిక్స్, ఆతిథ్య రంగాల్లో తాత్కాలిక ఉద్యోగాలు వెల్లువెత్తాయి.
- ప్రారంభ స్థాయి కొలువుల్లో వేతనాలు 12–15 శాతం పెరగ్గా, అనుభవంతో కూడిన విధుల్లో 18–22 శాతం వేతన వృద్ధి నమోదైంది.
- ప్రస్తుత పెళ్లిళ్ల సీజన్‌తో పాటు 2026 మార్చి వరకు హైరింగ్ జోరు కొనసాగే అవకాశం ఉంది. ముఖ్యంగా హాస్పిటాలిటీ, ట్రావెల్, లాజిస్టిక్స్, బీఎఫ్ఎస్ఐ రంగాల్లో డిమాండ్ జోరుగా ఉంది.
- ఈ కాలంలో హైరింగ్ వార్షికంగా 18–20 శాతం పెరగవచ్చని అంచనా. ఇందులో సగం ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల నగరాల నుంచే జతయ్యే అవకాశం ఉంది.
- మొత్తం హైరింగ్‌లో దాదాపు 75–80 శాతం ముంబై, ఢిల్లీ–ఎన్‌సీఆర్, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి మెట్రో సిటీల నుంచే నమోదైంది.
- అయితే, ద్వితీయ శ్రేణి, వర్ధమాన నగరాల్లో గతేడాదితో పోలిస్తే ఉద్యోగాల డిమాండ్ 21–25 శాతం ఎగబాకింది. లక్నో, జైపూర్, కోయంబత్తూరు, భువనేశ్వర్, నాగపూర్, మైసూరు వంటి నగరాలు... మెట్రోలను మించి (14 శాతం వృద్ధి) 21 శాతం పెరుగుదలను సాధించాయి. మరోపక్క, కాన్పూర్, కొచ్చి, విజయవాడ, వారణాసితో సహా పలు కొత్త మార్కెట్లు తాత్కాలిక ఉద్యోగాలకు కేంద్రాలుగా ఆవిర్భవించాయి.
- రిటైల్, ఈ–కామర్స్ రంగాల్లో 28 శాతం హైరింగ్ పెరిగింది. లాజిస్టిక్స్, లాస్ట్–మైల్ డెలివరీ తదితర విధుల్లో తాత్కాలిక ఉద్యోగాలకు సంబంధించి 35–40 శాతం వృద్ధి నమోదైంది.
- బీఎఫ్ఎస్ఐ రంగంలో పండగ నియామకాలు 30 శాతం ఎగబాకాయి. ప్రధానంగా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఫీల్డ్ సేల్స్, క్రెడిట్ కార్డ్, పాయింట్ ఆఫ్ సేల్స్ (పీఓఎస్) కొలువులకు ఫుల్ జోష్ నెలకొంది.
- హాస్పిటాలిటీ, ట్రావెల్ రంగం కూడా బాగానే పుంజుకుంది. ఫ్రంట్–ఆఫీస్, ఈవెంట్, ఫుడ్ అండ్ బెవరేజెస్ సిబ్బందికి డిమాండ్ 25 శాతం మేర పెరిగింది. పండగ ప్రయాణాలకు తోడు, పెళ్లిళ్ల సీజన్ బుకింగ్స్ ఇందుకు దోహదం చేశాయి.

క్యూ2 ఆర్థిక ఫలితాలు

బజాజ్ ఫిన్‌సర్వ్ లాభం ప్లస్

రూ. 2,244 కోట్లు

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ ఎన్‌బీఎఫ్‌సీ దిగ్గజం బజాజ్ ఫిన్‌సర్వ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 8 శాతం వృద్ధితో రూ. 2,244 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 2,087 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 33,704 కోట్ల నుంచి రూ. 37,403 కోట్లకు ఎగసింది. వడ్డీ ఆదాయం రూ. 16,572 కోట్ల నుంచి రూ. 19,599 కోట్లకు బలపడింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 27,741 కోట్ల నుంచి రూ. 30,581 కోట్లకు పెరిగాయి. అనుబంధ సంస్థ జనరల్ ఇన్సూరెన్స్ లాభం 5 శాతం పుంజుకుని రూ. 517 కోట్లకు చేరగా.. అసెట్ మేనేజ్‌మెంట్ ఏయూఎం రూ. 28,814 కోట్లను తాకింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 6.3 శాతం పతనమై రూ. 1,988 వద్ద ముగిసింది.

రిలయన్స్ పవర్‌కు లాభాలు

రూ. 87 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ విద్యుత్ కంపెనీ రిలయన్స్ పవర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో రూ. 87 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 352 కోట్ల నికర నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,963 కోట్ల నుంచి రూ. 2,067 కోట్లకు బలపడింది. వృద్ధికి అవసరమైన నిధుల సమీకరణకు బోర్డు అనుమతించినట్లు కంపెనీ పేర్కొంది. మార్పిడికి వీలయ్యే విదేశీ మారక బాండ్ల(ఎఫ్‌సీసీబీలు) జారీ ద్వారా 60 కోట్ల డాలర్లవరకూ సమకూర్చుకునేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో యథాతథంగా రూ. 41.20 వద్ద ముగిసింది.

టాటా పవర్ లాభం అప్

రూ. 1,245 కోట్లు



న్యూఢిల్లీ: విద్యుత్ రంగ దిగ్గజం టాటా పవర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్ (క్యూ2)లో నికర లాభం 14 శాతం ఎగసి రూ. 1,245 కోట్లను తాకింది. అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 1,093 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం స్వల్ప(3 శాతం) వృద్ధితో రూ. 15,769 కోట్లను తాకింది. గత క్యూలో రూ. 15,247 కోట్ల టర్నోవర్ అందుకుంది. నిర్వహణ లాభం(ఇబిటా) 6 శాతం మెరుగుపడి రూ. 4,032 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 3,808 కోట్ల ఇబిటా సాధించింది. సొంత అవసరాల కోసం 10 గిగావాట్ల వేఫర్ ఇన్‌గాట్ ప్రాజెక్టు ఏర్పాటు ప్రణాళికల్లో ఉన్నట్లు కంపెనీ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో యథాతథంగా రూ. 396 వద్ద ముగిసింది.

జాగిల్ లాభం జూమ్

రూ. 33 కోట్లు

హైదరాబాద్: స్పెండ్ మేనేజ్‌మెంట్ కంపెనీ జాగిల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 79 శాతం జంప్‌చేసి రూ. 33 కోట్లను అధిగమించింది. మొత్తం ఆదాయం సైతం 42 శాతం పైగా ఎగసి రూ. 431 కోట్లను తాకింది. నిర్వహణ లాభం(ఇబిటా) 48% వృద్ధితో రూ. 44 కోట్లకు చేరింది. ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌తో కలసి రిటైల్ కార్డుల విభాగంలోకి ప్రవేశించినట్లు కంపెనీ వెల్లడించింది. జాగిల్ గ్లోబల్‌ప్లే ఫారెక్స్ కార్డ్‌తోపాటు జాగిల్ మాస్టర్ కార్డ్ ప్రిపెయిడ్ కార్డ్‌లను ప్రవేశపెట్టినట్లు తెలియజేసింది.

హడ్కో లాభం రూ.710 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ హడ్కో సెప్టెంబర్ త్రైమాసికానికి రూ.710 కోట్ల లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.689 కోట్లతో పోల్చి చూస్తే 3 శాతం పెరిగింది. ఇదే కాలంలో ఆదాయం రూ.2,526 కోట్ల నుంచి రూ.3,251 కోట్లకు వృద్ధి చెందింది. ప్రధానంగా వడ్డీ ఆదాయం రూ.1,844 కోట్ల నుంచి రూ.3,197 కోట్లకు బలపడింది. ఈ ఏడాది 25 శాతం సీఏజీఆర్ వృద్ధిని సాధిస్తామని హడ్కో చైర్మన్, ఎండీ సంజయ్ కులశ్రేష్ట తెలిపారు. 3 శాతం నికర వడ్డీ మార్జిన్‌ను నమోదు చేస్తామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సం తొలి ఆరు నెలల కాలానికి లాభం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.1,246 కోట్ల నుంచి రూ.1,340 కోట్లకు మెరుగుపడింది. రూ.92,985 కోట్ల రుణాలను మంజూరు చేసింది.

బీఎస్‌ఈలో హడ్కో షేరు ధర ఒకటిన్నర శాతం లాభపడి రూ.234 వద్ద స్థిరపడింది.

ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో 'ఆరిజిన్ కంట్రీ' ఫిల్టర్ తప్పనిసరి

వినియోగదారుల వ్యవహారాల శాఖ ప్రతిపాదన

న్యూఢిల్లీ: ఈ–కామర్స్ ప్లాట్‌ఫాంలలో పారదర్శకతను పెంచే దిశగా వినియోగదారుల వ్యవహారాల శాఖ చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్యాకేజ్డ్ కమోడిటీలకు సంబంధించి అవి ఏ దేశం నుంచి వచ్చాయో తెలుసుకునేందుకు, ఎంచుకునేందుకు వీలుగా సెర్చ్, సోర్టింగ్ ఫిల్టర్లలో 'కంట్రీ ఆఫ్ ఆరిజిన్' ఆప్షన్‌ను తప్పనిసరిగా పొందుపర్చాలని ప్రతిపాదించింది. విస్తృతమైన జాబితా నుంచి తమకు కావాల్సిన ప్రోడక్టును సత్వరం కనుగొనడానికి యూజర్లకు, అలాగే ఆయా ప్రోడక్టుల పర్యవేక్షణలో అధికారులకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు నిర్దిష్ట చట్ట సవరణ చేసే దిశగా ముసాయిదా నిబంధనలను వినియోగదారుల వ్యవహారాల శాఖ తమ వెబ్‌సైట్‌లో ప్రచురించింది. నవంబర్ 22 వరకు దీనిపై సంబంధిత వర్గాలు తమ అభిప్రాయాలను తెలియజేయాల్సి ఉంటుంది.

రాష్ట్రాలు సకాలంలో ప్రోత్సాహకాలు ఇవ్వాలి

కేంద్ర మంత్రి పియూష్ గోయల్

న్యూఢిల్లీ: రాష్ట్ర ప్రభుత్వాలు పలు పరిశ్రమలకు హామీ ఇచ్చిన మేరకు ప్రోత్సాహకాలను సకాలంలో మంజూరు చేయాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ కోరారు. కొన్ని రాష్ట్రాలు ప్రోత్సాహకాలు ప్రకటించి, వాటిని సకాలంలో ఇవ్వకపోవడం పట్ల పలు రంగాల నుంచి ఆందోళన వ్యక్తమైనట్టు చెప్పారు. కార్మికులు, దుకాణాలు/వాణిజ్య సంస్థలకు సంబంధించిన చట్టాలను సరళతరం చేయాలని కోరారు. తద్వారా మరిన్ని పెట్టుబడులను ఆకర్షించొచ్చన్నారు. రాష్ట్రాల వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రులను ఉద్దేశించి మంత్రి గోయల్ మాట్లాడారు. నాణ్యమైన ఉత్పత్తుల తయారీ, సుస్థిర విధానాలను పాటించే దిశగా పరిశ్రమలకు అవగాహన కల్పించాలని సూచించారు. నాణ్యత నియంత్రణ చట్టాలను అనుసరించాల్సిన ప్రాధాన్యతను గుర్తు చేశారు.

వైద్య చికిత్సల కోసం వీసా ఆన్ అరైవల్

యూఎస్, యూరప్ దేశాల నుంచి వైద్య చికిత్సల కోసం భారత్‌కు వచ్చిన వారికి వెంటనే వీసా మంజూరు (వీసా ఆన్ అరైవల్)ను పరిశీలిస్తున్నట్టు మంత్రి పియూష్ గోయల్ తెలిపారు. ఇదొక మంచి ఆలోచన అని సీఐఐ వార్షిక కార్యక్రమంలో భాగంగా పేర్కొన్నారు. ఇప్పటికే పలు దేశాల వారికి వీసా ఆన్ అరైవల్ మంజూరు చేస్తున్న విషయాన్ని ప్రస్తావించారు.

ప్రపంచ స్థాయి రేటింగ్ వ్యవస్థ

2047 నాటికి వికసిత్ భారత్ సాధనలో భాగంగా మనకంటూ బలమైన, విశ్వసనీయమైన, ప్రపంచ స్థాయి రేటింగ్ సంస్థ ఉండాలన్నది తమ లక్ష్యమని మంత్రి గోయల్ చెప్పారు. వృద్ధి క్రమంలో రేటింగ్ ఏజెన్సీలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.

యమహా నుంచి రెండు ప్రీమియం బైకులు



ముంబై: జపాన్ ద్విచక్ర వాహన దిగ్గజం యమహా మోటార్ ఇండియా కొత్త బైకులు, ఎలక్ట్రిక్ స్కూటర్లను విడుదల చేసింది. వీటిలో ఎక్స్ఎస్ఆర్155, ఎఫ్‌జెడ్ రేవ్ ప్రీమియం బైకులతో పాటు ఏరోక్స్–ఈ, ఈసీ–06 ఎలక్ట్రిక్ స్కూటర్లు ఉన్నాయి. రెట్రో లుకింగ్ ఉండే ఎక్స్ఎస్ఆర్155 బైక్ ప్రారంభ ధర రూ.1,49,990గా ఉంది. స్టైలిష్ అప్‌డేట్ తో యమహా ఎఫ్‌జెడ్ రేవ్: ఢిల్లీ ఎక్స్‌షోరూం వద్ద దీని ధర రూ.1,17,218గా ఉంది. ఇది యమహా ప్రముఖ ఎఫ్‌జెడ్ మోడల్‌కు తాజా అప్‌డేట్.

స్మార్ట్‌ఫోన్ షిప్‌మెంట్‌లో వివో టాప్

- సెప్టెంబర్ క్వార్టర్‌లో 18.3 శాతం వాటా
- ద్వితీయ స్థానంలో ఒప్పో

న్యూఢిల్లీ: భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో చైనా బ్రాండ్ వివో తన ఆధిపత్యాన్ని చాటుకుంటోంది. జూలై–సెప్టెంబర్ త్రైమాసికంలో మొత్తం స్మార్ట్‌ఫోన్ షిప్‌మెంట్లలో (రవాణా) 18.3 శాతం వాటాతో వివో మొదటి స్థానాన్ని కాపాడుకుంది. ఒప్పో 13.9 శాతం, శామ్‌సంగ్ 12.6 శాతం, యాపిల్ 10.4 శాతం, రియల్‌మీ 9.8 శాతం, షావోమీ 9.2 శాతం చొప్పున మార్కెట్ వాటా కలిగి ఉన్నాయి. వన్‌ప్లస్ షిప్‌మెంట్‌లు ఇదే కాలంలో 30.5 శాతం తగ్గాయి. మోటరోలా 52 శాతం వృద్ధిని నమోదు చేసింది. మార్కెట్ పరిశోధనా సంస్థ ఐడీసీ డేటా ప్రకారం.. సెప్టెంబర్ త్రైమాసికంలో భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్ 4.8 శాతం వృద్ధితో 4.8 కోట్ల యూనిట్లకు చేరుకుంది. యాపిల్ సంస్థ 50 లక్షల ఐఫోన్లను రవాణా చేసింది. ప్రీమియం స్మార్ట్‌ఫోన్ల మార్కెట్‌లో 43.3 శాతం వృద్ధి నమోదైంది. ప్రీమియం స్మార్ట్‌ఫోన్ల వాటా మొత్తం ఫోన్లలో 4 శాతం నుంచి 6 శాతానికి పెరిగింది. ఇందులో 70 శాతం ఐఫోన్ 16, 15, 17 మోడళ్లున్నాయి. ప్రీమియం స్మార్ట్‌ఫోన్లలో 66 శాతం మార్కెట్ వాటాతో యాపిల్ టాప్‌లో ఉంది. శామ్‌సంగ్ 31 శాతం వాటాతో తర్వాతి స్థానంలో నిలిచింది.

ముత్తూట్ మైక్రోఫిన్‌తో ఏజియాస్ ఫెడరల్ లైఫ్ జట్టు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా జీవిత బీమా పథకాలను మరింతగా అందుబాటులోకి తెచ్చే దిశగా ముత్తూట్ మైక్రోఫిన్‌తో ఏజియాస్ ఫెడరల్ లైఫ్ ఇన్సూరెన్స్ చేతులు కలిపింది. ఈ భాగస్వామ్యంతో ఔత్సాహిక వ్యాపారవేత్తలు, చిన్న..మధ్య తరహా సంస్థలు సహ అన్ని వర్గాలకు బీమా పథకాలను విస్తరించేందుకు వీలవుతుందని ఏజియాస్ ఫెడరల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ జూడ్ గోమ్స్ తెలిపారు. ముత్తూట్ మైక్రోఫిన్‌కి చెందిన 78 శాతం శాఖలు మెట్రోయేతర ప్రాంతాల్లో ఉండటం ఇందుకు తోడ్పడుతుందని పేర్కొన్నారు. తమ కస్టమర్లకు సమగ్ర బీమా భద్రతను అందించేందుకు ఈ ఒప్పందం సహాయకరంగా ఉంటుందని ముత్తూట్ మైక్రోఫిన్ ఎండీ సదాఫ్ సయీద్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

12-11-2025

విశాఖ	585–00
చిత్తూరు	633–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	600–00
విజయవాడ	600–00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	590–00
వరంగల్	592–00
రిటైల్ ధర	6.50

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDIGO	5,787.00	3.55
BEL	426.8	2.39
M&M	3,745.10	2.22
ADANIPORTS	1,474.10	2.02
HCLTECH	1,571.50	2.01

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJFINANCE	1,009.10	-7
BAJAJFINSV	1,992.90	-5.92
ONGC	249.9	-0.6
TMPV	408.1	-0.57
KOTAKBANK	2,088.20	-0.22

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	7,191
ఎన్‌ఎస్‌ఈ	1,04,375
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	1,90,270
ఎఫ్ఐఐ	- 803
డీఐఐ	2,188

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు	క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	61.15	$ 60.13
బ్రెంట్	65.07	$ 64.06

ఈక్విటీ ఫండ్స్‌కు తగ్గుతున్న ఆకర్షణ!

అక్టోబర్‌లో 19 శాతం తక్కువ పెట్టుబడులు

- రూ.24,691 కోట్లకు పరిమితం
- సిప్ రూపంలో రూ.29,529 కోట్లు
- గోల్డ్ ఫండ్స్‌లోకి రూ.7,743 కోట్లు రాక

ముంబై: ఈక్విటీ మార్కెట్లలో అస్థిరతలు ఫండ్స్‌లో తాజా పెట్టుబడులపై ప్రభావం చూపిస్తున్నాయి. అక్టోబర్‌లోనూ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ 19 శాతం తక్కువగా రూ.24,691 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయి. సెప్టెంబర్‌లో ఈక్విటీ ఫండ్స్‌లోకి వచ్చిన నికర పెట్టుబడులు రూ.30,422 కోట్లుగా ఉండడం గమనార్హం. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) ఈ గణాంకాలను విడుదల చేసింది. బంగారం ధరల ర్యాలీ మద్దతుతో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (గోల్డ్ ఈటీఎఫ్‌లు)లోకి మరిన్ని పెట్టుబడులు వచ్చాయి. అక్టోబర్‌లో రూ.7,743 కోట్ల తాజా పెట్టుబడులను గోల్డ్ ఈటీఎఫ్‌లు ఆకర్షించాయి. నెలవారీ గరిష్ట రికార్డు ఇది. దీంతో గోల్డ్ ఈటీఎఫ్‌ల నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ మొదటిసారి రూ.లక్ష కోట్ల మార్క్‌ను అధిగమించింది.

సిప్ పెట్టుబడులు స్థిరం..

దీర్ఘకాల లక్ష్యాల కోసం క్రమానుగత పెట్టుబడుల (సిప్) విషయంలో ఇన్వెస్టర్ల ధోరణి స్థిరంగానే కొనసాగుతోంది. ఇందుకు నిదర్శనంగా సిప్ ద్వారా అక్టోబర్‌లో ఈక్విటీ ఫండ్స్‌లోకి వచ్చిన పెట్టుబడులు రూ.29,529 కోట్లుగా ఉన్నాయి. సెప్టెంబర్‌లో సిప్ పెట్టుబడులు రూ.29,631 కోట్లతో పోల్చితే స్వల్ప తగ్గుదల కనిపించింది.

విభాగాల వారీగా..

- అక్టోబర్‌లో డివిడెండ్ ఈల్డ్ ఫండ్స్, ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్ మినహా మిగిలిన విభాగాల పథకాల్లోకి నికరంగా పెట్టుబడులు వచ్చాయి.
- అత్యధికంగా ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌లోకి రూ.8,928 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. సెప్టెంబర్‌లో వచ్చిన రూ.7,029 కోట్లతో పోల్చి చూస్తే 27 శాతం పెరిగాయి.
- మిడ్‌క్యాప్ ఫండ్స్ సెప్టెంబర్ నెల కంటే 25 శాతం తక్కువగా రూ.3,807 కోట్లు, స్మాల్‌క్యాప్ ఫండ్స్ 20 శాతం తక్కువగా రూ.3,476 కోట్లు చొప్పున ఆకర్షించాయి.
- లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.3,177 కోట్లు, మల్టీక్యాప్ ఫండ్స్‌లోకి రూ.2,500 కోట్లు, లార్జ్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.972 కోట్లు, ఫోకస్డ్ ఫండ్స్‌లోకి రూ.939 కోట్ల పెట్టుబడులు వచ్చాయి.
- సెక్టోరల్/థీమ్యాటిక్ ఫండ్స్ రూ.1,366 కోట్లు ఆకర్షించాయి.
- ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్ నుంచి రూ.665 కోట్లు, డివిడెండ్ ఈల్డ్ ఫండ్స్ నుంచి రూ.179 కోట్ల చొప్పున ఇన్వెస్టర్లు ఉపసంహరించుకున్నారు.
- డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లోకి రూ.1.59 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అంతకుముందు రెండు నెలల్లోనూ ఇవి నికరంగా పెట్టుబడులను కోల్పోయాయి.
- డెట్ విభాగంలో లిక్విడ్ ఫండ్స్ రూ.89,375 కోట్లు, ఓవర్‌నైట్ ఫండ్స్ రూ.24,050 కోట్లు, అల్ట్రా షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ రూ.15,066 కోట్లు చొప్పున రాబట్టాయి.
- హైబ్రిడ్ ఫండ్స్‌లోకి (ఈక్విటీ, డెట్ కలయిక) 14,156 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. సెప్టెంబర్‌లో పెట్టుబడులు రూ.9,397 కోట్ల కంటే 51 శాతం పెరిగాయి.
- ఆర్బిట్రేజ్ ఫండ్స్‌లోకి రూ.6,919 కోట్లు, మల్టీ అసెట్ ఫండ్స్‌లోకి రూ.5,344 కోట్లు చొప్పున పెట్టుబడులు వచ్చాయి.
- బ్యాలన్స్‌డ్ హైబ్రిడ్ ఫండ్స్/అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్‌లోకి రూ.1,139 కోట్లు వచ్చాయి.
- ప్యాసివ్ ఫండ్స్ అయిన ఇండెక్స్ ఫండ్స్, ఈటీఎఫ్‌ల్లోకి పెట్టుబడులు 13 శాతం తగ్గి రూ.16,668 కోట్లకు పరిమితమయ్యాయి.
- అక్టోబర్‌లో 18 కొత్త పథకాలు (న్యూఫండ్ ఆఫర్/ఎన్ఎఫ్‌వో) మార్కెట్లోకి వచ్చి ఇన్వెస్టర్ల నుంచి రూ.6,062 కోట్ల పెట్టుబడులను సమీకరించాయి.
- అక్టోబర్ చివరికి మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ (ఏయూఎం) సెప్టెంబర్ నుంచి 5 శాతం పెరిగి రూ.79.88 లక్షల కోట్లకు పెరిగింది.

లాభాల స్వీకరణ వల్లే..

ఇన్వెస్టర్లు లాభాలు స్వీకరించడం ఫలితంగా ఈక్విటీల్లోకి పెట్టుబడులు తగ్గినట్టు యాంఫి సీఈవో వీఎన్ చలసాని తెలిపారు. ''సిప్ ఏయూఎం రూ.16.25 లక్షల కోట్లకు చేరింది. పరిశ్రమ మొత్తం ఏయూఎంలో సిప్ వాటా ఐదంట ఒక వంతుకు చేరింది. మొత్తం యాక్టివ్ సిప్ ఖాతాలు 9.45 కోట్లకు పెరిగాయి''అని చలసాని తెలిపారు.

అబుదాబిలో ఐపీఎల్ వేలం

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ వేలం వరుసగా మూడో ఏడాది విదేశీ గడ్డపైనే జరగనుంది. తాజా సీజన్ వేలం కోసం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని అబుదాబి నగరాన్ని వేదికగా ఎంపిక చేశారు. ఈ విషయాన్ని బీసీసీఐ ఉన్నతాధికారి ఒకరు నిర్ధారించారు. 2023లో దుబాయ్, 2024లో జిద్దాలో లీగ్ వేలం నిర్వహించారు. అయితే తేదీ విషయంలో బీసీసీఐ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. డిసెంబర్ 15 లేదా 16 తేదీల్లో వేలం జరిగే అవకాశం ఉంది.

ఇక్బాల్‌కు కెప్టెన్ పారస్ డోగ్రా అభినందన

సొంతగడ్డపై ఢిల్లీ చిత్తు

- సెంచరీతో చెలరేగిన కశ్మీరీ ఓపెనర్ ఇక్బాల్
- 65 ఏళ్ల కశ్మీర్ రంజీ చరిత్రలో ఢిల్లీపై తొలి గెలుపు

న్యూఢిల్లీ: జమ్మూ కశ్మీర్ జట్టు తమ రంజీ ట్రోఫీ చరిత్రలో ఘనతకెక్కే విజయాన్ని సాధించింది. గత 65 ఏళ్లుగా ఢిల్లీ చేతిలో ఇంటా బయటా ఓడిపోతూ వచ్చిన కశ్మీర్ ఇప్పుడు ఢిల్లీ గడ్డపై ఢిల్లీనే వణికించి గెలిచింది. గ్రూప్ 'డి'లో జరిగిన ఈ మ్యాచ్‌లో జమ్మూ కశ్మీర్ జట్టు 7 వికెట్ల తేడాతో ఢిల్లీపై జయభేరి మోగించింది. ఇది గాలివాటం గెలుపు కానేకాదు. మ్యాచ్ మొదలైన మొదటి రోజు నుంచి ఢిల్లీ బ్యాటర్లను జమ్మూ బౌలర్లు ఆకిబ్ నబీ (5/35), వంశజ్ (2/57), ముస్తాక్ (2/50) సమష్టిగా దెబ్బకొట్టారు. తర్వాత బ్యాటింగ్‌లో కెప్టెన్ పారస్ డోగ్రా తొలి ఇన్నింగ్స్ శతకం, ఢిల్లీ రెండో ఇన్నింగ్స్‌ను వంశజ్ (6/68), సాహిల్ (3/73) ఇలా ప్రతి ఒక్కరు కశ్మీర్‌ను గెలిపించేందుకు ప్రతీ రోజు కష్టపడ్డారు. 1960 నుంచి ఇప్పటివరకు ఢిల్లీ, జమ్మూ కశ్మీర్ జట్లు 43 సార్లు తలపడితే ఇందులో 37 మ్యాచ్‌ల్లో ఢిల్లీదే గెలుపు. గత సీజన్ వరకు ఢిల్లీపై గెలుపన్నదే ఎరుగని కశ్మీర్ జట్టు ఎట్టకేలకు తాజా సీజన్‌లో అసాధారణ ప్రదర్శనతో ఘన విజయం సాధించింది.

ఇక్బాల్ అజేయ శతకం

మంగళవారం 179 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు ఓవర్‌నైట్ స్కోరు 55/2తో ఆఖరి రోజు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన కశ్మీర్ 43.3 ఓవర్లలో మూడే వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ కమ్రాన్ ఇక్బాల్ (147 బంతుల్లో 133 నాటౌట్; 20 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. అతను బాదుతున్న బౌండరీలు, భారీ సిక్స్‌లతో విరుచుకుపడుతున్న వైనం చూస్తే ఇది నాలుగు రోజుల ఫస్ట్‌క్లాస్ మ్యాచా లేదంటే వన్డేనా అన్న సందేహం కలుగకమానదు. ఒంటి చేత్తో గెలిపించడం అంటే ఇదేనేమో అనిపించేలా దంచేశాడు.

అవుటైన ముగ్గురు శుభమ్ (8), వివ్రంత్ శర్మ (3), వంశజ్ (8)లు చేసిందేమీ లేదు. ఇక్బాల్‌తో పాటు అజేయంగా నిలిచిన కెప్టెన్ పారస్ డోగ్రా (10 నాటౌట్) పెద్ద స్కోరేం కాదు. ఈ నలుగురి కంటే కూడా ఎక్స్‌ట్రాల (17) రెండో అత్యధిక స్కోరు కావడం గమనార్హం! ఎనిమిది జట్లున్న గ్రూప్ 'డి'లో 7 పాయింట్లతో ఢిల్లీ ఆరో స్థానంలో ఉంది. సొంతగడ్డపై ఆడిన మూడు మ్యాచ్‌ల్లో గెలవకపోగా (రెండు డ్రా)... ఇప్పుడు కశ్మీర్ చేతిలో చిత్తుగా ఓడటంతో ఢిల్లీ నాకౌట్ అవకాశాల్ని క్లిష్టం చేసుకుంది.

శభాష్ షహబాజ్

7 వికెట్లు తీసిన బెంగాల్ స్పిన్నర్

- రైల్వేస్‌పై ఇన్నింగ్స్ 120 పరుగులతో బెంగాల్ జయభేరి
- రంజీ ట్రోఫీ రౌండప్

షహబాజ్ అహ్మద్ సంబరం

సూరత్: బ్యాటింగ్, బౌలింగ్ ప్రదర్శనతో బెంగాల్ ఇన్నింగ్స్ 120 పరుగుల తేడాతో రైల్వేస్‌పై ఘనవిజయం సాధించింది. రంజీ ట్రోఫీ గ్రూప్ 'సి' మంగళవారం ముగిసిన ఈ మ్యాచ్‌లో బెంగాల్ స్పిన్నర్ షహబాజ్ అహ్మద్ (7/56) రైల్వేస్ రెండో ఇన్నింగ్స్‌ను కూల్చేశాడు. ఈ మ్యాచ్‌లో అతను (తొలి ఇన్నింగ్స్ వికెట్) మొత్తం 8 వికెట్లు తీశాడు. చివరి రోజు 90/5 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన రైల్వేస్ జట్టు 55.5 ఓవర్లలో 132 పరుగులకే ఆలౌటైంది. షహబాజ్ స్పిన్ ఉచ్చు బిగించడంతో చేతిలో ఉన్న సగం వికెట్లతో ఆఖరి రోజు కనీసం ఒక సెషన్‌ను కూడా పూర్తిగా ఆడలేకపోయింది. క్రితం రోజు స్కోరుకు 42 పరుగులు మాత్రమే జోడించి 5 వికెట్లను కోల్పోయింది. ఈ ఐదు వికెట్లు షహబాజే పడగొట్టడం విశేషం! ఓవర్‌నైట్ బ్యాటర్లు భార్గవ్ (26; 2 ఫోర్లు), ఉపేంద్ర యాదవ్ (21; 2 ఫోర్లు) ఎంతోసేపు నిలువలేకపోయారు. వీళ్లిద్దరితో పాటు కరణ్ శర్మ (6), ఆకాశ్ పాండే (18; 2 సిక్స్‌లు), కునాల్ యాదవ్ (0)లను కూడా షహబాజ్ పెవిలియన్ చేర్చాడు.

మధ్యప్రదేశ్ గెలుపు

పొర్వోరిమ్: గ్రూప్ 'బి'లో జరిగిన మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ 3 వికెట్ల తేడాతో గోవాపై గెలుపొందింది. 328 పరుగుల లక్ష్యఛేదనలో భాగంగా ఆఖరి రోజు మంగళవారం 21/1 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన మధ్యప్రదేశ్ 94 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 328 పరుగులు చేసి గెలిచింది. ఆట మొదలైన కాసేపటికే హిమాన్షు మంత్రి (22; 3 ఫోర్లు) నిష్క్రమించినప్పటికీ... మరో ఓవర్‌నైట్ బ్యాటర్ హర్ష్ గాప్లీ (54; 6 ఫోర్లు), కెప్టెన్ శుభమ్ శర్మ (72; 7 ఫోర్లు) అర్ధసెంచరీలతో రాణించారు. ఇద్దరు కలిసి మూడో వికెట్‌కు 57 పరుగులు జోడించారు. తర్వాత హర్‌ప్రీత్ సింగ్ (35; 1 ఫోర్, 2 సిక్స్‌లు), సారాంశ్ జైన్ (82; 9 ఫోర్లు)లు సైతం విలువైన భాగస్వామ్యాలు జత చేయడంతో మధ్యప్రదేశ్ విజయం సాధించింది. గోవా బౌలర్లలో లలిత్ యాదవ్, దర్శన్ చెరో 2 వికెట్లు తీశారు. ఈ గెలుపుతో మధ్యప్రదేశ్ జట్టుకు ఆరు పాయింట్లు లభించాయి.

త్రిపుర, అస్సాం మ్యాచ్ డ్రా

అగర్తలా: గ్రూప్ 'సి'లో త్రిపుర, అస్సాం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రా అయ్యింది. ఇన్నింగ్స్ పరాజయం తప్పించుకోవాలంటే చేతిలో ఉన్న 7 వికెట్లతో ఇంకా 286 పరుగులు చేయాల్సిన దశలో అస్సామ్ బ్యాటర్లు పోరాడారు. ఫాలో ఆన్‌లో 78/3 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన అస్సాం 117.4 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 367 పరుగులు చేసింది. కెప్టెన్, ఓవర్‌నైట్ బ్యాటర్ దేనిశ్ దాస్ (103; 14 ఫోర్లు), సుమిత్ ఘడిగాంకర్ (54; 5 ఫోర్లు) నాలుగో వికెట్‌కు 150 పరుగులు జతచేశారు. ఈ క్రమంలో దాస్ సెంచరీ, సుమిత్ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నారు. ఆ తర్వాత శిబ్‌శంకర్ రాయ్ (101 నాటౌట్; 17 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా అజేయ శతకంతో అస్సాంను డ్రాతో గట్టెక్కించాడు. రోజంతా బౌలింగ్ చేసిన త్రిపుర బౌలర్లు కేవలం 4 వికెట్లే తీయగలిగారు. త్రిపుర తొలి ఇన్నింగ్స్‌లో 602/7 (డిక్లేర్డ్) స్కోరు చేసింది. హనుమ విహారి శతక్కొట్టాడు. ఈ సీజన్‌లో అతను వరుసగా రెండో సెంచరీ సాధించాడు.

పంకజ్ అవుట్

దోహా: ప్రపంచ స్నూకర్ చాంపియన్‌షిప్‌లో భారత దిగ్గజం పంకజ్ అద్వానీకి అనూహ్య పరాజయం ఎదురైంది. మంగళవారం జరిగిన నాకౌట్ దశ తొలి రౌండ్‌లో ప్రపంచ మాజీ చాంపియన్ పంకజ్ అద్వానీ ఓటమి పాలై టోర్నీ నుంచి నిష్క్రమించాడు. చైనా ప్లేయర్ డెంగ్ హావోహుయ్‌తో జరిగిన మ్యాచ్‌లో పంకజ్ అద్వానీ 1–4 (24–66, 38–71, 11–62, 79–46, 42–70) ఫ్రేమ్‌ల తేడాతో ఓటమి చవిచూశాడు. అంతకుముందు గ్రూప్ 'హెచ్'లో పంకజ్ రెండో స్థానంలో నిలిచి నాకౌట్ దశకు అర్హత పొందాడు. మొత్తం 12 గ్రూప్‌లలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన 24 మంది ప్లేయర్లు నాకౌట్ దశకు చేరుకున్నారు. భారత్‌కే చెందిన హుస్సేన్ ఖాన్ మాత్రం నాకౌట్ దశ తొలి మ్యాచ్‌లో గెలిచి తదుపరి రౌండ్‌కు అర్హత పొందాడు. నాకౌట్ మ్యాచ్‌లో హుస్సేన్ 4–3 (73–49, 59–30, 68–73, 36–48, 60–14, 44–59, 85–37) ఫ్రేమ్‌ల తేడాతో హసన్ కెర్డె (ఆస్ట్రేలియా)పై గెలుపొందాడు.

హైదరాబాద్‌కు 3 పాయింట్లు

రాజస్తాన్‌తో రంజీ మ్యాచ్ 'డ్రా' ● రాణించిన రోహిత్ రాయుడు

రోహిత్ రాయుడు

సాక్షి, హైదరాబాద్: రంజీ ట్రోఫీ గ్రూప్ 'డి'లో హైదరాబాద్, రాజస్తాన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. సొంతగడ్డపై జరిగిన ఈ పోరులో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ద్వారా హైదరాబాద్ 3 పాయింట్లు తమ ఖాతాలో వేసుకోగా, రాజస్తాన్‌కు ఒక పాయింట్ దక్కింది. మంగళవారం 198/7 ఓవర్‌నైట్ స్కోరుతో ఆఖరి రోజు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన హైదరాబాద్ 78 ఓవర్లలో 244/9 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. క్రితం రోజు బ్యాటర్లలో తనయ్ త్యాగరాజన్ (4) కేవలం పరుగు మాత్రమే జతచేసి నిష్క్రమించాడు. రోహిత్ రాయడు (42; 1 ఫోర్లు, 1 సిక్స్) కాసేపు కుదురుగా ఆడాడు. టెయిలెండర్ అనికేత్ రెడ్డి (21 నాటౌట్, 2 ఫోర్లు)తో కలిసి తొమ్మిదో వికెట్‌కు 31 పరుగులు జోడించాక రోహిత్‌ను మహిపాల్ అవుట్ చేశాడు. పున్నయ్య (0 నాటౌట్) క్రీజులోకి రాగా... మరో పది బంతులకే ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్ 95 పరుగుల ఆధిక్యం కలుపుకొని ప్రత్యర్థి ముందు 340 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. దీన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన రాజస్తాన్ మ్యాచ్ ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 57 ఓవర్లలో 3 వికెట్లకు 207 పరుగులు చేసింది. టాపార్డర్ బ్యాటర్లు సచిన్ యాదవ్ (44; 5 ఫోర్లు, 1 సిక్స్), సల్మాన్ ఖాన్ (79; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), మహిపాల్ లొమ్రోర్ (40; 3 ఫోర్లు) రాణించారు. హైదరాబాద్ బౌలర్లలో తనయ్ త్యాగరాజన్ 2, అనికేత్ ఒక వికెట్ తీశారు. ఈ సీజన్‌లో 4 మ్యాచ్‌లాడిన హైదరాబాద్ ఒకటి గెలిచి, మిగతా మూడు మ్యాచ్‌లను 'డ్రా' చేసుకుంది. 'డి' పాయింట్ల పట్టికలో ముంబై (17), జమ్మూ కశ్మీర్ (14) తర్వాత హైదరాబాద్ 13 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. ఈ నెల 16 నుంచి జమ్మూ వేదికపై జరిగే తదుపరి మ్యాచ్‌లో హైదరాబాద్... జమ్మూ కశ్మీర్‌తో తలపడుతుంది.

భారత్ అండర్-19 'బి' కెప్టెన్‌గా ఆరోన్

- ముక్కోణపు సిరీస్‌కు జట్ల ప్రకటన
- నలుగురు హైదరాబాద్ ఆటగాళ్లకు చోటు

వినూ మన్కడ్ ట్రోఫీతో ఆరోన్ జార్జ్

న్యూఢిల్లీ: బీసీసీఐ నిర్వహించే అండర్–19 ముక్కోణపు సిరీస్‌లో పాల్గొనే జట్లను జూనియర్ సెలక్షన్ కమిటీ ప్రకటించింది. అండర్–19 భారత్ 'ఎ', భారత్ 'బి' జట్లతో పాటు అఫ్గానిస్తాన్ అండర్–19 టీమ్ ఈ సిరీస్‌లో మూడో జట్టుగా బరిలోకి దిగుతుంది. 'బి' జట్టు కెప్టెన్‌గా హైదరాబాద్‌కు చెందిన ఆరోన్ జార్జ్ ఎంపికయ్యాడు. 'ఎ' టీమ్‌కు పంజాబ్‌కు చెందిన విహాన్ మల్హోత్రా కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఇటీవల ముగిసిన బీసీసీఐ అండర్–19 టోర్నీ 'వినూ మన్కడ్ ట్రోఫీ'లో హైదరాబాద్ జట్టు విజేతగా నిలిచింది. దీనికి ఆరోన్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఈ నేపథ్యంలో ఈ టీమ్ నుంచి నలుగురు ప్లేయర్లకు ముక్కోణపు సిరీస్‌లో ఆడే అవకాశం లభించింది. 'బి' కెప్టెన్ ఆరోన్ జార్జ్‌తో పాటు అండర్–19 'ఎ' టీమ్‌లోకి హైదరాబాద్‌కు చెందిన వాఫి కచ్చి, రాపోలు అలంకృత్ (వికెట్ కీపర్), మొహమ్మద్ మాలిక్ ఎంపికయ్యారు. రంజీ ట్రోఫీలో ఆడుతున్న ఆయుశ్ మాత్రే, రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌కు ఎంపికై న వైభవ్ సూర్యవంశీల పేర్లను ఈ సిరీస్ కోసం పరిశీలించలేదని సెలక్టర్లు వెల్లడించారు. 'బి' టీమ్‌లో వికెట్ కీపర్‌గా భారత దిగ్గజం రాహుల్ ద్రవిడ్ కుమారుడు అన్వయ్ ద్రవిడ్‌కు అవకాశం దక్కింది. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నవంబర్ 17 నుంచి 30 వరకు ఈ సిరీస్ జరుగుతుంది.

భారత్‌కు ఆడటమే లక్ష్యం: ఆరోన్

అండర్–19 టోర్నీ వినూ మన్కడ్ ట్రోఫీలో గత మూడేళ్లుగా ఆరోన్ జార్జ్ టాప్ స్కోరర్‌గా నిలుస్తూ వచ్చాడు. ఈ సీజన్‌లో అతను 2 సెంచరీలు సహా 373 పరుగులు చేశాడు. ప్రస్తుతం జరుగుతున్న అండర్–19 చాలెంజర్ ట్రోఫీలో కూడా అతను నిలకడగా రాణిస్తున్నాడు. స్కూల్ క్రికెట్‌లో మంచి ప్రదర్శనతో మూడేళ్ల క్రితం హైదరాబాద్ అండర్–16 టీమ్‌లోకి వచ్చిన అతను విజయ్ మర్చంట్ ట్రోఫీలో ఆకట్టుకున్నాడు. 2022–23 సీజన్‌లో ఒక ట్రిపుల్ సెంచరీ సహా 511 పరుగులు సాధించడంతో ఆరోన్‌కు మంచి గుర్తింపు దక్కింది. ప్రస్తుతం అతను భవాన్స్ కాలేజీలో బీకామ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. 'ఏ స్థాయిలోనైనా భారత జట్టు తరఫున ఆడాలనేది నా కల. ప్రస్తుత నా ప్రదర్శన, లభిస్తున్న అవకాశాలు ఆ దిశగా తొలి అడుగుగా భావిస్తున్నా. అండర్–19 లోకి వస్తే ఐపీఎల్ ఆడే అవకాశాలు కూడా మెరుగవుతాయి' అని కేరళ మూలాలు ఉన్న ఆరోన్ చెప్పాడు. హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన ఆరోన్ జార్జి వీలు చిక్కినపుడల్లా కొట్టాయంలో ఉంటున్న తన తాత, బామ్మ ఇళ్లకు వెళ్లి వస్తుంటాడు.

హైదరాబాద్‌లో జరిగిన బీసీసీఐ అండర్-19 వన్డే చాలెంజర్ ట్రోఫీ టోర్నీలో విజేతగా నిలిచిన టీమ్ 'ఎ' జట్టుతో హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అడ్మినిస్ట్రేటర్, జస్టిస్ (రిటైర్డ్) పి.నవీన్ రావు

సల్మాన్ సెంచరీ: పాక్ విజయం

తొలి వన్డేలో 6 పరుగులతో లంకపై గెలుపు

రావల్పిండి: వన్డే సిరీస్‌లో పాకిస్తాన్ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి వన్డేలో పాకిస్తాన్ 6 పరుగుల తేడాతో శ్రీలంకపై గెలుపొందింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య పాకిస్తాన్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 299 పరుగులు చేసింది. టాప్–4 బ్యాటర్లలో ఫఖర్ జమాన్ (55 బంతుల్లో 32; 2 ఫోర్లు, 1 సిక్స్), బాబర్ ఆజమ్ (51 బంతుల్లో 29; 3 ఫోర్లు) కాస్త మెరుగ్గా ఆడారు. అయూబ్ (6), రిజ్వాన్ (5) విఫలమయ్యారు. 95 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన పాక్‌ను సల్మాన్ ఆగా (87 బంతుల్లో 105 నాటౌట్; 9 ఫోర్లు) అజేయ శతకంతో ఆదుకున్నాడు. హుస్సేన్ తలత్ (63 బంతుల్లో 62; 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. సల్మాన్, హుస్సేన్ ఇద్దరు ఐదో వికెట్‌కు 138 పరుగులు చేశారు. సింహళ స్పిన్నర్ హసరంగ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం కష్టసాధ్యమైన 300 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు కడదాకా పోరాడిన లంక 50 ఓవర్లలో 9 వికెట్లకు 293 పరుగులు చేసి ఓడింది. హసరంగ (52 బంతుల్లో 59; 7 ఫోర్లు) క్రీజులో ఉన్నంత సేపు గెలుపుపై ఆశలు రేపాడు. సమరవిక్రమ (39; 6 ఫోర్లు), కమిల్ మిషార (38; 5 ఫోర్లు, 1 సిక్స్), అసలంక (32; 2 ఫోర్లు) ఫర్వాలేదనపించారు. రవూఫ్ 4, నసీమ్ షా, అష్రఫ్ చెరో 2 వికెట్లు తీశారు.

అనాహత్ శుభారంభం

న్యూఢిల్లీ: చైనా ఓపెన్ అంతర్జాతీయ స్క్వాష్ టోర్నమెంట్‌లో భారత జాతీయ చాంపియన్ అనాహత్ సింగ్ శుభారంభం చేసింది. షాంఘైలో మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో అనాహత్ 11–6, 11–8, 11–3తో మెనా హమీద్ (ఈజిప్ట్)పై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్లు అభయ్ సింగ్, వెలవన్ సెంథిల్ కుమార్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. అభయ్ 8–11, 7–11, 4–11తో బాప్టిస్ట్ మసోట్టి (ఫ్రాన్స్) చేతిలో, సెంథిల్ కుమార్ 8–11, 12–14, 6–11తో మొహమ్మద్ అబూఎల్గర్ (ఈజిప్ట్) చేతిలో ఓడిపోయారు.

ఏటా జరిగే సంప్రదాయ కార్నివాల్ సీజన్ ప్రారంభాన్ని పురస్కరించుకుని మంగళవారం జర్మనీలోని కొలోన్ నగరంలో ట్యాక్సీ గుర్తులు, వాటర్ కేన్లు, విచిత్ర వేషధారణలతో ప్రదర్శనల్లో పాల్గొన్న ఔత్సాహికులు

జార్జియాలో కూలిన తుర్కియే విమానం

విమానంలో మిలటరీ అధికారులు సహా 20 మంది

అంకారా: తుర్కియే మిలటరీ సరుకు రవాణా విమానమొకటి జార్జియాలో కూలిపోయింది. అజర్‌బైజాన్ సరిహద్దులకు సమీపంలో మంగళవారం ఘటన చోటు చేసుకుంది. ఆ సమయంలో విమానంలో మిలటరీ అధికారులు, సిబ్బంది కలిపి 20 మంది వరకు ఉన్నట్లు చెబుతున్నారు. విమానంలో వారి క్షేమ సమాచారాలు తెలియాల్సి ఉందని తుర్కియే అధికారులు తెలిపారు. ప్రాణనష్టం వాటిల్లిందని దుర్ఘటనపై స్పందించిన తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగన్ వ్యాఖ్యానించారు. ఇతర వివరాలను ఆయన వెల్లడించలేదు. సీ–130 రకం ఈ విమానం అజర్‌బైజాన్‌లో టేకాఫ్ తీసుకుని తుర్కియే దిశగా వస్తుండగా ప్రమాదానికి గురైందని తుర్కియే రక్షణ మంత్రి చెప్పారు. సహాయక చర్యలను చేపట్టేందుకు జార్జియా, అజర్‌బైజాన్ అధికారులతో సంప్రదింపులు జరుపుతు న్నట్లు వివరించారు. సింఘ్నాఘి పట్టణ సమీపంలో విమానం కూలిందని జార్జియా తెలిపింది. తుర్కియే, అజర్‌బైజాన్ మధ్య సన్నిహిత సంబంధాలున్నాయి. సీ–130 రకం విమానాలను తుర్కియే ఆర్మీ సిబ్బంది రవాణాకు, సామగ్రి తరలింపునకు విస్తృతంగా వాడుతోంది.

కూతురికి ప్రేమతో...!

ప్రపంచమంతా గుండె గుప్పెడే ఉంటుందంటారు.. నువ్వస్సలు నమ్మకు.. ఎందుకంటే.. నాన్న గుండె ఇల్లంత ఉంటుంది!.. అంటాడో కవి.

ఒక సామాన్య టీ కొట్టు యజమాని, తన కూతురి కలను నెరవేర్చడానికి చూపిన అచంచలమైన ప్రేమ, దృఢ సంకల్పం.. ఇప్పుడు సోషల్ మీడియాను కదిలిస్తోంది. తన బిడ్డకు స్కూటర్ కొనేందుకు ఆయన పడిన తపన ఎంతోమంది హృదయాలను తాకింది.

టీ దుకాణంలో బచ్చు చౌదరి

కూతుళ్ల కోసం కూడబెట్టిన నాణేలు

'బండెక్కిన'చిల్లర నాణేల కల

ఆ రోజు శనివారం.. పశ్చిమ బెంగాల్‌లోని మిడ్నాపూర్ జిల్లా చంద్రకోన, మౌలా గ్రామానికి చెందిన బచ్చు చౌదరి అనే టీ దుకాణం యజమాని.. చాలా నెమ్మదిగా, బిడియంగా ద్విచక్రవాహనాల షోరూమ్ లోపలికి ప్రవేశించారు. 'స్కూటర్‌ను వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేయవచ్చా?'.. అని ప్రశ్నించారు. సిబ్బంది దానికి అంగీకరించగానే, 'మీరు చిల్లర నాణేలను అంగీకరిస్తారా?'అని తిరిగి ప్రశ్నించారు. అందుకు సిబ్బంది సరే అన్నారు.. కానీ తరువాత ఏం జరగబోతోందో వారు ఊహించలేకపోయారు.

నాణేల డ్రమ్ము మోసుకొచ్చి..

క్షణాల్లో చౌదరి గారు బయటికి వెళ్లి, తాను ఏళ్ల తరబడి కూడబెట్టిన రూ.పది నాణేలతో నిండిన ఒక భారీ డ్రమ్మును మోసుకుంటూ తిరిగి వచ్చారు. షోరూమ్ ఇన్‌చార్జి అయిన అరిందమ్ ఆ దృశ్యాన్ని వివరిస్తూ.. 'స్కూటర్లను చూపించే సమయంలో చౌదరి కొంచెం భయపడుతూనే వాయిదాలలో కొంటానన్నారు.. అందుకు సరే అన్నాం. ఆ తర్వాత, చిల్లర నాణేలు తీసుకుంటారా? అని అడిగారు. సరే అనగానే, 'నాణేల మొత్తం సుమారు రూ.40,000 ఉండొచ్చేమో'.. అన్నారాయన.

లెక్కించేందుకు ఎనిమిది మంది!

'కానీ, ఆయన ఒక పెద్ద డ్రమ్ములో నాణేలు తీసుకొచ్చినప్పుడు మేమంతా నిశ్చేష్టులమయ్యాం! దాన్ని ఎత్తడం, కింద పోయడం చాలా కష్టమైంది. ఎనిమిది మంది ఉద్యోగులం కలిసి అతి కష్టం మీద నాణేలను నేలపై పోసి లెక్కించడం ప్రారంభించాం. ఆ డ్రమ్ములో రూ.69,000 విలువైన రూ.పది నాణేలు ఉన్నాయి. వాటితో పాటు వివిధ రకాల కరెన్సీ నోట్లు కూడా కలిపి మొత్తం రూ.1.10 లక్షలు అయ్యింది'.. అని అరిందమ్ వివరించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

నా బంగారు తల్లి అడిగింది మరి..

ఈ పొదుపు ప్రయాణం ఎలా మొదలైందో చౌదరి వివరిస్తూ.. 'చాలా ఏళ్ల క్రితం నా చిన్న కూతురు స్కూటర్ కొనివ్వమని కోరింది.. అప్పుడు ఆ కోరికను తీర్చలేకపోయాను'.. అని గుర్తు చేసుకున్నారు. 'నా బంగారుతల్లి అడిగింది కదా.. అందుకే కొద్దిపాటి ఆదాయంతో టీ కొట్టు నడుపుకొంటూనే పొదుపు చేయడం మొదలుపెట్టాను.. స్కూటర్‌కు అంత డబ్బు సమకూర్చలేనేమో అనుకున్నాను'.. అన్నారు. అయినప్పటికీ, తన కూతురి కలను నెరవేర్చాలనే సంకల్పంతో, చిరు వ్యాపారంలో వచ్చిన నాణేలను రోజూ పక్కన పెట్టడం మొదలుపెట్టారు. నాలుగేళ్ల నిరీక్షణ, పట్టుదల ఫలించింది. చివరకు, ఆయన గర్వంగా స్కూటర్‌ను తన కూతురికి కొనివ్వగలిగారు. నాణేలతో పాటు డ్రమ్ములో ఉన్న వివిధ రకాల నోట్లను లెక్కించడానికి షోరూమ్‌లోని ఉద్యోగులందరికీ సుమారు రెండు గంటల ఇరవై ఐదు నిమిషాల సమయం పట్టిందని సిబ్బంది తెలిపారు. బిడ్డపై అచంచల ప్రేమను చాటుకున్న ఈ తండ్రి అక్షరాలా బంగారు'తండ్రి'.

ఐఎస్ కుట్రదారుకు సుప్రీం నో బెయిల్

న్యూఢిల్లీ: ఉగ్ర సంస్థ ఐఎస్(ఇస్లామిక్ స్టేట్)కు సంబంధాలున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ వ్యక్తికి సుప్రీంకోర్టు బెయిల్ నిరాకరించింది. దేశంలో ఉగ్ర వలయం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలున్నాయని తెలిపింది. 'ఒక సందేశం అందించేందుకు ఇది సరైన ఉదయం'అంటూ ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుళ్ల నేపథ్యంలో జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం మంగళవారం వ్యాఖ్యానించింది. సోమవారం జరిగిన విషాద ఘటన నేపథ్యంలో ఈ కేసును వాదించేందుకు ఇది సరైన ఉదయం కాదంటూ పిటిషనర్ తరఫు లాయర్ చేసిన వ్యాఖ్యకు ధర్మాసనం పైవిధంగా స్పందించింది. మధ్యప్రదేశ్ హైకోర్టు బెయిల్ నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ సయ్యద్ మమూర్ అలీ వేసిన పిటిషన్‌పై మంగళవారం ధర్మాసనం విచారణ చేపట్టిన సందర్భంగా ఈ పరిణామం చోటుచేసుకుంది. పిటిషనర్ సయ్యద్ మమూర్ అలీపై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా), ఐపీసీల కింద కేసు నమోదు చేసిన జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) 2023 మేలో అరెస్ట్ చేసింది. రెండున్నరేళ్లుగా జైలులోనే ఉన్న సయ్యద్ 70 శాతం మేర దివ్యాంగుడని అతడి తరఫు లాయర్ వాదించారు. అధికారుల దాడుల్లో అతడి ఇంట్లో ఇస్లామిక్ సాహిత్యం మాత్రమే లభించిందన్నారు. అయితే, అతడు ఐఎస్ మాదిరిగా ఉండే వాట్సాప్ గ్రూప్‌ను నడపడం వెనుక ఉద్దేశమేంటని ధర్మాసనం ప్రశ్నించింది. అతడు ఎదుర్కొంటున్న ఆరోపణలకు ప్రాథమిక ఆధారాలున్నాయంది. ఈ కేసును రెండేళ్లలోగా తేల్చాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. నిందితుడి తప్పేమీ లేదని తేలినట్లయితే బెయిల్ విషయం అప్పుడు పరిశీలించవచ్చని తెలిపింది. '2020లో కోవిడ్‌తో దేశంలో లాక్‌డౌన్ అమలైన సమయంలో తన ఇంట్లో వివాదాస్పద బోధకుడు జకీర్ నాయక్ ప్రసంగాల వీడియోలు చూసి, ఆకర్షితుడైన సయ్యద్ ఇతరుల తోపాటు ఐఎస్‌తో సంబంధాలను ఏర్పర్చుకున్నాడు. అతడి వద్ద అభ్యంతరకర పత్రాలు, కరపత్రాలతోపాటు ఉగ్ర సంస్థను పోలిన జెండా లభించాయి. మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో ఉన్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీపై దాడి చేసి, ఆయుధాలను కొల్లగొట్టి దేశంలో ఐఎస్ కార్యకలాపాలను విస్తరించాలని కుట్ర పన్నాడు'అంటూ మధ్యప్రదేశ్ హైకోర్టు అతడి బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది.

ఎస్ఐఆర్‌పై టీఎంసీ, డీఎంకే పిటిషన్లు

కేంద్రం స్పందన కోరిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)ను సవాల్ చేస్తూ తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ), ద్రవిడ మున్నేట్ర కజగం(డీఎంకే) పార్టీలు వేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు కేంద్రం స్పందన కోరింది. రెండు వారాల్లోగా సమాధానమివ్వాలని మంగళవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం పేర్కొంది. తమిళనాడులో ఎస్ఐఆర్‌ను సమర్థిస్తూ ఏఐఏడీఎంకే వేసిన పిటిషన్‌పైనా విచారణకు అంగీకరించింది. తమిళనాడులో ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల కమిషన్(ఈసీ) హడావుడిగా చేపడుతోందని డీఎంకే తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ తెలిపారు. రకరకాలైన ధ్రువీకరణ పత్రాలు కావాలంటూ ఓటర్లను కోరుతోందన్నారు. ఈ నవంబర్, డిసెంబర్ నెలల్లో భారీ వర్షాలకు కురిసే అవకాశముందని వాతావరణ విభాగం కూడా అంచనా వేసిందంటూ ఆయన..ఎస్ఐఆర్ ప్రక్రియలో పాలుపంచుకునే అధికారులు, సిబ్బంది వరద సహాయక కార్యక్రమాల్లోనూ పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఈ సమయంలో ఎస్ఐఆర్‌ను సరైన నిర్ణయం కాదని వాదించారు. ఇలాంటి పరిస్థితులే పశ్చిమ బెంగాల్‌లోనూ ఉన్నాయన్నారు. దీనిపై జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ..'మనది విశాల దేశం. ఎప్పుడూ ఏదో ఒక చోట ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తూనే ఉంటాయి. ఎస్ఐఆర్‌ను చేపట్టేందుకు రాజ్యాంగ సంస్థ ఈసీ ఉంది. ప్రతి వారూ స్టేటస్ కో కోరుతుండటం సమస్యగా మారిపోయింది. ఇప్పటికే బిహార్‌లో ఈ ప్రక్రియ ముగిసింది. లోపాలను సరిదిద్దుకుంది. ఎస్ఐఆర్‌పై రాజకీయ పార్టీలు వ్యక్తంచేసే అభ్యంతరాలకు ఈసీ బదులిస్తుంది. ఈసీ సమాధానాలు సంతృప్తికరంగా ఉంటే మీ వాదనల్లో లోపమున్నట్లే'అని వ్యాఖ్యానించింది. తాజా పిటిషన్లపై సమాధానమివ్వాలని ఈసీ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీని కోరింది. ఎస్ఐఆర్ చేపట్టే రాష్ట్రాల్లోని ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటూ కార్యాచరణను రూపొందించుకోవాలని ఈసీకి సూచించింది. తదుపరి విచారణ ఈ నెల 26, 27వ తేదీల్లో చేపడతామని ధర్మాసనం తెలిపింది. టీఎంసీ నేత కల్యాణ్ బెనర్జీ, పశ్చిమబెంగాల్ కాంగ్రెస్ నేత శుభాంకర్ సర్కార్, డీఎంకే నేత ఆర్ఎస్ భారతి. సీపీఎం నేత షణ్ముగం తదితరులు పశ్చిమబెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరిల్లో జరిగే ఎస్ఐఆర్‌ను సవాల్ చేస్తూ పిటిషన్లు వేశారు.

ట్రంప్

ఒప్పందానికి సమీపంలో భారత్

టారిఫ్‌లను కొంతమేర తగ్గిస్తాం • అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి

వాషింగ్టన్: భారత్‌తో న్యాయబద్ధమైన వాణిజ్య ఒప్పందం అతి సమీపంలో ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందం ఓకే అయిన పక్షంలో భారత్ వస్తువులపై కొంతమేర టారిఫ్‌లను తగ్గిస్తామన్నారు. అయితే, భారత్‌తో కుదరబోయే ఒప్పందం, గతంలో వాటికంటే భిన్నంగా ఉంటుందన్నారు. 'ప్రస్తుతానికి వాళ్లు నన్ను ఇష్టపడటం లేదు. ఒప్పందం కుదిరితే మళ్లీ నన్ను తిరిగి ప్రేమిస్తారు'అని వ్యాఖ్యానించిన ట్రంప్ ఇతర వివరాలను వెల్లడించలేదు. రెండు వారాల వ్యవధిలో ట్రంప్ ఇలాంటి ప్రకటన చేయడం ఇది రెండోసారి. భారత్‌తో ద్వైపాక్షిక ఒప్పందం అతిత్వరలోనే కుదరనుందంటూ ఇటీవల ట్రంప్ ప్రకటించడం తెల్సిందే. అయితే, తాజాగా ఆయన చేసిన ప్రకటన ఎప్పటి మాదిరిగానే అతిశయోక్తా?, లేక ఒప్పందం కోసం రెండు పక్షాల మధ్య జరుగుతున్న చర్చల్లో నిజంగానే పురోగతి ఉందా? అనేది స్పష్టం కావాల్సి ఉంది. భారత్‌లో రాయబారిగా నియమితులవనున్న సెర్గియో గోర్‌తో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రమాణం చేయించారు. వైట్ హౌస్ ఓవల్ ఆఫీసులో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రంప్ పైవ్యాఖ్యలు చేశారు. 'చర్చల్లో వాళ్లు(భారత్) సిద్ధహస్తులు. సెర్గియో, వీలైతే ఈ విషయం నువ్వు చూసుకో'అని పేర్కొన్నారు. అదేవిధంగా, రష్యా ఆయిల్‌ను కొంటున్నందునే భారత్‌పై అత్యధికంగా టారిఫ్‌లు వేశామన్నారు. వాణిజ్య ఒప్పందం కుదిరిన పక్షంలో టారిఫ్‌లను కొంతమేర తగ్గిస్తామని చెప్పారు. ఇదే సమయంలో గత అధ్యక్షుడు బైడెన్‌పై పాత ధోరణిలోనే విమర్శలు గుప్పించారు. 'బైడెన్‌కు భారత్ గురించి తెలియదు. అతడికి అసలేమీ తెలియదు. ఇప్పుడు మేం ఏం చేస్తున్నామో చూడండి'అంటూ బడాయిగా మాట్లాడారు.

గెలుపు మాదే: ఎన్డీయే
ఫలితం అనూహ్యం: ఇండియా కూటమి

పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ముగియడంతో ఫలితాలపై అంచనాలు మొదలయ్యాయి. ఈ ఎన్నికల్లో తమ ఎన్డీయే విజయం నిర్ణయాత్మకంగా ఉంటుందని సీఎం నితీశ్ కుమార్ వ్యాఖ్యానించగా, ఈసారి ఫలితం అనూహ్యమని ఇండియా కూటమి నేతలు అంచనా వేస్తున్నారు. ఎన్డీయే మరోసారి అధికారంలో రానుందని వివిధ సంస్థలు చేపట్టిన ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. ప్రతిపక్ష ఇండియా కూటమికి దక్కేది పేలవ ఫలితాలేనని ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ తెలిపారు. భారీ మెజారిటీతో ఎన్డీయే మళ్లీ అధికారం చేపట్టనుందని హిందుస్తానీ అవామ్ మోర్చా(హెచ్ఏఎం) నేత సంతోష్ సుమన్ అన్నారు. ఎగ్జిట్ పోల్స్ కంటే కూడా సీట్లు ఎక్కువే వస్తాయన్నారు. ఆర్జేడీ నేత, బక్సార్ ఎంపీ సుధాకర్ సింగ్ స్పందిస్తూ.. అత్యధికఓటింగ్ అంటే అధికార పక్షానికి వ్యతిరేకంగా ప్రజలిచ్చిన తీర్పుగానే భావించాల్సి ఉంటుందన్నారు. మహాగఠ్ బంధన్ సునాయాసంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఎగ్జిట్ పోల్స్ వాస్తవానికి దూరంగా ఉన్నాయని చెప్పారు. ఇలాంటి అంచనాలు సాధారణంగా అధికార పక్షానికి మాత్రమే అనుకూలంగా ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు. పుర్నియా స్వతంత్ర ఎంపీ రాజేశ్ రంజన్ అలియాస్ పప్పూ యాదవ్ సైతం ఇలాంటి అభిప్రాయమే వ్యక్త పరిచారు. సీమాంచల్ ప్రాంతంలో అత్యధిక ఓటింగ్ నమోదైందంటే అది ఇండియా కూటమికి అనుకూలంగా ఉన్నట్లేనని, భారీ మెజారిటీతో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కానుందని ధీమా వ్యక్తం చేశారు.

పాక్ ఆరోపణలను గట్టిగా తిప్పికొట్టిన భారత్

న్యూఢిల్లీ: పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో చోటుచేసుకున్న ఆత్మహుతి దాడి వెనుక భారత్ ఉన్నదంటూ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేసిన ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది.ఆ దేశపు ఉన్మాద నాయకత్వం ఇలాంటి కల్పిత, తప్పుడు కథనాలను అల్లుతుందని తాము ముందే ఊహించామని వ్యాఖ్యానించింది. ఓ కోర్టు వెలుపల జరిగిన దాడిలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. వాస్తవమేదో అంతర్జాతీయ సమాజానికి తెలుసునని విదేశాంగశాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. తప్పుదోవ పట్టించే పాకిస్తాన్ కథనాలను ఎవరూ నమ్మరన్నారు. పాక్‌లో రాజ్యాంగ స్వరూపాన్ని మార్చి వేస్తూ మిలటరీ చేతుల్లోకి అధికారాన్ని ధారదత్తం చేస్తున్న వేళ ప్రజల దృష్టిని మరల్చేందుకే ఇలాంటి నిరాధార ఆరోపణలను ప్రధాని షరీఫ్ చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ పేరుతో మరో పోస్టును సృష్టించి, ఆర్మీ చీఫ్ ఆసిఫ్ మునీర్‌కు త్రివిధ దళాలపై తిరుగులేని అధికారాలను కట్టబెట్టేందుకు పార్లమెంట్ రాజ్యాంగ సవరణలకు ఆమోదించడంపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసనలకు దిగడం తెల్సిందే.

రాజస్తాన్ ఐఏఎస్‌పై గృహ హింస కేసు

జైపూర్: ఐఏఎస్ అధికారి అయిన తన భర్త పదేపదే భౌతికంగా దాడులకు పాల్పడుతున్నారని తనకు ప్రాణభయం ఉందంటూ మరో ఐఏఎస్ అధికారి భారతి దీక్షిత్ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు మరో ఆశిష్ మోదీపై కేసు నమోదు చేశారు. ఆర్థిక శాఖలో జాయింట్ సెక్రటరీగా దీక్షిత్ పనిచేస్తుండగా, మోదీ సామాజిక న్యాయ శాఖలో డైరెక్టర్‌గా బాధ్యతల్లో ఉన్నారు. రాజస్తాన్ కేడర్‌కు చెందిన వీరిద్దరూ 2014 బ్యాచ్‌మేట్లు కావడం విశేషం. 'మా తండ్రి కేన్సర్‌తో బాధపడుతున్న సమయంలో, నా మానసిక పరిస్థితిని ఆసరాగా చేసుకుని, 2014లో మోదీ బలవంతంగా పెళ్లి చేసుకున్నారు. తనను గురించి నిజాలు దాచారు. ఆ తర్వాత శారీరకంగా, మానసికంగా వేధింపులు మొదలయ్యాయి'అని దీక్షిత్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే మద్యం మత్తులో తనపై దాడికి పాల్పడుతున్నారని ఆరోపించారు. 2018లో కుమార్తె పుట్టాక వేధింపులు మరీ ఎక్కువైనట్లు చెప్పారు. అక్టోబర్‌లో విడాకులకు అంగీకరించకుంటే చంపుతానంటూ కొన్ని గంటలపాటు తనను నిర్బంధానికి గురిచేశారన్నారు. తుపాకీ గురిపెట్టి, తప్పుడు ప్రకటన చేసేలా బెదిరించారన్నారు. తనకు, తన కుటుంబానికి భద్రత కల్పించాలని కోరారు. ఈ మేరకు ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు జైపూర్‌లోని ఎస్ఎంఎస్ ఆస్పత్రి పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 7వ తేదీన కేసు నమోదైంది. ఈ పరిణామంపై మోదీ స్పందించలేదు.

ట్రిబ్యునల్ సంస్కరణల చట్టంపై సుప్రీం తీర్పు రిజర్వు

న్యూఢిల్లీ: ట్రిబ్యునళ్ల సంస్కరణల(క్రమబద్ధీకరణ మరియు సర్వీస్ నిబంధనలు) చట్టం–2021 రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై తీర్పును సుప్రీంకోర్టు రిజర్వులో ఉంచింది. ఈ చట్టం ద్వారా ఫిల్మ్ సర్టిఫికేషన్ అప్పిలేట్ ట్రిబ్యునల్ వంటి కొన్ని అప్పిలేట్ ట్రిబ్యునళ్లు రద్దయ్యాయి. మరికొన్ని ట్రిబ్యునళ్ల జ్యుడీషియల్, ఇతర సభ్యుల నియామకం, పదవీకాలంపై సవరణలు జరిగాయి. అంతకుముందు ఇదే పేరుతో తీసుకువచ్చిన ఆర్డినెన్స్ స్థానంలో ఇది అమల్లోకి వచ్చింది. అధికార విభజన సిద్ధాంతానికి, న్యాయవ్యవస్థ స్వతంత్రతకు ఈ చట్టం వ్యతిరేకమంటూ దాఖలైన పిటిషన్లపై తుది వాదనలు అక్టోబర్ 16వ తేదీ నుంచి కొనసాగుతున్నాయి. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం ఎదుట మంగళవారం వాదనలు పూర్తి చేసిన అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి.. పార్లమెంట్ చేసిన ఈ చట్టాన్ని అమలు కొనసాగనివ్వాలని కోరారు. అయితే, ఆర్డినెన్స్‌లో వివాదాస్పదంగా మారడంతో సవరణకు ఆదేశించిన అంశాలను, తాము కొట్టివేసిన అంశాలను సైతం యథా ప్రకారం చట్టంలో ఎలా చేర్చుతారంటూ ధర్మాసనం కేంద్రాన్ని ప్రశ్నించింది.

డబ్ల్యూహెచ్‌వో నిబంధనలపై పిటిషన్ కొట్టివేత

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో వాయు కాలుష్య నియంత్రణకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) వాయు నాణ్యత మార్గదర్శకాల(ఏక్యూజీ)ను దశల వారీగా అమలు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు నిరాకరించింది. మంగళవారం సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రస్తావించారు. ఢిల్లీ వాయు కాలుష్యానికి సంబంధించి ఎంసీ మెహతా కేసుతో ఈ పిటిషన్‌ను జత చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎవరు దాఖలు చేశారని సీజేఐ ప్రశ్నించగా.. పిటిషనర్ పర్యావరణ చట్టంలో నిపుణుడని లాయర్ బదులిచ్చారు. 'ఈ విషయంలో పర్యావరణ చట్టంలో నైపుణ్యం కలిగిన న్యాయవాదులు మన వద్ద తగినంత మంది ఉన్నారు'అని సీజేఐ వ్యాఖ్యానించారు. పిటిషన్‌ను విచారణ జాబితాలో చేర్చాల్సిన అవసరం లేదన్నారు. ఎంసీ మెహతా కేసులో ఢిల్లీ–ఎన్‌సీఆర్ పరిధిలో వాయు కాలుష్యంపై దాఖలైన పిటిషన్లను బుధవారం సీజేఐ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించనుంది.

పంట వ్యర్థాల దహనం మొదలైంది.. ఢిల్లీలో కాలుష్యం పెరిగిపోయింది..

సుప్రీంకోర్టుకు తెలిపిన అమికస్ క్యూరీ

న్యూఢిల్లీ: పంజాబ్, హరియాణాల్లో పంట వ్యర్థాల దహనం యథేచ్ఛగా భారీ ఎత్తున సాగుతోంది. ఫలితంగా ఢిల్లీ–ఎన్‌సీఆర్ పరిధిలో వాయు నాణ్యత అధ్వాన స్థితికి చేరుకుంది. ఈ సమస్య పరిష్కారానికి ఏం చర్యలు తీసుకుంటున్నారో తెలపాలని పంజాబ్, హరియాణా ప్రభుత్వాలను కోరాలని ఈ కేసులో అమికస్ క్యూరీగా వ్యవహరిస్తున్న లాయర్ అపరాజితా సింగ్ సుప్రీంకోర్టును కోరారు. ఢిల్లీ వాయు కాలుష్యం తీవ్రస్థాయికి చేరడంపై బుధవారం ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ సారథ్యంలోని ధర్మాసనం విచారణ చేపట్టనుంది. ఈ రెండు రాష్ట్రాల్లో పంటవ్యర్థాల దహన సమస్య ఎంత తీవ్రంగా ఉన్నదీ తెలిపేందుకు అమికస్ అపరాజితా సింగ్ నాసా ఉపగ్రహాల ఛాయాచిత్రాలను ధర్మాసనానికి అందజేశారు. అత్యున్నత న్యాయస్థానం ఉత్తర్వుల ఉల్లంఘన ఇష్టారీతిన సాగుతోందంటూ ఆమె, ఈ పరిస్థితిపై పంజాబ్, హరియాణాలు స్పందించాలన్నారు. ఈ పరిణామాలపై బుధవారం తగు ఆదేశాలు జారీ చేస్తామని సీజేఐ తెలిపారు. కాలుష్యం మరింత తీవ్రస్థాయికి చేరుకోకమునుపే అధికారులు సానుకూలంగా స్పందించాలన్నారు. ఢిల్లీలోని వాయు కాలుష్య పరిశీలన కేంద్రాలు కూడా సక్రమంగా పనిచేయడం లేదని, ఇందుకు సంబంధించి వార్తా కథనాలు కూడా వచ్చాయని అపరాజితా సింగ్ చెప్పారు. కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్(సీఏక్యూఎం) తగు కార్యాచరణ ప్రణాళికతో ముందుకు రావాలన్నారు. అయితే, ఈ బాధ్యత సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు(సీపీసీబీ)దేనని సీఏక్యూఎం లాయర్ పేర్కొన్నారు. ఈ రెండు విభాగాలు కార్యాచరణ సంబంధ నివేదికను అందజేస్తాయని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటి తెలిపారు.

మనందరిదీ ఒకే దేశం: సుప్రీం

కేరళ విద్యార్థులపై ఢిల్లీలో దాడి ఆందోళనకరం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో కేరళకు చెందిన ఇద్దరు విద్యార్థులపై దాడి జరగడంపై సుప్రీంకోర్టు ఆందోళన వెలిబుచ్చింది. ఎర్రకోట వద్ద కేరళ రాష్ట్ర సంప్రదాయ లుంగీ ధరించిన బాధిత విద్యార్థులను ఎగతాళి చేయడంతోపాటు హిందీ మాట్లాడేందుకు నిరాకరించారంటూ స్థానికులు కొట్టిన ఘటనపై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం..'మనందరిదీ ఒకే దేశం. తోటి వారిని సాంస్కృతిక, జాతి తారతమ్యాలనే కారణంతో లక్ష్యంగా చేసుకోవడం మాకు ఎంతో బాధ కలిగిస్తోంది'అని వ్యాఖ్యానించింది. ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన జకీర్ హుస్సేన్ కాలేజీలో రెండో సంవత్సరం చదివే ఇద్దరు విద్యార్థులు దాడికి గురయ్యారు. ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులే లక్ష్యంగా దాడులు జరగడంపై 2015లో దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ అలోక్ అరాధేల ధర్మాసనం పైవిధంగా స్పందించింది. అప్పట్లో ఢిల్లీలో జరిగిన దాడిలో అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన నిడో తానియా అనే విద్యార్థి ప్రాణాలు కోల్పోవడం తీవ్ర సంచలనం రేపింది. 'ఈ విషయంలో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ధర్మాసనం కేంద్రాన్ని ఆదేశించింది. ఆ కమిటీకి జాతి వివక్ష, దాడులకు సంబంధించిన సంఘటనలపై కఠిన చర్యలు తీసుకునే అధికారాలు ఇవ్వాలి. ఇటువంటి ద్వేషపూరిత, జాతిపరమైన నేరాలను అరికట్టడానికి చర్యలను సూచించాలి'అని ధర్మాసనం తెలిపింది. అయితే, ఇప్పటికే ఈ మేరకు కమిటీ ఏర్పాటైందంటూ అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజన్ తెలపగా, ఇటీవలే ఢిల్లీలో కేరళకు చెందిన ఇద్దరు విద్యార్థులను లుంగీ ధరించారంటూ హేళన చేయడంతోపాటు, హిందీ మాట్లాడటానికి నిరాకరించారనే కారణంతో స్థానికులు వారిపై దాడి చేశారనే వార్తను పత్రికల్లో చదివామని ధర్మాసనం పేర్కొంది. 'ఇలాంటి ఘటనలు ఏమాత్రం సమర్థనీయం కాదు. వీటిపై మరింత అప్రమత్తంగా ఉండాలి. మనందరిదీ ఒకే దేశం'అని ధర్మాసనం తెలిపింది.

ఢిల్లీ పేలుడు మృతులకు సుప్రీం నివాళి

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో సోమవారం చోటుచేసుకున్న బాంబు పేలుడులో ప్రాణాలు కోల్పోయిన వారికి సుప్రీంకోర్టు నివాళులర్పించింది. మంగళవారం ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ అధ్యక్షతన ఫుల్ కోర్టు సమావేశమైంది. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు శరత్ ఎస్ జవలి, జగదీశ్ చంద్ర గుప్తాలకు నివాళులర్పించింది. అదే సమయంలో, 10వ తేదీన బాంబు పేలుడుతో చనిపోయిన వారికి కూడా శ్రద్ధాంజలి ఘటించారు. 'పేలుడు కారణంగా సంభవించిన ప్రాణ నష్టంపై మేమంతా తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాం. సుప్రీంకోర్టు, యావత్ న్యాయ వ్యవస్థ తరఫున ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. వారికి సంఘీభావం తెలుపుతున్నాం'అని సీజేఐ పేర్కొన్నారు.

మూడేళ్ల తర్వాత బెంగాల్ మాజీ మంత్రికి బెయిల్

స్కూల్ ఉద్యోగాల కుంభకోణంలో అరెస్టయిన పార్థ చటర్జీ

కోల్‌కతా: స్కూల్ సిబ్బంది నియామకాల్లో అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై అరెస్టయిన పశ్చిమ బెంగాల్ మాజీ విద్యాశాఖ మంత్రి పార్థ ఛటర్జీ ఎట్టకేలకు బెయిల్ లభించింది. మంగళవారం ఆయన అలీపూర్ జైలు నుంచి విడుదలయ్యారు. 2016లో చేపట్టిన స్కూళ్లలో బోధనేతర సిబ్బంది నియామకాల్లో అవకతవకలకు పాల్పడినట్లు ఛటర్జీపై అభియోగాలు వచ్చాయి. దీంతో, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు 2022 జూలై 23న అరెస్ట్ చేశారు. అనారోగ్యానికి గురైన ఆయన్ను అధికారులు ఏప్రిల్‌లో ముకుందాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి ఆయన అక్కడే చికిత్స పొందుతున్నారు. సోమవారం ఈ కేసు విచారణ చేపట్టిన సీబీఐ కోర్టు మొత్తం 8 మంది సాక్షుల వాంగ్మూలాల నమోదు పూర్తయినందున ఆయనకు బెయలిచ్చేందుకు అంగీకరించింది. ఈ మేరకు కోర్టు ఆదేశాలు వెలువడటంతో ప్రెసిడెన్సీ జైలు అధికారులు ఛటర్జీని విడుదల చేశారు. సాక్షుల వాంగ్మూలాల నమోదు పూర్తయితే పార్థ ఛటర్జీకి బెయిలివ్వ వచ్చునంటూ ఆగస్ట్ 18వ తేదీన సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అంతకుముందే, ఛటర్జీకి ఈడీ కేసుల్లో బెయిల్ మంజూరైంది. ఆయన్ను మరే లాభదాయక పదవుల్లో నియమించరాదనే షరతుతో కలకత్తా హైకోర్టు సెప్టెంబర్ 26న బెయిల్‌కు పచ్చజెండా ఊపింది. బెయిల్‌పై పార్థ ఛటర్జీ విడుదలవడంతో కోల్‌కతాలోని ఆయన నివాసం వద్ద టీఎంసీ కార్యకర్తలు హడావుడి చేశారు.

‘నవనగర స్వామి’ అనే బిరుదు ఎవరిది?

శాతవాహనుల కంటే ముందే ‘దక్కన్’ను వివిధ రాజులు పరిపాలించారు. విదర్భలో గోబద లేదా గోబధ రాజు ఉన్నట్లు పురావస్తు శాస్త్రవేత్త డాక్టర్ అజయ్‌మిత్ర శాస్త్రి పేర్కొన్నారు. కోటిలింగాలలో కంవాయ, సమగోప, నరన తదితర రాజుల నాణేలు లభ్యమయ్యాయి. పైఠాన్ లేదా ప్రతిష్టానపురాన్ని సూర్యమిత్ర, భూమిపుత్ర, సత్యభద్ర అనే రాజులు పరిపాలించారు. సూర్యపుత్రుని నాణేలపై శాతకర్ణి తన గుర్తును ముద్రించాడు. సాతానికోట (కర్నూలు)లో శక్తికుమారుని నాణేలు లభ్యమయ్యాయి. ఇతడి కాలంలోనే అశోకుడు కర్నూలులోని ‘ఎర్రగుడి’ ప్రాంతంలో శాసనం వేయించినట్లు తెలుస్తోంది.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ హిస్టరీ

శాతవాహనుల రాజకీయ చరిత్ర

‘మత్స్యపురాణం’లో శాతవాహనుల రాజకీయ చరిత్ర గురించి వివరాలు ఉన్నాయి. దీని ప్రకారం ఈ వంశంలోని రాజులు...

శ్రీముఖుడు

ఇతడినే చిముఖుడు, సిముఖుడిగా పేర్కొంటారు. ఇతడే శాతవాహన వంశ స్థాపకుడు. ఇతడి నాణేలు విదర్భలోని అకోలా, పుణేలోని శన్నార్, అహ్మద్‌నగర్‌లోని నేవసలో లభించాయి. వీటి ద్వారా ఇతడు ‘మౌర్యులకు సామంతుడి’గా ఉన్నట్లు తెలుస్తోంది. (మౌర్యులు భారతదేశంలో గొప్ప రాజులు. వీరిలో అశోకుడు చాలా ప్రసిద్ధుడు. ఉత్తర భారతదేశంలో ‘నంద వంశం’ తర్వాత మౌర్యులు రాజ్యానికి వచ్చారు. మౌర్యుల జన్మస్థలం పింప్రవనం. వీరి సామంతులే శాతవాహనులు.)

సామంతులు అంటే..

1. వీరికి స్వయం నిర్ణయాధికారాలు ఉండవు.
2. సొంతంగా నాణేలు ముద్రించుకోలేరు. తమకు తాముగా సార్వభౌమాధికారులుగా ప్రకటించుకోలేరు.
3. వీరు ‘అశ్వమేథ యాగాలు’ చేయకూడదు.

పైన పేర్కొన్న లక్షణాలున్న రాజ్యపాలకులను సామంతులుగా పేర్కొంటారు. విదర్భ, పుణే, అహ్మద్‌నగర్‌లోని వివిధ ప్రాంతాల్లో శాతవాహనుల నాణేలు లభించాయి. ఇవన్నీ మహారాష్ట్రలో ఉండటం వల్ల వీరి తొలి రాజధాని ‘పైఠాన్’ లేదా ‘ప్రతిష్ఠానపురం’ అని శ్రీనివాస అయ్యర్ పేర్కొన్నారు.

తెలంగాణలోని కోటిలింగాల, సంగారెడ్డి, పటాన్‌చెరు, కొండాపూర్ మొదలైన ప్రదేశాల్లో వీరి నాణేలు లభించాయి. కాబట్టి వీరి తొలి రాజధాని ‘కోటి లింగాల’ అని బార్నేట్, వి.ఎ. స్మిత్ మొదలైన చరిత్రకారులు అభిప్రాయపడ్డారు. శ్రీముఖుడు ‘33 ఏళ్లు’ రాజ్యపాలన చేసినట్లు పురాణాలు తెలియజేస్తున్నాయి. ఇతడు తెలంగాణలోని ‘కోటిలింగాల’ రాజధానిగా రాజ్యాన్ని పాలించాడు. ఇతడి పాలన చివర్లో రాజ్యంలో తిరుగుబాట్లు జరిగాయి. దీంతో రాజ్యాన్ని ఉత్తర దిశగా విస్తరించడానికి రాజధానిని ‘కోటిలింగాల’ నుంచి మహారాష్ట్రలోని ‘జున్నార్’కు మార్చాడని అజయ్ మిత్ర అభిప్రాయం. నానాఘాట్ శాసనం శ్రీముఖుడిని ‘రాయనిముఖ శాతవాహనో సిరిమతో’గా అభివర్ణించింది. శ్రీముఖుడు జైన మతస్థుడు.

కృష్ణుడు (కన్హుడు)

శ్రీముఖుని తర్వాత అతడి సోదరుడైన కృష్ణుడు సింహాసనం అధిష్ఠించాడు. మత్స్య, వాయు, బ్రహ్మాండ పురాణాల్లో ఇతడు 18 ఏళ్లు రాజ్యపాలన చేసినట్లు పేర్కొన్నారు. నాసిక్‌లో లభ్యమైన బ్రాహ్మి శాసనంలో కృష్ణుడిని సమణమహామాత (శ్రమణ మహామాత్ర)గా పేర్కొన్నారు. శ్రమణుల (బౌద్ధ భిక్షువులు) బాగోగులు చూడటానికి కృష్ణుడు నియమించిన మహామాత్రుడు (ఉన్నతాధికారి) గుహను తొలిపించాడు.

కృష్ణుడు తన అన్న మీద గౌరవంతో ఆయన పేరు మీద శాతవాహన వంశాన్ని ప్రారంభించాడు. కృష్ణుడు భాగవత మతాన్ని దక్కన్‌లో విస్తరించినప్పటికీ, బౌద్ధాన్ని కూడా ఆదరించాడు. (భాగవత మతాన్ని ఉత్తర భారతదేశంలో వాసుదేవుడు స్థాపించాడు. ఈ మతస్థులు శ్రీకృష్ణుడిని తమ ఆరాధ్య దైవంగా కొలుస్తారు)

మొదటి శాతకర్ణి

పురాణాల్లో ఇతణ్ని ‘మల్లకర్ణి’గా పేర్కొన్నారు. ఇతడు పదేళ్లు పరిపాలించాడు. శాతవాహన ‘నిజమైన స్థాపకుడు’ ఇతడే. ఈయన పూర్వీకులైన శ్రీముఖుడు, కృష్ణుడు మౌర్యులకు సామంతులు. కానీ మొదటి శాతకర్ణి తనకు తానుగా ‘సార్వభౌముడి’గా ప్రకటించుకొని స్వతంత్ర రాజ్యం స్థాపించాడు. అశ్వమేథ యాగాలు నిర్వహించాడు. మౌర్య వంశ చివరి రాజైన బృహద్రదుణ్ని అతడి సేనాని పుష్యంగ మిత్రుడు హతమార్చి ‘శుంగ’ వంశాన్ని స్థాపించాడు. మౌర్యుల పతనంతో శాతకర్ణి స్వతంత్రుడిగా ప్రకటించుకునేందుకు అవకాశం లభించింది. మొదటి శాతకర్ణి తన రాజ్య విస్తరణకు ‘మహారధి త్రణకైయిరో కుమార్తె ‘దేవి నాగానిక’ను వివాహమాడి తెలంగాణతో పాటు మహారాష్ట్రను పాలించాడు. ‘కళింగాధిపతి’ అయిన మహామేఘ వాహన ఖారవేలుడు శాతకర్ణి రాజ్యంపైకి పెద్ద సంఖ్యలో త్రివిధ దళాలను పంపాడు. ‘కణ్ణబెణ్ణ’ నది వరకు ఇతడి సైన్యాలు వెళ్లగలిగాయి. విదర్భలో ప్రవహించే కణ్ణబెణ్ణ నదినే ప్రాచీన మరాఠా సాహిత్యంలో ‘గోదావరి నది’గా పేర్కొన్నారు. నాగ్‌పూర్‌కి ఈశాన్యంలో వెణ్ణ (చెణ్ణ), వైన్‌గంగా నదితో కలిసి ప్రవహిస్తోంది. ఈ రెండు నదులను కలిపి కణ్ణబెణ్ణ అని పిలిచేవారు. భిక్షురాజుగా ప్రసిద్ధి చెందిన ఖారవేలుడు రాజ్యపాలన చేపట్టిన రెండో ఏట శాతవాహన రాజ్యంతో యుద్ధం చేశాడు.

అసిక నగరం (నాగ్‌పూర్ జిల్లాలోని ఆడం సమీపంలో అసిక జనపద ముద్రిక ఒకటి లభించింది) వరకు ఇతడి సైన్యాలు విజృంభించాయని నానాఘాట్ శాసనం ద్వారా తెలుస్తోంది.

ఖారవేలుడు తన సైన్యంతో నల్గొండ జిల్లాలోని వాడపల్లి వద్ద కృష్ణానదిని దాటాడు. ‘పితుండా’ (గుంటూరు జిల్లాలోని భట్టిప్రోలు) నగరాన్ని ధ్వంసం చేసి గాడిదలతో దున్నించాడు.

మొదటి శాతకర్ణి సూర్యమిత్రుని నాణేలపై తన ముద్రను వేయించాడు. సూర్యమిత్రుని రాజ్యాలైన మహారాష్ట్ర, తెలంగాణ, మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌తో పాటు ‘విదిశ’ ప్రాంతాలను కూడా శాతకర్ణి ఆక్రమించుకున్నాడు. మొదటి శాతకర్ణి మరణించిన తర్వాత అతడి భార్య నాగానిక (నాగవరదాయిని) నానాఘాట్ శాసనం వేయించింది. ఈ శాసనంలో మొదటి శాతకర్ణిని ‘ఏకవీర’గా పేర్కొన్నారు.

వేదసిరి

వేదసిరి మొదటి శాతకర్ణి కుమారుడు. ఇతడు నానాఘాట్ శాసనంలో తన పూర్వీకులైన శ్రీముఖుడు, కన్హుడి ప్రతిమలను చెక్కించాడు. ఈ శాసనంలో తన సోదరులైన కుమార భాయ, కుమార హకుసిరి, కుమార శాతవాహన ప్రతిమలను కూడా వేదసిరి చెక్కించాడు. తన కుటుంబానికి సహకరించిన త్రణకైయిరో, ఇతర బంధువుల బొమ్మలను కూడా వేదసిరి చెక్కించాడు. ఇతడి తర్వాత వరుసగా.. .పూర్ణోత్సంగ, స్కందస్తంభి, రెండో శాతకర్ణి రాజ్యాన్ని పాలించారు. తర్వాత లంబోదర (క్రీ.పూ. 78–60), అప్పిలక రాజ్యాధికారాన్ని చేపట్టారు.

రెండో శాతకర్ణి (క్రీ.పూ.134-78)

ఇతడు దాదాపు 56 ఏళ్లు రాజ్యాన్ని పాలించాడు. ఇతడు కళింగ, పాటలీపుత్ర రాజ్యాలను జయించాడని ఆనందుడు అనే కవి పేర్కొన్నాడు.

అప్పిలక (క్రీ.పూ. 60-44)

మధ్యప్రదేశ్‌లోని భిలాస్‌పూర్‌లో ఇతడి నాణేలు లభించాయి. మేఘస్వాతి (క్రీ.పూ.44–30), స్వాతి (క్రీ.పూ.30–12), స్కంద స్వాతి (క్రీ.పూ.12–5) కొద్ది కాలం పాటు రాజ్యాన్ని పాలించారు. వీరి తర్వాత మృగేంద్రుడు క్రీ.పూ. 5–2 మధ్య కాలంలో రాజ్యాన్ని పాలించాడు.

కుంతల శాతకర్ణి (క్రీ.పూ. 2 - క్రీ.శ. 5)

ఇతడు మహారాష్ట్రలోని దక్షిణ ప్రాంతాలను, కర్ణాటకలోని ఉత్తర ప్రాంతాలను జయించాడు. ఈ రెండు రాజ్యాలను కలిపి ‘కుంతల’ దేశమనే పేరుతో పాలించాడు. అందువల్ల ఇతడికి కుంతల శాతకర్ణి అనే పేరు వచ్చింది. వాత్స్యాయనుడి కామశాస్త్రం, యశోధరుడి జయమంగళం గ్రంథాల్లో ఇతడి ప్రస్తావన ఉంది. వాత్స్యాయనుడు కుంతల శాతకర్ణి ఆస్థానంలో ఉండేవాడు. మలయవతి రాణిని శృంగారంలోని ‘కర్తిర’ అనే రతి క్రీడలో కుంతల శాతకర్ణి చంపినట్లు వాత్స్యాయనుడు చెప్పాడు. (కామశాస్త్రాన్ని దాదాపు ‘58’ భాషల్లోకి అనువదించారు).

కుంతల శాతకర్ణి తర్వాత రాజ్యానికి వచ్చిన వారు వరుసగా...

1. **స్వాతి కర్ణుడు:** ఇతడు క్రీ.శ.5–6 మధ్య పాలించాడు.
2. **పులోమావి -1**(క్రీ.శ.6–41): ఉత్తర భారతదేశంలోని మగధపై దాడిచేసి కణ్వ వంశస్థుడైన సుశర్మ రాజును హతమార్చాడు.
3. **గౌర విష్ణుడు:** ఇతడు క్రీ.శ. 41 –66 మధ్య రాజ్యాన్ని పరిపాలించాడు. తర్వాత ‘హాలుడు’ రాజ్యానికి వచ్చాడు.

హాలుడు (క్రీ.శ. 66-71)

ఇతడు 17వ రాజు. హాలుడి పాలనా కాలంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఇతడు ఒకే సంవత్సరం పరిపాలించాడని తెలుస్తుండగా, ఆరేళ్లు రాజ్యపాలన చేశాడని పురాణాలు తెలుపుతున్నాయి. హాలుడు ‘గాథాసప్తశతి’ (సప్తసాయి)ని రచించాడు. ‘మహారాష్ట్ర ప్రాకృతం’లో ఉన్న ఈ గ్రంథం 700 గ్రామీణ శృంగార కథల సమాహారం. హాలుడికి ‘కవి వత్సలుడు’ బిరుదు ఉంది. ఇతడి కాలంలో కర్ణాటకలోని కళ్యాణి రేవు పట్టణం వద్ద విదేశీ పడవలకు రక్షణ లేకుండా పోయిందని ‘పెరిప్లస్ ఆఫ్ ఎరిత్రియన్ సి’ గ్రంథంలో పేర్కొన్నారు. ఈ గ్రంథాన్ని ఒక గ్రీకు నావికుడు రచించినట్లు చెబుతున్నారు.

హాలుని ఆస్థానంలోని ప్రసిద్ధ కవులు:

1. **గుణాఢ్యుడు:** ఇతడు ‘బృహత్‌కథ’ గ్రంథాన్ని ‘పైశాచిక’ ప్రాకృతంలో రచించాడు. ఇతడు తొలి తెలంగాణ కవి.
2. **శర్వ వర్మ:** ‘కాతంత్ర్య వ్యాకరణం’ గ్రంథకర్త. సులభపద్ధతిలో సంస్కృతం నేర్చుకోవడానికి ఈ గ్రంథం ఉపయోగపడుతుంది. ఇతడి తర్వాత మాండూలకుడు, పురీంద్రసేనుడు, సుందర స్వాతికర్ణి, చకోర స్వాతికర్ణి, శివ స్వాతికర్ణి వరుసగా రాజ్యానికి వచ్చారు.

గౌతమీపుత్ర శాతకర్ణి (క్రీ.శ. 110-134)

ఇతడు 23వ రాజు. గౌతమీపుత్ర శాతకర్ణి రాజ్యానికి వచ్చిన సమయం కచ్చితంగా తెలియదు. ఇతడు నహపాణుడిని ఓడించి క్షహారాట వంశాన్ని నిర్మూలించాడు. ‘జోగల్‌తంబి’ లో దొరికిన రూపాణుని వెండి నాణేలు, నాసిక్, కార్లే, జున్నార్ శాసనాలు ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నాయి. మరత్వాడి ప్రాంతం కూడా గౌతమీపుత్ర శాతకర్ణి ఆధీనంలో ఉన్నట్లు ‘బోర్ధన్’ తవ్వకాల్లో దొరికిన ‘రాగి’ నాణేల ద్వారా తెలుస్తోంది. గౌతమీపుత్ర శాతకర్ణి సింహాసనాన్ని అధిష్ఠించే సమయానికే కర్ణాటక, విదర్భ, దక్షిణ మహారాష్ట్ర శాతవాహన రాజ్యంలో భాగంగా ఉన్నాయి. గౌతమీపుత్ర శాతకర్ణి జయించిన రాజ్యాలు...

1. అసిక లేదా అస్మక (తెలంగాణ)
2. ములక (మహారాష్ట్ర)
3. సౌరాష్ట్ర (గుజరాత్)
4. అపరాంత (కొంకణ్)
5. అనూప (విదర్భ)
6. నేతగిరి (శ్రీ పర్వతం)
7. నీలిగిరి (తమిళనాడు)
8. మహేంద్రగిరి (ఒడిశా)

గౌతమీపుత్ర శాతకర్ణికి ‘త్రిసముద్రతోయ పీత వాహన’, ‘దక్షిణాపథపతి’ అనే బిరుదులు ఉన్నాయి. ఇతడి తల్లి గౌతమి బాలశ్రీ నాసిక్ శాసనాన్ని వేయించింది. ఇందులో గౌతమీపుత్ర శాతకర్ణిని ‘శాతవాహనకుల యశ ప్రతిష్ఠాపనాకర’గా అభివర్ణించారు (గౌతమీపుత్ర శాతకర్ణి మరణించిన 19 ఏళ్ల తర్వాత ఈ శాసనాన్ని చెక్కించారు). ‘ఏక బ్రాహ్మణ’, ‘క్షత్రీయదర్పమాణ’ అనేవి ఇతడి ఇతర బిరుదులు. బెణకటకం నగరాన్ని నిర్మించి బెణగటక స్వామిగా ప్రసిద్ధి చెందాడు.

వాసిష్టిపుత్ర పులోమావి

ఇతడు 24వ రాజు. గౌతమీపుత్ర శాతకర్ణి కుమారుడు. 28 ఏళ్లు (క్రీ.శ.134–162) పరిపాలించాడు. తన బొమ్మలతో కూడిన వెండి నాణేలను ముద్రించాడు. ఇతడికి ‘దక్షిణాపథేశ్వరుడు’ బిరుదు ఉంది. నాసిక్ ప్రాంతంలో గోవర్ధన, పైఠాన్ నగరాలను నిర్మించాడు. ‘నవనగర స్వామి’ అనే బిరుదు పొందాడు. మహాక్షాత్రపరాజైన ‘చేష్టనుడు’ ఇతడి సమకాలీనుడు.

వాసిష్టిపుత్ర శాతకర్ణి

ఇతడు 25వ రాజు, పులోమావి సోదరుడు. మహాక్షాత్రపుడైన రుద్రదాముని అల్లుడు (సంస్కృతంలో శాసనాలు ముద్రించిన తొలి భారతీయ రాజు రుద్రదమనుడు). ఇతడు ‘కన్హేరి’ శాసనాన్ని సంస్కృతంలో వేయించాడు.(శాతవాహనుల కాలంలో వచ్చిన శాసనాలన్నీ ప్రాకృతంలోనే ఉన్నాయి. కానీ ‘కన్హేరి’ శాసనం మాత్రమే సంస్కృతంలో ఉంది).

మాదిరి ప్రశ్నలు

1. గౌతమీపుత్ర శాతకర్ణికి సంబంధించి కిందివాటిలో సరికాని అంశం ఏది?
   ఎ) క్షహారాట వంశం నిర్మూలించడం
   బి) మాతృ సంజ్ఞలు పాటించడం
   సి) జోగల్‌తంబిలో ఇతడి నాణేలు లభించలేదు
   డి) దక్షిణా సముద్రాధిపతిగా ప్రసిద్ధి
   1) ఎ మాత్రమే 2) బి, సి మాత్రమే
   3) బి, డి మాత్రమే 4) సి, డి మాత్రమే
2. శాతవాహనుల కాలంనాటి స్త్రీలకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
   1) రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించారు
   2) మత విషయాల్లో జోక్యం చేసుకునేవారు
   3) దాతృత్వం, దాన ధర్మాలు, సంక్షేమ విషయాల్లో కీలకంగా వ్యవహరించేవారు
   4) పైవన్నీ
3. బౌద్ధ మతస్థులకు అభయం ఇస్తున్నట్లు ఉన్న మాందాతా శిల్పం ఎక్కడుంది?
   1) నాగార్జున కొండ 2) ఏలేశ్వరం
   3) జగ్గయ్యపేట 4) చేజెర్ల
4. కిందివాటిలో సరికాని జత ఏది?
   1) పూర్వ శైలి – అమరావతి
   2) అపరశైలి – శ్రీ పర్వతం
   3) ఉత్తర శైలి – గుడివాడ
   4) రాజగిరిక – గుంటుపల్లి
5. శాతవాహన నిజమైన రాజ్య స్థాపకుడు?
   1) సిముఖుడు
   2) గౌతమీపుత్ర శాతకర్ణి
   3) మొదటి శాతకర్ణి
   4) యజ్ఞశ్రీ శాతకర్ణి

సమాధానాలు

1) 4 2) 4 3) 3 4) 3 5) 3

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐటీ మద్రాస్‌లో జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) మద్రాస్ తాత్కాలిక ప్రాతిపదికన జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.20,000 నుంచి 50,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.11.2025.
» **వెబ్‌సైట్:** https://icsrstaff.iitm.ac.in

ఎయిమ్స్ న్యూఢిల్లీలో 10 పోస్టులు

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 10.
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్1(నాన్ మెడికల్)–01, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్ 3–03, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్1(ల్యాబొరేటరీ)–02, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్1–03, డేటా ఎంట్రీ ఆపరేటర్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంఎల్‌టీ/డీఎంఎల్‌టీ/ఐటీఐ, డిగ్రీ/పీజీ/పీహెచ్‌డీలో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 28ఏళ్ల నుంచి 35ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్‌కు రూ.56,000, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్‌కు రూ.28,000, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్1(ల్యాబొరేటరీ)కు రూ.18,000, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.29,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 17.11.2025.
» **వెబ్‌సైట్:** www.aiims.edu

ఎరుపు లిట్మస్‌ను నీలి రంగుకు మార్చేది?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
ఫిజికల్ సైన్స్ - ఎస్ఏ కంటెంట్

ఆమ్లాలు - క్షారాలు - లవణాలు

- అలోహ ఆక్సైడ్‌లను నీటిలో కరిగించినప్పుడు ఆమ్లాలు ఏర్పడతాయి.
- ఫాస్ఫరస్ పెంటాక్సైడ్ నీటితో చర్య జరిపి ఫాస్ఫారిక్ ఆమ్లాన్ని ఏర్పరుస్తుంది.
  $P_2O_5 + H_2O \rightarrow 2H_3PO_4$
- ఎక్కువ భాష్పశీల ఆమ్లాల నుంచి తక్కువ భాష్పశీల ఆమ్లాలను తయారు చేయవచ్చు.
  $2NaCl + H_2SO_4 \rightarrow Na_2SO_4 + 2HCl$
- లోహ ఆక్సైడ్‌లను నీటిలో కరిగించినప్పుడు క్షారాలు ఏర్పడతాయి.
  $Na_2O + H_2O \rightarrow 2\ NaOH$
- ఆమ్లాలు నీలి లిట్మస్‌ను ఎరుపుకు మారుస్తాయి.
- ఆమ్లాలు నారింజ రంగు గల మిథైల్ ఆరంజ్ సూచిక రంగును ఎరుపు రంగుకు మారుస్తాయి.
- Zn, Mg మొదలైన లోహాలతో ఆమ్లాలు చర్య పొంది హైడ్రోజన్ వాయువును విడుదల చేస్తాయి.
  ఉదా: $Zn + H_2SO_4 \rightarrow ZnSO_4 + H_2\uparrow$
- ఆమ్లాలు, క్షారాలతో చర్య పొంది నీటిని, లవణాలను ఏర్పరుస్తాయి.
  $HCl + NaOH \rightarrow NaCl + H_2O$
- కార్బొనేట్‌లు, బై కార్బొనేట్‌లతో ఆమ్లాలు చర్య పొంది CO_2 వాయువును విడుదల చేస్తాయి.
  $Na_2CO_3 + 2HCl \rightarrow 2NaCl + CO_2 + H_2O$
- క్షారాలు ఎరుపు లిట్మస్‌ను నీలి రంగుకు మారుస్తాయి.
- క్షారాల నారింజ రంగు గల మిథైల్ ఆరంజ్ సూచికను పసుపు రంగుకు మారుస్తాయి.
- క్షారాలను వేడిచేస్తే లోహ ఆక్సైడ్‌లను, నీటిని ఏర్పరుస్తాయి.
- ఆమ్ల, క్షారాల జల ద్రావణాలు విద్యుత్ వాహకతను ప్రదర్శిస్తాయి.
- 1887లో స్వీడన్ దేశస్థుడైన అర్హీనియస్ అయనీకరణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఈ పదార్థాల్లో ఆమ్లాలు, క్షారాలు కూడా ఉన్నాయి.
- అర్హీనియస్ సిద్ధాంతం ప్రకారం జల ద్రావణంలో H^+ అయాన్లు ఇచ్చేవి ఆమ్లాలు.
  $HCl \rightarrow H^+ + Cl^-$
- జల ద్రావణంలో OH^- అయాన్‌లను ఇచ్చే పదార్థాలు క్షారాలు.
  $NaOH \rightarrow Na^+ + OH^-$
- స్వచ్ఛమైన నీరు మంచి విద్యుద్వాహకం కాదు.
- నీరు అతి తక్కువ పరిమాణంలో అయనీకరణం చెంది H^+, OH^- అయాన్‌లను ఇస్తుంది.
  $H_2O \rightleftharpoons H^+ + OH^-$ (సమతాస్థితి)
- ఒక మోల్ నీటిలో గల $[H^+]$, $[OH^-]$ అయాన్‌ల గాఢతల లబ్ధాన్ని నీటి అయానిక లబ్ధం అంటారు. దీన్ని K_Wతో సూచిస్తారు.
  $K_W = [H^+] \times [OH^-] = 1 \times 10^{-14}$ (25^0C వద్ద)
- ఉష్ణోగ్రత పెరుగుదలతో అయనీకరణం, దానితోపాటు K_W విలువ కూడా పెరుగుతుంది.

సంఖ్య	ఉష్ణోగ్రత ^0C	K_W(మోల్.అయాన్^{2}/లీ)
1.	0	1.14×10^{-15}
2.	25	1.0×10^{-14}
3.	50	5.30×10^{-14}

- నీటి అయానిక లబ్దానికి ప్రమాణాలు మోల్.అయాన్^{2}/లీ^{2}
- P^H పదాన్ని సొరెన్‌సేన్ పరిచయం చేశారు.
  $P^H = -\log_{10}[H^+]$
- ఆమ్ల ద్రావణాలకు $[H^+] > 10^{-7}$; $P^H < 7$ తటస్థ ద్రావణాలకు $[H^+] = 10^{-7}$; $P^H = 7$
  క్షార ద్రావణాలకు $[H^+] < 10^{-7}$; $P^H > 7$
- సంపూర్ణంగా అయనీకరణం చెందే ఆమ్లాలు బలమైన ఆమ్లాలు. పాక్షికంగా అయనీకరణం చెందే ఆమ్లాలు బలహీనమైన ఆమ్లాలు.

HCl (బలమైన ఆమ్లం) $\rightarrow H^+ + Cl^-$ (100% అయనీకరణం)
CH_3COOH(బలహీన ఆమ్లం) $\rightleftharpoons$ $CH_3COO^- + H^+$(<100% అయనీకరణం)

కొన్ని సాధారణ ద్రావణాల P^H		
క్ర.సం.	సాధారణ ద్రవం	P^H
1.	గ్యాస్ట్రిక్ రసం	1 – 2
2.	నిమ్మ రసం	2 – 4
3.	మూత్రం	4.8 – 7.5
4.	సోడా నీరు	5.5
5.	ఉమ్మి	6.4 – 6.9
6.	స్వచ్ఛమైన నీరు	7
7.	రక్తం	7.32–7.45

- సంపూర్ణంగా అయనీకరణం చెందే క్షారాలు బలమైన క్షారాలు. పాక్షికంగా అయనీకరణం చెందే క్షారాలు బలహీన క్షారాలు.
  $NaOH$(బలమైన క్షారం) $\rightarrow Na^+ + OH^-$ (100% అయనీకరణం)



NH_4OH(బలహీన క్షారం) $\rightleftharpoons NH_4^+ + OH^-$ (<100% అయనీకరణం)

- ఒక మోల్ బలమైన ఆమ్లం, ఒక మోల్ బలమైన క్షారంతో చర్య పొంది వెలువడే ఉష్ణాన్ని తటస్థీకరణోష్ణం అంటారు.
  $H^+ + OH^- \rightarrow H_2O + 13.7$ K.Cal / Mole
- బలమైన ఆమ్ల, క్షారాల మధ్య జరిగే చర్యకు తటస్థీకరణోష్ణం 13.7 KCal / Mole
  $NaOH + HCl \rightarrow NaCl + H_2O + 13.7$ KCal / Mole
- బలహీన ఆమ్లం, బలమైన క్షారం మధ్య తటస్థీకరణోష్ణం జరిగినప్పుడు విడుదలయ్యే ఉష్ణం = 13.7 KCal / Mole కంటే తక్కువగా ఉంటుంది.
  $CH_3COOH + NaOH \rightarrow CH_3COONa + H_2O + 13.4$ KCal / Mole

మాదిరి ప్రశ్నలు

1. ఎరుపు లిట్మస్‌ను నీలి రంగుకు మార్చేవి?
   1) ఆమ్లాలు 2) క్షారాలు
   3) లవణాలు 4) పైవన్నీ
2. నారింజ రంగు గల మిథైల్ ఆరంజ్ సూచికను ఎరుపు రంగుకు మార్చేవి?
   1) ఆమ్లాలు 2) క్షారాలు
   3) లవణాలు 4) అన్నీ
3. అయనీకరణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది?
   1) లూయిస్ 2) అర్హీనియస్
   3) ఆస్వాల్డ్ 4) సొరెన్‌సేన్
4. తటస్థ ద్రావణాల P^H విలువ?
   1) 6 2) 5
   3) 9 4) 7
5. క్షార ద్రావణాల్లో ఫినాఫ్తలీన్ సూచిక రంగు?
   1) పసుపు 2) ఆకుపచ్చ
   3) గులాబీ 4) నారింజ
6. నిమ్మ రసం P^H విలువ?
   1) 1–2 2) 2–4
   3) 2 4) 5–6
7. P^H అనే పదాన్ని ఎవరు పరిచయం చేశారు?
   1) మోస్లే 2) అర్హీనియస్
   3) సొరెన్‌సేన్ 4) లూయిస్
8. రక్తం గుణం?
   1) ఆమ్లం 2) క్షారం
   3) తటస్థం 4) ఏదీ కాదు
9. 25^0C వద్ద నీటి అయానిక లబ్ధం విలువ____ మోల్ / అయాన్^{2}/లీ^{2}
   1) 0.4×10^{-14} 2) 1.0×10^{-14}
   3) 1.4×10^{-15} 4) 1×10^{-12}
10. మిథైల్ ఆరెంజ్ సూచిక గల ఆమ్ల ద్రావణ రంగు?
    1) ఎరుపు 2) పసుపు
    3) ఆకుపచ్చ 4) నీలం
11. **0.001 M HCl ద్రావణ P^H విలువ?**
    1) 2 2) 4
    3) 3 4) 1
12. ఆమ్ల ఆక్సైడ్‌కు ఉదాహరణ?
    1) Na_2O 2) Mgo
    3) Cao 4) SO_2
13. Na_2CO_3, $NaHCO_3$లతో ఆమ్లాలు చర్య జరపగా ____ వాయువు వెలువడుతుంది?
    1) O_2 2) H_2
    3) CO_2 4) Co
14. వీటిలో ఆమ్లం కానిదేది?
    1) HNO_3 2) H_2SO_4
    3) CH_3COOH 4) KoH
15. క్షారాలు నారింజ రంగు గల మిథైల్ ఆరెంజ్ సూచికను ____ రంగుకు మారుస్తాయి?
    1) ఎరుపు 2) నీలం
    3) నలుపు 4) పసుపు
16. ఎసిటికామ్లాన్ని అయనీకరణం చెందించేందుకు ఎంత ఉష్ణం ఉపయోగపడుతుంది?
    1) 0.1 KCals 2) 0.2 KCal
    3) 0.3 KCal 4) ఏదీకాదు
17. లోహ ఆక్సైడ్‌లు నీటిలో కరిగి ఏర్పర్చే పదార్థాలు ఏ వర్గానికి చెందుతాయి?
    1) ఆమ్లం 2) క్షారం
    3) లవణం 4) తటస్థ ద్రావణం
18. ఆమ్ల స్వభావం కలిగి నీటిలో కరగనది?
    1) SiO_2 2) HCl
    3) Na_2CO_3 4) ఏదీకాదు
19. హైడ్రోనియం అయాన్____
    1) H_3O 2) H^+
    3) OH^- 4) H_2O_2
20. **NaCl ద్రావణ P^H విలువ?**
    1) 3 2) 7 3) 8.9 4) 12

సమాధానాలు

1) 2; 2) 1; 3) 2; 4) 4;
5) 3; 6) 2; 7) 3; 8) 2;
9) 2; 10) 1; 11) 3; 12) 4;
13) 3; 14) 4; 15) 4; 16) 3;
17) 2; 18) 1; 19) 1; 20) 2.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. **0.001 M HCl ద్రావణం P^H విలువ?** (డీఎస్సీ - 2003)
   1) 4 2) 3 3) 2 4) 1
2. ఒక బలమైన ఆమ్లం, మరొక బలమైన క్షారంతో చర్య జరిపినప్పుడు వెలువడే తటస్థీకరణోష్ణం విలువ? (డీఎస్సీ - 2006)
   1) 13.7 KCal / Mole
   2) 13.4 KCal / Mole
   3) 0 KCal / Mole
   4) 0.3 KCal / Mole
3. $P^H = 8$గా గల ద్రావణంలో $[H^+]$ అయాన్‌ల గాఢత ఎంత? (డీఎస్సీ - 2006)
   1) 10^8 2) 10^{-8}
   3) 8 4) $\log 10^{-8}$
4. ఆమ్ల ద్రావణంలో మిథైల్ ఆరెంజ్ సూచిక రంగు? (డీఎస్సీ - 2006)
   1) పసుపు 2) ఆకుపచ్చ
   3) నారింజ 4) ఎరుపు
5. ఫాస్ఫారిక్ ఆమ్లం, సోడియం హైడ్రాక్సైడ్‌తో చర్య పొంది సోడియం ఫాస్ఫేట్ ఏర్పడే చర్యలో ఒక అణువు ఫాస్ఫారిక్ ఆమ్లంతో కలిసే సోడియం హైడ్రాక్సైడ్ అణువుల సంఖ్య? (డీఎస్సీ - 2008)
   1) 3 2) 4 3) 1 4) 2
6. ఏ లోహం H_2SO_4తో చర్య జరపదు? (డీఎస్సీ - 2008)
   1) Zn 2) Cu 3) Au 4) Pb
7. $[H^+] = 10 \times 10^{-4}$ M గాఢత గల ద్రావణం P^H విలువ? (డీఎస్సీ - 2012)
   1) 1 2) 2 3) 3 4) 4

సమాధానాలు

1) 2; 2) 1; 3) 2; 4) 4;
5) 1; 6) 3; 7) 3.

జయక్‌వాడీ ప్రాజెక్టు ఏ నదిపై ఉంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ జాగ్రఫీ

భారతదేశం - బహుళార్థ సాధక ప్రాజెక్టులు

'ఆనకట్టలే ఆధునిక దేవాలయాలు' అని భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అన్న మాట నాటికి, నేటికీ అక్షర సత్యం. మన దేశ ప్రగతిని సరికొత్త మలుపు తిప్పినవి బహుళార్థ సాధక ప్రాజెక్టులే అనడంలో ఎలాంటి సందేహం లేదు. కాబట్టి దేశంలో మొదటి పంచవర్ష ప్రణాళిక(1951) నుంచి వివిధ ప్రాంతాల్లో పలు బహుళార్థ సాధక ప్రాజెక్టులను నిర్మించారు.

- ఒకటి కంటే ఎక్కువ సదుపాయాల కల్పనకు ఉద్దేశించి నిర్మించిన ప్రాజెక్టునే బహుళార్థ సాధక ప్రాజెక్టు అంటారు.
- భారతదేశంలో వ్యవసాయ నీటిపారుదల, గృహ, పరిశ్రమ అవసరాలకు నీటి సరఫరా, విద్యుదుత్పాదన, వరద నివారణ, స్థానిక రవాణా, భూ సంరక్షణ, మత్స్య పరిశ్రమ అభివృద్ధి, విహారయాత్ర, కృత్రిమ వనాల పెంపకం మొదలైన అనేక ప్రయోజనాల కోసం ఈ బహుళార్థ సాధక ప్రాజెక్టులను నిర్మిస్తున్నారు.
- బెంగాల్‌లో 1948లో వరదలను, వాటిఅనుబంధ సమస్యలను నివారించడానికి దామోదర్ నదీ, దాని ఉపనదులపైన ప్రాజెక్టులు కట్టడం కోసం మొట్టమొదటి నదీలోయ ప్రాజెక్టు సంస్థను ఏర్పాటు చేశారు.
- ఈ సంస్థను అమెరికాలోని టెన్నిస్ వేలీ అథారిటీ (టీవీఏ) నమూనా ఆధారంగా ఏర్పాటు చేశారు.
- 1948 ఫిబ్రవరి 18న భారత పార్లమెంట్ ఈ సంస్థను ఆమోదించడంతో ఇది దామోదర్ లోయ కార్పొరేషన్ (డీవీసీ)గా వాస్తవ రూపం దాల్చింది.
- డీవీసీ ఏర్పడక ముందు వరదలతో బెంగాల్ దుఃఖదాయినులుగా దామోదర్, దాని ఉపనదులున్నాయి. తర్వాత వాటిపై ప్రాజెక్టులు నిర్మించడంతో బెంగాల్ వరదాయినులుగా ఉన్నాయి.
- భారతదేశంలో నీటి పారుదల ప్రాజెక్టులను మూడు రకాలుగా విభజించవచ్చు.
  అవి...
  1) భారీ నీటిపారుదల పథకాలు
  2) మధ్య తరహా నీటి పారుదల పథకాలు
  3) చిన్న తరహా నీటి పారుదల పథకాలు
- ప్రాజెక్టు కల్పించే నీటి పారుదల విస్తీర్ణాన్ని బట్టి ప్రాజెక్టులను విభజించారు.

1. **భారీ నీటిపారుదల పథకాలు**
- 10,000 హెక్టార్ల కంటే ఎక్కువ ఆయకట్టు ప్రాంతం ఉన్న పథకాలను భారీ నీటిపారుదల పథకాలు అంటారు.
- వీటిని ప్రధానంగా నదులపై నిర్మిస్తారు.

2. **మధ్య తరహా నీటిపారుదల పథకాలు**
- 2,000 నుంచి 10,000 హెక్టార్ల వరకు ఆయకట్టు ప్రాంతం ఉన్న పథకాలు.
- వీటిని నదులపై, ఉపనదులపై నిర్మిస్తారు.

3. **చిన్న తరహా నీటిపారుదల పథకాలు**
- 2,000 హెక్టార్ల కంటే తక్కువ ఆయకట్టు గల పథకాలు.
- భూగర్భ జల పథకాలు, ఉపరితల జల పథకాలు ఈ తరహా పథకాల్లోకి వస్తాయి.
  భూగర్భ జల పథకాలు: సాధారణ బావులు, గొట్టపు బావులు.
  ఉపరితల జల పథకాలు: చెరువులు, జలాశయాల నుంచి నీటిని మళ్లించే పథకాలు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు.

ఆయకట్టు ప్రాంత అభివృద్ధి పథకం

- నీటిపారుదల ఆవశ్యకత, ఉత్పత్తి, వినియోగాల మధ్య అంతరాన్ని పూడ్చే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 1974-75లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది.
- భారతదేశంలో 1990లో జాతీయ జల మండలిని ఏర్పాటు చేశారు.
- 2008 నవంబర్ 4న గంగానదిని 'జాతీయ నది'గా ప్రకటించారు.

దేశంలో కొన్ని ప్రధాన బహుళార్థ సాధక ప్రాజెక్టులు

1. **భాక్రానంగల్ ప్రాజెక్టు**
- దేశంలో నిర్మించిన మొట్టమొదటి ప్రాజెక్టు, అన్నిటికంటే పెద్దది.
- దీన్ని భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1962 అక్టోబర్ 22న జాతికి అంకితం చేశారు.
- ఈ ప్రాజెక్టు పంజాబ్, హర్యానా, రాజస్థాన్‌ల ఉమ్మడి పథకం. వీటితోపాటు హిమాచల్ ప్రదేశ్ కూడా లబ్ధి పొందుతోంది.
- సట్లెజ్ నదిపై హిమాచల్‌ప్రదేశ్‌లో భాక్రా అనే ప్రాంతంలో భాక్రా ఆనకట్ట (226 మీటర్లు), పంజాబ్‌లోని నంగల్ ప్రాంతం వద్ద నంగల్ ఆనకట్ట(29 మీటర్లు)ను నిర్మించారు.
- ఈ ప్రాజెక్టు 1204 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తుంది.

2. **హీరాకుడ్ ప్రాజెక్టు**
- ఈ ప్రాజెక్టును ఒడిశాలో మహానదిపై నిర్మించారు.
- ఈ ప్రాజెక్టు 4801 మీటర్ల పొడవుతో ప్రపంచంలోనే అతి పొడవైన ప్రాజెక్టుగా గుర్తింపు పొందింది.
- దీన్ని విద్యుదుత్పాదన, నీటిపారుదల ప్రయోజనాల కోసం ఏర్పాటు చేశారు.

3. **నాగార్జున సాగర్ ప్రాజెక్టు**
- తెలంగాణలోని నల్గొండ జిల్లాలో నందికొండ గ్రామ సమీపంలో కృష్ణానదిపై నిర్మించారు.
- ఇది ఆంధ్రప్రదేశ్, తెలంగాణఉమ్మడి రాష్ట్రాల పథకం.
- దీనికి భారత తొలి ప్రధాని నెహ్రూ 1955 డిసెంబర్ 10న శంకుస్థాపన చేశారు.
- ఈ ప్రాజెక్టు 1450 మీటర్ల పొడవుతో, రాతి కట్టడపు ఆనకట్టల్లో ప్రపంచంలోనే ప్రథమ స్థానం పొందింది.
- దీని కుడి కాలువను జవహర్ కాలువ అంటారు. ఈ కాలువ 204 కి.మీ. పొడవు ఉంది. ఇది గుంటూరు, కృష్ణా జిల్లాలకు నీరు అందిస్తుంది.
- దీని ఎడమ కాలువను లాల్ బహదూర్ కాలువ అంటారు. ఈ కాలువ 179 కి.మీ. పొడవుతో నల్గొండ, ఖమ్మం జిల్లాలకు నీటిని సరఫరా చేస్తోంది.
- ఈ ప్రాజెక్టు పూర్తిగా భారతీయ సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకుంది.

4. **దామోదర్ నదీలోయ ప్రాజెక్టు**
- ఈ ప్రాజెక్టు పశ్చిమ బెంగాల్, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల ఉమ్మడి పథకం.
- ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం బెంగాల్ ప్రాంతాన్ని.. దామోదర్ నది, దాని ఉపనదుల వల్ల వచ్చే వరదల నుంచి కాపాడడం.
- ఈ పథకంలో భాగంగా తిలయ్యా, మైథాన్ ఆనకట్టలు - బరాకర్ నదిపై, పంచట్‌హిట్ ఆనకట్ట - దామోదర్ నదిపై, కోనార్ ఆనకట్ట- కోనార్ నదిపై నిర్మించారు.

5. **బియాస్ పథకం**
- ఇది పంజాబ్, హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాల ఉమ్మడి పథకం.
- ఇది బియాస్ జలాలను సట్లెజ్ జలాలతో కలుపుతుంది.
- బియాస్ నదిపై 'పోంగ్' వద్ద ఈ ఆనకట్టను నిర్మించారు.

6. **కోసి ప్రాజెక్టు**
- దీన్ని బీహార్ - నేపాల్ సరిహద్దులోని హనుమాన్‌నగర్ సమీపంలో 'కోసి' నదిపై నిర్మించారు.
- ఇది అంతర్జాతీయ పథకం

7. **గండక్ పథకం**
- దీన్ని బీహార్‌లోని వాల్మీకినగర్ వద్ద గండక్ నదిపై నిర్మించారు.
- ఇది బీహార్, ఉత్తరప్రదేశ్, నేపాల్‌ల ఉమ్మడి పథకం.

8. **చంబల్ పథకం**
- ఇది మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల ఉమ్మడి పథకం.
- దీన్ని చంబల్ నదిపై నిర్మించారు.
- ఈ పథకంలో మూడు ఆనకట్టలున్నాయి.
  అవి ...
  1) గాంధీసాగర్ ఆనకట్ట
  2) రాణా ప్రతాప్‌సాగర్ ఆనకట్ట
  3) జవహర్ సాగర్ ఆనకట్ట

9. **తెహ్రీడ్యామ్ ప్రాజెక్టు**
- ఈ ప్రాజెక్టు ఉత్తరప్రదేశ్, ఉత్తరాంచల్, ఢిల్లీ రాష్ట్రాల ఉమ్మడి పథకం.
- దీన్ని 'భాగీరథి' నదిపై హిమాలయ ప్రాంతం(ఉత్తరాఖండ్)లోని భూకంపాలు సంభవించే ప్రదేశంలో నిర్మించడం వల్ల ఇది వివాదాస్పదమైంది.
- తెహ్రీడ్యామ్ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టిన వ్యక్తి - సుందర్‌లాల్ బహుగుణ.

10. **ఇందిరాసాగర్ ప్రాజెక్టు**
- ఇది నర్మద నదిపై ఉంది.
- దీన్ని గుజరాత్‌లోని పూర్ణసా ప్రాంతంలో నిమోరి జిల్లాలో నిర్మించారు.
- ఇది మధ్యప్రదేశ్, గుజరాత్‌ల ఉమ్మడి ప్రాజెక్టు

11. **సర్దార్ సరోవర్ ప్రాజెక్టు**
- దీన్ని నర్మద నదిపై, గుజరాత్‌లోని బరూచ్ జిల్లాలో బడగావ్ అనే ప్రాంతంలో నిర్మించారు.
- ఇది రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌ల ఉమ్మడి ప్రాజెక్టు.
- ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ మేథాపాట్కర్ చేపట్టిన ఉద్యమమే- నర్మదా బచావో.

మరికొన్ని ముఖ్యమైన ప్రాజెక్టులు

ప్రాజెక్టు పేరు	నది	రాష్ట్రాలు	ఇతర అంశాలు
1. బాగ్లీహార్ ప్రాజెక్టు	చీనాబ్	జమ్మూ & కాశ్మీర్	భారత్, పాకిస్థాన్‌ల మధ్య వివాదాస్పదమైంది
2. ధూల్‌హస్తి	చీనాబ్	జమ్మూ & కాశ్మీర్	-
3. నాథ్‌పాజాక్రి	సట్లెజ్	హిమాచల్ ప్రదేశ్	-
4. రిహాండ్	రిహాండ్	ఉత్తరప్రదేశ్	-
5. రామ్‌గంగా	రామ్‌గంగా	ఉత్తరప్రదేశ్	ఢిల్లీ నగరానికి 200 క్యూసెక్కుల నీటి సరఫరా
6. సువర్ణరేఖ	సువర్ణరేఖ	బీహార్	-
7. ఫరక్కా	హుగ్లీ	పశ్చిమ బెంగాల్	-
8. మయూరాక్షి	మురళీ	పశ్చిమ బెంగాల్	-
9. జయక్‌వాడీ	గోదావరి	మహారాష్ట్ర	-
10. బాబ్లీ	గోదావరి	మహారాష్ట్ర	-
11. ఆల్మట్టి	కృష్ణా	కర్ణాటక	-
12. ఇడుక్కి	పెరియార్	కేరళ	-
13. శబరిగిరి	పంప	కేరళ	-
14. మెట్టూరు	పైకారా	తమిళనాడు	పైకారా నది కావేరి నదికి ఉపనది
15. ఉకాయ్	తపతి	గుజరాత్	-
16. కాక్రపార	తపతి	గుజరాత్	-
17. శ్రీరాంసాగర్	గోదావరి	తెలంగాణ	దీని కాలువ కాకతీయ కాలువ. దీన్ని నిజామాబాద్ జిల్లాలోని పోచంపాడు వద్ద నిర్మించారు.
18. సుంకేసుల	తుంగభద్ర	ఆంధ్రప్రదేశ్	కర్నూలు జిల్లాలో ఉంది
19. పులిచింతల	కృష్ణానది	ఆంధ్రప్రదేశ్	గుంటూరు జిల్లాలో ఉంది. దీని పేరు కెఎల్.రావు సాగర్
20. జంఝావతి	జంఝావతి నది	ఆంధ్రప్రదేశ్	విజయనగరం
21. ఎల్లంపల్లి(శ్రీ పాదసాగర్)	గోదావరి	తెలంగాణ	కరీంనగర్

మాదిరి ప్రశ్నలు

1. 'మెట్టూరు జల విద్యుత్ కేంద్రం' ఏ నదిపై ఉంది?
1) తుంగభద్ర 2) మహానది
3) కావేరి 4) గోదావరి

2. కిందివాటిలో 'దామోదర్ వ్యాలీ కార్పొరేషన్'లో భాగాలైన ఆనకట్టలు ఏవి?
1) తిలైయా 2) మైథాన్
3) పంచట్ 4) పైవన్నీ

3. భారతదేశ జాతీయ నది?
1) గోదావరి 2) గంగా
3) కృష్ణా 4) నర్మద

4. ఆల్మట్టి ప్రాజెక్టు ఏ నదిపై ఉంది?
1) గోదావరి 2) కృష్ణా
3) పెన్‌గంగా 4) పూర్ణ

5. దామోదర్ వ్యాలీ ప్రాజెక్టు ఒక?
1) జలవిద్యుత్ 2) నీటిపారుదల
3) బహుళార్థ సాధక
4) ఏదీకాదు

6. కింది వాటిలో ఏ జల విద్యుత్ కేంద్రం ఉత్తరప్రదేశ్‌లో ఉంది?
1) మయూరాక్షి 2) రిహాండ్
3) కంగ్సబతి 4) హీరాకుడ్

7. అత్యధిక ప్రాజెక్టులను ఏ నదిపై నిర్మించారు?
1) గోదావరి 2) గంగా
3) నర్మద 4) కావేరి

8. భారతదేశంలో కెల్లా అత్యంత ఎత్తైన ప్రాజెక్టు?
1) నాథ్ ప్రాజెక్టు 2) భాక్రా ప్రాజెక్టు
3) నాగార్జున ప్రాజెక్టు
4) హీరాకుడ్ ప్రాజెక్టు

9. కిందివాటిలో అంతర్జాతీయ ప్రాజెక్టు?
1) కోసి 2) చంబల్
3) తెహ్రీడ్యామ్ 4) మయూరాక్షి

10. ప్రపంచంలో అతి పెద్ద రాతికట్టడపు ఆనకట్ట ఏది?
1) భాక్రానంగల్ 2) హీరాకుడ్
3) నాగార్జున సాగర్ 4) కోసి

11. భారతదేశంలో జాతీయ జల మండలిని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1975 2) 1948
3) 1951 4) 1990

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 2; 5) 3; 6) 2; 7) 3; 8) 2; 9) 1; 10) 3; 11) 4.

గతంలో వచ్చిన ప్రశ్నలు

1. 'సుంకేసుల' ప్రాజెక్టును ఏ నదిపై నిర్మిస్తున్నారు? (కానిస్టేబుల్-2012)
1) గోదావరి 2) నాగావళి
3) తుంగభద్ర 4) పెన్నా

2. ఆంధ్రప్రదేశ్‌లోని ఏ జిల్లాలో జంఝావతి రబ్బర్ డ్యాం ఉంది? (కానిస్టేబుల్-2009)
1) వరంగల్ 2) శ్రీకాకుళం
3) విశాఖపట్నం 4) విజయనగరం

3. పులిచింతల ప్రాజెక్టు ఎవరి పేరుతో నిర్మించారు? (కానిస్టేబుల్-2009)
1) డి. సంజీవయ్య 2) కె.ఎల్.రావు
3) కోట్ల విజయభాస్కర్ రెడ్డి
4) జె. చొక్కారావు

4. ఇందిరాసాగర్ ఆనకట్టను ఏ నదిపై నిర్మించారు? (కానిస్టేబుల్-2013)
1) మహానది 2) చంబల్
3) నర్మద 4) యమున

5. జపాన్ సహాయంతో పూర్తి చేసిన పైథాన్ (జయక్‌వాడీ) జల విద్యుత్ ప్రాజెక్టు ఏ నదిపై ఉంది? (కానిస్టేబుల్ - 2013)
1) గంగ 2) గోదావరి
3) నర్మద 4) కావేరి

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 3; 5) 2.

Command that fixes the minor errors..

BANK EXAMS

COMPUTER AWARENESS

1. A technique used by codes to convert an analog signal into a digital bit stream is known as:
a) Pulse code modulation
b) Pulse stretcher
c) Query processing
d) Queue management
e) None of these

2. The most important or powerful computer in a typical network is:
a) desktop b) network client
c) network server
d) network station
e) my computer

3. In MS word what is the short cut of Ctrl + L?
a) Left Align b) Left Indent
c) Increase Left Margin
d) Decrease Left Margin
e) None

4. Which of the following can NOT be used to create parallel style column?
a) Format Tabs
b) Table Insert Table
c) Insert Textbox
d) Format Columns
e) None of these

5. An Internet standard for transferring files is known as:
a) IRC
b) Telnet
c) FTP
d) WAIS
e) None of these

6. Another name for electronic cash or e-cash, the Internet equivalent to traditional cash, is:
a) Cybercast and analog cash
b) Digital cash and cybercom
c) Carders and cybercom
d) Cybercast and digital cash
e) None of these

7. This type of e-commerce often takes the form of an electronic version of the classified ads or an auction:
a) B2C b) C2C c) G2C
d) B2B e) None of these

8. The command that fixes the minor errors of the disk:
a) Error.fix b) Scandisk
c) Chkdsk d) Defrag
e) None of these

9. What is a LAN that has one or more dedicated computers and all others act as recipients?
a) Peer-to-peer model
b) Client/server model
c) P-to-p model
d) Ring network e) None

10. If a computer has a(n) ______ port, it does not need a NIC.
a) Internet b) Ethernet
c) Intranet d) Broad band
e) None of these

11. Microprocessors as switching devices are used for which generation computers?
a) First Generation
b) Second Generation
c) Third Generation
d) Fourth Generation
e) None of these

12. ASCII and EBCDIC are the popular character coding systems. What does EBCDIC stand for?
a) Extended Binary Coded Decimal Interchange Code
b) Extended Bit Code Decimal Interchange Code
c) Extended Bit Case Decimal Interchange Code
d) Extended Binary Case Decimal Interchange Code
e) None of these

13. Storage capacity of magnetic disk depends on:
a) Tracks per inch of surface
b) Bits per inch of tracks
c) Disk pack in disk surface
d) All of abovee) None of these

14. A storage area used to store data to a compensate for the difference in speed at which the different units can handle data is:
a) Memory b) Buffer
c) Accumulator d) Address
e) None of these

15. A credit card-sized expansion board that is inserted into portable computers that connects the modem to the telephone wall jack is the ________.
a) Internal modem
b) External modem
c) PC Card modem
d) Wireless modem e) None

16. An affordable technology that uses existing telephone lines to provide high-speed connections is called ________.
a) ISDN
b) Microwave
c) Cable modem
d) DSL
e) None of these

17. The rules for exchanging data between computers are called
a) Interconnections
b) Synchronous packages
c) Protocols
d) Data transmission synchronization
e) None of these

18. ______ is the process of breaking down information sent or transmitted across the Internet into small parts called packets.
a) Protocol
b) Bandwidth
c) Reformatting
d) Identification
e) None of these

19. Relocation bits used by relocating loader are specified (generated) by
a) Relocating loader itself
b) Linker
c) Assembler or translator
d) Macro processor
e) None of these

20. Which of the following scheduling objectives should be applied to the following: the system should admit jobs to create a mix that will keep most devices busy
a) to be fair
b) to balance resource utilization
c) to obey priorities
d) to be predictable
e) none

21. A task in a blocked state
a) is executable
b) is running
c) must still be placed in the run queues
d) is waiting for same temporarily unavailable resources
e) none of these

22. The higher versions of the operating systems are so written that programs designed for earlier versions can still be run. What is it called?
a) Upgradability
b) Upward mobility
c) Universality
d) upward compatibility
e) none of these

23. IP address is currently
a) 4 bytes long
b) available in plenty
c) 6 bytes long
d) not assigned as it is all used up
e) none of these

24. Internet data is broken up as
a) Fixed length packets
b) Variable length packets
c) Not packetized
d) 64 bytes packets
e) None of these

25. The packets of an internet message
a) take a predetermined path
b) take a path based on packet priority
c) go along different paths based on path availability
d) take the shortest path from source to destination
e) none of these

26. By an intranet we mean
a) a LAN of an organization
b) a Wide Area Network connecting all branches of an organization
c) a corporate computer network
d) a network connecting all computers of an organization and using the internet protocol
e) none of these

27. The part of machine level instruction, which tells the central processor what has to be done, is
a) Operation code b) Address
c) Locator d) Flip-Flop
e) Register

28. Which of the following systems software does the job of merging the records from two files into one?
a) Security software
b) Utility program
c) Networking software
d) Documentation system
e) None of these

29. Fork is
a) The dispatching of a task
b) The creation of a new job
c) The creation of a new process
d) Increasing the priority of a task
e) None

30. Computer is free from tiresome and boardroom. We call it
a) Accuracy b) Reliability
c) Diligence d) Versatility
e) None of these

31. CD-ROM is a
a) Semiconductor memory
b) Memory register
c) Magnetic memory
d) All the above
e) None of these

32. To produce high quality graphics (hardcopy) in colour, you would want to use a/n
a) RGB monitors b) Plotter
c) Ink-jet printer
d) Laser printer e) None

33. Which of the following IC was used in third generation of computers?
a) SSI b) MSI c) LSI
d) Both a and b e) None of these

34. On which of the following sites can you set up your email account:
a) www.hotmail.com
b) www.gre.org c) www.linux.org
d) www.syvum.com e) none

35. The acronym NOS refers to the :
a) Operating system on the clients
b) Network order system, or topology
c) Operating system of the network
d) network architecture
e) none of these

36. The most common network strategies are ________
a) star, ring, bus, hierarchical
b) terminal, peer-to-peer, client server
c) topology, protocol, architecture
d) host, client, terminal
e) none of these

Answers

1) a; 2) c; 3) a; 4) d; 5) c; 6) d; 7) b; 8) c; 9) b; 10) b; 11) d; 12) a; 13) d; 14) b; 15) c; 16) d; 17) c; 18) c; 19) b; 20) b; 21) d; 22) d; 23) a; 24) b; 25) c; 26) d; 27) a; 28) b; 29) c; 30) c; 31) d; 32) b; 33) d; 34) a; 35) c; 36) a.